

'మట్టిని నమ్ముకున్న వ్యక్తి
రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 88

సోమవారం 19-6-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

# తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాం.. విద్యార్థుల మనోస్థైర్యాన్ని పెంచాం

# సాధారణ విద్యార్థుల్ని సైతం IIT టాపర్స్‌గా మార్చాం

## ఆలిండియా ఓపెన్ కేటగిరీ 1st ర్యాంక్ శ్రీచైతన్య హైదరాబాద్ జోన్ విద్యార్థిదే!

డా॥ బి.ఎస్. రావు
ఫౌండర్-చైర్మన్

శ్రీమతి సుష్మ
అకడమిక్ డైరెక్టర్

### ఆలిండియా టాప్ 10 లోపు ర్యాంకులు (ఆల్ కేటగిరీ)

| All India Rank | Name | H.T. No. |
|---|---|---|
| 1 | DESHANK PRATAP SINGH | H.T. No. 232006139, DLP, SC |
| 2 | RAMESH SURYA THEJA | H.T. No.236131371,OBC- NCL |
| 3 | BONIGALA ABHISHEK | H.T. No.236063043,SC |
| 4 | SUTHAR HARSHAL | H.T. No. 231005060, (DLP),OBC |
| 5 | KUNSOTH CHANDRASHEN NAYAK | H.T. No.236159219,ST |
| 6 | N SREEVAMSHI MADHAV | H.T. No. 236132927,ST |
| 7 | NENAVATH KALYAN | H.T. No. 236130689, ST |
| 8 | KANDADI TRILOK REDDY | H.T. No.236048004,EWS |
| 9 | SUTHAR HARSH | H.T. No.232100028, DLP, OBC |

### ఆలిండియా ఓపెన్ కేటగిరిలో శ్రీచైతన్య సాధించిన టాప్ 766 లోపు ర్యాంకులు

| Rank | Name | H.T. No. |
|---|---|---|
| 101 | NADIPALLI SIDDARDHA | 236052245 |
| 104 | ADITI SINGH | 231003230(DLP) |
| 105 | V KRISHNA SAMEER | 236131335 |
| 113 | PARTH AGRAWAL | 232065255(DLP) |
| 118 | AADITYA SHARMA | 237055086(DLP) |
| 119 | MALINENI DATHA RISHYANTH | 236057103 |
| 121 | T SUBHASH RAM | 236064014 |
| 125 | NADELLA MOHITH SAI | 236049137 |
| 130 | TUSHAR JAI(DLP) | 231022076 |
| 137 | ADITYA ANAND SAWANT(DLP) | 231092249 |
| 139 | Y RAMA MANOJ KUMAR REDDY | 236059031 |
| 140 | REUBEN LAWRENCE | 236054225 |
| 146 | SHRAVYA KARNA | 236128553 |
| 150 | ANIRUDDH KOMMAJOSYULA | 236129519 |
| 161 | SAI SAKETH M | 236134052 |
| 163 | NARULA SIMAR(DLP) | 232059086 |
| 173 | VYSYARAJU SRIKAR NIHAL | 236049028 |
| 181 | SAKSHAM VERMA | 231090350 |
| 183 | DANGI YATHARTH(DLP) | 232101024 |
| 190 | CH V SAI KOUSHIK | 236131290 |
| 198 | P DHRUV SHIVKANT | 231035130 |
| 201 | MARALA SAI PRAGNAAN | 236135284 |
| 203 | B ANIRUDH SRIVATSA | 236133044 |
| 210 | DEVANGAM KISHAN TEJA | 236054060 |
| 214 | M PRANATHI SREEJA | 236053164 |
| 218 | VANGURI ESHWAR | 236131521 |
| 225 | CH RAKESH KUMAR REDDY | 236048395 |
| 228 | VADDE SHANVITHA REDDY | 236056067 |
| 229 | GUDURU ADARSH | 236050284 |
| 233 | POPURI ANIRUDH | 236049153 |
| 234 | SAMMETA AVANEESH SAI | 236050476 |
| 235 | SHAIK ASIM SHAREEF | 236048077 |
| 239 | SOHAM DAS(DLP) | 235063551 |
| 245 | D V V ABHINAV TEJA | 236048350 |
| 258 | T N KUMAR REDDY | 236133299 |
| 262 | VAKA SRI VARSHITHA | 236049362 |
| 263 | R HARSHA VARDHAN | 236053116 |
| 267 | MACHARLA HARIHARA VARMA | 236133401 |
| 268 | KOKKILIGADDA MANASWI | 236057019 |
| 270 | KOMRELLY SNIGDHA REDDY | 236128289 |
| 273 | MALPANI TUSHAR | 236131408 |
| 274 | SANAPALA ANIRUDH | 236049657 |
| 279 | THOTA RITHVIK | 236130136 |
| 282 | BOYINA SANJANA | 236049495 |
| 284 | P PRAMOD KUMAR REDDY | 236063036 |
| 285 | DUDIGANI LATHIK ABHINAY | 236199056 |
| 292 | GINJALA SRIVARDHAN | 236160009 |
| 297 | V AJAY KUMAR REDDY | 236064069 |
| 302 | DOLA SURYA SAI | 236049426 |
| 311 | SARTHAK TOSHNIWAL | 231130057 (DLP) |
| 330 | G MAHENDRA REDDY | 236059056 |
| 331 | T CHARAN KUMAR REDDY | 236152109 |
| 346 | KANITHI SRI KARTHIK | 236049301 |
| 362 | DAKSH KANSIL | 237021047 |
| 374 | SATHVIK REDDY BHAVANAM | 236132069 |
| 382 | KALLAKURI SREEMANTH | 236048082 |
| 383 | PEDDINENI HARSHITH | 236177134 |
| 387 | ETTE HASINI | 236057045 |
| 389 | Y H NIHAR CHOWDARY | 236049625 |
| 391 | MEDA SADVIK | 236128370 |
| 407 | JAIN PRATYAKSH | 231041159 |
| 412 | NAMA SRI SHASHANK | 236163104 |
| 421 | ANNAJI SAI DHEERAJ | 236049744 |
| 427 | NEELKANTH MISHRA | 232018266 (DLP) |
| 428 | C KETHAN | 236129758 |
| 432 | GUNVEEN GILL | 237001076 (DLP) |
| 435 | MUDUGURU MAHEDAR REDDY | 236157062 |
| 447 | Y V SAI RAGHU VARDHAN | 236133928 |
| 457 | MORISETTY SAI VARSHITHA | 236051031 |
| 461 | KAKANI SINDHURA | 236129446 |
| 462 | M BOGADI SUSHANTH | 236048134 |
| 474 | EDUBILLI KARTHIK | 236049414 |
| 478 | P LOKESWARA REDDY | 236048367 |
| 500 | SOMA KOUSHIK | 236132534 |
| 523 | M LEKHYA REDDY | 231048050 |
| 526 | DIVI POTHUKUCHI | 236150067 |
| 527 | S MANISH KUMAR | 236054198 |
| 528 | VARALA CHARISHMA | 236165089 |
| 533 | BASWA DHANUSH SAI | 236053059 |
| 537 | JAYESH NARAYANAN | 236129517 |
| 550 | ADITHYA K ANIL | 231037062 |
| 558 | BV SAI SHARMIL KUMAR | 236051102 |
| 559 | MANOJ N H | 231038007 |
| 566 | GAMPA RESHWIK | 236162021 |
| 572 | E SAI VISHESH SHARMA | 236132898 |
| 574 | P HARSHA SAI SRINIVAS | 236058081 |
| 583 | GUNTI MURALI KRISHNA | 236055179 |
| 590 | NALI VIVEK VARDHAN | 236053214 |
| 608 | G SREE RAM CHARAN | 236130563 |
| 630 | UDTYAVATH SAI LIKHITH | 236131195 |
| 636 | DONDETI SAMHITHA | 236187032 |
| 640 | G SRIMANNADH REDDY | 236060105 |
| 648 | GAUTAM HEMANG | 232079185(DLP) |
| 650 | JAMI RITHVIK | 236135743 |
| 652 | N AASISH VARMA | 236151041 |
| 657 | T.V.KAVISIVAKUMAR | 231039045 |
| 660 | VIPUL TEJWANI | 231047032 |
| 665 | DEVYANSH GUPTA | 232058471 (DLP) |
| 669 | K VENKATA SAI VIVEK | 236133400 |
| 670 | S JAMEEL UR RAHAMAN | 235007214 |
| 672 | MATHI KARTHIK | 236049577 |
| 674 | MADISHETTY ADITYA NATH | 236138026 |
| 675 | PRANAV REDDY NAMGA | 236132763 |
| 688 | YERNAGULA LAVANYA VANI | 236052178 |
| 693 | VEMURI SAI LOKESH | 236050202 |
| 695 | GONA SANJANA | 236139058 |
| 702 | MONICA REDDY NAREM | 236129549 |
| 708 | K CHANDRASHEN NAYAK | 236159219 |
| 711 | DEGALA AMAN | 236130052 |
| 720 | SEEMALA VARSHA | 236150013 |
| 734 | VAASU KANSAL | 237022101 |
| 740 | MIRYALA AVINASH KUMAR | 236050266 |
| 744 | NRY SRIKAR ADITHYA REDDY | 236160073 |
| 748 | PRAKHAR AGRAWAL | 232055422 (DLP) |
| 754 | CY SREE NARAYANA | 236063083 |
| 757 | SANJAY RAGHAV VANGALA | 236130628 |
| 760 | S MOHAMMED SHANAWAZ | 236048254 |
| 763 | DASARI PARDHA SARADHI | 236060194 |
| 765 | SUNKI NAGARJUN REDDY | 236048247 |
| 766 | MARADANI NITIN SAI | 236130138 |

ఇంతటి అద్భుత ఫలితాలను అందించిన మా విద్యార్థుల తల్లిదండ్రులు, మా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి పేరు పేరునా ఇవే మా అభినందనలు

– శ్రీచైతన్య యాజమాన్యం

*T & C apply | Note: Any inadvertent error published in this advertisement could be brought to our notice

**JEE-MAIN | JEE-ADVANCED**
**LONG-TERM 2024**
అడ్మిషన్లు జరుగుచున్నవి

Sri Chaitanya
Scan QR Code for Website

క్లాసులు 19 జూలై 2023 నుండి ప్రారంభం

ప్రతిభావంతమైన విద్యార్థులకు ఆకర్షణీయమైన ఫీజు రాయితీ కలదు

## శ్రీచైతన్య విద్యాసంస్థలు

www.srichaitanya.net

**వివరాలకు సంప్రదించండి:** **HYDERABAD:** MADHAPUR - NARSINGI BOYS - 9177736808 / 9100589991 | VAISHNAVI KONDAPUR GIRLS - IPL 9177046533 | MADHAPUR BOYS - 8712600768 / 69 | BHASKAR BHAVAN: KUKATPALLI BOYS & GIRLS - 9100484443 / 9177525540 | NKT IPL: NALLAKUNTA / DD COLONY BOYS & GIRLS - 8639633187 / 9948676603 | **VIJAYAWADA:** RAMAN BHAVAN-I: GUDAVALLI BOYS & GIRLS - 9652699222 / 6305170575 / 9704065666 / 9701911666 | **VIZAG:** ASILMETTA IIT ACADEMY: ASILMETTA BOYS & GIRLS - 9908785220

Knowledge Hub (NEET | IIT JEE | FOUNDATION) | Sri Chaitanya Educational Institutions

**NEET 2024 COACHING CENTERS**

www.srichaitanyaknowledgehub.com

KUKATPALLY : 91774 44352
DILSUKHNAGAR : 91774 44326
AMEERPET : 91774 44350
HIMAYATNAGAR : 91774 44341
KONDAPUR : 95151 11428
KARKHANA : 91774 44837
VISAKHAPATNAM: 91774 44307 | 95151 11047

సత్యమేవ జయతే

# సాక్షి

'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 88

సోమవారం 19-6-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

# నారాయణ విద్యాసంస్థలు-ఇండియా

## JEE ADV. 2023 ఆల్ కేటగిరీ 200లోపు ర్యాంకులు

51, 54, 55, 56, 58, 58, 61, 61, 63, 67, 68

69, 69, 70, 71, 72, 75, 78, 78, 79, 80, 82

84, 87, 90, 92, 93, 93, 93, 94, 98, 98, 99

99, 101, 102, 102, 103, 105, 108, 108, 109, 111, 112

113, 117, 118, 119, 120, 124, 124, 126, 128, 130, 130

131, 132, 132, 133, 135, 136, 137, 137, 137, 137, 138

141, 143, 145, 145, 147, 149, 152, 152, 153, 154, 155


156, 157, 164, 165, 166, 167, 167, 170, 174, 175, 176

177, 181, 183, 185, 188, 191, 193

and many more...

**TOTAL SELECTIONS 3907**






వివిధ కేటగిరీలలో ఆల్ ఇండియా టాప్ 10 లోపు **20**

వివిధ కేటగిరీలలో ఆల్ ఇండియా టాప్ 100 లోపు **108**

వివిధ కేటగిరీలలో ఆల్ ఇండియా టాప్ 1000 లోపు **721**


JEE-MAIN / ADV. LONG TERM NEW BATCH COMMENCES ON **29-06-2023**

**NARAYANA EDUCATIONAL INSTITUTIONS**

Scan above to find your nearest branch

Call: 1800 102 3344

SUBSCRIBE www.narayanagroup.com




సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 88

సోమవారం 19-6-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL






**'ప్రాపర్టీ'కి యజమాని అవుతారా!**

రూ.300తోనూ పెట్టుబడికి అవకాశం..
అందుబాటులో నాలుగు రీట్‌లు - 15లో



**ఆకాశానికి నిచ్చెనలు వద్దు**

ఎత్తైన భవన నిర్మాణాలకు
బ్రేక్ వేస్తూ పారిస్ నిర్ణయం - 6లో



**యువత ఆశల్ని కేంద్రం చిదిమేసింది**

పెట్టుబడిదారులైన కొందరు మిత్రుల కోసం కేంద్రం లక్షలాది మంది యువత ఆశల్ని చిదిమేసిందని రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు.

- వివరాలు 6లో



**ఎమర్జెన్సీ.. ఒక చీకటి యుగం**

ఇందిరాగాంధీ అత్యవసర పరిస్థితి విధించినప్పుడు ప్రజాస్వామ్యవాదుల్ని క్రూరంగా వేధించారని ప్రధాని మోదీ చెప్పారు.

- వివరాలు 6లో



**పేదల ఆకలి తీర్చిన భారత్**

ప్రపంచ ఆహార వ్యవస్థల్లో సానుకూల మార్పులు తేగల సామర్థ్యం భారత్‌కు ఉందని ఐరాస విభాగమైన ఐఎఫ్ఏడీ అధ్యక్షుడు చెప్పారు.

- వివరాలు 6లో



**భారత సంతతి వ్యక్తికి ఏడేళ్ల ఖైదు**

యూకేలో మద్యం మత్తులో ఉన్న మహిళపై అత్యాచారం చేసినందుకు భారత సంతతి విద్యార్థి ప్రీత్ వికల్‌కు ఏడేళ్ల జైలు శిక్ష పడింది.

- వివరాలు 6లో

## న్యూస్‌రీల్

### నేడు హరితోత్సవానికి కేసీఆర్



తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించే హరితోత్సవం కార్యక్రమంలో సీఎం కేసీఆర్ పాల్గొంటారని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా తుమ్మలూరు అర్బన్ ఫారెస్ట్ పార్కులో సీఎం మొక్కలు నాటుతారని తెలిపారు.

- వివరాలు 11లో

### కూల్చాల్సిన భవనాలెన్ని.. కొట్టేయాల్సిన చెట్లెన్ని..?



రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి మూడు కాలా(కాంపిటెంట్ అథారిటీ ఫర్ ల్యాండ్ అక్విజిషన్)ల పరిధిలో అవార్డు పాస్ చేసేందుకు ఎన్‌హెచ్ఏఐ ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం పట్టాదారుల వారీగా వివరాలు నమోదు చేస్తోంది. రోడ్డు నిర్మాణంలో సేకరించాల్సిన భూముల్లో ఉన్న నిర్మాణాలు, తోటలు, ఇతర ఆస్తుల విలువను మదింపు చేసే ప్రక్రియకు తాజాగా అధికారులు శ్రీకారం చుట్టారు.

- వివరాలు 3లో

### కొన్ని కేటగిరీలకు ఉమ్మడి పరీక్షలు



గురుకుల ఉద్యోగాల భర్తీకి నిర్వహించే అర్హత పరీక్షలకు తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ) వ్యూహాత్మక కార్యాచరణ చేపట్టింది. పరీక్షలను సులభతరంగా నిర్వహించే క్రమంలో అభ్యర్థులకు వెసులుబాటు కల్పించింది. ఆగస్టు 1 నుంచి 22 వరకు పరీక్షలు నిర్వహించనుంది.

- వివరాలు 11లో

### మిర్చి ఘాటు.. ఏఐ చెబుతుంది!

- పొలం వద్దే కేవలం 25 నిమిషాల్లోనే తేమ, రసాయనాల శాతం నిర్ధారణ
- కాయ పొడవు, నాణ్యతనూ తేల్చే కృత్రిమ మేధ

11లో



# మళ్లీ అదరగొట్టారు

## జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చూపిన తెలుగు విద్యార్థులు

టాప్ ర్యాంకర్ నాగర్ కర్నూల్‌కు చెందిన చిద్విలాసరెడ్డి

- టాప్ టెన్‌లో ఇద్దరు తెలంగాణ, నలుగురు ఏపీ వారే..
- బాలికల్లో మొదటి ర్యాంకు సాధించిన తెలుగు విద్యార్థిని భవ్యశ్రీ
- గతంతో పోలిస్తే పెరిగిన కటాఫ్ మార్కులు..
- నేటి నుంచే ఐఐటీ అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్లు ప్రారంభం
- జూన్ 30న తొలి విడత సీట్ల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్స్‌లో సత్తా చూపిన తెలుగు విద్యార్థులు అడ్వాన్స్‌డ్ పరీక్షలోనూ అదరగొట్టారు. జాతీయ స్థాయిలో మొదటి, రెండో ర్యాంకులతోపాటు టాప్–10లో ఆరుగురు తెలుగు విద్యార్థులే నిలిచారు. ఇందులో వావిలాల చిద్విలాసరెడ్డి (1వ ర్యాంకు), నాగిరెడ్డి బాలాజీరెడ్డి (9వ ర్యాంకు) తెలంగాణ వారుకాగా.. రమేశ్ సూర్యతేజ (2వ), అడ్డగడ వెంకట శివరామ్ (5వ), బిక్కిని అభినవ్ చౌదరి (7వ), వైపీవీ మనీందర్ రెడ్డి (10వ ర్యాంకు) ఏపీకి చెందినవారు. ఇక మహిళల్లో జాతీయ టాప్ ర్యాంకర్ (298 మార్కులు)గా ఏపీ విద్యార్థిని నాయకంటి నాగ భవ్యశ్రీ నిలిచింది. ఆమెకు జనరల్ కేటగిరీలో 56వ ర్యాంకు వచ్చింది.

**టాప్‌లో ఐఐటీ హైదరాబాద్ జోన్..**

దేశంలో ఐఐటీలు, ఇతర జాతీయస్థాయి విద్యా సంస్థల్లో ప్రవేశానికి ఐఐటీ గౌహతి ఆధ్వర్యంలో జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను నిర్వహించగా.. ఆదివారం ఫలితాలను విడుదల చేశారు. దేశవ్యాప్తంగా 1,83,072 మంది పరీక్షలు రాయగా.. 43,773 మంది అర్హత సాధించారు. ఇందులో బాలురు 36,264 మంది, బాలికలు 7,509 మంది ఉన్నారు. ఇందులో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు గణనీయ సంఖ్యలో ర్యాంకులు సాధించారు. అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల పరిధి అధికంగా ఉన్న ఐఐటీ హైదరాబాద్ జోన్ టాప్‌లో నిలిచింది. ఈ జోన్ పరిధిలో 10,432 మందికి ర్యాంకులు వచ్చాయి. టాప్–500 ర్యాంకర్లలో 174 మంది ఈ జోన్ (తెలంగాణ, ఏపీతోపాటు తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి కలిపి)కు చెందినవారే. నాగర్ కర్నూల్‌కు చెందిన వావిలాల చిద్విలాసరెడ్డి మొత్తం 360 మార్కులకు గాను 341 మార్కులు సాధించి జాతీయ స్థాయి టాపర్‌గా నిలిచాడు. గత ఏడాదితో పోల్చితే ఈసారి జేఈఈకి పోటీ ఎక్కువగా ఉందని.. పరీక్ష రాసిన వారి సంఖ్య, అర్హుల సంఖ్య పెరిగిందని నిపుణులు చెప్తున్నారు.

**నేటి నుంచే జోసా రిజిస్ట్రేషన్లు**

ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశానికి సంబంధించిన 'జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా)'కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం

మిగతా 2వ పేజీలో ▶

### పేదల విద్య కోసం సాఫ్ట్‌వేర్ రూపొందిస్తా..



జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జాతీయ స్థాయిలో టాపర్‌గా నిలిచినందుకు చాలా సంతోషంగా ఉంది. మాది నాగర్ కర్నూల్ జిల్లా బల్మూరు మండలం గోదల్ గ్రామం. నాన్న రాజేశ్వర్ రెడ్డి, అమ్మ నాగలక్ష్మి ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. అమ్మానాన్న, సోదరుడి ప్రోత్సాహంతో ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యంగా చదివాను. భవిష్యత్‌లో పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించేలా సాఫ్ట్‌వేర్ రూపొందించడమే లక్ష్యం.

**- ఫస్ట్ ర్యాంకర్ చిద్విలాసరెడ్డి**

### టాప్ 10 ర్యాంకర్లు వీరే..

1. వావిలాల చిద్విలాసరెడ్డి (తెలంగాణ)
2. రమేశ్ సూర్యతేజ (ఏపీ)
3. రిషి కర్లా (రూర్కీ ఐఐటీ పరిధి)
4. రాఘవ్ గోయల్ (రూర్కీ ఐఐటీ పరిధి)
5. అడ్డగడ వెంకట శివరామ్ (ఏపీ)
6. ప్రభవ్ ఖండేల్‌వాల్ (ఢిల్లీ ఐఐటీ పరిధి)
7. బిక్కిని అభినవ్ చౌదరి (ఏపీ)
8. మలయ్ కేడియా (ఢిల్లీ ఐఐటీ పరిధి)
9. నాగిరెడ్డి బాలాజీరెడ్డి (తెలంగాణ)
10. వైపీవీ మనీందర్‌రెడ్డి (ఏపీ)

ట్రోఫీలతో సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి




# అద్భుత జోడి... అపూర్వ విజయం

## ఇండోనేసియా ఓపెన్ పురుషుల డబుల్స్ టైటిల్ కైవసం

ఆద్యంతం అద్భుత ఆటతో ఆకట్టుకున్న సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జోడీ ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో అద్భుతం చేసింది. పురుషుల డబుల్స్ విభాగంలో తొలిసారి చాంపియన్స్‌గా నిలిచింది. జకార్తాలో ఆదివారం జరిగిన ఫైనల్లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జంట 21–17, 21–18తో ప్రపంచ మూడో ర్యాంక్ జంట, ప్రస్తుత ప్రపంచ చాంపియన్స్‌గా ఉన్న ఆరోన్ చియా–సో వుయ్ యిక్ (మలేసియా)పై గెలుపొందింది. విజేతగా నిలిచిన సాత్విక్–చిరాగ్ జోడీకి రూ. 75 లక్షల 77 వేలు ప్రైజ్‌మనీతోపాటు 12,000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. విజేతలుగా నిలిచిన ఏపీ క్రీడాకారుడు సాత్విక్‌తో పాటు చిరాగ్‌ను ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్ అభినందించారు.

14లో

# మాజీ ఎంపీల భేటీ అంటూ రోజంతా హడావుడి

## హైదరాబాద్ వేదికగా ఉందంటూ సాగిన ప్రచారం

- కొందరు నేతలకు ఆహ్వానాలు.. చివరి నిమిషంలో రద్దు
- తాము తరచూ కలుస్తుంటామని.. దీనికి రాజకీయ ప్రాధాన్యత లేదన్న ఓ మాజీ ఎంపీ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఏర్పాటు బిల్లు ఆమోదం పొందిన సమయంలో ఎంపీలుగా ఉన్న పలు పార్టీలకు చెందిన నాయకులు ఆదివారం ఉదయం బ్రేక్‌ఫాస్ట్ కోసం భేటీ అవుతున్నారన్న చర్చ రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. హైదరాబాద్ వేదికగా ఈ సమావేశం జరగనుందని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరగడం, తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో మాజీ ఎంపీలంతా భేటీ అవుతున్నారని వార్తలు షికార్లు చేయడంతో దీనిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కేసీఆర్ వ్యతిరేక రాజకీయ పునరేకీకరణలో భాగంగానే ఈ సమావేశం జరుగుతోందని... ఈ భేటీ కోసం పలువురు కాంగ్రెస్ మాజీ ఎంపీలకు ఆహ్వానాలు సైతం అందాయనే చర్చ గాంధీ భవన్ వర్గాల్లో జరిగింది. అయితే చివరి క్షణంలో ఈ భేటీ రద్దయినట్లు సమాచారం. ఈ సమావేశం గురించి ఓ మాజీ ఎంపీ 'సాక్షి'తో మాట్లాడుతూ తాము కలుద్దామని అనుకున్న మాట వాస్తవమేనని, అయితే అందరికీ ఆహ్వానాలు అందాయో లేదో తెలియదన్నారు. కొందరికి మాత్రం ఫోన్లు వచ్చాయని చెప్పారు. ఈ భేటీకి రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదని, సమయం వచ్చినప్పుడల్లా తాము కలుస్తుంటామని, అప్పుడప్పుడూ కలిసి రాజకీయాలు మాట్లాడుకుంటుంటామని అన్నారు. అయితే ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండటం, నేతల పార్టీల మార్పు గురించి చర్చ జరుగుతుండటంతో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడిందని వివరించారు.

### కొత్త కార్యదర్శులకు బాధ్యతలు

జిల్లాల వారీగా అప్పగించిన కాంగ్రెస్

త్వరలో పర్యటనలు ప్రారంభం

12లో

### ఎన్నికల ప్రచారానికి అందరిలాగే డీకే వస్తారు

రాష్ట్ర ఇన్‌చార్జిగా వస్తారనే వార్తలు అవాస్తవం: మాణిక్‌రావు ఠాక్రే



# పవర్‌లోకి వస్తామని కాంగ్రెస్ పగటి కలలు

## అప్పుడే గాలిలో మేడలు కడుతున్నారు

- టీపీసీసీ అంటే...టెయింటెడ్ పొలిటీషియన్స్ ఆఫ్ క్రైమ్ అండ్ కరప్షన్
- ట్విట్టర్ వేదికగా కాంగ్రెస్ తీరుపై బండి సంజయ్ ఘాటు విమర్శలు

సాక్షి, హైదరాబాద్, సాక్షి, నాగర్‌కర్నూల్, కొత్తపల్లి (కరీంనగర్): తెలంగాణలో అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ నాయకులు పగటి కలలు కంటున్నారని, అప్పుడే గాలిలో మేడలు కడుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో జరిగిన వివిధ ఉప ఎన్నికలతో పాటు జీహెచ్ఎంసీ, కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా పరాజయం పాలైన విషయాన్ని వారు సులభంగా మరిచిపోయినట్టు ఉన్నారని ఎద్దేవా చేశారు. టీపీసీసీ అంటే టెయింటెడ్ పొలిటీషియన్స్ ఆఫ్ క్రైమ్ అండ్ కరప్షన్.. అని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చాక అన్ని సామాజిక భద్రతా పథకాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. గతంలోని లోటుపాట్లను తొలగించి మరింత మెరుగ్గా అవి అమలయ్యేలా ప్రజలకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు ఆదివారం ట్విట్టర్ వేదికగా సంజయ్ ట్వీట్ చేశారు. ఇప్పటికే ధరణి, సంక్షేమ పథకాలు, పెన్షన్లు వంటి వాటిపై రాష్ట్ర ప్రజల్లో అనిశ్చితి, అయోమయం రేకెత్తించే ప్రయత్నాల్లో కాంగ్రెస్ నిమగ్నమైతే... మరోవైపు బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాకపోతే సంక్షేమ పథకాలు రద్దవుతాయంటూ సీఎం కేసీఆర్ ప్రజల్లో అలజడి సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారని సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కేసీఆర్ సర్వేలోనే బీఆర్ఎస్‌కు 30 స్థానాలు**

కేసీఆర్ నిర్వహించిన సర్వేలోనే బీఆర్ఎస్‌కు 30 స్థానాలకు మించి రావని తేలిపోయిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ గెలవాలనే సీఎం కేసీఆర్ కోరుకుంటున్నారని సంజయ్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి పోటీ చేస్తున్నట్టు కాంగ్రెస్

మిగతా 12వ పేజీలో ▶

**బీఆర్ఎస్ నేతల దోపిడీపైనే ఐటీ దాడులు**

రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేస్తున్న దోపిడీకి అంతులేకుండా పోయిందని అందుకే వారిపై ఐటీ దాడులు జరుగుతున్నాయని ఎంపీ బండి సంజయ్ అన్నారు. ఆదివారం ఆయన నాగర్‌కర్నూల్‌లో మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేసే విషయంతో బీజేపీకి సంబంధం లేదని, అది దర్యాప్తు సంస్థలు చూసుకుంటాయని చెప్పారు. కాంగ్రెస్ మాదిరిగా ఈడీ, సీబీఐలను గుప్పిట్లో పెట్టుకునే సంస్కృతి బీజేపీది కాదన్నారు.



భువనగిరి సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్ ఉజ్జల్‌భూయాన్

# మౌలిక సూత్రాలకు లోబడే న్యాయవ్యవస్థ పనిచేస్తుంది

## 'ఐలు' సదస్సులో హైకోర్టు సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్

సాక్షి, యాదాద్రి/యాదగిరిగుట్ట: రాజ్యాంగంలో మార్పులెన్ని తెచ్చినా న్యాయవ్యవస్థ రాజ్యాంగ మౌలిక సూత్రాలకు లోబడే పనిచేస్తుందని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అన్నారు. యాదాద్రి జిల్లా భువనగిరిలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర మహాసభలు ఆదివారం రెండవ రోజు ముగిశాయి. ఇందులో భాగంగా 'రాజ్యాంగం–న్యాయవ్యవస్థ' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారంలో ఉన్నవారు రాజ్యాంగ

మిగతా 3వ పేజీలో ▶

## ఇదండీ సంగతి





ఐడియా! ముందుగా పదని పార్టీల కోసం ఒక భేటీ పెడితే..!!

# 3 జిల్లాలు = 30 జిల్లాలు!

## జీఎస్డీపీలో 43.72 శాతం వాటా రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలదే..

- మిగతా 30 జిల్లాల వాటా 56.28 శాతం
- ఆర్థికాభివృద్ధి, తలసరి ఆదాయంపై పట్టణీకరణ ప్రభావం
- మారుమూల గ్రామీణ జిల్లాల్లో వెనుకబాటుతనం

తెలంగాణ @ 10 నివేదికలో వెల్లడి




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 33 జిల్లాలు ఉండగా.. ఆర్థికాభివృద్ధిలో కేవలం మూడు జిల్లాలకే 43.72 శాతం వాటా ఉంది. 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పట్టణీకరణ ఎక్కువగా ఉన్న రంగారెడ్డి జిల్లా రూ.2,26,957 కోట్లు, హైదరాబాద్ జిల్లా రూ.1,86,225 కోట్లు, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా రూ.73,132 కోట్ల స్థూల జిల్లా దేశీయోత్పత్తి (జీడీడీపీ)ని సాధించి.. ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలిచాయి. రాష్ట్రంలోని మిగతా 30 జిల్లాలు కలిపి వాటా 56.28 శాతమే కావడం గమనార్హం. ములుగు జిల్లా రూ.6,240 కోట్ల జీడీడీపీతో అన్నింటికన్నా చివరన నిలిచింది. 'తెలంగాణ ఆర్థికాభివృద్ధి @ 10' నివేదికలో రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని వెల్లడించింది. జిల్లాల ఆర్థికాభివృద్ధికి సూచికగా జీడీడీపీని పరిగణిస్తుంటారు. అభివృద్ధి అంతా హైదరాబాద్,

మిగతా 11వ పేజీలో ▶



ఉత్తరప్రదేశ్ బలియా జిల్లాలో తీవ్ర ఎండల దెబ్బకు అస్వస్థతతో ఆస్పత్రిలో చేరిన ప్రజలు

# వడగాడ్పులకు 100 మంది బలి!

- యూపీ, బిహార్‌లలో 98 మరణాలు నమోదు .. ఉత్తరాదిన కొనసాగుతున్న అధిక ఉష్ణోగ్రతలు - వివరాలు 6లో

**రాష్ట్రంలో మరో రెండ్రోజులు వడగాడ్పులు**

- వివరాలు 5లో

# ‘అడ్వాన్స్‌డ్’గా గురుకుల విద్యార్థులు

## ఐఐటీల్లో సీట్లు సాధించే స్థాయిలో 96 మందికి ర్యాంకులు



సాక్షి, హైదరాబాద్/రాయదుర్గం: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో రాష్ట్ర సంక్షేమ గురుకుల విద్యార్థులు మంచి ప్రతిభ కనబర్చారు. తెలంగాణ గిరిజన గురుకుల విద్యా సంస్థల సొసైటీ నుంచి 400 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 96 మంది ఐఐటీల్లో సీట్లు సాధించే స్థాయిలో ర్యాంకులు సాధించారు. మరో 118 మంది విద్యార్థులకూ మంచి మార్కులు వచ్చాయి. గతేడాది 105 మంది విద్యార్థులు పలు ఐఐటీల్లో అడ్మిషన్లు పొందారని గిరిజన గురుకుల సొసైటీ ప్రకటించింది.

**గౌలిదొడ్డి గురుకులం నుంచి 35 మంది**

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో హైదరాబాద్‌లోని గౌలిదొడ్డితెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులం విద్యార్థి సాత్విక్ జాతీయ స్థాయిలో ఎస్సీ కేటగిరీలో 53వ ర్యాంకు సాధించాడు. ఈ గురుకులం నుంచి 35 మందికి ఐఐటీ సీట్లు సాధించగల ర్యాంకులు వచ్చాయని ప్రిన్సిపాల్ పాపారావు తెలిపారు.

**ర్యాంకర్‌గా కారు డ్రైవర్ కుమారుడు**

జాతీయస్థాయిలో ఎస్సీ కేటగిరీలో 53వ ర్యాంకు సాధించిన బైండ్ల సాత్విక్.. కామారెడ్డి జిల్లాకు చెందిన కారు డ్రైవర్ సురేందర్, రేణుక దంపతుల కుమారుడు. జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించడం సంతోషంగా ఉందని, తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహమే దీనికి కారణమని సాత్విక్ తెలిపాడు.

**టిఫిన్ సెంటర్ నడిపే తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..**



గౌలిదొడ్డి గురుకులం విద్యార్థి పృథ్వీరాజ్ ఎస్టీ కేటగిరీలో జాతీయ స్థాయిలో 225వ ర్యాంకు సాధించాడు. తన తల్లిదండ్రులు నర్యా, సుగుణ టిఫిన్ సెంటర్ నడుపుతూ తనను చదివిస్తున్నారని.. మంచి ర్యాంకు సాధించడంతో వారి కల నెరవేరినట్లు అయిందని పృథ్వీరాజ్ చెప్పాడు. ఐఐటీలో సీట్లు రావడానికి గురుకులాల్లోని విద్య తోడ్పడుతోందని పేర్కొన్నాడు.

# పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

- పక్కకు ఒరిగిన ఆరు బోగీలు
- విజయనగరం జిల్లాలో ఘటన



శృంగవరపుకోట/తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): కిరండూల్ నుంచి విశాఖకు ఐరన్ ఓర్ లోడుతో వస్తున్న గూడ్స్ రైలు విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం బొడ్డవర వద్ద ఆదివారం సాయంత్రం పట్టాలు తప్పింది. పాయింట్ నంబరు 23ఏ వద్ద కిలోమీటరు 23 నుంచి 29 మధ్య ఆరు బోగీలు పక్కకు ఒరిగాయి. ఇటీవల కొత్తగా వేసిన ట్రాక్‌పై ఈ ప్రమాదం జరిగింది. డౌన్ ట్రైన్ 20 కి.మీ. వేగంతో రావాల్సి ఉండగా ప్రమాద సమయంలో 40 కి.మీ. వేగంతో ఉందని రైల్వే సిబ్బంది తెలిపారు. వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి, సీనియర్ అధికారుల బృందం ఘటనా స్థలానికి చేరు కుని యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను సోమ, మంగళవారాల్లో రద్దు చేస్తున్నట్టు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ప్రకటనలో తెలిపారు. జూన్ 19న కిరండూల్‌లో బయల్దేరిన కిరండూల్–విశాఖపట్నం (18513) ఎక్స్‌ప్రెస్, జూన్ 19న విశాఖపట్నంలో బయల్దేరవలసిన విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్, జూన్ 20న కిరండూల్‌లో బయల్దేరవలసిన కిరండూల్–విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ రద్దయ్యాయి.

# మళ్లీ అదరగొట్టారు

▶ మొదటి పేజీ తరువాయి




చిద్విలాస్‌రెడ్డి తల్లిదండ్రుల ఆనందోత్సాహం

కానుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు దీనిలో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నెల 30న తొలి విడత సీట్ల కేటాయింపు ఉంటుంది. మొత్తం 6 దశల్లో సీట్ల కేటాయింపు చేపడతారు. ఈ కౌన్సెలింగ్‌లో దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీలు (23), ఎన్ఐటీ, ఐఐఈఎస్టీ (31), ఐఐఐటీ (26) జీఎఫ్ఐటీ (38)లు కలిపి మొత్తం 118 విద్యాసంస్థల్లో సీట్లను కేటాయిస్తారు. గత ఏడాది ఈ సంస్థలన్నింటిలో కలిపి 16,598 సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసారి ఈ సీట్ల సంఖ్య మరింత పెరగనుందని అంచనా వేస్తున్నారు. ఐఐటీలలోని మొత్తం సీట్లలో 20శాతం మేర మహిళలకు సూపర్ న్యూమరరీ కింద కేటాయిస్తారు.

- జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు సాధించిన వారిలో ఆర్కిటెక్ట్ కేట గిరీ అభ్యర్థులు ఆర్కిటెక్ట్ ఆప్టిట్యూడ్ టెస్టును రాయాల్సి ఉంటుంది. వారు సోమవారం నుంచే ఏఏటీకి దరఖాస్తు చేయవచ్చు. ఈనెల 21న పరీక్ష నిర్వహించి 24న ఫలితాలు విడుదల చేస్తారు.

**ఈసారి కనీస అర్హత మార్కుల శాతం**




**కొన్నేళ్లుగా క్వాలిఫై కటాఫ్ మార్కులివీ..**

| కేటగిరీ | 2023 | 2022 | 2021 | 2020 | 2019 |
|---|---|---|---|---|---|
| జనరల్ | 86 | 55 | 63 | 69 | 93 |
| ఓబీసీ | 77 | 50 | 56 | 62 | 83 |
| ఈడబ్ల్యూఎస్ | 77 | 50 | 56 | 62 | 83 |
| ఎస్సీ | 43 | 28 | 31 | 34 | 46 |
| ఎస్టీ | 43 | 28 | 31 | 34 | 46 |
| పీడబ్ల్యూడీ | 43 | 28 | 31 | 34 | 46 |

**పెద్ద కంపెనీకి సీఈఓ అవుతా**



జాతీయ స్థాయిలో రెండో ర్యాంక్ రావడం పట్ల ఆనందంగా ఉంది. మాది చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు మండలం బీఎస్ ఆర్ పేట. అమ్మానాన్న కృష్ణవేణి, రమేష్ ఇద్దరూ ప్రభుత్వ టీచర్లే. ఐఐటీ బాంబేలో సీఎస్ఈ తీసుకుంటాను. పెద్ద కంపెనీకి సీఈఓ కావాలన్నదే నా లక్ష్యం. పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడేలా టెక్నాలజీని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తా.

–సెకండ్ ర్యాంకర్ ఆర్.సూర్యతేజ

**ఎంఐటీలో ఎంఎస్ చేయాలనుంది**

మా స్వస్థలం గుంటూరు జిల్లా చిలక లూరి పేట. నాన్న హనుమంతరావు రైతు. అమ్మ కళావతి నరస రావుపేట లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ లో సూపర్‌వైజర్. ముంబై ఐఐటీలో సీఎస్ ఈలో చేరుతాను. తర్వాత ఎంఐటీ (మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)లో ఎంఎస్ చేయాలనే లక్ష్యంతో ఉన్నాను. –5వ ర్యాంకర్ అడ్డగడ వెంకట శివరాం

**ముంబై ఐఐటీలో సీఎస్ఈలో చేరుతా..**

మా స్వస్థలం ప్రకాశం జిల్లా మార్కాపురం. ప్రస్తుతం గుంటూరులో ఉంటున్నాం. నాన్న శ్రీనివాసరెడ్డి వ్యవసాయం చేస్తున్నారు. అమ్మ అనురాధ గృహిణి. ఏపీఈఏపీ సెట్‌లో 6వ ర్యాంకు, తెలంగాణ ఎంసెట్‌లో 2వ ర్యాంకు సాధించాను. జేఈఈ అడ్వాన్స్‌డ్ జనరల్ కేటగిరీలో 10వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో ఫస్ట్ ర్యాంక్ వచ్చింది. ఐఐటీలో చదవాలనే లక్ష్యంతో చదివాను. ముంబై ఐఐటీలో సీఎస్ఈలో చేరుతాను.

–10వ ర్యాంకర్ యక్కంటి ఫణి వెంకట మణీందర్‌రెడ్డి

**ఏపీ, తెలంగాణ నుంచి కొందరు ముఖ్య రాంకర్లు**

| పేరు | ర్యాంకు |
|---|---|
| దాసరి సాకేత్ నాయుడు | 12 |
| జి.అభిరామ్ | 14 |
| కౌశిక్‌రెడ్డి | 17 |
| డి.వెంకటయుగేష్ | 18 |
| మాలిక్ జిందాల్ | 19 |
| షేక్ సాహిల్ చందా | 23 |
| సోని మయాంక్ | 26 |
| ఎస్ఎస్ సుమేథ్ | 37 |
| బీడీఎస్ సాత్విక్‌రెడ్డి | 38 |
| సుతార్ హర్ష | 62 |
| డి.ఫణీంద్రనాథ్‌రెడ్డి | 65 |
| గుండా సుశాంత్ | 67 |
| హర్ష తాయ | 68 |
| కె.వివేక్ | 73 |
| తేజరెడ్డి | 81 |
| వెంకట కౌండిన్య | 84 |
| సమోట అపూర్వ | 92 |

**అత్యధిక ర్యాంకులు వచ్చిన ఐఐటీ జోన్లు**

| జోన్ | టాప్10 | టాప్100 | టాప్200 | టాప్300 | టాప్400 | టాప్500 | క్వాలిఫైడ్ |
|---|---|---|---|---|---|---|---|
| బాంబే | 0 | 22 | 42 | 59 | 80 | 103 | 7,957 |
| ఢిల్లీ | 2 | 20 | 44 | 69 | 98 | 120 | 9,290 |
| గౌహతి | 0 | 1 | 2 | 2 | 4 | 4 | 2,395 |
| హైదరాబాద్ | 6 | 40 | 75 | 121 | 149 | 174 | 10,432 |
| కాన్పూర్ | 0 | 2 | 4 | 4 | 9 | 16 | 4,582 |
| ఖరగ్‌పూర్ | 0 | 5 | 11 | 20 | 25 | 37 | 4,618 |
| రూర్కీ | 2 | 10 | 22 | 25 | 35 | 46 | 4,499 |



## జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో శ్రీచైతన్య ప్రభంజనం

**జేఈఈ టాపర్‌కు రూ.50 లక్షలు**



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో శ్రీచైతన్య యాజమాన్యం

బంజారాహిల్స్ (హైదరాబాద్) : ఐఐటీ ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ –2023 పరీక్ష ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థలు ప్రభంజనం సృష్టించింది. ఆల్‌ఇండియా ఓపెన్ కేటగిరీలో టాప్–10లోపు అయిదు ర్యాంకులు, టాప్–100లోపు 32, టాప్ 1000లోపు 181, ఆల్ కేటగిరీల్లో టాప్ 10లోపు 21, టాప్ 100లోపు 142, టాప్ 1000లోపు 699 ర్యాంకులు శ్రీ చైతన్య సాధించింది. ఆల్ ఇండియా కేటగిరీలో తమ సంస్థ విద్యార్థులు వావిలాల చిద్విలాస్ రెడ్డి 1వ ర్యాంకు, రమేశ్ సూర్యతేజ 2వ ర్యాంకు, కర్ల రిషి 3వ ర్యాంకు, రాఘవ్ గోయల్ 4వ ర్యాంకు, అభినవ్ చౌదరి 7వ ర్యాంకు సాధించారు. కాగా, చిద్విలాస్ రెడ్డికి రూ.50 లక్షలు, రమేశ్ సూర్యతేజకు రూ.25 లక్షలు, కర్ల రిషికి రూ.10 లక్షలు చెక్కుల రూపంలో అందజేశారు. తమ సంస్థనుంచి ఐఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు ఆదివారం జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ బీఎస్.రావు, అకడమిక్ డైరెక్టర్ ఇన్ఫినిటీ లెర్న్ ఫౌండర్ డైరెక్టర్ సుష్మ బంగారు పతకాలను అందజేసి అభినందించారు.

## జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో నారాయణ రికార్డ్



సాక్షి, హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నారాయణ రికార్డ్ సృష్టించింది. నారాయణ విద్యార్థిని ఎస్.నాగభవ్యశ్రీ బాలికల విభాగంలో ఆలిండియా ఫస్ట్ ర్యాంక్‌ను సాధించింది. ఓపెన్ కేటగిరీలో బాలాజీరెడ్డి నాగిరెడ్డి 9వ ర్యాంక్, ఉజ్వల్ శంకర్ 11వ, యువరాజ్ గుప్తా 13వ, మహేష్ 15వ, సమీర్ అరవింద్‌పాటిల్ 20వ ర్యాంకు దక్కించుకున్నారు. తమ విద్యార్థులు వందలోపు 29 ర్యాంకులు కైవసం చేసుకున్నారని నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్స్ పి.సింధూరనారాయణ, పి.శరణి నారాయణ తెలిపారు. ఆలిండియా అన్ని కేటగిరీల్లో 100లోపు 106 ర్యాంకులు పొందారని వెల్లడించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు.

## ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ

విద్యారణ్యపురి: జేఈఈ అడ్వాన్స్‌డ్–2023 ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభను చాటారని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాల్లో జాతీయ స్థాయి అన్ని కేటగిరీలు కలిపి సాత్విక్.జి 10వ ర్యాంకు, జె.శశివర్ధన్ 26, పెండెం శ్రీకరి 42, బి.సమీత్ 42, బి.సోనుశ్రీ 87, ఎల్.విశాల్ 114, బానోతు నితీష్ 135, సి.సోనికా 164, బి.అభిరామ్‌నాయక్ 168, ఎ.మణిదీప్‌రెడ్డి 253 ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు.

## సత్తాచాటిన ‘అల్ఫోర్స్’



కొత్తపల్లి(కరీంనగర్): జేఈఈ అడ్వాన్స్‌డ్–2023 ఫలితాల్లో అల్ఫోర్స్ ఐఐటీ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. వివిధ కేటగిరీల్లో అద్భుత ర్యాంకులు సాధించినట్లు కరీంనగర్‌లోని అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..బి. లోకేష్ 115వ ర్యాంకు, ఎ.ఇషాంత్‌రెడ్డి 282, అభిరామ్ 306, శశిప్రీతమ్ 467, వాగ్దేవి 660, వివేకవర్ధన్ 916 ర్యాంక్‌తో పాటు మరో 36 మంది 5 వేల లోపు, 50 ఆపై మంది 10 వేల లోపు ర్యాంకులు సాధించినట్లు వివరించారు.

# కూల్చాల్సిన భవనాలెన్ని.. | కొట్టేయాల్సిన చెట్లెన్ని..?

**విలువతో సహా లెక్కించి వివరాలు నమోదు చేస్తున్న యంత్రాంగం**

- రీజినల్ రింగ్‌రోడ్డుకు అవార్డ్ పాస్ చేసే కసరత్తు వేగం పెంచిన అధికారులు
- చిన్న స్తంభాల తొలగింపు.. పెద్ద స్తంభాల ఎత్తు పెంపు
- మిషన్ భగీరథ, మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వే లైన్‌ల వద్ద ప్రత్యేక వంతెనలు



రోడ్డుకు మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వేలైన్ అడ్డుగా ఉండేచోట వంతెన నిర్మాణంపై అధికారుల సర్వే

సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి మూడు కాలా(కాంపిటెంట్ అథారిటీ ఫర్ ల్యాండ్ అక్విజిషన్)ల పరిధిలో అవార్డు పాస్ చేసేందుకు ఎన్‌హెచ్‌ఏఐ ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం పట్టాదారుల వారీగా వివరాలు నమోదు చేస్తోంది. రోడ్డు నిర్మాణంలో సేకరించాల్సిన భూముల్లో ఉన్న నిర్మాణాలు, తోటలు, ఇతర ఆస్తుల విలువను మదింపు చేసే ప్రక్రియకు తాజాగా అధికారులు శ్రీకారం చుట్టారు. సేకరించాల్సిన భూమి విలువ ఆధారంగా పరిహారాన్ని అందించే క్రమంలో, ఆయా భూముల్లో ఉన్న నిర్మాణాలు, చెట్ల విలువలను కూడా గుణించి పరిహారం అందిస్తారు. ఇప్పుడు వాటి విలువకు సంబంధించి అధికారులు సర్వే చేస్తూ లెక్కలు సేకరిస్తున్నారు.

**ఉత్తరభాగంలో 8 'కాలా'లు**

రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగంలో 8 'కాలా'లున్న విషయం తెలిసిందే. ఇందులో యాదాద్రి–భువనగిరి, చౌటుప్పల్, ఆందోల్–జోగిపేట కాలాలకు సంబంధించి ఇటీవలే ఎన్‌హెచ్‌ఏఐ 3డీ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఈ మూడు ప్రాంతాల్లోని రైతులకు పరిహారం పంపిణీకి మార్గం సుగమమైంది. ఇందులో భాగంగా అవార్డ్ పాస్ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. యాదాద్రి ప్రాంతంలో భూసేకరణకు సంబంధించిన ప్రక్రియ జరక్కుండా రైతులు అడ్డుకుంటున్న విషయం తెలిసిందే. ఎట్టిపరిస్థితుల్లో రీజినల్ రింగ్‌రోడ్డుకు భూములు ఇవ్వబోమంటూ వారు భీష్మించుకుని కూర్చున్నారు. నిరసన కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇటీవల కొందరు రైతులపై కేసులు పెట్టిన పోలీసులు, వారికి బేడీలు వేసి మరీ కోర్టుకు తీసుకురావటం తీవ్ర విమర్శలకు దారి తీసిన విషయం తెలిసిందే. దీంతో ఈ ప్రాంతంలో సర్వేను అలాగే పెండింగులో ఉంచిన అధికారులు, మిగతా రెండు కాలాల్లో వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సేకరించాల్సిన భూముల్లో ఉన్న ఇళ్లు, దుకాణ సముదాయాలు, పరిశ్రమలు, ఇతర నిర్మాణాల లెక్కలు తీస్తున్నారు. పొలాల్లో ఉన్న తోటలు, సాధారణ చెట్ల లెక్కలు కూడా సిద్ధం చేస్తున్నారు. వాటి నిర్ధారిత విలువ ఆధారంగా నష్టపరిహారాన్ని అందిస్తారు. ప్రైవేటు వ్యక్తులతోపాటు, కొన్ని ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులు కూడా ఉన్నాయి. వాటి లెక్కలను కూడా సంబంధించి విభాగాల అధికారులతో కలిసి సర్వే చేసి సిద్ధం చేస్తున్నారు.

**ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ..**

ప్రభుత్వ విభాగాల ఆధ్వర్యంలో రింగురోడ్డుకు అడ్డుగా ఉన్న స్తంభాలు, నీటి పైపులైన్లను తరలించేందుకు కూడా సమాంతరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎల్‌టీ లైన్లకు సంబంధించిన చిన్న స్తంభాలను తొలగించనున్నారు. అదే హైటెన్షన్, పవర్ గ్రిడ్ స్తంభాలను తొలగించకుండా, లైన్లు మరింత ఎత్తుగా ఉండేలా స్తంభాల ఎత్తును పెంచాలని నిర్ణయించారు. ఈమేరకు ట్రాన్స్‌కో, పవర్‌గ్రిడ్ అధికారులతో కలిసి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు నమోదు చేస్తున్నారు. ఇక మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వే లైను కూడా అడ్డుగా ఉన్నందున, ఏయే ప్రాంతాల్లో ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించాలో, వాటి పొడవు, ఎత్తు ఎంత ఉండాలో తేల్చేందుకు రైల్వే అధికారులతో కలిసి సర్వే చేస్తున్నారు. మిషన్ భగీరథ పైపులైన్లు ఉన్న చోట్ల ప్రత్యేక నిర్మాణాలు చేపడతారు. మరో నెల రోజుల్లో ఈ కసరత్తు పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. సంగారెడ్డి–తూప్రాన్ మధ్య 30 కి.మీ.లు చొప్పున రెండు ప్యాకేజీలుగా 60 కి.మీ. నిడివి గల రింగు రోడ్డు పనులు తొలుత ప్రారంభించాలని ఇప్పటికే నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ రెండు ప్యాకేజీలకు ఈ సంవత్సరమే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో వీలైనంత తొందరగా అవార్డు పాస్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణలో లాయర్లు ముందుండాలి: కాసాని జ్ఞానేశ్వర్

సాక్షి, హైదరాబాద్: సమాజంలో లాయర్ల పాత్ర కీలకమని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ముందుకు వచ్చి నిరంతరం కృషి చేయాలని టీటీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో జరిగిన తెలుగుదేశం రాష్ట్ర పార్టీ లీగల్ సెల్ విభాగం నూతన కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన హాజరై ప్రసంగించారు. లీగల్ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన రాఘవేంద్ర ప్రతాప్‌ను అభినందించారు. అన్ని నియోజకవర్గాల్లో పూర్తిస్థాయి కమిటీలు వేసి పార్టీకి అండగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు కాట్రగడ్డ ప్రసూన తదితరులు పాల్గొన్నారు.



### కరుణాపురం 'క్రీస్తుజ్యోతి' మందిరానికి
## అంతర్జాతీయ గుర్తింపు



అవార్డు అందుకుంటున్న పాల్సన్‌రాజ్

ధర్మసాగర్: హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం కరుణాపురం శివారులోని 'క్రీస్తుజ్యోతి' ప్రార్థన మందిరానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. కరుణాపురంలో 40 వేల మంది కూర్చొని ఏకకాలంలో ప్రార్థనలు చేసే అతిపెద్ద చర్చి నిర్మాణం చేపట్టినందుకు డెన్నీ కె.డెవిస్ పీస్ 2023 అవార్డును సాధించింది. అమెరికన్ మల్టీ ఎత్నిక్ కోయలిషన్ 7వ కాంగ్రెషనల్ మల్టీ ఎత్నిక్ అడ్వైజరీ టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో సొసైటీ ఆఫ్ క్రైస్ట్ ప్రెసిడెంట్ క్రీస్తుజ్యోతి మినిస్ట్రీ ఫౌండర్ డాక్టర్ సంగాల పాల్సన్‌కు ఆదివారం ఆ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా పాల్సన్ మాట్లాడుతూ.. తమను గుర్తించి అవార్డు ఇచ్చిన సంస్థకు ధన్యవాదాలు తెలుపుతూ సంస్థ మరింత అభివృద్ధిలోకి రావాలని ఆశీర్వదించారు. తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణ నుంచి ఈ అవార్డు రావడంపై సొసైటీ ఆఫ్ క్రైస్ట్ జనరల్ సెక్రటరీ రెవ డాక్టర్ జయప్రకాశ్ గోపు హర్షం వ్యక్తం చేశారు.

## .. న్యాయవ్యవస్థ పనిచేస్తుంది

▶ మొదటి పేజీ తరువాయి

మౌలిక సూత్రాలకు కట్టుబడి పనిచేయాలని, రాజ్యాంగం మౌలిక సూత్రాలకు ఆటంకం కలిగించే విధంగా వ్యవహరించవద్దని కేశవానంద భారతి కేసు తీర్పుతో మరోసారి స్పష్టమైందన్నారు. దేశంలో అత్యవసర పరిస్థితిలో, ప్రభుత్వం పౌరుల హక్కులను కాల రాసినప్పుడు న్యాయ వ్యవస్థ వ్యవహరించిన తీరు అభినందనీయమని కొనియాడారు. రాజ్యాంగంలో ఎన్నో మార్పులు చేర్పులు చేయవచ్చు కానీ ప్రాథమిక హక్కులను మార్పు చేయలేమన్నారు. రాజ్యాంగంలోని 21 ఆర్టికల్‌కు సవాలుగా ఎన్ని కేసులు వచ్చినా స్వేచ్ఛ, సమానత్వ మౌలిక సూత్రాలకు ఎలాంటి విఘాతం కలగలేదన్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను ప్రభుత్వాలు తమ ఎజెండా కోసం వాడుకోకుండా, వాటిని కాపాడే బాధ్యతను తీసుకోవాలని కోరారు.

**నిత్య విద్యార్థులమే..**

భారత రాజ్యాంగం ఒక గొప్ప గ్రంథమని, ఈ గ్రంథాన్ని అందించిన మహానుభావులకు మనం కృతజ్ఞతగా ఉండాలని సీజే సూచించారు. సుప్రీంకోర్టు ప్రతిష్ట పెంచిన న్యాయమూర్తులు ఎందరో ఉన్నారని, వారు తమ తీర్పులతో న్యాయవ్యవస్థకు గౌరవం తెచ్చారని గుర్తు చేశారు. న్యాయవిద్యలో ఎంత విజ్ఞానాన్ని సంపాదించినప్పటికీ నిత్య విద్యార్థులమేనని, ప్రజలకు సత్వర న్యాయం అందించడంలో న్యాయవాదుల పాత్ర ఎంతో ముఖ్యమని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బాల భాస్కర్ రావు, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.మారుతీ దేవి, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కె.మురళీ మోహన్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.దశరథ రామయ్య, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, ఆలేరు జూనియర్ సివిల్ జడ్జి సుమలత, తెలంగాణ బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఏనుగు నరసింహారెడ్డి, ఐలు రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు జి.విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి పీవీ సురేంద్ర నాథ్, భువనగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగారం అంజయ్య పాల్గొన్నారు.



హైకోర్టు సీజే ఉజ్జల్ భూయాన్ దంపతులకు చతుర్వేద ఆశీర్వచనం చేస్తున్న ఆచార్యులు

**లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు..**

హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ దంపతులు ఆదివారం ఉదయం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భూయాన్ దంపతులకు ఆచార్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపించారు. భూయాన్ దంపతులకు ఆచార్యులు ముఖ మండపంలో చతుర్వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ గీతారెడ్డి లడ్డూ ప్రసాదం అందజేశారు. అంతకుముందు కొండపైన అతిథిగృహంవద్ద కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్ తదితరులు స్వాగతం పలికారు.

## శ్రీవారి దర్శనానికి 24 గంటలు




తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ కృష్ణతేజ అతిథిగృహం వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 87,762 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. 43,753 మంది తలనీలాలు ఇచ్చారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.61 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది.

## ఆ తీర్మానం రాజ్యాంగ విరుద్ధం

- 11 బీసీ కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీ తీర్మానంపై లంబాడీ హక్కుల పోరాట సమితి
- 20న ఎస్టీల 'చలో హైదరాబాద్'కు పిలుపు

కాచిగూడ (హైదరాబాద్): తెలంగాణలో 11 బీసీ కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానం రాజ్యాంగ విరుద్ధమని లంబాడీ హక్కుల పోరాట సమితి స్పష్టం చేసింది. బీసీ కులాలను ఎస్టీ జాబితాలో చేరిస్తే గిరిజనుల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని లంబాడీ హక్కుల పోరాట సమితి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రజాసంఘాల ఐక్యవేదిక సమన్వయకర్త జాతోత్ కిషన్ నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తీర్మానాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని లేదంటే రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనులకు పట్టాలివ్వాలని, 'గిరిజనబంధు'ను తక్షణమే ప్రకటించి ప్రతి గిరిజన కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'చలో హైదరాబాద్' పేరుతో ఈ నెల 20న ఇందిరాపార్క్‌లో జరగనున్న ధర్నాకు రాష్ట్రవ్యాప్తంగా ఎస్టీలు తరలిరావాలని పిలుపునిచ్చారు.



ప్రేమికి చెంత ప్రతి ఒక్కరూ కవిగా మారుతారు.
– ప్లేటో



సాక్షి

సోమవారం, 19 జూన్ 2023

# పుస్తక మర్యాద

ఒక పుస్తకాన్ని చదవడం వేరు, ఆ పుస్తకాన్ని అపురూపంగా చూడటం వేరు. చాలామంది పుస్తకాలను అమర్యాదగా చదువుతారు. అంతే సమానంగా వాటిపట్ల అజాగ్రత్తగా ఉంటారు. పుస్తకాలను వాటి మర్యాదకు తగినట్టుగా గౌరవించడం కూడా ఒక సంస్కృతి! పుస్తకం పేజీలు తీయడం కూడా కొందరు సుతారంగా తీస్తారు; పేజీలు నలగకుండా దాన్నొక పువ్వులా హ్యాండిల్ చేస్తారు. కొందరు నీటుగా బుక్ మార్క్స్ సిద్ధం చేసుకుంటారు. కొందరు చదవడం ఆపిన చోట పేజీ కొసను చిన్నగా మడుచుకుంటారు. ఇక కొందరి పుస్తకం చదవడం పూర్తయ్యేసరికి ఒక బీభత్సం జరిగి వుంటుంది. అలాగని పుస్తకం చదువుతూ రాసుకునే నోట్సు దీనికి భిన్నం. అది పుస్తకంతో ఎవరికి వారు చేసుకునే వ్యక్తిగత సంభాషణ. కొందరు కేవలం అండర్‌లైన్ చేసుకుంటారు. కొందరు పుస్తకం చివర నచ్చిన పేజీ తాలూకు నంబర్ వేసుకుని దానికి సంబంధించిన వ్యాఖ్యో, పొడి మాటో రాసుకుంటారు. ఇలాంటివారికి పుస్తకంలో చివర వచ్చే తెల్ల కాగితాలు చాలా ఉపయుక్తం. పఠనానుభవాన్ని పెంపు చేసుకునేది ఏదైనా పుస్తకాన్ని గౌరవించేదే. అయితే, పుస్తకాన్ని గౌరవిస్తున్నారని చూడగానే ఇట్టే తెలియజేసే అతి ముఖ్యమైన భౌతిక రూప చర్య– దాన్ని బైండు చేయడం. ఈ బైండు చేయించడంలో, స్వయంగా తామే చేసుకోవడంలో కూడా ఎవరి అభిరుచి వారిది. అలాగే పుస్తకం తరహాను బట్టి కూడా ఇది మారొచ్చు. అలాగే బైండింగుకు వాడే మెటీరియల్, అది చేసే పద్ధతులు కూడా చాలా రకాలు. ఏమైనా బైండింగు కూడా దానికదే ఒక కళ. అది కొందరికి బతుకుదెరువు అనేది కూడా ఒక వాస్తవమే. కానీ ప్రపంచంలో గొప్ప బైండింగు కళాకారుల పనితనాన్ని తెలియజేసే పుస్తకాలు కూడా కొన్ని చోట్ల ప్రదర్శనకు ఉన్నాయి. పుస్తకం లోపల వ్యక్తమయ్యే భావాలకు అనుగుణంగా దాన్ని తీర్చిదిద్దాలంటే ఆ బైండరు కూడా మంచి కళాకారుడు అయివుండాలి.

ఫ్యోదర్ దోస్తోవ్‌స్కీ నవల 'ద పొసెస్డ్'లో జరిగే ఈ ఆసక్తికర సంభాషణ పుస్తకాల పట్ల ప్రపంచం ఇంకా ఎక్కడుందో తెలియజేస్తుంది. ఈ నవలకే వాటి అనువాదకులను బట్టి 'డెమన్స్', 'డెవిల్స్' అని మరో రెండు పేర్లున్నాయి. జీవితంలో ఎన్నో దెబ్బలు తిని, వాస్తవాల చేదును గ్రహించి, బండి బాడుగ కూడా ఇవ్వలేని స్థితిలో చివరకు తానే వదిలేసిన భర్త దగ్గరకు మళ్లీ చేరుతుంది మేరీ. బతకడానికి ఏదైనా మార్గం గురించి ఆలోచిస్తూ, 'పోనీ పుస్తకాల బైండింగు చేస్తాను' అంటుంది. అప్పుడు ఆమె భర్త, నవలలో అన్నివిధాలా సంయమనం కలిగిన మనిషి, 'ఆదర్శాల్లోని' నిగ్గును తేల్చుకున్న ఇవాన్ షతోవ్ ఆమె భ్రమలు తొలిగేలా ఇలా చెబుతాడు: ''పుస్తకాలను చదవడం, వాటిని బౌండు చేయించడం అనేవి అభివృద్ధికి సంబంధించిన రెండు పూర్తి భిన్న దశలు. మొదట, జనాలు నెమ్మదిగా చదవడానికి అలవాటు పడతారు. దీనికి సహజంగానే శతాబ్దాలు పడుతుంది; కానీ వాళ్లు తమ పుస్తకాలను కాపాడుకోరు. వాటిని నిర్లక్ష్యంగా పడేస్తారు. పుస్తకాలను బైండు చేయించడం అనేది పుస్తకాల పట్ల గౌరవానికి సంకేతం; అది ప్రజలు పుస్తకాలను చదవడానికి ఇష్టపడటమే కాదు, వాళ్లు దాన్ని ఒక ప్రధాన వృత్తిగా భావిస్తున్నారని సూచిస్తుంది. రష్యాలో ఎక్కడా అలాంటి దశకు చేరుకోలేదు. యూరప్‌లో కొంతకాలంగా తమ పుస్తకాలను బైండింగ్ చేయిస్తున్నారు.''

1871–72 కాలంలో రాసిన ఈ నవలలో, సాహిత్యం అత్యంత ఉచ్చస్థితిని అందుకొందనుకునే రష్యా సైతం ఒక దేశంగా చదివే సంస్కృతిలో వెనుకబడి ఉందన్నట్టుగా రాశారు దోస్తోవ్‌స్కీ. ఇంక మిగతా దేశాల పరిస్థితి?

ఒక సమాజపు అత్యున్నత స్థితిని కొలవగలిగే ప్రమాణాలు అక్కడి కళలు, వాటి పట్ల జనాల వైఖరి మాత్రమే. దీనికి కూడా ఈ నవలలో దోస్తోవ్‌స్కీ ద్వారా సమాధానం దొరుకుతుంది. అప్పటి కాలానికి తనను తాను అభ్యుదయ రచయితగా భావించుకొనే పీటర్ వెర్కోవెన్‌స్కీ ఇలా ఆవేశపడతాడు: ''బానిసల (సెర్ఫులు) దాస్య విమోచన కంటే కూడా షేక్‌స్పియర్, రఫేల్ అధికోన్నతులని నేను ఘోషిస్తున్నాను; జాతీయత కంటే అధికోన్నతులు, సామ్యవాదం కంటే అధికోన్నతులు, యువతరం కంటే అధికోన్నతులు, రసాయన శాస్త్రం కంటే అధికోన్నతులు, దాదాపు మానవాళి మొత్తం కంటే అధికోన్నతులు; ఎందుకంటే వాళ్లు ఇప్పటికే సమస్త మానవాళి సాధించిన ఫలం. నిజమైన ఫలం. బహుశా ఇంకెప్పటికీ సాధ్యం కానంతటి అత్యున్నత ఫలం!'' అలాంటి ఒక కళోన్నత స్థితి లేని సమాజంలో తాను జీవించడానికి కూడా సమ్మతించకపోవచ్చునంటాడు వెర్కోవెన్‌స్కీ. ఇది ఆర్ట్ అనేదానికి అత్యున్నత స్థానం ఇచ్చే సాంస్కృతిక కులీనుల అతిశయోక్తిలా కనబడొచ్చు. కానీ కళ అనేదాన్ని మినహాయిస్తే మన జీవితాల్లో మిగిలేది ఏమిటి? మహాశూన్యం. గాఢాంధకారం. అందుకే తమ జీవితాల్లో ఏదో మేరకు కళను సజీవంగా నిలుపుకొన్నవాళ్లు అదృష్టవంతులు. అది తమకు నచ్చిన సీరియళ్లను ఒక పుస్తకంగా కుట్టుకోవడం, తమకు నచ్చిన పుస్తకాలను బైండు చేయించుకోవడం కూడా కావొచ్చు.

ఏ రూపంలో ఉన్న అతివాదాన్నయినా దాని మూలాలను, అది పాతుకుపోవడానికి దారితీసే పరిస్థితులను, ఒకప్పుడు తమ వర్గంవాడే అయినా కేవలం ఇప్పుడు ఆ వాదంలోంచి బయటపడ్డాడన్న కారణంగా చంపడానికీ వెనుకాడని మూక మనస్తత్వాన్ని–– ఒక శక్తిమంతమైన సూక్ష్మదర్శినిలో చూసినట్టుగా చిత్రించిన నవల 'పొసెస్డ్'. విషాదాంతంగా ముగిసే ఈ సామాజిక, రాజకీయ వ్యాఖ్యాన నవల కూడా బైండు చేసుకుని దాచుకోవాల్సిన పుస్తకం. అదే అనితర సాధ్యుడైన దోస్తోవ్‌స్కీ లాంటి రచయితకు ఇవ్వగలిగే సముచిత మర్యాద!

# టీవీకి సరిగ్గా సరిపోయే ఆట!

కామెంట్



కరణ్ థాపర్

**ఫుట్‌బాల్, క్రికెట్ వ్యక్తిగతమైన ఆటలు కావు. అవి జట్టు ఆటలు. జట్టులోని ఏ ఆటగాడి ఆట తీరునైనా అర్థం చేసుకోవడానికీ, అతడి నైపుణ్యాన్ని గుర్తించడానికీ మిగతా ఆటగాళ్లు ఏ స్థానంలో ఉన్నారో తెలుసుకోవడం అవసరమౌతుంది. అందుకే అవి స్టేడియంలలో చక్కగా కనిపిస్తాయి. అదే టెన్నిస్‌లో కెమెరాలు విడిగా ఒక క్రీడాకారుడిని అత్యుత్తమంగా చిత్రీకరిస్తాయి. అతడు ఫ్రేము నిండుగా ఉన్నప్పుడు అతడి ప్రతి చర్య, ప్రతి కదలిక కనిపిస్తుంది. అతడి నిస్పృహ అయినా, అతడి విజయోద్వేగం అయినా స్పష్టంగా తెలిసిపోతుంది. దానికి తోడు, టెన్నిస్‌లో బంతిని అట్నుంచి ఇటు, ఇట్నుంచి అటు కొట్టడం లక్ష్యంగా ఉంటుంది. ఇద్దరు ఆటగాళ్ల నడుమ బంతి ప్రయాణ మార్గాలను కెమెరా అలవోకగా అనుసరిస్తుంది.**

నేను క్రీడాకారుడిని కాదు. నిజం చెబుతున్నా, స్క్వాష్ తప్ప నేను ఏనాడూ ఏ ఆటా ఆడింది లేదు. క్రికెట్ అయితే నాకు ఒక దుర్భరమైన ధారావాహికలా తోస్తుంది. ఫుట్‌బాల్ మరీ అంత సాగతీతగా ఉండదు కనుక కొంచెం నయం అనుకుంటాను. ఎప్పుడైనా మర్యాద కోసం తప్ప ఆటల్ని నేను కనీసం చూడనైనా చూడను. కానీ టెన్నిస్... ఆహా! టెన్నిస్. అది నాకు మిగతా ఆటల్లా కాదు. మొత్తంగా అది వేరే కథ.


మొన్న నేను ఫ్రెంచి ఓపెన్ ఫైనల్స్‌లో నొవాక్ జొకోవిచ్‌ను చూసినప్పుడు టెన్నిస్ అన్నది టెలివిజన్ కోసం తయారైన ఆట అని గ్రహించాను. ఫుట్‌బాల్, క్రికెట్ అలా కాదు. బహుశా అందుకేనేమో ఎప్పుడో గాని గ్రాండ్ స్లామ్ ఫైనల్స్‌ని నేను చేజార్చుకోను. ఇతర ఆటల వరల్డ్ కప్పులు ఏమైపోయినా నాకు పట్టదు.

టెన్నిస్‌లో కెమెరాలు విడిగా ఒక క్రీడాకారుడిని అత్యుత్తమంగా చిత్రీకరిస్తాయి. అతడు ఫ్రేము నిండుగా ఉన్నప్పుడు అతడి ప్రతి చర్య, ప్రతి కదలిక కనిపిస్తుంది. అతడి నిస్పృహ అయినా, అతడి విజయోద్వేగం అయినా స్పష్టంగా తెలిసిపోతుంది. సంకల్ప బలం, స్థయిర్య క్షీణత వంటి అంతర్గత గుణాల విషయంలో కూడా ఇది నిజం. కెమెరా ఆ గుణాలను వెలికి తీస్తుంది. దానికి తోడు, టెన్నిస్‌లో బంతిని అట్నుంచి ఇటు, ఇట్నుంచి అటు కొట్టడం లక్ష్యంగా ఉంటుంది. ఇద్దరు ఆటగాళ్ల నడుమ బంతి ప్రయాణ మార్గాలను కెమెరా అలవోకగా అనుసరిస్తుంది. ప్రతి విసురూ ఆట ఊపునుంచి వీక్షకుల చూపును తిప్పుకోనివ్వకుండా చేస్తుంది.

టెన్నిస్‌లా ఫుట్‌బాల్, క్రికెట్ వ్యక్తిగతమైన ఆటలు కావు. అవి జట్టు ఆటలు. అందువల్ల జట్టులోని ఏ ఆటగాడి ఆట తీరునైనా అర్థం చేసుకోడానికీ, అతడి నైపుణ్యాన్ని గుర్తించడానికీ మిగతా ఆటగాళ్లు ఏ స్థానంలో ఉన్నారో తెలుసుకోవడం మీకు అవసరమవుతుంది. అప్పుడు మాత్రమే మీరు బంతిని నియంత్రణలోకి తీసుకున్న ఆటగాడి మదిలోని వ్యూహాన్ని దృశ్యమానం చేయగలరు. అయితే ఒక ఆటగాడి మీద దృష్టిని నిలపడం అన్నది ఆటలోని తక్కిన భాగాన్నంతా కోల్పోయేలా చేస్తుంది. అందుకే ఏ ఆటగాడు ఏ స్థానంలో ఉన్నదీ ఒకేసారి చూడా లంటే మైదానం మీకు తగినంత దూరంగా ఉండాలి. ఆ దూరం ఆట గాళ్లందర్నీ కనిపించేలా చేస్తుంది. అందుకే



ఫుట్‌బాల్, క్రికెట్‌లు స్టేడియంలలో చక్కగా కనిపిస్తాయి. మానవ నేత్రం ఒక్క సారింపుతో అన్నిటినీ చూడగలదు. టీవీ కెమెరా అలా చూడలేదు. అనేక కెమెరాలు పని చేస్తున్నప్పటికీ ఏదైనా ఒక కెమెరాలో వచ్చిన పేలవమైన దృశ్యాన్ని కూడా అవి ఏవీ భర్తీ చేయలేవు.



నొవాక్ జొకోవిచ్

టెన్నిస్‌లో ఇందుకు భిన్నంగా ఉంటుంది. ఉదాహరణకు, మీరు రాయల్ బాక్స్ నుంచి వింబుల్డన్‌ను తిలకిస్తున్నట్లయితే దూరం నుంచి క్రీడా మైదానం సంతృప్తికరమైన వీక్షణను ఇవ్వదు. ఒక వేళ మీరు పక్కల నుంచి చూస్తున్నట్లయితే మీ మెడ ఎడమ నుంచి కుడికి, కుడి నుంచి మళ్లీ ఎడమకు మళ్లుతూ ఉంటుంది. బంతిని ఏ మాత్రం నేలను తాకనివ్వని పోటాపోటీ షాట్‌ల సుదీర్ఘమైన నిడివి కూడా మీకు అలసటను కలిగించవచ్చు. అదే టీవీలోనైతే రెండు మైదానాలు సమంగా కళ్ల ముందర ఉంటాయి. మీ మెడకు అసౌకర్యం కలుగదు. ఎందుకంటే మీరు స్క్రీన్‌కు ఎదురుగా కూర్చొని చూస్తుంటారు. బహుశా ఈ సదుపాయం వల్లనే దశాబ్దాలుగా నేను కొందరు టెన్నిస్ క్రీడాకారులను పిచ్చిగా అభిమానిస్తుండవచ్చు. వాళ్లు ఆడుతున్నప్పుడు ఉత్కంఠగా చూస్తుంటాను. వాళ్లు గెలిచి తీరాలని ఆశ పడతాను. ఓడిపోతే కలత చెందుతాను. వాళ్ల విజయాలను, వైఫల్యాలను నావిగా మనసులోకి తీసుకుంటాను. ఇలా వ్యక్తిగతంగా తీసుకోవడం 70 లలో బార్న్ బోర్గ్, మార్టినా నవ్రతిలోవాలతో మొదలైంది. వారి స్థానాన్ని 2000–2009 మధ్య రోజర్ ఫెదరర్ ఆక్రమించాడు. ప్రస్తుతం నొవాక్ జొకోవిచ్.

1980లో బోర్గ్ సాధించిన ఐదవ వింబుల్డన్ విజయాన్ని నేనెప్పటికీ మర్చిపోలేను. నాలుగో సెట్‌లో అతడి ప్రత్యర్థి జాన్ మెకెన్రో అతడికి ఏడు చాంపియన్‌షిప్ పాయింట్‌లను దక్కకుండా చేశాడు. అది అతడి ఆత్మను ఛిన్నాభిన్నం చేస్తుందని వ్యాఖ్యాతలు విశ్వసించారు. విజయానికి చేరువై కూడా విఫలం చెందిన విషయాన్ని మర్చిపోయి ముందుకు సాగిపోవడం సాధ్యం అయ్యే పని కాదు. అయితే ఆ వ్యాఖ్యాతల అంచనా తలకిందులైంది. ఆ ఆటలో దృఢనిశ్చయంతో తలపడిన బోర్గ్ తన మోకాళ్లపై కూలబడటానికి ముందు ఐదో సెట్‌లో 8–6 తేడాతో విజయం సాధించాడు. అతడు చూపేది ఆ ఒక్క భావోద్వేగమే. గెలిచిన ప్రతిసారీ అతడు అలాగే చేస్తాడు. అతడి వ్యక్తిత్వానికి సూచనప్రాయమైన సంకేతం ఇంకొకటి! టోర్నమెంటు జరుగుతున్నంత కాలం గడ్డం తీసేయకపోవడం!

1979లో సిమ్లాలో ఉండగా మా అమ్మమ్మ వాళ్ల ఇంట్లోని బ్లాక్ అండ్ వైట్ టీవీలో నేను బోర్గ్ ఆడుతున్న వింబుల్డన్ ఫైనల్ చూస్తున్నాను. పాకిస్తాన్ టీవీ దానిని ప్రసారం చేస్తోంది. ఐదో సెట్ చివరిలో ఆనాటి అత్యంత భయానక సర్వర్‌లలో ఒకరైన రాస్కో టానాతో పోరాడుతున్న బోర్గ్‌కు మూడు చాంపియన్ షిప్ పాయింట్‌లు చేతిలో ఉండగా పాకిస్తాన్ టీవీ చానల్ అకస్మాత్తుగా వార్తల ప్రసారంలోకి మళ్లింది. ఆ తర్వాత బోర్గ్ విజయం సాధించాడని తెలుసుకోడానికి ముందు అరగంట పాటు నేను తీరని వేదనతో టీవీ ముందు వేచి ఉన్నాను. ఆ నిర్దాక్షిణ్యమైన పీటీవీ, బులెటిన్‌లోకి ఆ వార్తను చేర్చడం సరికాదని భావించినట్లుంది.

ఇప్పుడు మళ్లీ నాలుగు వారాల తర్వాత వింబుల్డన్ నన్ను టీవీ తెర ముందుకు తీసుకురానుందా? మొన్నటితో 23 గ్రాండ్ స్లామ్ టైటిల్స్ గెలిచిన జొకోవిచ్ 24వ టైటిల్‌ను కూడా కోరుకుంటాడు. అందులో సందేహం లేదు. కానీ అది అతడికి ఎంత ముఖ్యమో నాకూ అంత ముఖ్యమా? 1981లో బోర్గ్‌ను ఓడించినందుకు నేను మెకెన్రోని ద్వేషించాను. ఎస్.డబ్ల్యూ18 మైదానంలో జొకోవిచ్ ఓడిపోతే నా ప్రతిస్పందన ఇప్పుడూ అలాగే ఉండబోతుందా?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### ఎందుకలా చూస్తాయి?



ఒక చిన్న ప్రశ్న. అద్దంలో కనబడేది వాటి ప్రతిబింబం అని కుక్కలకు తెలుసా? లేదా, అవి ఇంకో కుక్క అనుకుంటాయా?

– క్యాథెరీన్ షాఫీల్డ్, హిస్టారియన్

### ఏం ఆపుతోంది?



మణిపూర్‌లో కనీసం పది సైనిక దళాలు మోహరించివున్నాయి. ఆదేశాలు, అధికారం ఇస్తే, ఒక క్రమం నెలకొల్పడానికి వాటికి 24 గంటలు పట్టదు. ఎందుకు ఉపయోగించుకోవడం లేదో నాకు అర్థం కావడం లేదు.

– సందీప్ థాపర్, మాజీ సైనికాధికారి

### వన్ మ్యాన్ షో



దేశాన్ని 'ఛాయ్‌వాలా' నాశనం చేశాడని 67 శాతం మంది సరిగ్గానే అభిప్రాయపడుతున్నారు. నేననుకోవడం, దేశం కంటే ఎక్కువగా ఆయన బీజేపీకి నష్టం చేశారు. పార్టీ కార్యాచరణను 'ఒక్క మనిషి పార్టీ'గా మార్చేసి దాన్ని దెబ్బకొట్టారు. ఒక్కసారి ఆయన వెళ్లిపోతే, రెండు లోక్‌సభ సీట్లతో ప్రారంభమైన బీజేపీకి అవీ రావడం కష్టమే.

– రాజేంద్ర కుంభట్, కాంగ్రెస్‌వాది

### సరైన పని



నేను చేసిన ఒక ట్వీట్‌ను స్క్రీన్‌షాట్ తీసి, నన్ను తొలగించాలంటూ నేను పనిచేసే చోటుకు మెయిల్ చేశారు. అది చివరకు సీఈఓ డెస్కుకు చేరింది. నాతో నేను(సీఈఓ) సుదీర్ఘ చర్చ జరిపి, నన్ను ఉద్యోగంలోంచి తొలగించుకోకూడదని నిర్ణయించుకున్నాను.

– మొహమద్ సఫా, ఐరాస ఎకోసాక్ ప్రతినిధి

### పాపం... కదా!



తమ ఇంట్లో పనిచేసే వాళ్లకు కొందరు యజమానులు అప్పు ఇచ్చి దానికి వడ్డీ వసూలు చేస్తారని ఈమధ్యే తెలిసింది. ఎలాంటి మనుషులు ఇలా చేస్తారు? అసలే ఆర్థిక భారంతో ఉన్న మనుషుల మీద మరింత భారం మోపడమా?

– దీప్‌శిఖా ఘోష్, వైద్యురాలు

### ఏంటో తెలియకుండానే...



శ్వేతజాతి మహిళలు హిజాబ్‌ను ఆకర్షణీయమైనదిగా చూస్తుంటే దిగులు కలుగుతుంది. వాళ్లు ఎప్పుడూ దాన్ని ధరించనవసరం లేదు, పాశ్చాత్య దేశాల్లో గానీ, మధ్య ప్రాచ్య దేశాలకు యాత్రలకు వెళ్లినప్పుడు గానీ. ఎంత నష్టం కలిగించే ఆలోచనలకు వాళ్లు పాల్పడుతున్నారో కూడా వారు గుర్తించలేరు.

– జారా కే, యాక్టివిస్ట్

### జెంటిల్‌మన్



వాళ్లు పెళ్లిచేసుకున్నారు. ఆమెతో అతడు సంతోషంగా లేడు. దాని గురించి అడిగినప్పుడు అతనన్నాడు: మరొకరితో నేను నా భార్య గురించి మాట్లాడను. వాళ్లు విడాకులు తీసుకున్నాక, కారణం ఏమిటని మళ్లీ అడిగారు. అతడు మళ్లీ అన్నాడు: పరాయి మహిళ గురించి మాట్లాడను. ఇదీ అసలైన మనుష్యత్వం!


– అస్సీమ్ అల్‌హకీమ్, ఇస్లాం స్కాలర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్‌బాక్స్

## ఆయన జీవితం రామార్పణం

కీర్తి ప్రతిష్ఠలూ, ధనమూ ముఖ్యం కాదు, భక్తియే జీవిత పరమావధి అంటూ రామ భక్తికీ, రాముని సేవకూ తన సర్వస్వమూ వెచ్చించిన వారు– ఖమ్మం జిల్లా, జక్కేపల్లిలో జన్మించిన చందాల కేశవదాసు. తొలి తెలుగు సినీ కవి అయిన ఆయన 1930ల నాటికే ఆయన 'కనకతార' నాటక రచయితగా తెలుగు నాట ప్రసిద్ధి పొందారు. సంస్కృతం గానీ, ఉన్నత విద్యలు గానీ అభ్యసించకపోయినా, ఏ గురువుల శిష్యరికమూ లేకపోయినా... నటన, నాటక రచన, సినీ రచన, హరికథా గానం, అష్టావధానం, పాడడం, ఆశుకవిత్వం, భక్తి తత్వం వారిలో సహజంగా పరిమళించాయి. అన్న వద్ద నారాయణ మంత్రోపదేశం, వంశ పారంపర్యంగా వస్తున్న ఆయుర్వేద వైద్యం, వాస్తు కొద్దికాలమే నేర్చుకొన్నారు.



చందాల కేశవదాసు

స్వప్నంలో ఇష్ట దైవమైన తమ్మర (కోదాడ వద్ద, నాటి నల్గొండ జిల్లా, నేటి సూర్యాపేట జిల్లా) శ్రీ సీతారామచంద్ర స్వామి ఆజ్ఞగా వామన చరిత్రను 'బలిబంధనం' నాటకంగా రాసినట్లు ముందుమాటలో ఆయనే పేర్కొన్నారు. తొలి తరం సినీ రచయితగా సినిమా స్క్రిప్టులూ, మాటలూ, పాటలూ రాశారు. అప్పట్లో కొల్హాపూర్, కలకత్తాలలో షూటింగులు జరుగుతూ ఉండేవి. దాసుగారు మటుకు సినిమాలకు వచ్చిన డబ్బుతో, అక్కడే రాముల వారికై ఛత్రాలు వంటివి కొని, నేరుగా తమ్మరకు వచ్చి స్వామికి సమర్పించేవారు. రామనామాన్ని రోజుకి ఎనిమిది గంటల చొప్పున చేస్తూ, ఆ సమయంలో వీరొక ప్రత్యేకమైన మందు 'రామబాణం' పేరిట తయారు చేసేవారు. ఆ మందు బాలింతలకు ధనుర్వాతానికీ, కొన్ని రకాల చర్మవ్యాధులకీ, తేలు నొప్పికీ, తల నొప్పికీ, ఫిట్స్‌కీ పనిచేసేది.

తమ్మర గుడి గాలిగోపుర నిర్మాణం ద్రవ్యం చాలక కట్టుబడి ఆగిపోయేలా ఉండగా, అప్పటికప్పుడే జక్కేపల్లి లోని తమ ఇంటికి మనిషిని పంపి, భార్య చిట్టెమ్మ చేతి బంగారు గాజులు తెప్పించి, అమ్మి ఆ ద్రవ్యాన్ని గాలి గోపుర నిర్మాణానికి వినియోగించారు. హరికథలు చెప్పడం, అష్టావధానాలు చేయడం ద్వారా వచ్చిన ధనాన్ని రాముల వారి సేవకే వినియోగించేవారు. శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలం వెళ్లే భక్తుల కోసం హరికథ, భాగవత సప్తాహాలు 'తిరువూరు'లో నిర్వహించేవారు. ఆ సందర్భంగా నిత్యాన్నదానం, భక్తులకు వసతీ కల్పించేవారు. భక్తుల సౌకర్యం కోసం తిరువూరులో ఒక మంచినీటి బావిని తవ్వించిన వితరణశీలి ఆయన. అటువంటి కేశవ దాసు 1956 జూన్ 14న తమ 80వ ఏట పంచమి తిథి నాడు తుదిశ్వాస విడిచారు.

– బోనాల అన్నపూర్ణ, చందాల కేశవదాసు మనుమరాలు
(జూన్ 20న చందాల కేశవదాసు జయంతి)

# హరిత వర్ణ శోభిత తెలంగాణ లక్ష్యంగా...

అభిప్రాయం



డా॥ జి.రంజిత్ రెడ్డి

మానవ చరిత్రలో మూడవ అతి పెద్ద అటవీకరణ కార్యక్రమంగా తెలంగాణ హరితహారం పథకాన్ని పరిగణిస్తున్నారు. రాష్ట్రానికి పచ్చదనం పెంచడమే ఈ కార్యక్రమం లక్ష్యం. తెలంగాణ రాష్ట్రం పచ్చదనంతో పరిఢవిల్లాలని బృహత్ సంకల్పం చేసుకున్న ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు మానస పుత్రికే హరితహారం. హరించుకుపోయిన అడవులను పునరుద్ధరించి, రాష్ట్రంలో పచ్చదనాన్ని 22 శాతం నుంచి 33 శాతానికి పెంచడమే లక్ష్యంగా హరితహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వం చొరవకు ప్రజల సహకారం తోడై ఉద్యమ రూపంలో కొనసాగిన హరిత హారంలో భాగంగా తొమ్మిదేళ్లలో, గడచిన 8 విడతల్లో రాష్ట్రంలో దాదాపు 273 కోట్ల మొక్కలను నాటడం అపూర్వం. పర్యావరణ విధ్వంసం నుంచి తెలంగాణ ప్రాంతం కోలుకునేలా తొలినాళ్లలోనే కేసీఆర్ దూరదృష్టితో ఈ హరితహారాన్ని చేపట్టి, దాని అమలుకు చూపిన అచంచలమైన కృషి వల్లనే ఈ ఘనత సాధ్యమైంది. ఈ కార్యక్రమం వలన అనేక సానుకూల ఫలితాలు అందుతున్న విషయాన్ని అనేక సంస్థలు పలుమార్లు గుర్తించాయి కూడా.



2015–16లో రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం 19,854 చదరపు కిలోమీటర్లు ఉండగా, 2023 నాటికి అది 26,969 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. హరిత హారం ఫలితంగా రాష్ట్రంలో 7.70 శాతం పచ్చదనం పెరిగిందని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా ఒక నివేదికలో వెల్లడించింది. దేశంలోనే అత్యధికంగా తెలంగాణ విస్తీర్ణంలో అడవులు 24.06 శాతంగా ఉండటం జాతీయ గుర్తింపును పొందింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 15 వేల నర్సరీలు, దాదాపు 19,400కు పైగా పల్లె ప్రకృతి వనాలు, 2,725 బృహత్ పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. పట్టణాల్లోనూ రూ. 700 కోట్లతో 180 అర్బన్ ఫారెస్టు పార్కులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం చేపట్టిన హరితహారం ఫలితాలు ఫలించి హైదరాబాద్ నగరానికి వరల్డ్ ట్రీ సిటీగా రెండుసార్లు గుర్తింపు లభించింది.

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటున్న వేళ తెలంగాణ మరో అరుదైన ఘనతను దక్కించుకుంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రముఖ సంస్థ సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ విడుదల చేసిన నివేదికలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. తెలంగాణ రాష్ట్రం చేపట్టిన అడవుల పెంపకం, మునిసిపల్ వేస్ట్ మేనేజ్మెంట్ వంటి అనేక పర్యావరణహిత కార్యక్రమాలను పరిగణనలోకి తీసుకున్న సంస్థ, తెలంగాణ రాష్ట్రానికి అగ్రస్థానాన్ని కట్టబెట్టింది.

హరితహారంతో పాటు ఇంకా అనేక పర్యావరణహిత కార్యక్రమాలను తెలంగాణ ప్రభుత్వం చేపట్టింది. పట్టణ ప్రాంతాల్లో పర్యావరణానికి అత్యంత సవాలుగా నిలిచే పారిశుద్ధ్య నిర్వహణ విషయంలోనూ అద్భుత ప్రణాళికలతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు పలు పురపాలికల్లో పేరుకుపోయిన చెత్తను బయో మైనింగ్ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ వేస్ట్ టు ఎనర్జీ రంగంలో 24 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తూ దేశంలో ఈ రంగంలో రెండోస్థానంలో నిలిచింది.

హరితహారాన్ని 2015 జూలై 3న చిలుకూరు బాలాజీ దేవాలయంలో సీఎం కేసీఆర్ అధికారికంగా ప్రారంభించారు. ఈ పథకంలో భాగంగా 2016లోనే 46 కోట్ల మొక్కలు నాటడంతో దేశం దృష్టిని ఆకర్షించింది. ఈ బృహత్తర పథకం కోసం తెలంగాణ సర్కార్ ఈ తొమ్మిదేళ్లలో రూ.5,230 కోట్లు ఖర్చు చేసింది. 2019 – 2021 మధ్య అటవీ విస్తీర్ణంలో 632 చదరపు కిలోమీటర్ల పెరుగుదలతో దేశంలోనే అటవీ విస్తీర్ణంలో తెలంగాణ రెండో రాష్ట్రంగా నిలిచిందని 2022 డిసెంబరు 14న కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి అశ్వినీ కుమార్ చౌబే రాజ్యసభలో ప్రకటించారు.

ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం తనదైన విధానాలతో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నది. ముఖ్యంగా పర్యావరణం విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాల ఫలితమే తెలంగాణ దేశంలో అగ్రస్థానంలో నిలబడగలగడానికి కారణం. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న బృహత్ ప్రకృతి వనాలు, దేశానికే ఆదర్శం అంటూ నీతి ఆయోగ్ ఈ మధ్యనే ప్రత్యేక ప్రశంసలు ఇవ్వడం కూడా విశేషమే.

హైదరాబాద్ నగరంలో ఒక్కరోజులోనే 25 లక్షల మొక్కలు, ఒకే రోజు లక్షమంది 163 కిలోమీటర్ల పొడవునా నిలబడి మొక్కలు నాటి రికార్డు సృష్టించారు. ప్రతీ రెండు గ్రామాలకు ఒక నర్సరీ చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4,213 నర్సరీలు ఏర్పాటుచేశారు. కేవలం ఒకే రకం చెట్లు కాకుండా నీడనిచ్చే చెట్లు, పండ్ల చెట్లు, పూల చెట్లు, ఔషధ మొక్కలను కూడా నాటారు. 2016లో నాటిన 46 కోట్ల మొక్కల్లో నీడ నిచ్చే వేప, మర్రి, రావి లాంటివి 36.81 కోట్ల మొక్కలు... టేకు, మద్ది లాంటి లాభదాయక చెట్లు మరో 8.5 కోట్ల మొక్కలు...పండ్ల చెట్లు కోటి దాకా ఉన్నాయి. పూలచెట్లు, ఈత మొక్కలున్నాయి. అటవీ ప్రాంతంలోనే కాక అన్ని రహదారులకూ ఇరువైపులా, విద్యాలయాల్లో, తదితర ప్రాంతాల్లో హరితహారాన్ని జరపడం కాలగతిలో సత్ఫలితాలిస్తోంది.

హరితహారం ద్వారా అటవీ ప్రాంతాన్ని 33 శాతానికి పెరిగేలా చేయడం, తద్వారా మేఘాలను ఆకర్షించి సమృద్ధిగా వానలు కురిసేలా చూడడం, అడవిలో, రోడ్లకిరువైపులా పండ్ల చెట్లను నాటడం ద్వారా నివాసాలు, పంటపొలాలపై దాడి చేస్తున్న ఆకలిగొన్న కోతులకు ప్రత్యామ్నాయం చూపడం, వాతావరణంలో ప్రాణవాయువును పెంచడం, పర్యావరణ సమతుల్యాన్ని కాపాడడం, ఇతర పర్యావరణ లక్ష్యాలను చేరుకోవడం– ఇవీ హరితహారం ప్రధాన లక్ష్యాలు.

ఇప్పటికి ఎనిమిది విడతల్లో హరిత హారం అమలు చేశారు. తాజా తొమ్మిదో విడత హరితహారం కార్యక్రమాన్ని ఈ జూన్ 19వ తేదీ సోమవారం నుంచి ప్రారంభించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 19.24 కోట్ల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో దాదాపు 7 కోట్ల మొక్కలను హైదరాబాద్ మెట్రో పరిధిలో, గ్రేటర్ హైదరాబాద్ నగరపాలక సంస్థ పరిధిలో నాటాలని నిర్ణయించారు.

వ్యాసకర్త చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు
(నేడు హరిత దినోత్సవం సందర్భంగా)

## గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు. పాడ్యమి ఉ.9.46 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** ఆరుద్ర రా.7.11 వరకు, తదుపరి పునర్వసు, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ప.12.26 నుండి 1.20 వరకు, తదుపరి ప.3.04 నుండి 3.54 వరకు, **అమృతఘడియలు:** ఉ.8.27 నుండి వరకు ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.30, **సూర్యాస్తమయం:** 6.32.

## క్లుప్తంగా...

### జూలై 9న బీసీల రాజకీయ ప్లీనరీ: జాజుల



లాలాపేట (హైదరాబాద్): వచ్చే నెల 9వ తేదీన హైదరాబాద్‌లో దాదాపు 10 వేల మంది బీసీ ప్రతినిధులతో రాజకీయ ప్లీనరీ నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం సంఘం రాష్ట్ర కార్యాలయంలో ప్లీనరీ ఏర్పాటుపై సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్లీనరీ సమావేశంలో బీసీల రాజకీయ దశ–దిశపై చర్చిస్తామన్నారు. మరో 5 నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు బీసీల ఓట్ల కోసం బీసీ డిక్లరేషన్ పేరుతో మరోసారి మోసం చేయాలని చూస్తున్నాయని మండిపడ్డారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించకుండా చేసే డిక్లరేషన్‌ను నమ్మి మోసపోవడానికి సిద్ధంగా లేమని స్పష్టం చేశారు. ప్రధాన రాజకీయ పార్టీలకు బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీ ఎన్నికల్లో 60 సీట్లు ఇస్తామని విధాన పరమైన నిర్ణయాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.మహేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### చేనేత కుటుంబాలను ఆదుకోవాలి: దాసు సురేశ్



సాక్షి, హైదరాబాద్: తొమ్మిదేళ్ల కాలంలో రాష్ట్రంలో 400 మంది చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని, వారి కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే కార్యాచరణను ప్రారంభించకపోతే బాధిత కుటుంబాలతో కలిసి సచివాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీలను పాలకవర్గాలు రాజకీయ బలిపశువులను చేస్తున్నాయని, కొన్ని కులసంఘాల నేతలు వారికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బాధిత మహిళల సమస్యలను కులసంఘ నాయకులు పట్టించుకోకపోవడమే గాక, తమ గోడు వెళ్లబోసుకోవడానికి పద్మశాలీ భవన్‌కు వచ్చిన వారిని ఈసడించుకోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ పథకాలతో సంతృప్తి చెందకుండా అధికారంలో వాటా కోసం ఉద్యమించేందుకు కార్యాచరణను రూపొందించుకోవాలని కోరారు. వృత్తిరీత్యా ప్రమాదమున్న కల్లు గీత, మత్స్య కార్మికులకు, కమ్మరి, కంసాలి, వడ్డెర తదితర బీసీ కులవృత్తి దారులకు ప్రభుత్వం రూ.5 లక్షల బీమా కల్పించడంతో పాటు రాష్ట్రంలోని ఏ ఆసుపత్రిలోనైనా చికిత్స పొందే విధంగా హెల్త్ కార్డులను అందజేయాలని దాసు సురేశ్ డిమాండ్ చేశారు.

### స్మార్ట్ ఫోన్ కొనివ్వలేదని బాలిక ఆత్మహత్య

మునిపల్లి(అందోల్): సెల్‌ఫోన్ కొనివ్వలేదని మనస్తాపంతో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన రాయికోడ్‌లో ఆదివారం జరిగింది. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంగ అంజలి (14) రాయికోడ్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఆదివారం తనకు స్మార్ట్‌ఫోన్ కొనివ్వమని తల్లిదండ్రులను అడిగింది. కొన్ని రోజుల్లో కొనిస్తామని చెప్పినా.. ఈ రోజే కొనివ్వాలని పట్టుబట్టడంతో తల్లిదండ్రులు సముదాయించి వారి పనుల్లో నిమగ్నమయ్యారు. మధ్యాహ్నం 2 గంటలకు సమీపంలోని బావిలో దూకేసింది. ఆమె కనిపించకపోవడంతో గ్రామమంతా వెతికారు. బావి ఒడ్డున చెప్పులు ఉండటం గుర్తించిన స్థానికులు బావిలో గాలించగా అంజలి మృతదేహం లభించింది. మృతదేహాన్ని పోలీసులు జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

# సుపారీ ఇచ్చి.. హత్య చేయించి..

- రిటైర్డ్ ఎంపీడీఓ నల్లా రామకృష్ణయ్య హత్య కేసులో వీడిన మిస్టరీ
- భూముల వివాదంలో కక్షగట్టి హత్య చేయించిన బీఆర్‌ఎస్ నేత అంజయ్య
- రూ.8 లక్షలతో నలుగురి ముఠాకు సుపారీ..
- కిడ్నాప్ చేసి.. గొంతుకు టవల్ బిగించి చంపి.. క్వారీ నీటి గుంటలో పడేసిన ముఠా
- సూత్రధారి సహా ముగ్గురు అరెస్టు.. పరారీలో మరో ఇద్దరు
- విచారణలో వెలుగులోకి మరో హత్య కేసు కూడా..
- వివరాలు వెల్లడించిన వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న వరంగల్ సీపీ రంగనాథ్

సాక్షి ప్రతినిధి, వరంగల్: జనగామ జిల్లా బచ్చన్నపేటలో హత్యకు గురైన రిటైర్డ్ ఎంపీడీఓ నల్లా రామకృష్ణయ్య (70) కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. సుపారీ గ్యాంగ్ ఆయనను అపహరించి, హత్య చేసిందని.. క్వారీ నీటి గుంటలో మృతదేహాన్ని పడేసి వెళ్లిపోయిందని గుర్తించారు. భూముల వివాదం నేపథ్యంలో బీఆర్‌ఎస్ నేత, జనగామ జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి భర్త అంజయ్య ఈ హత్యకు సూత్రధారి అని తేల్చారు. ఈ మేరకు బచ్చన్నపేట, టాస్క్‌ఫోర్స్ పోలీసులు ప్రధాన నిందితుడు గిరబోయిన అంజయ్య, సుపారీ ముఠా సభ్యులు డోలకొండ శ్రీకాంత్, శివరాత్రి బాషా అలియాస్ భాస్కర్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి ఒక కారు, 3 సెల్‌ఫోన్లు, రూ.15 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం సాయంత్రం వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ఈ కేసు వివరాలను వెల్లడించారు.

**ఇప్పటికే ఓసారి చంపేందుకు యత్నించి..:** అంజయ్యకు సంబంధించి సర్వే నంబర్ 174లోని భూములపై వివాదాలు ఉన్నాయి. దీనిపై రామకృష్ణయ్య గతంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కక్షగట్టిన అంజయ్య.. రామకృష్ణయ్యను హత్య చేయడానికి సిద్ధమయ్యాడు. 2022 జూలైలో జలంధర్ అనే వ్యక్తితో కలసి కారుతో ఢీకొట్టి చంపేందుకు విఫలయత్నం చేశాడు. ఇటీవల తనకు పరిచయమున్న దండుగుల తిరుపతి అనే వ్యక్తితో రూ.8 లక్షలు సుపారీ ఇస్తానని, రామకృష్ణయ్యను చంపాలని ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీనికి అంగీకరించిన తిరుపతి.. తనకు సమీప బంధువులైన డోలకొండ శ్రీకాంత్, శివరాత్రి బాషా, దండుగుల రాజులతో కలసి రామకృష్ణయ్య హత్యకు ప్లాన్ చేశాడు.

**పోచన్నపేట శివారులో కిడ్నాప్ చేసి..:** తిరుపతి, శ్రీకాంత్, బాషా, దండుగుల రాజు నలుగురూ కలసి ఈ నెల 15న సాయంత్రం ఒక కారు అద్దెకు తీసుకుని పోచన్నపేట శివారులో మాటు వేశారు. బచ్చన్నపేట నుంచి పోచన్నపేటకు వెళ్తున్న రామకృష్ణయ్యను బలవంతంగా కారులోకి ఎక్కించుకొని, చిన్నరామన్చర్ల శివారుకు తీసుకువెళ్లారు. సుమారు 6.30 గంటల సమయంలో టవల్ మెడకు బిగించి రామకృష్ణయ్యను హత్య చేశారు. మృతదేహాన్ని కారు డిక్కీలో పెట్టుకుని.. ఓబుల్ కేశ్వాపూర్, పెద్దపహాడ్‌ల మీదుగా చంపక్ హిల్స్ ప్రాంతానికి వెళ్లి, అక్కడి ఓ క్వారీ నీటిగుంటలో పడవేశారు. హత్య జరిగే నాటికి అంజయ్య ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా రూ.2 లక్షల వరకు నిందితులకు ముట్టజెప్పాడు.

**ఒకటి కాదు రెండు హత్యలు!:** రామకృష్ణయ్య హత్య కేసులో విచారణ జరుపుతున్న క్రమంలో మరో హత్య కేసు వెలుగులోకి వచ్చిందని వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. అంజయ్య మరో భూవివాదంలో రూ.2.5 లక్షల సుపారీ ఇచ్చి తన బావమరిది మల్లేశం భార్య సుభద్రను హత్య చేయించినట్టు వెల్లడైందని వివరించారు. 2022 అక్టోబర్ 20న ఆ హత్య జరిగిందని, ఆ ఘటనలోనూ తిరుపతి, రాజు హస్తం ఉన్నట్టు గుర్తించామన్నారు. 2012లో సుభద్ర భర్త మల్లేశం చనిపోయాడని.. తనకు రెండెకరాల భూమి రావాలని సుభద్ర నిలదీయడంతో అంజయ్య సుపారీ గ్యాంగ్‌తో హత్య చేయించాడని సీపీ వెల్లడించారు.

### బీఆర్‌ఎస్ నుంచి అంజయ్య సస్పెన్షన్

భూవివాదాలు, హత్య కేసు నేపథ్యంలో బీఆర్‌ఎస్ నాయకుడు గిరబోయిన అంజయ్యను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు ఆ పార్టీ మండలాధ్యక్షుడు బొడిగం చంద్రారెడ్డి ప్రకటించారు. అంజయ్య తొలి నుంచి బీఆర్‌ఎస్ కార్యకర్త కాదని, నాలుగేళ్ల కింద వేరే పార్టీ నుంచి వచ్చాడని పేర్కొన్నారు.

# మరో రెండ్రోజులు వడగాడ్పులు

**నేడు, రేపు అక్కడక్కడా తేలికపాటి వర్షాలు సైతం కురిసే అవకాశం**

రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతాలు

| ప్రాంతం | జిల్లా | ఉష్ణోగ్రత |
|---|---|---|
| ఈసల తక్కెళ్లపల్లి | పెద్దపల్లి | 44.8 |
| జంబుగ | ఆసిఫాబాద్ | 44.5 |
| అకెనపల్లి | పెద్దపల్లి | 44.5 |
| మల్యాలపల్లి | పెద్దపల్లి | 44.4 |
| నేలకొండపల్లి | ఖమ్మం | 44.4 |



రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

| కేంద్రం | గరిష్టం |
|---|---|
| ఆదిలాబాద్ | 40.8 |
| భద్రాచలం | 41.8 |
| హకీంపేట | 39.0 |
| దుండిగల్ | 39.0 |
| హనుమకొండ | 39.0 |
| హైదరాబాద్ | 39.2 |
| ఖమ్మం | 40.6 |
| మహబూబ్‌నగర్ | 39.5 |
| మెదక్ | 39.4 |
| నల్లగొండ | 40.0 |
| నిజామాబాద్ | 39.8 |
| రామగుండం | 42.0 |

సాక్షి, హైదరాబాద్: రానున్న రెండ్రోజులు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు వడగాడ్పుల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలలో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. రానున్న రెండు రోజుల్లో దక్షిణాదిలోని మరికొన్ని భాగాలకు నైరుతి రుతుపవనాలు విస్తరించే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశంఉందని అంచనా వేసింది. ఆదివారం రాష్ట్రంలోకెల్లా అత్యధికంగా పెద్దపల్లి జిల్లా ఈసల తక్కెళ్లపల్లిలో 44.8 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

# ఇద్దరు పిల్లలతో సహా తండ్రి ఆత్మహత్య

- ఫాదర్స్ డే రోజే వెలుగుచూసిన ఘటన
- భార్యతో వివాదం నేపథ్యంలో మనస్తాపం

బంట్వారం: చేయి పట్టి నడిపించాల్సిన నాన్నే ఇద్దరి పిల్లలను బావిలోకి తోసి తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఫాదర్స్ డే రోజే వికారాబాద్ జిల్లాలో ఆదివారం వెలుగుచూసిన విషాద ఘటన వివరాలిలా.. కర్ణాటక రాష్ట్రం కుంచారానికి చెందిన వడ్డె హన్మంతు (36), కవిత దంపతులు. వీరికి ఓంకార్ (9) అక్షర (7) ఇద్దరు సంతానం. కూలి పనులు చేసుకుని జీవనం సాగించే వీరు నెల కోజుల కిందటే హైదరాబాద్‌కు మకాం మార్చారు. భార్యాభర్తల మధ్య తరచూ వివాదాల నేపథ్యంలో ఇటీవల హన్మంతుపై కవిత వికారాబాద్ మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా పెట్టారు. ఈ నేపథ్యంలో హన్మంతు ఈ నెల 16న ఇద్దరు పిల్లలను తీసుకుని హైదరాబాద్‌లో బస్సెక్కి బంట్వారం మండలం బొప్పునారం శివారులో దిగాడు. అక్కడి నుంచి భార్య తరపు బంధువుకు ఫోన్ చేసి తాను ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. సదరు బంధువు వెంటనే హన్మంతు సోదరుడు వెంకటేశంకు చెప్పగా, ఆయన అక్కడి పరిసరాల్లో వెతికినా కనిపించ లేదు. అదే రోజు రాత్రి వెంకటేశం బంట్వారం పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టారు. పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ దొరక లేదు. ఆదివారం బొప్పునారం శివారులోని వ్యవసాయ బావి దగ్గర చెప్పులు కనిపించడంతో స్థానికులు అక్కడికి వెళ్లి చూడగా మూడు శవాలు నీటిలో తేలుతూ కనిపించాయి. మృత దేహాలను బయటికి తీసి పోస్టు మార్టం నిమిత్తం కర్ణాటకలోని కుంచారం పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ మేరకు కుంచారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఓంకార్‌తో హన్మంతు



అక్షర

# ప్రొటీన్ పౌడర్ డబ్బాలో బంగారం



బంగారం తీసుకొచ్చిన ప్రొటీన్ పౌడర్ డబ్బా

శంషాబాద్: అక్రమంగా రవాణా చేస్తున్న బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం తెల్లవారుజామున ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్‌లో దుబాయ్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడి కదలికలను అనుమానించిన అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అతడి వద్ద పిల్లలకు వినియోగించే ప్రొటీన్ పౌడర్ డబ్బాను పరిశీలించారు. బంగారాన్ని పౌడర్‌గా మార్చి అందులో తీసుకొచ్చినట్లు గుర్తించారు. 127 గ్రాముల బంగారం పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ 7.7 లక్షలు ఉంటుందని నిర్ధారించిన అధికారులు, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**మహిళ వద్ద...:** అదే విమానంలో దుబాయ్ నుంచి వచ్చిన మరో మహిళా ప్రయాణికురాలినీ తనిఖీ చేయగా.. ఆమె లో దుస్తుల్లో దాసుకుని తీసుకొచ్చిన బంగారం పేస్టుతో పాటు రెండు బంగారు గొలుసులు దొరికాయి. 45.37లక్షల విలువైన 726 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు.

# ఏపీలో 20 నుంచి వర్షాలు

సాక్షి, అమరావతి: ఏపీలో ఈనెల 20వ తేదీ నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. రాయలసీమను తాకినా మిగిలిన ప్రాంతాలకు విస్తరించకుండా ఆగిపోయిన రుతుపవనాలు ముందుకు కదిలేందుకు అనువైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. శ్రీహరికోట, పుట్టపర్తి, కర్ణాటకలోని రత్నగిరి, కొప్పల్ ప్రాంతాల్లోనే పది రోజులుగా రుతుపవనాలు కేంద్రీకృతమై ఉన్నాయి. వచ్చే రెండు, మూడు రోజుల్లో ఇవి దక్షిణ ద్వీపకల్ప భారతదేశం, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, బిహార్‌లోని మరి కొన్ని ప్రాంతాలకు విస్తరిస్తాయని చెబుతున్నారు. అదే క్రమంలో ఏపీలోనూ విస్తరించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బంగాళాఖాతంలో దట్టమైన మేఘాలు అలముకుని ఉన్నాయి. వీటి ప్రభావంతో రాయలసీమ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు తగ్గడంతో పాటు అక్కడక్కడా చిరు జల్లులు కూడా కురిశాయి.



# పాతబస్తీలో కాల్పుల కలకలం

- ఆస్తి వివాదంలో పరస్పర దాడులు
- కొనుగోలు చేసిన ఇంటి వద్దకు రాగా అడ్డుకున్న నిందితులు
- గన్ ఫైరింగ్ చేసి బెదిరింపులు
- నిందితుడు అడ్వొకేట్.. స్పోర్ట్స్ కేటగిరీలో పొందిన గన్స్

చార్మినార్: పాతబస్తీలో జరిగిన కాల్పుల ఘటనలో ఇద్దరు నిందితులను మీర్‌చౌక్ పోలీసులు అరెస్టు చేసి తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. కోర్టు వివాదంలో ఉన్న ప్రాపర్టీ విషయంలో శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ గన్ ఫైరింగ్ ఘటన నగరంలో కలకలం రేపింది. రెండు గ్రూపులకు చెందిన మహిళలు కర్రలు, రాళ్లతో పరస్పరం దాడులకు దిగారు. మహిళలు కొట్టుకుంటుండగానే అడ్వకేట్ మసూద్ అలీ ఖాన్ ఇంట్లోంచి లైసెన్స్‌డ్ గన్‌తో బయటకొచ్చి గాల్లోకి కాల్పులు జరిపారు. దీంతో అక్కడున్న వారందరూ భయాందోళనకు గురై చెల్లాచెదురుగా పరుగులు తీయగా.. గన్ ఫైరింగ్ శబ్దాలు స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేశాయి.

పాతబస్తీకే చెందిన అనీస్ ఉర్ రెహ్మాన్ ఖురేషీ తన సోదరుడు రెహ్మాన్ ఖురేషీతో కలిసి మగర్‌కీ బౌలీలో 215 గజాల ప్రాపర్టీని మీర్ ఇబ్రహీం అలీ ఖాన్ వద్ద నుంచి కొనుగోలు చేశారు. దీనిని ఏప్రిల్ 4వ తేదీన చార్మినార్ సబ్ రిజిస్ట్రార్‌లో రిజిస్టర్ చేయించుకున్నారు. తాము ఖరీదు చేసిన ఇంట్లోకి వెళ్లే ప్రయత్నం చేస్తున్న వారిని అడ్వొకేట్ వర్గీయులు అడ్డుకుంటున్నారు. దీంతో ఖురేషీ ఇప్పటికే మీర్ చౌక్ పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు కొనసాగుతుండగానే.. శనివారం అర్ధరాత్రి ఖురేషీ కుటుంబసభ్యులు తిరిగి ప్రాపర్టీని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించడంతో మళ్లీ అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో ఇరు వర్గాలు పరస్పరం దాడులకు దిగాయి.

### మూడు గంటలకి పైగానే దాడులు

శనివారం అర్ధరాత్రి ఒంటి గంటకు మొదలైన దాడుల పరంపర ఆదివారం తెల్లవారు జాము వరకు కొనసాగింది. కాల్పులు జరిగిన ప్రాంతం మీర్‌చౌక్ పోలీసు స్టేషన్‌కు కూత వేటు దూరంలోనే ఉండడం గమనార్హం. సమాచారం తెలిసిన వెంటనే మీర్‌చౌక్ ఏసీపీ దామోదర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. దాడుల్లో గాయపడిన వారిని చికిత్సనిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కాల్పులు జరిపిన అడ్వకేట్ మసూద్ అలీ ఖాన్, ఆయన సోదరుడు ముర్తుజా అలీ ఖాన్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఏసీపీ తెలిపారు. తల్లి హస్మత్ ఉన్నీసా బేగం పాత్రపై కూడా ఆరా తీస్తున్నామన్నారు. పరస్పర దాడులు జరిగినందున ఇరువర్గాలపై కేసులను నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామన్నారు. నిందితుని వద్ద 5 గన్‌లున్నాయని.. ఇవి స్పోర్ట్స్ క్యాటగిరీలో పొందినట్లు ఏసీపీ చెప్పారు.



# మానుకోట తహసీల్దార్‌పై దాడి

- కోర్టు కాంప్లెక్స్‌కు కేటాయించిన స్థలం సర్వే చేస్తుండగా ఘటన
- ఆ భూమి మాదేనంటూ అధికారులతో వాదన
- పిడిగుద్దులు కురిపించిన స్థానికులు..
- రాళ్లతో దాడి చేసిన మహిళలు

మహబూబాబాద్: కోర్టు కాంప్లెక్స్‌కు కేటాయించిన భూమిని సర్వే చేసేందుకు వెళ్లిన మానుకోట తహసీల్దార్‌పై మహిళలతో సహా స్థానికులు రాళ్లతో దాడి చేసిన ఘటన మానుకోట శివారులో చోటుచేసుకుంది. రెవెన్యూ అధికారుల కథనం ప్రకారం.. మానుకోట శివారు సాలార్‌తండా సమీప 255/1 సర్వే నంబర్‌లో కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి తొమ్మిది ఎకరాల భూమి కేటాయించారు. ఆ స్థలాన్ని పరిశీలించేందుకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుకారాంజీ ఆదివారం వస్తుండటంతో మానుకోట తహసీల్దార్ ఇమ్మానియల్ తమ సిబ్బందితో కలిసి స్థలం వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో సర్వేయర్, ఏడీ భూమిని కొలుస్తుండగా.. ఆ భూమి తమదేనని ఎందుకు సర్వే చేస్తున్నారని స్థానికులు గుగులోత్ నవీన్, డప్పు ప్రవీణ్ తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగారు. ఇందుకు రెవిన్యూ సిబ్బంది..అది ప్రభుత్వ భూమి.. కోర్టు కాంప్లెక్స్‌కు కేటాయించామని చెప్పారు. ఇదే సమయంలో రెవెన్యూ సిబ్బంది హైకోర్టు జడ్జికి ఎస్కార్ట్ కోసం సాలార్‌తండా మెయిన్‌రోడ్డు వరకు వెళ్లారు. ఇదే అదనుగా తహసీల్దార్‌పై దాడికి పాల్పడ్డారు. వీపుపై పిడిగుద్దులు కురిపించారు. అలాగే మరో ఇద్దరు మహిళలు రాళ్లతో దాడి చేశారు. దాంతో అస్వస్థతకు గురైన తహసీల్దార్‌ను రెవెన్యూ సిబ్బంది ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. దాడి తర్వాత టౌన్ సీఐ సతీష్ బందోబస్తుతో హైకోర్టు జడ్జి తుకారాంజీ, ఆర్డీఓ కొమురయ్య అక్కడికి చేరుకున్నారు. స్థలాన్ని పరిశీలించిన అనంతరం హైకోర్టు జడ్జి, ఆర్డీఓ వెళ్లిపోయారు.

**కౌన్సెలింగ్ నిర్వహించిన టౌన్ సీఐ..**

అధికారులు వెళ్లిన తర్వాత దాడికి పాల్పడ్డ వారితో పాటు అక్కడికి వచ్చిన తండావాసులకు సీఐ సతీష్ కౌన్సెలింగ్ నిర్వహించారు. భూములకు సంబంధించిన పత్రాలు ఉంటే అధికారులకు చూపించి పరిష్కారం చేసుకోవాలని, దాడులు చేస్తే ఎలా అని నిలదీశారు. దాడికి పాల్పడ్డ నవీన్, ప్రవీణ్‌ను అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తహసీల్దార్ ఇమ్మానియల్. (ఇన్‌సెట్‌లో) దాడి చేస్తున్న నవీన్

### పోలీసులు బందోబస్తు ఇవ్వడం లేదంటూ...

ప్రభుత్వ భూముల్లో సర్వే చేసేందుకు వెళ్లినప్పుడు పోలీసులు సరైన బందోబస్తు ఇవ్వడం లేదని, ఇలాంటి పరిస్థితుల్లోనే దాడులు జరుగుతున్నాయని రెవెన్యూ అధికారులు, సిబ్బంది వాపోతున్నారు.



## 3 వేల ఏళ్లయినా 'కత్తి'లా ఉంది!

బెర్లిన్: సుమారు మూడు వేల ఏళ్లనాటి కంచు కత్తి జర్మనీలో తవ్వకాల్లో బయటపడింది. ఇప్పటికీ ఆ కత్తి పదును, మెరుపు ఏమాత్రం తగ్గ లేదని పురాతత్వ నిపుణులు తెలిపారు. బవేరియా రాష్ట్రంలోని నోయెర్డ్లింజెన్‌లో జరిపిన తవ్వకాల్లో ఇది వెలుగు చూసింది. క్రీస్తుపూర్వం 14వ శతాబ్దం..కంచుయుగం మధ్య కాలం నాటి ముగ్గురు వ్యక్తుల సమాధిలోని అష్టభుజి పట్టీ కలిగిన ఈ కత్తి ఇప్పటికీ కొత్తదిగానే ఉండటం అద్భుతం, అరుదైన విషయమన్నారు. క్రీస్తు పూర్వం 3,300–12,00 సంవత్సరాల మధ్య మానవులు కంచు వాడిన కాలాన్ని చరిత్రకారులు కంచుయుగంగా గుర్తిస్తారు.



## 'బాహుబలి' సమోసా.. తింటే రూ. 71 వేల నజరానా!

మీరట్: బాహుబలి సమోసా..బరువు 12 కిలోలు..అరగంటలో పూర్తిగా తింటే రూ.71 వేల బహుమానం..! ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన కౌశల్ స్వీట్స్ దుకాణం ఈ ఆఫర్‌ను ప్రకటించింది. లాల్‌కుర్తిలోని దుకాణం యజమాని శుభమ్ కౌశల్ ఏమంటున్నారంటే.. 'బర్త్‌డేలప్పుడు కేక్‌కు బదులుగా పెద్ద సమోసాలను కట్ చేయడం ఫ్యాషనైంది. అందుకే 4, 8 కిలోల సమోసాలను తయారు చేశాం. ఇప్పుడు 12 కిలోల సమోసా తయారీకి పూనుకున్నాం 'అన్నారు. 'ఖరీదు రూ.1,500గా నిర్ణయించాం. దీనిని 30 నిమిషాల్లో తిన్న వారికి రూ.71 వేలు ఇస్తామనిప్రకటించాం. ఆర్డర్లు కూడా వస్తున్నాయి' అంటూ ఆనందం వ్యక్తం చేశారు.

**ఆకాశహర్మ్యాలకు పారిస్ పెట్టింది పేరు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఈఫిల్ టవర్ దగ్గర్నుంచి ఎన్నో భవంతులు నింగికి నిచ్చెన వేసినట్టుగా ఆకర్షిస్తూ ఉంటాయి. పారిస్ ఇప్పుడు వాటి నిర్మాణానికి బ్రేక్ వేసింది. మొట్టమొదటి ఆకాశాన్నంటే భవనాన్ని నిర్మించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పారిస్ సిటీ కౌన్సిల్ ఈ నిర్ణయం తీసుకుంది. ఆకాశాన్నంటే భవన నిర్మాణాలు ఇంకా కొన సాగితే పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇకపై సాధారణ భవనాలదే భవిష్యత్ అన్నది పర్యావరణ వేత్తల మాట.**

### ఎత్తయిన భవన నిర్మాణాలకు పారిస్ బ్రేక్




# ఆకాశానికి నిచ్చెనలు వద్దు

ప్రపంచ పర్యాటక స్వర్గధామం పారిస్. ఫ్యాషన్లకు పుట్టినిల్లయిన ఈ సుందర నగరాన్ని చూసేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రతీ ఏడాది కోట్లాదిమంది విదేశీయులు తరలివస్తుంటారు. ఈఫిల్ టవర్, మోపానాసే టవర్, లౌవ్రే పిరమిడ్ వంటి ఆకాశహర్మ్యాలను సంభ్రమాశ్చర్యాలతో చూస్తుంటారు. అంతస్తుల మీద అంతస్తులు నింగికి నిచ్చెనలా వేసుకుంటూ నిర్మించిన భవనాల అందాలు వర్ణించ వీల్లేదు.330 మీటర్ల ఎత్తైన ఈఫిల్ టవర్ , 210 మీటర్ల ఎత్తయిన మోపానాస్ టవర్ (689 అడుగులు) పారిస్‌కున్న సిటీ ఆఫ్ లైట్స్‌కి ప్రత్యామ్నాయంగా నిలిచాయి. పారిస్‌లో ఎత్తైన భవన నిర్మాణాలు మనకి ఇక కనిపించవు. వాటి నిర్మాణంపై పారిస్ నగర కౌన్సిల్ నిషేధం విధించింది. స్థానికంగా పర్యావరణాన్ని కాపాడుకోవడానికి కొత్తగా నిర్మించే భవనాలేవైనా 12 అంతస్తులు లేదంటే 37 మీటర్లకు మించకూడదని ఆంక్షలు విధించింది. ఇటీవల కాలంలో అంతటి అందాల నగరం మురికి కూపంలా మారిపోయింది. పారిస్‌కు తిరిగి పూర్వ వైభవం కల్పించాలంటే కాలుష్య కారకమైన ఆకాశహర్మ్యాల నిర్మాణాన్ని నిలిపివేశారు. 18వ శతాబ్దంలో పారిస్ అంటే చిన్న చిన్న ఇళ్లతో చూడముచ్చటగా ఉండేది. ఆ దేశ మొట్ట మొదటి అధ్యక్షుడు నెపోలియన్ –3 రాజధానిపై ఎన్నో కలలు కన్నారు. ఆధునిక, చైతన్యవంతమైన నగరంగా పారిస్‌ను రూపొందించడానికి ప్రత్యేకంగా కొందరు ఇంజనీర్లను నియమించారు. చిన్న చిన్న భవనాలు, ఉద్యాన వనాలు అండర్ డ్రైనేజీ వంటి వ్యవస్థలతో పారిస్ అత్యంత పరిశుభ్రంగా పచ్చదనంతో అలరారేలా మారింది. ఆరు అంతస్తుల రాతి నిర్మాణాలు చూడడానికి అందంగా , నివాస యోగ్యంగా ఉండేవి. ఈఫిల్ టవర్ మినహాయించి మరో ఎత్తైన భవనం లేదనే చెప్పాలి. రెండో ప్రపంచ యుద్ధంలో నగరం చాలా వరకు ధ్వంసం కావడంతో ఆ శిథిలాల నుంచి ఇప్పుడు మనం దరం చూస్తున్న సరికొత్త పారిస్ నగరం పుట్టింది. అప్పటికే ఆకాశాన్నంటే భవంతులతో అందరినీ ఆకట్టుకుంటున్న న్యూయార్క్, లండన్ వంటి నగరాల బాటలో పారిస్ నడిచింది. 40 అంతస్తులు, 50 అంతస్తులు, 59 అంతస్తులు ఇలా కట్టుకుంటూ వెళ్లిపోయింది. 1973లో తొలిసారిగా అత్యంత ఎత్తైన మోపానాస్ టవర్ నిర్మాణం జరిగింది. సరిగ్గా 50 ఏళ్ల తర్వాత ఓల్డ్ ఈజ్ గోల్డ్ అన్న సామెతలా మళ్లీ ఆ నాటి నిర్మాణాల వైపు చూస్తోంది.

### ప్రజలకి తగ్గిన మోజు

రానురాను ప్రజలకీ ఈ హంగు ఆర్భాటాల్లాంటి భవనాలపై మోజు తగ్గింది. మళ్లీ రెండో ప్రపంచ యుద్ధానికి ముందు నాటి పారిస్‌గా మారిపోవాలని వారు కోరుకుంటున్నారు. పైగా అన్నేసి అంతస్తులున్న భవనాల్లో నివాసం మా వల్ల కాదంటూ ఒక దండం పెట్టేస్తున్నారు. ఒకప్పుడు 50 అంతస్తుల భవనం నిర్మిస్తే పై అంతస్తులో నివాసం కోసం ప్రజలు పోటీ పడేవారు. కానీ ఇప్పుడు వాటికి డిమాండ్ బాగా తగ్గిపోయింది. దీనికి పలు కారణాలున్నాయి. పై అంతస్తుల్లో ఉండే వారిలో ఒంటరితనం వెంటాడుతోంది. సమూహం నుంచి దూరంగా ఉన్న భావన పెరిగిపోయి మానసిక సమస్యలు తలెత్తుతున్నాయి. అంత ఎత్తు నుంచి కిందకి రావడమే ఒక ప్రహసనంగా మారుతోంది. దీంతో నాలుగ్గోడల మధ్య అధికంగా కాలక్షేపం చేయడంతో శారీరక, మానసిక సమస్యలు వెంటాడుతున్నాయి. అందుకే ప్రజలు కూడా ఎత్తైన భవనాల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు.

### పర్యావరణానికీ దెబ్బే



**అతి పెద్ద అంతస్తులు పర్యావరణానికి కూడా హానికరంగా మారుతున్నాయి. ఇంధనం వినియోగం విపరీతంగా ఉంటుంది. సాధారణ భవనంలో ప్రతీ చదరపు మీటర్‌కి ఖర్చు అయ్యే ఇంధనానికి ఆకాశహర్మ్యాలలో రెట్టింపు ఖర్చు అవుతుంది. కాలుష్యం 145% అధికంగా విడుదల అవుతుంది. పై అంతస్తులకి నీళ్లు పంప్ చెయ్యడానికి అధికంగా విద్యుత్ వినియోగించాలి. భవనాల నిర్వహణ ఖర్చు కూడా తడిసిమోపెడవుతోంది. ఈ భవన నిర్మాణాలతో ఇంధనం 48% , కర్బన ఉద్గారాలు విడుదల 45% , వ్యర్థాలు 25% వస్తూ ఉంటే నీటి వినియోగం 15% ఉంటోంది. భావితరాలు వినియోగించాల్సిన సహజ వనరుల్ని ఇప్పుడే మనం ఖర్చు చేసేయడంపై పర్యావరణవేత్తల్లో ఆందోళన కూడా నెలకొంది.అందుకే ఇక భవిష్యత్ అంతా సాధారణ భవనాలదేనని పర్యావరణవేత్తలు కూడా అభిప్రాయపడుతున్నారు. చైనా కూడా పారిస్ బాటలోనే నడుస్తూ ఎత్తయిన భవన నిర్మాణాలను నిలిపివేసింది. గ్లోబల్ వార్మింగ్ ఇంకా పెరుగుతూ ఉంటే ఇతర దేశాల్లో అతి పెద్ద నగరాలు కూడా పారిస్ బాటలో నడవక తప్పదు.**

-సాక్షి, నేషనల్ డెస్క్

# భోజనానికి సగటున 96 నిమిషాలు!

- ఉద్యోగం, ఉపాధికి వారానికి 41 గంటలు వెచ్చిస్తున్న జనం



ఆధునిక యుగంలో మనిషి జీవితం యాంత్రికంగా మారిపోతోంది. పొద్దున నిద్ర నుంచి లేచింది మొదలు రాత్రి మళ్లీ పడకపైకి చేరేదాకా అంతా రొటీన్‌గా సాగిపోతోంది. పల్లె జీవితానికి, నగర జీవితానికి కొంత వ్యత్యాసం ఉంటోంది. పల్లె అయినా, నగరమైనా తినడం, పని చేయడం, నిద్రపోవడం.. ఇదే చక్రం పునరావృతం అవుతోంది. ప్రపంచవ్యాప్తంగా మనుషుల సగటు జీవితం ఎలా సాగుతోందన్న దానిపై కెనడాలోని మెక్‌గిల్ యూనివర్సిటీ పరిశోధకులు ఆసక్తికరమైన అధ్యయనం నిర్వహించారు. ప్రజల రోజువారీ జీవితం ఎలా ఉంటోంది? ఏ పనికి ఎంత సమయం కేటాయిస్తున్నారు? అనేది నిశితంగా పరిశీలించారు. ఇందుకోసం 58 దేశాల్లో వివిధ జాతీయ సర్వేల గణాంకాలను క్రోడీకరించారు. ప్రపంచ జనాభాలో 60 శాతం ఈ అధ్యయనం పరిధిలోకి వచ్చారు. అధ్యయనంలో ఏం తేలిందంటే..

- ఉద్యోగం, ఉపాధి కోసం మనుషులు వారానికి సగటున 41 గంటలు వెచ్చిస్తున్నారు.
- ఇంట్లో పరిశుభ్రతకు 2.5 గంటలు, తోట పనులు, ఇతర వ్యక్తిగత పనులకు 3.4 గంటలు వెచ్చిస్తున్నారు.
- స్నేహితులతో బయట ఆనందంగా గడపడానికి, టీవీ వీక్షించడానికి, ఆటలు ఆడడానికి సగటున 6.5 గంటలు వెచ్చిస్తున్నట్లు తమ అధ్యయనంలో వెల్లడయ్యిందని పరిశోధకుడు ఎరిక్ గాల్‌బ్రెయిత్ చెప్పారు.
- గిన్నెలు కడుక్కోవడం, వంట చేసుకోవడం, టేబుళ్లు శుభ్రం చేసుకోవడానికి జనం 55 నిమిషాలు ఖర్చు చేస్తున్నారు.
- భోజనం చేయడానికి 96 నిమిషాలు(1.6 గంటలు) వెచ్చిస్తున్నారు.
- చేపలు పట్టడం, పంటల సాగు, ఇతర వ్యవసాయ సంబంధిత పనులకు 52 నిమిషాల (0.9 గంటలు) సమయం ఖర్చవుతోంది.
- స్నానం, ఆరోగ్య సంరక్షణ వంటి పనుల్లో 2.5 గంటలు గడుపుతున్నారు.
- సర్వేలో చిన్న పిల్లలను కూడా చేర్చడంతో కొన్ని పనులకు పట్టే సమయం అధికంగా ఉన్నట్లు కనిపిస్తుందని అధ్యయనకర్తలు వెల్లడించారు.
- నిద్ర కోసం వెచ్చిస్తున్న సమయం 9 గంటలు కాగా, ఇందులో పిల్లల నిద్ర 11 గంటలు, పెద్దల నిద్ర 7.5 గంటలుగా ఉంది.
- కొన్ని విషయాల్లో దేశాల మధ్య చాలా వ్యత్యాసం కనిపిస్తోంది. మతపరమైన ప్రార్థనలు, పూజలకు నిత్యం 12 నిమిషాలు వెచ్చిస్తుండగా, కొన్ని దేశాల్లో ఈ సమయం మరింత ఎక్కువగా ఉంటోంది.
- వివిధ దేశాల నడుమ ఆదాయంలో తేడాలు, సాంస్కృతిక వ్యత్యాసాలు ఉంటాయన్న సంగతి తెలిసిందే. అలాగే ఆయా దేశాల్లో వివిధ పనులకు ప్రజలు వెచ్చించే సమయాల్లోనూ తేడాలు ఉంటాయని పరిశోధకులు వెల్లడించారు.
- ఉదాహరణకు సంపన్న దేశాలతో పోలిస్తే పేద దేశాల్లో వ్యవసాయం కోసం వెచ్చించే సమయం అధికం.
- ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ప్రయాణించే సమయం విషయంలో దేశాల మధ్య పెద్దగా తేడాలు లేవని గుర్తించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

# 18 దేశాల్లో పేదల ఆకలి తీర్చిన భారత్

ఐఎఫ్ఏడీ అధ్యక్షుడు అల్వారో లారియో



న్యూఢిల్లీ: ప్రపంచ ఆహార వ్యవస్థల్లో సానుకూల మార్పులు తీసుకురాగల సామర్థ్యం భారత్‌కు ఉందని ఐక్యరాజ్యసమితి అనుబంధ విభాగమైన అంతర్జాతీయ వ్యవసాయ అభివృద్ధి నిధి(ఐఎఫ్ఏడీ) అధ్యక్షుడు అల్వారో లారియో ప్రశంసించారు. జీ20 దేశాల వ్యవసాయ శాఖ మంత్రుల సదస్సులో పాల్గొనేందుకు భారత్‌కు వచ్చిన ఆయన తాజాగా మీడియాతో మాట్లాడారు. గత ఏడాది ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాల్లో ఆహార కొరత ఏర్పడిందని గుర్తుచేశారు. అలాంటి సమయంలో 18 దేశాలకు భారత్ 10.8 లక్షల టన్నుల గోధుమలను ఎగుమతి చేసిందని, పేద ప్రజల ఆకలి తీర్చిందని కొనియాడారు. ఇటీవలి కాలంలో తృణధాన్యాల సాగుకు భారత్ అధిక ప్రాధాన్యం వేస్తుండడం ప్రశంసనీయమని చెప్పారు. ఆహార ఉత్పత్తి విషయంలో భారత్ ప్రాధాన్యతలు, ఐక్యరాజ్యసమితి ప్రాధాన్యతలను పోలి ఉన్నాయని పేర్కొన్నారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధిలో భారత్ సాధించిన నైపుణ్యం 'గ్లోబల్ సౌత్'లోని ఇతర దేశాలకు సైతం ఉపకరిస్తుందని అల్వారో లారియో వివరించారు. వాతావరణ మార్పులు విపరీత ప్రభావం చూపిస్తున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో తృణధాన్యాల సాగు చేపట్టడం రైతులకు లాభదాయకమని సూచించారు. కరువులను తట్టుకొనే శక్తి తృణధాన్యాలకు ఉందన్నారు. పేదలకు పౌష్టికాహారం అందించాలంటే తృణధాన్యాలతోనే సాధ్యమని స్పష్టం చేశారు.

# యువత ఆశల్ని కేంద్రం చిదిమేసింది

- పీఎస్‌యూల్లో రెండు లక్షల ఉద్యోగాలు గల్లంతు
- వాటిని ప్రైవేట్ పరం చేసేందుకు ప్రయత్నాలు
- కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ధ్వజం



న్యూఢిల్లీ: పెట్టుబడిదారులైన కొందరు మిత్రుల కోసం కేంద్ర ప్రభుత్వం లక్షలాది మంది యువత ఆశల్ని చిదిమేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. రెండేళ్ల కాలంలో ప్రభుత్వ రంగ సంస్థ(పీఎస్‌యూ)ల్లోని 2 లక్షల ఉద్యోగాలను లేకుండా చేసిందని విమర్శించారు. దేశంలో నిరుద్యోగిత రికార్డు స్థాయికి చేరుకుందని తెలిపారు. దేశానికి గర్వకారణమైన ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగం సంపాదించడం ప్రతి నిరుద్యోగ యువతకు కల..అలాంటి వాటిని ప్రభుత్వం వదిలేసిందన్నారు. రాహుల్ గాంధీ ఆదివారం ఈ మేరకు పలు ట్వీట్లు చేశారు. '2014లో పీఎస్‌యూల్లో 16.9 లక్షల ఉద్యోగాలుండగా 2022 వచ్చే సరికి వాటి సంఖ్య 14.9 లక్షలకు పడిపోయింది. బీఎస్ఎన్ఎల్‌లో 1,81,127 ఉద్యోగాలు, సెయిల్‌లో 61,928, ఎంటీఎన్ఎల్‌లో 34,997, ఎస్ఈసీఎల్‌లో 29,140, ఎఫ్‌సీఐలో 28,063, ఓఎన్‌జీసీలో 21,120 ఉద్యోగాలు తగ్గిపోయాయి. అభివృద్ధి చెందుతున్న దేశంలో ఉద్యోగిత పడిపోతుందా?'అని ఆయన ప్రశ్నించారు. ఏడాదికి రెండు కోట్ల మందికి ఉద్యోగాలిస్తామంటూ తప్పుడు వాగ్దానాలు చేసిన ప్రభుత్వం.. ఉద్యోగాల కల్పనను మరిచిపోయి 2 లక్షల ఉద్యోగాలను లేకుండా చేసిందన్నారు. ఇదే సమయంలో పీఎస్‌యూల్లో కాంట్రాక్టు నియామకాలు పెరిగిపోయాయి. ఇలా కాంట్రాక్టు ఉద్యోగాలకు ప్రాధాన్యం ఇవ్వడం రిజర్వేషన్ హక్కును లాగేసుకోవడం కాదా? ఇది ఈ సంస్థలను ప్రైవేట్‌పరం చేసే కుట్ర కాదా?'అని రాహుల్ ప్రశ్నించారు. ఒక వైపు పారిశ్రామిక వేత్తల రుణాల మాఫీ, మరోవైపు పీఎస్‌యూల్లో ప్రభుత్వ ఉద్యోగాల తొలగింపు! అమృత్‌కాల్ అంటే ఇదేనా'అని ప్రభుత్వాన్ని నిలదీశారు.

# అయిదేళ్ల తర్వాత బీజింగ్‌కు బ్లింకెన్

చైనా విదేశాంగ మంత్రితో కీలక చర్చలు



బీజింగ్: అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఆదివారం ఉదయం చైనా రాజధాని బీజింగ్‌కు చేరుకున్నారు. చైనా విదేశాంగ మంత్రి క్విన్ గాంగ్‌తో ఆయన భేటీ అయ్యారు. తైవాన్ అంశం, ఉక్రెయిన్ యుద్ధం తదితర కీలక అంశాలపై వారు చర్చలు జరిపారు. అనంతరం అధికార విందులో పాల్గొన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా బ్లింకెన్ అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను కూడా కలుస్తారని సమాచారం. రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్న సమయంలో బ్లింకెన్ చేపట్టిన ఈ పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సాధారణ సంబంధాలపై ఇరుపక్షాలు ఆసక్తితో ఉన్నప్పటికీ, బ్లింకెన్ పర్యటనతో కీలక పరిణామాలకు అవకాశాలు తక్కువని 'సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' వ్యాఖ్యానించడం గమనార్హం.

# వడగాడ్పులకు 100 మంది బలి!

- యూపీ, బిహార్‌ల్లో 98 మరణాలు నమోదు
- ఉత్తరాదిన కొనసాగుతున్న ఉష్ణోగ్రతలు



బలియాలో ఓ ఆస్పత్రి ఎదుటే బాధితురాలికి చికిత్స

బలియా/పట్నా: ఉత్తరాదిన కొనసాగుతున్న అత్యధిక ఉష్ణోగ్రతలు, వడగాలులతో జనం పిట్టల్లా రాలుతున్నారు. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో మూడు రోజుల్లోనే 100 మంది వరకు ప్రజలు చనిపోయారు. భరించలేని ఎండలు, వడగాడ్పులకు తాళలేక యూపీలో 54, బిహార్‌లో 44 మరణాలు నమోదయ్యాయి. ఈ నెల 15, 16, 17 తేదీల్లో యూపీలోని బలియా ఆస్పత్రిలో చేరిన సుమారు 400 మంది జ్వర బాధితుల్లో 54 మంది వివిధ కారణాలతో చనిపోయారని అధికారులు తెలిపారు. ఎండలు విపరీతంగా ఉండడంతో ప్రజలు వివిధ ఆరోగ్య సమస్యలకు గురై ఆస్పత్రికి వస్తున్నారని బలియా ప్రధాన వైద్యాధికారి(సీఎంవో) డాక్టర్ జయంత్ కుమార్ తెలిపారు. మొత్తం 54 మందిలో 40 శాతం మంది జ్వరంతో, 60 శాతం మంది ఇతర వ్యాధులతో చనిపోయారని డాక్టర్ కుమార్ చెప్పారు. ఎక్కువ మంది 60 ఏళ్లకు పైబడిన వారేనన్నారు. మరణాలకు కచ్చితమైన కారణాలను కనుగొనేందుకు లక్నో నుంచి వైద్య బృందాలను పంపించింది. బల్లియా జిల్లా ఆస్పత్రిలో మరిన్ని ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలను ఏర్పాటు చేశారు. వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది సంఖ్యను కూడా పెంచామని అధికారులు తెలిపారు.

ఆజంగఢ్ డివిజన్ ఆరోగ్య శాఖ అదనపు డైరెక్టర్ ఓపీ తివారీ శనివారం మీడియాతో మాట్లాడుతూ..లక్నో నుంచి రానున్న ఆరోగ్య శాఖ బృందం బల్లియాకు వచ్చి పరీక్షలు నిర్వహిస్తుందని, మరణాలకు కారణాలను నిర్ధారిస్తామని చెప్పారు. బహుశా గుర్తించని ఏదో ఒక వ్యాధి మరణాలకు కారణమై ఉండొచ్చు. ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు కూడా ఎక్కువగానే ఉంటున్నాయి. వేసవి, శీతాకాలాల్లో డయాబెటిక్ రోగులతోపాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, రక్తపోటు ఉన్నవారిలో మరణాల రేటు సాధారణంగా ఎక్కువగా ఉంటుంది'అని తివారీ చెప్పారు. శుక్రవారం బలియాలో 42.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైందని ఐఎండీ తెలిపింది. సాధారణం కంటే ఇది 4.7 డిగ్రీలు ఎక్కువని పేర్కొంది.

**సీఎంఎస్ తొలగింపు**

బలియా జిల్లా ఆస్పత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్(సీఎంఎస్) డాక్టర్ దివాకర్ సింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. ఆస్పత్రిలో మరణాలకు కారణాలపై నిర్లక్ష్యపూరితంగా వ్యాఖ్యలు చేశారంటూ ఆజంగఢ్‌కు బదిలీ చేసింది. డాక్టర్ ఎస్‌కే యాదవ్‌కు సీఎంఎస్ బాధ్యతలను అప్పగించింది. ఆయన మీడియాతో మాట్లాడుతూ..నిత్యం 125 నుంచి 135 మంది రోగులు ఆస్పత్రిలో చేరుతున్నారని తెలిపారు. 15న 23 మంది, 16న 20 మంది, 17న 11మంది వేర్వేరు కారణాలతో చనిపోయినట్లు తెలిపారు.

**బిహార్‌లో 44 మంది..**

బిహార్‌లోనూ ఎండలు మండిపోతున్నాయి. గత 24 గంటల్లో తీవ్ర వడగాల్పుల కారణంగా 44 మంది చనిపోయారు. వీరిలో ఒక్క పట్నాలోనే 35 మంది ప్రాణాలు కోల్పోయారు. పట్నా మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో వంద మంది వరకు వడదెబ్బ బాధితులు చేరినట్లు అధికారులు తెలిపారు. ఎండలకు తోడు రాష్ట్రంలోని 18 ప్రాంతాల్లో తీవ్రమైన వడగాడ్పులు, నాలుగు చోట్ల వడగాడ్పులు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయని అధికారులు తెలిపారు. షేక్‌పురాలో అత్యధికంగా 44.2 డిగ్రీలు, పట్నాలో 43.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ప్రభుత్వం పాఠశాలలు, అంగన్‌వాడీలకు వేసవి సెలవులను 24 వరకు పొడిగించింది.

### లండన్‌లో కత్తిపోట్లతో భారతీయుడు దుర్మరణం



లండన్: దక్షిణ లండన్‌లో భారతీయుడు ఒకరు వ్యక్తి కత్తిపోట్లకు గురై మరణించాడు. కేరళకు చెందిన అరవింద్ శశికుమార్ (38)ను సౌత్‌వార్క్‌లో ఆయన నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్‌లో కత్తితో పొడిచారు. తీవ్ర గాయాలతో పడి ఉన్న శశికుమార్ ఆస్పత్రికి తరలించే లోపు మరణించినట్టు పోలీసులు తెలిపారు. సల్మాన్ సలీమ్ (25) అనే అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన తేజస్విని రెడ్డిని కత్తితో పొడిచి చంపిన మూడు రోజుల్లోనే మరొక భారతీయుడు అదే విధంగా మరణించడం ఆందోళన కలిగిస్తోంది.

### ఖుష్బూపై వ్యాఖ్యలు.. డీఎంకే నేత అరెస్ట్

చెన్నై: సినీ నటి, తమిళనాడు బీజేపీ నేత, జాతీయ మహిళా కమిషన్(ఎన్‌సీడబ్ల్యూ) సభ్యురాలు ఖుష్బూ సుందర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికార డీఎంకే నాయకుడు శివాజీ కృష్ణమూర్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఐపీసీలోని వివిధ సెక్షన్ల కింద కేసు పెట్టారు. ఆదివారం ఆయనను అరెస్టు చేశారు. శివాజీ కృష్ణమూర్తిని తమ పార్టీ నుంచి బహిష్కరించినట్లు డీఎంకే ప్రకటించింది.

### గీతా ప్రెస్‌కు గాంధీ శాంతి బహుమతి



న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో ఉన్న ప్రఖ్యాత గీతా ప్రెస్‌కు ప్రతిష్టాత్మక గాంధీ శాంతి బహుమతి–2021ను ప్రకటించారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని జ్యూరీ ఈ మేరకు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర సాంస్కృతి శాఖ తెలిపింది. అహింస, ఇతర గాంధేయ మార్గాల్లో సమాజంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ పరివర్తన కోసం చేసిన కృషికి గాను గీతా ప్రెస్‌కు ఈ బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలియజేసింది. గాంధీ శాంతి బహుమతి విజేతకు రూ.కోటి నగదు, జ్ఞాపిక, సంప్రదాయ హస్తకళ లేదా చేనేత వస్త్రం అందజేస్తారు. ఈ బహుమతిని 2020లో బంగ్లాదేశ్‌కు చెందిన బంగబంధు షేక్ ముజీబుర్ రెహ్మాన్‌కు ప్రకటించారు. గోరఖ్‌పూర్‌లో గీతా ప్రెస్‌ను 1923లో స్థాపించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రచురణ సంస్థల్లో ఒకటిగా ప్రఖ్యాతిగాంచింది. 14 భాషల్లో 41.7 కోట్లకుపైగా పుస్తకాలను ప్రచురించింది. వీటిలో 16.21 కోట్ల భగవద్గీత గ్రంథాలు ఉన్నాయి. గీతా ప్రెస్‌కు అవార్డు రావడంపై ప్రధాని హర్షం వ్యక్తంచేశారు.

### భారత సంతతి వ్యక్తికి ఏడేళ్ల ఖైదు



లండన్: యూకేలో మద్యం మత్తులో ఉన్న మహిళపై అత్యాచారం చేసినందుకు గాను భారతీయ సంతతికి చెందిన విద్యార్థికి ఏడేళ్ల కారాగార శిక్ష పడింది. వేల్స్‌లోని కార్డిఫ్‌లో ఒక మహిళపై అత్యాచారం చేసినట్టుగా ప్రీత్ వికల్ (20) అనే విద్యార్థి అంగీకరించడంతో న్యాయస్థానం అతనికి ఆరేళ్ల తొమ్మిది నెలల ఖైదు విధించింది. గత ఏడాది జూన్ 4న ప్రీత్ వికల్ ఒక మహిళని తన భుజాలపై మోసుకుంటూ ఇంట్లోకి తీసుకువెళ్లిన దృశ్యాలు సీసీటీవీ ఫుటేజ్‌లో రికార్డయ్యాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో బాధితురాలితో ప్రీత్ జరిపిన చాటింగ్ ద్వారా అతనిని గుర్తించి అరెస్ట్ చేశారు. ప్రీత్ నేరం అంగీకరించడంతో న్యాయమూర్తి అతనికి శిక్ష ఖరారు చేశారు.

### అమెరికాలో కాల్పుల ఘటనలు.. నలుగురు మృతి

వాషింగ్టన్: అమెరికాలో 24 గంటల వ్యవధిలో జరిగిన కాల్పుల ఘటనల్లో నలుగురు మృతి చెందగా 33 మంది గాయపడ్డారు. షికాగోకు 32 కిలోమీటర్ల దూరంలో ఉన్న విల్లోబ్రూక్ పట్టణంలోని షాపింగ్ మాల్ ఎదుట ఆదివారం ఉదయం జరిగిన కాల్పుల్లో ఒకరు చనిపోయారు. కనీసం 20 మంది గాయపడ్డారు. వాషింగ్టన్‌లోని గోర్జ్ ఆంఫిథియేటర్ వెలుపల మ్యూజిక్ ఫెస్టివల్‌లో జరిగిన తుపాకీ కాల్పుల్లో ఇద్దరు చనిపోగా ముగ్గురు గాయాలపాలయ్యారు. మిస్సోరిలోని సెంట్ లూయిస్‌లో శనివారం అర్ధరాత్రి జరిగిన కాల్పుల్లో ఒక మైనర్ చనిపోగా, మరో 10 మంది మైనర్లు గాయపడ్డారు.

అమెరికాలో ప్రవాస భారతీయులతో

### మోదీ సమావేశం కుదింపు

న్యూయార్క్: ప్రధాని మోదీ అమెరికా పర్యటనలో ప్రవాస భారతీయులతో సమావేశాన్ని కుదించారు. క్షణం తీరిక లేకుండా ప్రధాని షెడ్యూల్ ఉండడంతో ప్రవాస భారతీయుల్లో అత్యంత ముఖ్యులతో వాషింగ్టన్‌లో చిన్న సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. దీనికి వెయ్యి మంది వరకు హాజరయ్యే అవకాశాలున్నాయి. తొలుత షికాగోలో భారీ ఈవెంట్‌ను ఏర్పాటు చేయాలని సన్నాహాలు చేసినప్పటికీ ప్రధాని బిజీ షెడ్యూల్‌తో తగ్గించాల్సి వచ్చిందని ఇండియన్ అమెరికన్ కమ్యూనిటీ ఫౌండేషన్ చైర్మన్ భరత్ బరాయ్ వెల్లడించారు. అధ్యక్షుడు బైడెన్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ తొలిసారిగా అధికారిక హోదాలో ఈ నెల 21 నుంచి 24 వరకు అగ్రరాజ్యంలో పర్యటించనున్నారు.

# ఎమర్జెన్సీ.. ఒక చీకటి యుగం

- మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ
- ప్రజాస్వామ్యవాదులపై క్రూరంగా వ్యవహరించారని విమర్శలు



న్యూఢిల్లీ: దేశ చరిత్రలో ఎమర్జెన్సీ ఒక చీకటి యుగం అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.1975 జూన్ 25న అప్పట్లో దేశ ప్రధానిగా ఉన్న ఇందిరాగాంధీ అత్యవసర పరిస్థితి విధించినప్పుడు ప్రజాస్వామ్యవాదుల్ని అత్యంత క్రూరంగా వేధించారని గుర్తు చేసుకున్నారు. ఇలాంటి అకృత్యాల వల్ల దేశ స్వేచ్ఛా స్వాతంత్య్రాలు ప్రమాదంలో పడతాయని ఆదివారం ఆకాశవాణిలో ప్రసారమైన మన్ కీ బాత్ కార్యక్రమంలో ఆందోళన వ్యక్తం చేశారు. 'మన దేశంలో రాజ్యాంగమే అత్యుత్తమం. ప్రజాస్వామ్య విలువలున్న ఈ దేశంలో జూన్ 25ని ఎప్పటికీ మర్చిపోలేము. అది దేశ చరిత్రలో ఒక చీకటి యుగం'' అని ప్రధాని అన్నారు. కొద్ది రోజుల క్రితం ఎమర్జెన్సీపై రాసిన టార్చర్ ఆఫ్ పొలిటికల్ ప్రిజనర్స్ ఇన్ ఇండియా అనే పుస్తకం గురించి తెలుసుకున్నానని తెలిపారు. అందులో ఎన్నో కేస్ స్టడీల్లో ఇందిర ప్రభుత్వం ఎంత క్రూరంగా వ్యవహరించిందో తెలుస్తుందన్నారు. ప్రతీ నెల చివరి ఆదివారం జరగాల్సిన మన్‌కీ బాత్ ప్రధాని అమెరికా పర్యటనతో ముందే ప్రసారమైంది.

**యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి**

ఈ నెల 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాని మోదీ ప్రతీ ఒక్కరూ యోగాని జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతీ రోజూ యోగా చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ ఏడాది యోగా దినోత్సవం రోజు యూఎన్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో పాల్గొనే అరుదైన అవకాశం వచ్చిందని ప్రధాని చెప్పారు. తుపాన్లను సమర్థంగా ఎదుర్కొనే స్థాయికి మనం చేరుకున్నామని ప్రధాని చెప్పారు. గుజరాత్‌లో బిపర్‌జోయ్ తుపాన్ బీభత్సం నుంచి కచ్ ప్రజలు వేగంగా కోలుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు.

### కరువు ముంగిట ఉ.కొరియా

న్యూఢిల్లీ: ప్రపంచ దేశాల ఆంక్షలతో ఒంటరిగా మారిన ఉత్తరకొరియాలో కరువు రాజ్యమేలుతోంది. 1990ల నాటి కరువు కంటే తీవ్ర పరిస్థితులు అక్కడ కొనసాగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అప్పట్లో సుమారు 30 లక్షల మంది ప్రాణాలొదిలారు. దేశంలో పంటల సాగు తగ్గిపోవడంతో ప్రజలకు సరిపోను ఆహార పదార్థాలు లభ్యం కావడం లేదు. సరిహద్దులను పూర్తిగా మూసివేయడంతో పరిస్థితి విషమంగా మారింది. సరిహద్దుల వెంట ఉన్న ప్రాంతాల్లో ఇప్పటికే జనం ఆకలితోచనిపోతున్నట్లు సమాచారం. దేశంలో ఆహార కొరత ఏర్పడిన విషయాన్ని సాక్షాత్తూ అధ్యక్షుడు కిమ్ స్వయంగా అంగీకరించడం గమనార్హం. మరోవైపు, ప్రభుత్వం క్షిపణులు, అణ్వాయుధాల తయారీకి భారీగా ఖర్చు పెడుతోంది.

# సాక్షి హైదరాబాద్

సోమవారం । 19 । జూన్ । 2023




## విద్యార్థులకు ఉచిత ప్రవేశం


ఖైరతాబాద్: పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన సమ్మర్ ఉత్సవ్ మేళాలో ఫిష్ టన్నెల్‌ను ఉచితంగా సందర్శించేందుకు పాఠశాల విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు నిర్వాహకుడు మీర్జా రఫీక్ బేగ్ తెలిపారు. ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 19, 20, 21వ తేదీల్లో మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 10.30 గంటల వరకు ఉచిత ప్రవేశం కల్పిస్తామన్నారు.

## రేపు ఓయూలో డా.నాగయ్య ఆంఫి థియేటర్ ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో రూ.75 లక్షల వ్యయంతో నిర్మించిన డాక్టర్. జి నాగయ్య ఓపెన్ ఎయిర్ ఆంఫి థియేటర్ మంగళవారం ప్రారంభం కానుంది. ఓయూ పూర్వవిద్యార్థి, డాక్టర్ నాగయ్య ఆర్థిక సహాయంతో క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియం పక్కన ఓపెన్ ఎయిర్ ఆంఫి థియేటర్ నిర్మిస్తున్నారు. ఈ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు.

## ఉష్ణోగ్రత

| గరిష్టం | కనిష్టం |
|---|---|
| 39.2° | 28.0° |



## అంటువ్యాధులకూ దోహదం..



పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, మరోవైపు వాతావరణంలో ఆకస్మిక మార్పులు అనారోగ్యాలకు కారణమవుతున్నాయి. జీర్ణవాహిక మీద, జీర్ణకోశ సామర్థ్యం మీద దుష్ప్రభావం చూపుతున్నాయి. ఇది ఆకలి మందగించడానికి తీవ్రమైన అలసటకు దారి తీస్తోంది. అలాగే వేడి గాలులు కూడా జీర్ణవాహిక ఇన్ఫెక్షన్లకు కారణమవుతాయి. ఇవి వ్యక్తిగత సంబంధాలు, ఆహారం, నీరు, మలమూత్రాల ద్వారా వ్యాప్తి చెందుతాయి. అధిక ఉష్ణోగ్రతల కారణంగా బ్యాక్టీరియా ప్రేరేపిత వ్యాధులు వస్తే కడుపు నొప్పి, నీళ్ల విరేచనాలు వంటి తీవ్రమైన ఇబ్బందులకు కారణమవుతాయి. ఈ సీజన్‌లో పెద్దలతో పాటు చిన్నారులను కూడా మరింత జాగ్రత్తగా చూసుకోవాలి.

– డా.నితీష్ ప్రతాప్, గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, కిమ్స్ ఆస్పత్రి

# పొట్ట 'తిప్పలు' పెరిగాయ్!

- సిటీలో పెరుగుతున్న గ్యాస్ట్రిక్ బాధితులు
- కడుపులో మంట.. ఉబ్బరంతో ఉక్కిరిబిక్కిరి
- బడి పిల్లలు, టీనేజీ యువకుల్లోనే ఎక్కువ
- అధిక ఉష్ణోగ్రతతో పాటు పలు కారణాలు అంటున్న వైద్యులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గతంలో కన్నా ఎక్కువగా గ్యాస్ట్రిక్ కేసులు నమోదవుతున్నాయి. పలువురు రోగులు కడుపులో మంట, ఉబ్బరం, వాంతులతో వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. దీనికి అధిక ఉష్ణోగ్రతలు సహా రకరకాల కారణాలు దోహదం చేస్తున్నాయంటున్నారు పలువురు వైద్యులు. నగరంలోని హఫీజ్‌పేట్ సీహెచ్‌సీలో గత రెండు నెలల్లో ఆహార సంబంధ వ్యాధుల సంఖ్య రెట్టింపైంది. రోజుకు సగటున డజను దాకా రోగులు ఈ తరహా అనారోగ్యంతో వైద్యుల్ని సంప్రదిస్తున్నారు. అదే విధంగా శేరిలింగంపల్లి , బంజారాహిల్స్ పీహెచ్‌సీల్లో కూడా 10–15 శాతం మేర కేసులు పెరిగాయి. 'అధిక వేడి సంబంధిత వ్యాధులు డీహైడ్రేషన్ కేసులు ఈ మధ్య కాలంలో బాగా నమోదయ్యాయి. అలాగే పాఠశాలకు వెళ్లే పిల్లలు టీనేజీ యువకులలో గ్యాస్ట్రిక్ కేసులను ఎక్కువగా కనిపిస్తున్నాయి. వారిలో ఎక్కువ మంది రోడ్డుపక్కన ఆహారం లేదా పానీయాలు తీసుకున్నవారేనని వైద్యులు చెప్పారు. గత మూడు వారాల్లో ఉస్మానియా ఆస్పత్రిలో ప్రతిరోజూ 10–12 గ్యాస్ట్రిక్ కేసులు నమోదవుతున్నాయని సమాచారం. సెలవుల నేపథ్యంలో నగరవాసులు వెకేషన్ వెళ్లి రావడం కూడా ఈ వ్యాధుల విజృంభణకు దోహదం చేస్తోంది. పరిచయం లేని చోట నప్పని, పరిశుభ్రం కాని ఆహారం తీసుకుని తిరిగి వచ్చాక రోగాల బారిన పడుతున్నారని వైద్యులు అంటున్నారు.

### వేడి..దాడి..

ప్రపంచ ఆరోగ్య సంస్థ పరిశోధన ప్రకారం.. అధిక ఉష్ణోగ్రతల పరిస్థితుల్లో ఆహారంలో ఒకే ఒక్క బ్యాక్టీరియా ఏడు గంటల్లో 20 లక్షల బ్యాక్టీరియాకు విస్తరిస్తుంది అని ఐసీఎంఆర్ సర్టిఫైడ్ పరిశోధకుడు డాక్టర్ కిరణ్ మదాల అంటున్నారు. సాధారణంగా అధిక ఉష్ణోగ్రతల సమయంలో ఆహారం వల్ల కలిగే వ్యాధులు పెరుగుతాయి. 'అధిక ఉష్ణోగ్రతల వల్ల ఆహారం కొన్ని గంటల్లోనే పాడైపోతుంది. తేలికపాటి నుంచి తీవ్రమైన అనారోగ్యాలకు కారణమయ్యే బ్యాక్టీరియా పెరుగుదలకు అధిక ఉష్ణోగ్రతలు కారణమవుతాయి. ప్రస్తుత జూన్ నెలలో నమోదైన అధిక ఉష్ణోగ్రతలు నగరంలో ఆహార సంబంధిత అనారోగ్యాల పెరుగుదలకు దారితీశాయి. 'కొన్ని రోజులుగా ఆహార సంబంధిత వ్యాధులతో వచ్చే రోగుల సంఖ్య 8–10% పెరిగింది. వేసవి వేడి ఈ కేసులు పెరగడానికి ఓ కారణం,' అని ఈ తరహా రోగులకు చికిత్స అందిస్తున్న డాక్టర్ పి సంగీత అంటున్నారు.

### లక్షణాలు.. నివారణ..

నీళ్ల విరేచనాలు, జ్వరం, కడుపు నొప్పి, నీరసం...వంటివి ఈ సమస్య లక్షణాలని వైద్యులు పేర్కొంటున్నారు. 'దీనిని నిరోధించడానికి పిల్లలకు టీకాలు వేయడం, ఆహారం తినడానికి ముందు చేతులు కడుక్కోవడం వంటి శుభ్రతలు పాటించడం, పండ్లు కూరగాయలు వినియోగానికి ముందు కడగడం, ఉడకని మాంసం చేపలను తీసుకోకుండా ఉండడం, కలుషితమైన నీటితో తయారయే ఐస్ క్యూబ్స్ వినియోగానికి దూరంగా ఉండడం...' వంటివి పాటించాలని డాక్టర్ శివ్‌రాజు చెప్పారు.

## బుట్ట బొమ్మలు మెరిశాయ్



వైశ్య లైమ్ లైట్స్ అవార్డ్స్ సన్నాహక కార్యక్రమంలో భాగంగా ఆదివారం జూబ్లీహిల్స్ రోడ్ నెం. 36లోని ఎఫ్ హౌజ్‌లో కళామందిర్ రాయల్ ఫ్యాషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాంప్‌షోలో మోడల్స్ హొయలొలికించారు. జులై 1న జేఆర్‌సీ కన్వెన్షన్‌లో జరిగే వైశ్య లైమ్ లైట్ అవార్డ్స్ ఫర్ మెన్–2023 కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించబోతున్నట్లు ఈ సందర్భంగా వాసవి గ్రూప్స్ అధ్యక్షుడు ఇమ్మడి శివకుమార్, భరద్వాజ్ తెలిపారు.

– బంజారాహిల్స్



ర్యాంపుపై హొయలొలికిస్తున్న మోడల్స్

## న్యూస్‌రీల్

### లోటస్‌పాండ్‌లో ఎయిరేటర్లు



బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని లోటస్ పాండ్‌లో అర్బన్ డైవర్సిటీ అధికారులు ఎయిరేటర్లు ఏర్పాటు చేశారు. కొన్ని రోజుల క్రితం లోటస్‌పాండ్ చెరువులో ఆక్సిజన్ అందక వేలాది చేపలు మృత్యువాతపడిన నేపథ్యంలో ఫిషరీస్ శాఖ సూచనల మేరకు అధికారులు ఈ చెరువులో రెండు చోట్ల ఎయిరేటర్లు ఏర్పాటు చేశారు. ఇవి నీళ్లలో తిరుగుతూ నీటిని కదిలిస్తుండటంతో ఆక్సిజన్ ఉత్పత్తి పెరుగుతుందని పార్కు అధికారులు తెలిపారు. ఒక్కో ఎయిరేటర్‌కు రూ.70 వేల వరకు ఖర్చు చేసినట్లు చెప్పారు. చెరువులో నీరు పరిశుభ్రంగా ఉండేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని వారు పేర్కొన్నారు. ఇటీవల నీటితో పాటు పరిశుభ్రత కరువై ఈ పార్కు వాకర్ల ఆగ్రహానికి గురి కావాల్సి వచ్చింది. మేల్కొన్న అధికారులు అభివృద్ధిపై దృష్టిసారించి ఒక్కొక్కటిగా పనులన్నీ చేస్తున్నారు.

### పీజీ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ రేపటితో ఆఖరు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూతో పాటు రాష్ట్రంలోని వివిధ వర్సిటీల్లో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, జర్నలిజం, లైబ్రరీ సైన్స్, ఎంఎస్‌డబ్ల్యూ తదితర పీజీ కోర్సుల ప్రవేశ పరీక్షలకు రూ.2000 అపరాధ రుసుముతో మంగళవారంతో గడువు ముగియనుంది. రూ.500 అపరాధ రుసుముతో దరఖాస్తుల స్వీకరణ గడువు ఆదివారంతో ( ఈ నెల 18న) ముగిసినట్లు టీఎస్‌సీపీజీఈటీ–2023 కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు. ఇప్పటివరకు 69 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎంఏ కోర్సు ప్రవేశాలకు 200 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. అభ్యర్థులకు ఈ నెల 27 నుంచి హాల్‌టికెట్లు జారీ చేయనున్నట్లు, 30 నుంచి వచ్చే నెల 10 వరకు పీజీ ప్రవేశ పరీక్షలను నిర్వహించనున్నట్లు కన్వీనర్ చెప్పారు.

### ఓల్డ్ హఫీజ్‌పేట్‌లో నిధి అగర్వాల్ సందడి



హఫీజ్‌పేట్: ఓల్డ్ హఫీజ్‌పేట్‌లో ఆదివారం సినీ తార నిధి అగర్వాల్ సందడి చేశారు. ఈ సందర్భంగా మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, ప్రముఖ దర్శకులు సంపత్ నంది, కార్తీక్ దండులతో కలిసి ఆమె ఓ హోటల్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

# గోవా టు హైదరాబాద్

- సెలబ్రిటీలు, యువత లక్ష్యంగా మత్తు దందా
- వినియోగంతో మొదలై.. పెడ్లర్లుగా మారి..
- నైజీరియన్లతో కలిసి మాదకద్రవ్యాల వ్యాపారం

## నగరానికి ఇటీవల పెరిగిన డ్రగ్స్ సరఫరా

సాక్షి, సిటీబ్యూరో: 'బీటెక్ పూర్తయిన ఓ విద్యార్థి ఒక రోజు స్నేహితులతో కలిసి వీకెండ్ పార్టీ అని గోవాకు వెళ్లాడు. రెండ్రోజులు అక్కడే గడిపి తిరిగి నగరానికి వచ్చేశాడు. అప్పట్నుంచి తల్లిదండ్రులకు ఏదో ఒక కారణం చెప్పి తరచూ బయటికి వెళ్లడం, అర్ధరాత్రుళ్లు ఇంటికి రావటం మొదలుపెట్టాడు. కుమారుడి కదలికలను గమనించిన తల్లిదండ్రులు చరణ్‌ను రిహాబిలిటేషన్ సెంటర్‌కు తీసుకెళ్లారు. చరణ్‌ను పరిశీలించిన వైద్యులు డ్రగ్స్‌కు బానిసయ్యాడని తేల్చి చెప్పారు. ఆశ్చర్యపోయిన తల్లిదండ్రులు అసలు మావాడికి ఎలాంటి చెడు అలవాట్లు లేవని, డ్రగ్స్ ఎలా అలవాటైందో అర్థం కావడం లేదని ఆవేదన చెందారు.. ఇదీ ఓ రిహాబిలిటేషన్ సెంటర్‌లో వైద్యులు, తల్లిదండ్రులకు మధ్య జరిగిన సంభాషణ'..

బ్యాచ్‌లర్ పార్టీ అనో, ఫ్రెండ్స్ కలిసి వీకెండ్ ట్రిప్ అనో కారణమేదైనా తరచూ మీ అబ్బాయి గోవాకు వెళ్తున్నాడా? పిల్లల సెల్‌ఫోన్‌లో కోడ్‌నేమ్స్‌తో మెసేజ్‌లు, కాల్ లిస్ట్‌లు ఉన్నాయా? అయితే.. కాసింత అనుమానించాల్సిందే అని రిహాబిలిటేషన్ వైద్యులు, పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల కాలంలో గోవా నుంచి హైదరాబాద్‌కు మాదక ద్రవ్యాల సరఫరా పెరిగింది. స్టడీ, మెడికల్ వీసాలపై నైజీరియా నుంచి ఇండియాకు వచ్చిన నైజీరియన్లు వీసా గడువు ముగిసిన తర్వాత కూడా అక్రమంగా దేశంలో ఉంటూ.. జీవనోపాధి కోసం గోవా, ముంబై, బెంగళూరు వంటి నగరాలలో ఉంటూ డ్రగ్స్ దందా నిర్వహిస్తున్నారు.



### గోవాలో పార్టీ అంటే ఇవే..

గ్రేటర్‌లో మూడు కమిషనరేట్ల పోలీసులు మాదక ద్రవ్యాలపై నిఘా పెట్టిన నేపథ్యంలో పెడ్లర్లు రూటు మార్చారు. హైదరాబాద్‌కు వస్తే అరెస్టు చేయడమో, పీడీ యాక్ట్‌లు నమోదు చేస్తుండటంతో కస్టమర్లనే వారు ఉండే చోటుకు రప్పించుకొని మత్తును సరఫరా చేస్తున్నారు. ఎడ్విన్ నూన్స్, చకుమెకా, ఒసోండు, విక్టర్ చుక్వా, ఉచెచుక్వి వంటి పలువురు నైజీరియన్ డ్రగ్ పెడ్లర్లను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. సాధారణంగా మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి గంజాయి, హాష్ ఆయిల్ సరఫరా ఎక్కువగా అవుతూ ఉంటుంది. సెలబ్రిటీలు, హై ప్రొఫైల్ ఉద్యోగులు వీటిని ఎక్కువగా ఇష్టపడరని, కొకైన్, హెరాయిన్, ఎండీఎంఏ వంటి మాదక ద్రవ్యాలు ఎక్కువగా సేవిస్తుంటారని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. అందుకే ఈ తరహా కస్టమర్లు ఎక్కువగా గోవాలో పార్టీలలో హాజరయ్యేందుకు వెళ్తుంటారని చెప్పారు. గోవాలో స్థిరపడిన నైజీరియన్ డ్రగ్ పెడ్లర్లు పార్టీలలో కొకైన్ సరఫరా చేస్తూ మత్తు పార్టీలు నిర్వహిస్తుంటారు.

### కస్టమర్లు టు పెడ్లర్లు..

17–25 ఏళ్ల మధ్య ఉన్న యువత ఎక్కువగా డ్రగ్స్ వినియోగిస్తున్నారు. సరదాగా మొదలు పెట్టి బానిసలుగా మారిపోతున్నారు. విలాసవంతమైన జీవితానికి అలవాటు పడిన యువత చేతిలో సంపాదన లేకపోవటంతో డ్రగ్స్ దందాలోకి క్రమంగా దిగిపోతున్నారు. నైజీరియన్లు, అంతర్రాష్ట్ర పెడ్లర్లతో ఏర్పడిన పరిచయాలతో పెడ్లర్లుగా మారిపోతున్నారు. వాట్సాప్, టెలిగ్రాం, ఇన్‌స్టాగామ్ వంటి సామాజిక మాధ్యమాలలో ప్రత్యేక గ్రూప్‌లు పెట్టి మత్తు ఆర్డర్లు, డెలివరీ, లావాదేవీలు నిర్వహిస్తున్నారు. పోలీసుల నిఘా, ట్రాకింగ్ పెరగడంతో ఫోన్ కాల్స్ చేయడం లేదు. అత్యవసరమైతే వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రొటోకాల్ (వీఓఐపీ) కాల్స్ చేస్తున్నారు. అనాథలు, యాచకులు ఆధార్ కార్డులు ఇప్పించి, వారి పేర్ల మీద బ్యాంకు ఖాతాలు తెరుస్తున్నారు. యూపీఐ యాప్‌లు లేదా మ్యూల్ బ్యాంక్ అకౌంట్ల ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్నారు.

# నమ్మించి.. నిండా ముంచి..

- రెండేళ్ల క్రితం కోవిడ్‌తో మృతి చెందిన తమ్ముడు
- మృతుడి భార్య సంతకాలతో డబ్బులు హాంఫట్

## సోదరుడి బ్యాంక్ అకౌంట్ నుంచి రూ. 3 కోట్లు స్వాహా

హిమాయత్‌నగర్: అనారోగ్యంతో మృతి చెందిన తమ్ముడి బ్యాంక్ అకౌంట్‌లోంచి అన్న భారీ మొత్తంలో డబ్బు స్వాహా చేశాడు. మృతుడి భార్యకు రావాల్సిన ఇన్సూరెన్స్ డబ్బులు, ఇతర సేవింగ్స్‌ను సైతం కాజేసి జల్సాలు చేయడంతో బంధువులకు అనుమానం వచ్చి.. నిలదీయగా పొంతన లేని సమాధానాలు చెప్పాడు. మృతుడి భార్య, బంధువులు బ్యాంకుకు వెళ్లి ఆరా తీయగా రూ. 3 కోట్లు అతడు తన అకౌంట్‌కు బదిలీ చేసుకున్నట్లు వారు స్పష్టం చేశారు. దీంతో కొద్దిరోజుల క్రితం మృతుడి భార్య ఆసిఫ్‌నగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. అనంతరం ఈ కేసు ప్రాధాన్యత దృష్ట్యా సీసీఎస్‌కు బదిలీ చేయడంతో ఇక్కడ కేసును రీ రిజిష్టర్ చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి..

మెహిదీపట్నానికి చెందిన పటాన్ తబసుమ్ బాజీ భర్త సయ్యద్ నజీర్ అహ్మద్ కోవిడ్‌తో 2020లో మరణించాడు. అతను బతికున్నప్పుడు భార్య, పిల్లలపై ఇన్సూరెన్స్ చేశాడు. దీంతో పాటు తన బ్యాంక్ అకౌంట్‌లో కూడా కొంత డబ్బు ఉంచాడు. ఇవన్నీ తన మరణం అనంతరం భార్య పటాన్ తబసుమ్‌కు చెందేలా నామినీగా తనని చేర్చాడు. సయ్యద్ నజీర్ అహ్మద్ మృతి చెందిన తర్వాత ఇతని అన్న షేక్ జాన్ షాహీదా బాగోగులు చూసుకుంటానంటూ మృతుడి భార్య, పిల్లలకు దగ్గరయ్యాడు. తమ్ముడి పేరుపై ఉన్న బ్యాంకు లావాదేవీలన్నీ నీ పేరిట ట్రాన్స్‌ఫర్ చేస్తానంటూ పటాన్ తబసుమ్‌ను నమ్మించి ఆమె సంతకాలు తీసుకున్నాడు. ఆ తర్వాత రెండు ఖాతాల నుంచి దాదాపు రూ. 3 కోట్ల నగదును షేక్ జాన్ షాహీదా తన అకౌంట్‌కు బదిలీ చేసుకున్నాడు. ఆ డబ్బుతో కొత్త ఇన్నోవా కారు, బంగారు, వజ్రాల ఆభరణాలను కొనుగోలు చేశాడు. ఇదే సమయంలో యూఎస్ వెళ్లేందుకు ప్రయత్నాలు కూడా ముమ్మరం చేశాడు. ఈ క్రమంలో పటాన్ తబసుమ్‌ను చూసేందుకు బంధువులు ఇంటికి వచ్చినప్పుడు బ్యాంకు వివరాలు, పిల్లల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఆర్థికపరమైన లావాదేవీలు, మా భారం అంతా కూడా బావ షేక్ జాన్ షాహీదా చూసుకుంటున్నాడని వారికి తెలిపింది. ఈ విషయంపై అనుమానం వ్యక్తం చేసిన బంధువులు పటాన్ తబసుమ్‌ను బ్యాంకుకు తీసుకెళ్లి ఖాతాలను చూపించగా.. మృతుడి భార్య సంతకాలు చేయడంతో ఆ డబ్బు మృతుడి అన్న షేక్ జాన్ షాహీదా ఖాతాలకు క్రెడిట్ అయినట్లు నిర్ధారించారు. ఆసిఫ్‌నగర్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదయ్యింది. తాజాగా ఈ కేసుకు ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా సీసీఎస్‌కు బదిలీ చేశారు, ఇక్కడ రీ–రిజిష్టర్ చేసి దర్యాప్తును వేగవంతం చేశారు.



# నకిలీ రసీదులతో మాయాజాలం

- త్రైమాసిక పన్ను చెల్లించకుండానే స్లిప్పులు
- మోసాలకు పాల్పడుతున్న దళారులు





సాక్షి, సిటీబ్యూరో: నగరంలో త్రైమాసిక పన్ను చెల్లింపులపై నకిలీ రసీదుల దందా హల్‌చల్‌గా మారింది. రవాణాశాఖకు పన్ను చెల్లించకుండానే సాంకేతిక పరిజ్ఞానంతో నకిలీ రసీదులను సృష్టిస్తూ కొందరు దళారులు పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారు. నిబంధనల మేరకు చెల్లించాల్సిన పన్ను మొత్తాన్ని 30 నుంచి 50 శాతం వరకు తగ్గిస్తామంటూ వాహనదారులను బ్రోకర్లు ఆకట్టుకుంటున్నారు. దీంతో వాళ్ల మాటలు నమ్మి డబ్బు చెల్లించిన వాహనదారులకు నకిలీ రసీదులను చేతికిచ్చి ఉడాయిస్తున్నారు. రవాణాశాఖ అందజేసే రసీదులకు, దళారులు ఇచ్చేవాటికి ఎలాంటి తేడా లేకపోవడంతో వాహనదారులు తేలికగా నమ్ముతున్నారు. పన్ను చెల్లించిన తర్వాత ఆర్టీఏ అధికారులను సంప్రదిస్తే సదరు వాహనాలపై చెల్లించాల్సిన పన్నులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో తాము మోసపోయినట్లు వాహనదారులు లబోదిబోమంటున్నారు. నగరంలోని ఒక ప్రాంతీయ రవాణా కార్యాలయం పరిధిలోనే దళారులు సుమారు 30 కార్లపై ఇలాంటి నకిలీ రసీదులను అందజేశారు. ప్రతి 3 నెలలకు ఒకసారి రూ.5,600 చెల్లించాల్సిన వినీత్ అనే బ్రోకర్ రూ.3600 చొప్పున వసూలు చేసి నకిలీ రసీదులు చేతికిచ్చారని బాల్‌రెడ్డి అనే వాహనదారు తెలిపారు. పన్ను చెల్లించామనే భరోసాతో ఆర్టీఏకు వెళితే పన్ను పెండింగ్‌లో ఉన్నట్లు తేలిందన్నారు.

### రాష్ట్రవ్యాప్తంగా ఇదే దందా..

- హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతీయ రవాణా కార్యాలయాల పరిధిలోనూ బ్రోకర్లు ఇదే తరహా మోసాలకు పాల్పడడం గమనార్హం. కరీంనగర్, వరంగల్, ఖమ్మం తదితర జిల్లాల్లో ఇలాంటి నకిలీ రసీదులు వెలుగు చూశాయి. రాయితీ లభిస్తుందనే ఆశతో ఉన్న వందలాది మంది వాహనదారులను లక్ష్యంగా చేసుకొని అక్రమ దందా కొనసాగుతోంది. ఒకవైపు రవాణా కార్యాలయాల్లో దళారులుగా కొనసాగుతూనే సాఫ్ట్‌వేర్‌లో మాయాజాలం చేసి నకిలీ రసీదులకు తెరతీశారు.
- రాష్ట్రవ్యాప్తంగా ఈ దందా కొనసాగుతున్నప్పటికీ ఇటు ఆర్టీఏ అధికారులు, అటు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. మరోవైపు అధికారులతో చనువుగా ఉండే ఏజెంట్లే ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆర్టీఏ సాంకేతిక పరిజ్ఞానం పట్ల బాగా అవగాహన ఉన్న వాళ్లే నకిలీలను సృష్టిస్తున్నారని వాహనదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పలు ఆర్టీఏ కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగులు తాము చేయాల్సిన విధులను 'సహాయకులకు' అప్పగించి ప్రేక్షకపాత్రకు పరిమితమవుతున్నారు. దీంతో సాంకేతిక పరిజ్ఞానం తస్కరణకు గురవుతోందనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

## నేటినుంచి బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ వేడుకలు



విద్యుత్ దీపాల కాంతుల్లో బల్కంపేట ఎల్లమ్మ ఆలయం

అమీర్‌పేట: ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో నిర్వహించే బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మూడు రోజుల పాటు వేడుకలు కొనసాగనున్నాయి. సోమవారం ఎదుర్కోళ్లు, మంగళవారం ఎల్లమ్మ కల్యాణం, బుధవారం రథోత్సవం నిర్వహిస్తామని ఆలయ ఈవో ఎస్ అన్నపూర్ణ తెలిపారు.

### ట్రాఫిక్ మళ్లింపు

బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాల నేపథ్యంలో ట్రాఫిక్‌ను ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. మంగళవారం, బుధవారం రెండు రోజుల పాటు ఆంక్షలు అమల్లో ఉంటాయని ఒక ప్రకటనలో తెలిపారు. గ్రీన్‌ల్యాండ్, అమీర్‌పేట సత్యం థియేటర్ నుంచి ఫతేనగర్ వైపు వెళ్లే వాహనాలు బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం మీదుగా కాకుండా ఎస్ఆర్‌నగర్ టీ జంక్షన్, కమ్యూనిటీ హాల్, బీకేగూడ క్రాస్ రోడ్డు, శ్రీరామనగర్, సనత్‌నగర్ మీదుగా ఫతేనగర్ బ్రిడ్జిపైకి వెళ్లాల్సి ఉంటుంది. ఫతేనగర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి వచ్చే వాహనాలను కొత్త బ్రిడ్జి కట్టమైసమ్మ దేవాలయం మీదుగా బేగంపేట వైపు మళ్లిస్తారు. గ్రీన్ ల్యాండ్, ఫుడ్‌వరల్డ్ మీదుగా బల్కంపేట వైపు వచ్చే వాహనాలను ఫుడ్ వరల్డ్ క్రాస్ రోడ్డు వద్ద దారి మళ్లించి సోనాబాయి ఆలయం, సత్యం థియేటర్, మైత్రి వనం, ఎస్ఆర్‌నగర్ టీ జంక్షన్ వైపు అనుమతిస్తారు. బేగంపేట, కట్ట మైసమ్మ దేవాలయం వైపు నుంచి బల్కంపేటకు వచ్చే వాహనదారులు గ్రీన్ ల్యాండ్స్, కనకదుర్గా దేవి దేవాలయం, సత్యం థియేటర్, ఎస్ఆర్‌నగర్ టీ జంక్షన్ నుంచి ఎడమ వైపు తీసుకుని ఎస్ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.

## ఉప్పల్ స్కైవాక్ పిల్లర్‌ను ఢీకొట్టిన ఇసుక లారీ



ఉప్పల్: ఉప్పల్ స్కైవాక్ వంతెన పిల్లర్‌ను భారీ ఇసుక లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ ముందరిభాగం నుజ్జు నుజ్జు అవడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో స్కైవాక్ వంతెన పిల్లర్‌కు ఎలాంటి నష్టం కలుగలేదని అధికారులు తెలిపారు. ఆదివారం తెల్లవారు జామున లోడ్‌తో ఉన్న భారీ ఇసుక లారీ (టిఎస్06-యుఎ-4499) బోడుప్పల్ నుంచి ఉప్పల్ వైపు వస్తోంది. ఉప్పల్ చౌరస్తా వద్దకు రాగానే అదుపు తప్పి స్కైవాక్ వంతెన పిల్లర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ మోహన్ నాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ నిద్రమత్తు వల్లనే ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# పర్యావరణాన్ని పరిరక్షిద్దామంటూ సైకిల్ ర్యాలీ

లాలాపేట: తార్నాక డివిజన్ శాంతినగర్‌కు చెందిన తక్షశిల హైస్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం తార్నాకలో భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సైకిల్ ర్యాలీని పాఠశాల డైరెక్టర్ భాగ్యలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యం, పర్యావరణం, భవిష్యత్ తరానికి పచ్చదనాన్ని అందించాలనే విషయాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలనేదే ఈ సైకిల్ ర్యాలీ ఉద్దేశ్యం అన్నారు. రోజురోజుకు పెరుగుతున్న వాహన కాలుష్యం తగ్గించడానికి సైకిల్ వినియోగాన్ని అందరూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. తార్నాక నుంచి హబ్సిగూడలోని ఎన్‌జీఆర్ఐ వరకు...తిరిగి తార్నాక చౌరస్తా వరకు సాగిన ఈ సైకిల్ ర్యాలీలో విద్యార్థులందరూ తెల్లని రంగు టీ షర్టు, టోపీ ధరించి శాంతి సందేశాన్ని ప్రకటిస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఆర్ భాను, ప్రిన్సిపాల్ తనుప్రీత్, వైస్ ప్రిన్సిపాల్ మహిపాల్, హెచ్ఎం నాజమా, రిటైర్డు ప్రిన్సిపాల్ నవీన్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు అల్పాహారం, చల్లని పానీయాలు అందజేశారు.



తార్నాకలో సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న పాఠశాల నిర్వాహకులు

## ఈ నెల 24 వరకు ఎంఎంటీఎస్ రైళ్లు రద్దు

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 18 నుంచి 24 వరకు వివిధ రూట్లలో నడిచే ఎంఎంటీఎస్ రైళ్లను రద్దు చేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌ఓ సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు లింగంపల్లి నుంచి ఫలక్‌నుమా వరకు, ఉందానగర్ నుంచి లింగంపల్లి వరకు, ఫలక్‌నుమా-లింగంపల్లి మధ్య నడిచే 23 రైళ్లను రద్దు చేయనున్నట్లు పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, నిర్వహణ పనుల దృష్ట్యా ఎంఎంటీఎస్ రైళ్ల రాకపోకలను నిలిపివేయనున్నారు.

## గోవధను అరికట్టాలని డీజీపీకి లేఖ

అబిడ్స్: బక్రీద్‌ను పురస్కరించుకుని నగరంలో గోవులను వధించకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం గోవధను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ డీజీపీ అంజనీకుమార్‌కు లేఖ రాశారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం..ఆవులు, ఆవుదూడల్ని వధించడం నేరమన్నారు. బక్రీద్ సమీపిస్తున్నా నగర శివారులో పోలీసులు చెక్‌పోస్టులు కూడా ఏర్పాటు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

## భరతనాట్య అరంగేట్రం



శృతి అడ్డాల, దివ్య అడ్డాల నృత్య ప్రదర్శన

మాదాపూర్: ప్రవాస భారతీయ కళాకారులు తమ నృత్యాలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో ఆదివారం భరతనాట్య అరంగేట్రం కార్యక్రమాన్ని నిర్వహించారు. నాట్య గురువు సుగంధ శ్రీనాథ్ అధ్వర్యంలో శిష్యులు శృతి అడ్డాల, దివ్య అడ్డాల పలు అంశాలను ప్రదర్శించారు. ఇందులో మల్లారి, శివాష్టకం, అలరిపు, విష్ణు కీర్తన, దేవీ కీర్తన, జతిస్వరం, పదం, నృత్య ఉపహారం, నృత్యాంగహారం తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. వీరికి నటువాంగం సుగంధ శ్రీనాథ్, మృదంగం టీ.పి బాలసుబ్రమణ్యం, వయోలిన్ కె.అనిల్‌కుమార్, ఫ్లూట్ కె.ఉమా వెంకటేశ్వర్లు సంగీత సహకారాన్ని అందించారు.

# మరో ముగ్గురు బందిపోట్లు చిక్కారు

- ముంబైలో నమోదైన 'సూడో పోలీసు' కేసులో పురోగతి
- నగర వ్యాపారికి చెందిన రూ.2.67 కోట్ల సొత్తు దోపిడీ
- ఇప్పటి వరకు 5 మంది అరెస్టు, రూ.1.7 కోట్ల సొత్తు సీజ్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ నుంచి బంగారం, వజ్రాభరణాలు వివిధ నగరాలకు సరఫరా చేసే సంస్థ ఉద్యోగిని ముంబైలో అడ్డగించి, ఢిల్లీ పోలీసుల పేరుతో రూ.2.67 కోట్ల సొత్తు దోచుకుపోయిన కేసులో అక్కడి పోలీసులు శనివారం మరో ముగ్గురిని అరెస్టు చేశారు. దీంతో ఈ కేసులో ఇప్పటి వరకు ఐదుగురు చిక్కడంతో పాటు రూ.1.7 కోట్ల సొత్తు రికవరీ చేసినట్టయింది. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం ముంబై క్రైమ్ బ్రాంచ్ గాలిస్తోంది. గతంలో నగరంలోని మరో సంస్థలో పని చేసిన వ్యక్తి ఇచ్చిన సమాచారంతోనే ముంబైలోని సియోన్‌లో గత నెల 31న ఈ దారిదోపిడీ చోటు చేసుకున్న విషయం విదితమే. సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన సంతోష్ నర్ది బంగారం, వజ్రాభరణాల వ్యాపారి. ఇతడి వద్ద పని చేసే హరిరామ్ ఘోటియా రూ.2.67 కోట్ల విలువ చేసే బంగారం బిస్కెట్లు, ఆభరణాలతో గత నెల 30న నగరం నుంచి ప్రైవేట్ బస్సులో ముంబై వెళ్లారు. రాజస్థాన్‌లోని చూరూలో ఉన్న సర్దార్‌సహర్‌కు చెందిన ప్రశాంత్ చౌదరి గతంలో నగరంలోని బంగారం కార్ఖానాలో పని చేశాడు. దీనికి సమీపంలోనే సంతోష్‌కు చెందిన సంస్థ కూడా ఉండటంతో ఆయన వ్యాపార లావాదేవీలు, ఉద్యోగుల సమాచారం తెలిసింది. అతడు ఇచ్చిన సమాచారంతో రాజస్థాన్, మహారాష్ట్రలకు చెందిన మహేంద్ర సరన్, మనోజ్ నెహ్రా, కిషనాథ్, అశోక్, మనోజ్, మెహతాలు బందిపోటు దొంగతనానికి పథక రచన చేశారు. సరన్, నెహ్రా హైదరాబాద్ చేరుకుని సంతోష్ కార్ఖానా వద్ద కాపుకాశారు. హరిరామ్ సొత్తుతో బయలుదేరిన విషయాన్ని మిగిలిన నలుగురికీ చేర్చారు. అప్పటికే ముంబై వచ్చి సిద్ధంగా ఉన్న వీళ్లు ఓ ఎస్‌యూవీ వాహనం తీసుకుని మిగిలిన వాళ్లతో కలిసి హరిరామ్ వెళ్తున్న కారు అడ్డగించి దోచుకుపోయారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న ముంబై క్రైమ్ బ్రాంచ్ గత సోమవారం చూరూలో సరన్, నెహ్రాలను, ఈ శనివారం మనోజ్, మెహతా, అశోక్‌లను అరెస్టు చేశారు. వీరి నుంచి మొత్తం రూ.1.7 కోట్ల సొత్తు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మిగిలిన ఇద్దరి కోసం గాలిస్తున్నారు. మిగిలిన సొత్తు వారి వద్దే ఉన్నట్లు ఇప్పటికే అరెస్టు అయిన నిందితుల విచారణలో ముంబై క్రైమ్ బ్రాంచ్ గుర్తించింది.

# వీసాల పేరిట మోసం..ఇద్దరిపై కేసు

బంజారాహిల్స్: ఐఈఎల్టీఎస్ పరీక్ష రాయకుండా ఆస్ట్రేలియా వీసా ఇప్పిస్తామంటూ మోసం చేసిన ఇద్దరిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లో నివసించే ఎంఏ ఫయాజ్ ఉనిమాన్ (23)కు డాక్టర్ సఫియా షరీన్ అలియాస్ మరియుమ్మఫాతో ఏడాది కిందట పరిచయమైంది. ఈ క్రమంలోనే ఆమె అప్పుడప్పుడు తన వ్యక్తిగత అవసరాల కోసం ఫయాజ్ వద్ద డబ్బులు అప్పుగా తీసుకుంది. ఆమెను నమ్మిన అతను దాదాపు రూ.4.47 లక్షలు అప్పుగా ఇవ్వగా ఆమె తిరిగి రూ. 65 వేలు చెల్లించింది. వీరి పరిచయ కాలంలో తాను ఐఈఎల్టీఎస్ పరీక్ష లేకుండా ఆస్ట్రేలియాకు పంపుతానని నమ్మించింది. ఇందు కోసం తన స్నేహితుడైన సహారా వరల్డ్ మేనేజ్మెంట్ సర్వీసెస్లో పనిచేసే మహ్మద్ టస్కీన్ తో కలిసి ఆయా వీసాలను అందిస్తానని నమ్మించింది. ఇది నమ్మిన ఫయాజ్ తన ముగ్గురు బంధువులైన మహమ్మద్ జాఫర్, మహమ్మద్ రషీద్ ఖాన్, మహమ్మద్ సుఫియాన్లను ఆమెకు పరిచయం చేశారు. ఈ క్రమంలోనే ఆమె ఆస్ట్రేలియా వీసా కోసం ముగ్గురి వద్ద నుంచి మొత్తం రూ. 7.20 లక్షలు తీసుకొంది. స్పాన్సర్‌షిప్ వీసా ఇస్తానని నమ్మించిన ఆమె విజిటింగ్ వీసా కోసం దరఖాస్తు చేసినట్లు గుర్తించారు. దీనికితోడు ఆమె ఫోన్‌లో అందుబాటులో లేకపోవడం, స్పందించకపోవడంతో వారికి అనుమానం వచ్చింది. దీంతో మోసపోయినట్లు గుర్తించిన ముగ్గురు వారిపై దృష్టి పెట్టగా టస్కీన్ గతంలో పంజగుట్ట పోలీసు ఠాణా పరిధిలో ఇలానే వీసా పేరుతో దాదాపు రూ.13 లక్షల వరకు మోసం చేసినట్లు తేలింది. దీంతో జరిగిన మోసంపై ఫయాజ్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా డాక్టర్ సఫియా షరీన్, మహ్మద్ టస్కీన్లపై ఐపీసీ సెక్షన్ 420, 406 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గంజాయి రవాణా చేస్తూ...

వాహనం వదిలి ఇద్దరు పరారీ

మేడ్చల్ రూరల్: మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించేందుకు కారును ఆపగా కారు డ్రైవర్‌తో పాటు పక్కన ఉన్న వ్యక్తి వాహనం వదిలి పరారైన ఘటన మేడ్చల్‌లో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ భూపాల్‌గౌడ్ శనివారం రాత్రి మేడ్చల్ చెక్‌పోస్ట్ సమీపంలో ఓఆర్ఆర్ నుండి మేడ్చల్ వైపు వస్తున్న వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో రాత్రి 11.40 సమయంలో ఓ స్కార్పియో వాహనాన్ని ఆపారు. దీంతో కారు డ్రైవర్, అతని పక్క సీటులో ఉన్న మరోవ్యక్తి వాహనాన్ని వదిలి పరిగెత్తారు. వారిని పట్టుకునేందుకు ట్రాఫిక్ పోలీసులు ప్రయత్నించినా దొరకకుండా పరారయ్యారు. వెంటనే పోలీసులు కారును తనిఖీ చేయగా కారు వెనుక సీటులో చిన్న చిన్న బ్యాగులు కనిపించాయి, వాటిని పరిశీలించగా వాటి నుండి ఘాటైన వాసన రావడం, బ్యాగుల్లో ఆకుపచ్చ రంగు ఆకులు ఉండడంతో గంజాయిగా భావించి మేడ్చల్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం



విగ్నేశ్ (ఫైల్)

ఘట్‌కేసర్: బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడిన సంఘటనలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందిన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఆర్కే పురం, కొత్తపేట్‌కు చెందిన సి.హెచ్ విగ్నేశ్ (22) అవుషాపూర్ వీబీఐటీలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. శనివారం ఎదులాబాద్ శ్రీ లక్ష్మీనారాయణ చెరువు వద్ద స్నేహితులు హరీశ్, శశాంక్, సాయిరాంతో కలిసి విందు చేసుకున్నారు. విందు అనంతరం సింగపూర్ టౌన్‌షిప్‌లోని ఇంటికి వెళుతుండగా హెచ్ఎండీఏ నర్సరీ సమీపంలో ఓఆర్ఆర్ వద్ద విగ్నేశ్ ప్రయాణిస్తున్న కేటీఎం బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. తీవ్ర గాయాలైన అతడిని స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి, తర్వాత ఉప్పల్ ఆదిత్య ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన అక్కడి వైద్యులు మృతి చెందినట్లు ప్రకటించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## చోరీకి విఫలయత్నం



నిందితుడు శంకర్



వాహిద్



స్వాధీనం చేసుకున్న కారు

అత్తాపూర్: వ్యసనాలకు అలవాటు పడిన ఓ డ్రైవర్ అతడి స్నేహితులతో కలిసి దొంగతనం చేసేందుకు రెక్కీ నిర్వహించి పోలీసులకు పట్టుబడ్డారు. అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులియాదగిరి, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శివరాంపల్లి ప్రాంతానికి చెందిన ఎన్.జనార్దన్‌రెడ్డి ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడు. ఇటీవల అతడి కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి గోవాకు వెళ్లి ఆదివారం మధ్యాహ్నం ఇంటికి తిరిగివచ్చారు. వారు టూర్‌కు వెళ్లిన విషయం తెలుసుకున్న స్థానిక డ్రైవర్‌గా పని చేస్తున్న శంకర్, వాహిద్ మరో ఇద్దరితో కలిసి జనార్దన్ ఇంట్లో చోరీ చేసేందుకు కారులో అక్కడికి వచ్చారు. దీనిని గుర్తించిన స్థానికులు జనార్దన్‌రెడ్డికి సమాచారం అందించడంతో పాటు అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు డ్రైవర్ శంకర్‌తో పాటు వాహిద్‌ను అదుపులోకి తీసుకోని ప్రశ్నిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సింక్రొనీకి బెస్ట్ వర్క్‌ప్లేస్ గుర్తింపు..


సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ సింక్రొనీకి ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు విధులు నిర్వర్తించేందుకు అనువైన ఇండియాస్ బెస్ట్ కంపెనీలు అనే విషయంలో గ్రేట్ ప్లేస్ టూ వర్క్‌గా తమ సంస్థకు గుర్తింపు దక్కడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు చక్కని పనివాతావరణం కల్పించడంలో తమ సంస్థకు ఉన్న అంకితభావానికి దక్కిన గుర్తింపు తమ బాధ్యతను మరింత పెంచిందని సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆండీ పన్నేరి ఈ సందర్భంగా తెలిపారు.

# వీరంతా ఏమయ్యారో?

నగరం పరిధిలో ఇటీవల అదృశ్యం కేసులు ఎక్కువ అవుతున్నాయి. సిటీ నలుమూలలా ఏదో ఒక చోట బాలిక లేదా బాలుడు లేదా యువతీయువకులు అదృశ్యమయ్యారని ఆయా పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదవుతున్నాయి. వీరంతా ఏమయ్యారో తెలియక బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. తాజాగా ఆదివారం ఇలా నాలుగు పోలీస్ స్టేషన్లలో అదృశ్యం ఫిర్యాదులు అందాయి.

– సాక్షి, నెట్‌వర్క్

### డిగ్రీ విద్యార్థిని అదృశ్యం



శ్రావ్య (ఫైల్)

నల్లకుంట: డిగ్రీ రెండో సంవత్సరం చదువుతూ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్న ఓ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ రమాదేవి తెలిపిన వివరాల మేరకు.. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ తుమ్మ యాదగిరి కుమార్తె శ్రావ్య (21)కు ఇటీవలే వివాహమైంది. కాగా 2021లో ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కు వచ్చిన ఆమె ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతూ నల్లకుంట శంకరమఠం సమీపంలోని హాస్టల్‌లో ఉంటుంది. ఇటీవల ఇంటికి వెళ్లిన ఆ యువతి ఈ నెల 15న హాస్టల్‌కు వచ్చింది. ఈ క్రమంలో 17న సాయంత్రం తండ్రి యాదగిరి కుమార్తెను చూడడానికి హైదరాబాద్‌కు వచ్చాడు. హాస్టల్ నిర్వాహకులను విచారించగా శ్రావ్య ఈ నెల 16న సాయంత్రం 8 గంటలకు హాస్టల్ నుంచి వెళ్లిపోయిందని చెప్పారు. కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారిని విచారించినప్పటికీ ఆచూకీ లభించలేదు. ఆందోళన చెందిన యాదగిరి తమ కుమార్తె కనిపించడంలేదంటూ నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### మేడ్చల్‌లో ఇద్దరు పిల్లలు..



మేడ్చల్ రూరల్: నిత్యం ఇంట్లో ఉండే అన్నా చెల్లెలు ఇద్దరు తండ్రి పనికి వెళ్లొచ్చేసరికి అదృశ్యమైన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..బిహార్ రాష్ట్రానికి చెందిన బ్రహ్మదేశ్ పాశ్వాన్-బబ్లీదేవి దంపతులు మేడ్చల్ పట్టణానికి వలస వచ్చి జీవనం సాగిస్తున్నారు. వారికి కుమారుడు అజయ్‌కుమార్ (7), ప్రతిభ (5)లు సంతానం. కాగా మూడేళ్ల క్రితం దంపతులు విడాకులు తీసుకోవడంతో పిల్లలు తండ్రి వద్ద ఉంటున్నారు.నిత్యం పిల్లలకు భోజనం తినిపించి ఇంటి వద్దే ఉంచి తండ్రి సెంట్రింగ్ పనికి వెళ్తుంటాడు. ఈ క్రమంలో ఈ నెల 16వ తేదీన రోజులాగే ఉదయం 7 గంటలకు పనికి వెళ్లిన బ్రహ్మదేవ్ మధ్యాహ్నం 3 గంటలకు ఇంటికి వచ్చేసరికి పిల్లలు అజయ్‌కుమార్, ప్రతిభ ఇంట్లో కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం మేడ్చల్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### మనుమడిని చూసేందుకొచ్చిన వృద్ధురాలు..



వెంగళరావునగర్: నగరంలో నివసిస్తున్న మనుమడిని చూడటానికి వచ్చిన ఓ వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఒంగోలులో నివసించే డి.అచ్చమ్మ (70) వెంగళరావునగర్ డివిజన్ వీడియోగల్లీలో నివసించే మనుమడి ఇంటికి మూడు రోజుల కిందట వచ్చింది. శనివారం ఉదయం 8 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన అచ్చమ్మ తిరిగి రాలేదు. మనుమడు వెంకటేశ్వర్లు బంధుమిత్రులకు ఫోన్ల ద్వారా సమాచారం తెలియజేసి విచారించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆదివారం మధురానగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అచ్చమ్మ నలుపు రంగు ఉండి. దాదాపు 4.8 అడుగులు ఎత్తు ఉంటుందని, కొద్దిగా మతిస్థిమితం లేకుండా మాట్లాడుతుందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో మనుమడు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ఫిలింనగర్‌లో యువతి...



అంకిత

ఫిలింనగర్: అనుమానాదస్పద స్థితిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన ఫిలింనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ.. ఫిలింనగర్‌లోని మహాత్మాగాంధీ నగర్ బస్తీకి చెందిన అంకిత(19) డెంటల్ హాస్పిటల్లో పనిచేస్తున్నది. ఎప్పటిలాగే ఆదివారం డ్యూటీకి వెళ్లి సాయంత్రం ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. తండ్రి ఊషన్న అన్ని ప్రాంతాల్లో గాలించారు. ఫలితం లేకపోవడంతో తన కూతురు కనిపించడంలేదు అని ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని గాలింపు చేపట్టారు.

## క్లుప్తంగా...

### కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరిన నేతలకు కండువాలు వేస్తున్న విజయారెడ్డి

బంజారాహిల్స్: వెంకటేశ్వరకాలనీ డివిజన్ బంజారాహిల్స్ రోడ్ నెం. 4కు చెందిన పలువురు పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు, నేతలు టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా విజయారెడ్డి వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బాబా, కృష్ణ, మనోజ్, సాయితో పాటు పలువురు ఉన్నారు. కార్యక్రమంలో నేతలు ధన్‌రాజ్ రాథోడ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### మోతీనగర్ క్రాస్ రోడ్డు వద్ద పోలీస్ చెక్‌పోస్టు



చెక్‌పోస్టును ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ రవికుమార్

రహమత్‌నగర్(బోరబండ): బక్రీద్ పండగను పురస్కరించుకొని బోరబండ పోలీస్ పోలీసులు మోతీనగర్ క్రాస్ రోడ్డు వద్ద ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బోరబండ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ... చెక్ పోస్టులో పోలీసులు మూడు షిఫ్టులుగా 24 గంటల పాటు విధులు నిర్వహిస్తారన్నారు. అక్రమంగా పశువులను తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాయని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

### భార్యావియోగాన్ని తట్టుకోలేక వ్యక్తి ఆత్మహత్య



నర్సింహా(ఫైల్)

ఫిలింనగర్: భార్య పుట్టింటికి వెళ్లడమే కాకుండా తనతో సరిగా మాట్లాడడం లేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలివీ... ఫిలింనగర్‌లోని దుర్గాభవనీనగర్ బస్తీకి చెందిన పెద్ద నర్సింహా(29) వివాహం రెండేళ్ల క్రితం శివానీతో జరిగింది. నాలుగు రోజుల క్రితం శివాని పుట్టింటికి వెళ్లింది. అత్త మాట్లాడినా సరిగా స్పందించలేదు. భర్తతో సైతం సరిగా మాట్లాడకపోవడంతో విరక్తి చెందిన నర్సింహా ఆదివారం తన గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు



అదృశ్యమైన వ్యక్తిని పట్టుకున్న పోలీసులు

వెంగళరావునగర్: కూలీ కోసం వచ్చిన వ్యక్తి అదృశ్యమైనట్టు ఫిర్యాదు అందిన కొన్ని గంటల్లోనే పోలీసులు కేసును ఛేదించిన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... రాజస్థాన్‌కు చెందిన సురేష్ అనే వ్యక్తి ఈ నెల 13న నగరానికి వచ్చాడు. యూసుఫ్‌గూడలోని పెయింటింగ్ షాపులు పనులు చేసుకుంటూ జవహర్‌నగర్‌లోని తన తోడల్లుడి ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో 15వ తేదీ రాత్రి 10.30 గంటలకు షాపును మూసివేయగా ఇంటికి వెళ్తున్నట్టు చెప్పి షాపు నుంచి బయటకు వచ్చాడు. అయితే ఇంటికి మాత్రం చేరలేదు. అతని సోదరుడు రామ్‌లాల్ రెండురోజుల పాటు గాలించినా ఫలితం లేకపోవడంతో శనివారం రాత్రి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు శనివారం రాత్రి, ఆదివారం ఉదయం అతని కోసం గాలింపు చేపట్టి మధ్యాహ్నం కల్లా సురేష్ ఉన్న ప్రాంతాన్ని గుర్తించి తీసుకువచ్చారు. అనంతరం సురేష్ బంధువులను పిలిపించి అప్పగించారు. అత్యంత వేగంగా కేసును శోధించిన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌ను, అతని బృందాన్ని కాంట్రాక్టర్, సురేష్‌కు తోడల్లుడు అయిన రామ్‌లాల్‌తో పాటు జవహర్‌నగర్ ప్రజలు అభినందించారు.

# శిథిల 'బడి'



మురుగు, బురద నీటిలో కూరుకుపోయిన బీజేఆర్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

గతేడాది భారీ వర్షాలకు బురద, వరద నీటితో కూరుకుపోయిన బీజేఆర్ నగర్ ప్రభుత్వ పాఠశాల ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రారంభమవుతుందని అంతా భావించారు. అయితే ఇప్పటికీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఈ బడి కనిపించకపోవడం ఆశ్చర్యకరం.
ఈ పాఠశాలలో సుమారు 250 మంది విద్యార్థులు చదువుకునేవారు.
బడి నీట మునగడంతో ఈ స్కూల్ విద్యార్థులంతా చుట్టుపక్కల పాఠశాలల్లో చేరిపోయారు. మిగతా కొంత మంది విద్యార్థులను మహాత్మాగాంధీ నగర్ బస్తీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు తరలించారు.

- బీజేఆర్‌నగర్ బస్తీలో నీట మునిగిన సర్కారు బడి
- చదువుకు దూరమైన విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- స్థానిక యువత నడుం బిగించినా ఉపయోగం కరువు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్, షేక్‌పేట డివిజన్ల సరిహద్దులో ఉన్న ఈ ప్రభుత్వ పాఠశాల దుస్థితి అటు ప్రజాప్రతినిధులకు, ఇటు అధికారులకు పట్టడం లేదు. పాఠశాలను బాగు చేయాలని స్థానికులు ఎన్నోమార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఒకప్పుడు 250 మంది విద్యార్థులతో కళకళలాడిన ఈ పాఠశాల నీటి మునగడంతో చాలా మంది విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్లలేక చదువులకు దూరం కావాల్సిన పరిస్థితి తలెత్తింది. చాలా మంది విద్యార్థులు బడికి పోవడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయి. ఓ వైపు బడి బాట, ఇంకో వైపు మన బస్తీ మన బడి పేరిట విద్యా శాఖ తూతూ మంత్రంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఇలాంటి ప్రజోపయోగ కార్యక్రమాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నది.

- జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఈ బడి దుస్థితిపై సమాచారమే లేనట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని బస్తీవాసులు దుయ్యబడుతున్నారు.
- ఈ బస్తీ ఏర్పడ్డప్పుడు అంటే సుమారు 40 సంవత్సరాల క్రితం స్కూల్ భవనం నిర్మించారు. స్థానిక యువత చొరవతో ఓ సాఫ్ట్‌వేర్ సంస్థ పాఠశాలకు రంగులు వేసి షాబాదు బండలు వేయించింది. వరద నీటి దాటికి ఈ స్కూల్ నిలవకుండా పోయింది.
- నేరుగా వరద అంతా స్కూల్‌లోనే తిష్ట వేస్తుండటంతో దీన్ని పూర్తిగా కూల్చేయాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. ఆ దిశలో ఏ ఒక్కరు స్పందించడం లేదు.
- బీజేఆర్‌నగర్ బస్తీకి చెందిన కొంత మంది యువకులు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఫైవ్ ఫింగర్స్ అనే సంస్థ ఏర్పాటు చేసి దీని ద్వారా బడిని బాగు చేద్దామని గత మూడేళ్లుగా అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. ఎవరూ ముందుకు రాకపోవడంతో ఇలా బడి శిథిలబడి కనిపిస్తున్నది.

# మిషన్ భగీరథ దేశానికే ఆదర్శం

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



వాటర్‌వర్క్స్ అధికారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే మాగంటి, కమిషనర్ దానకిషోర్

శ్రీనగర్‌కాలనీ: దేశానికే ఆదర్శంగా మిషన్ భగీరథ నిలిచిందని, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టిన సీవరేజీ, వాటర్ పైప్‌లైన్ పనులు దాదాపు పూర్తయ్యాయని, కొన్ని మరికొన్ని రోజుల్లో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. ఆదివారం శ్రీనగర్ కాలనీ నాగార్జుననగర్‌కాలనీలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంచినీళ్ల పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వాటర్‌వర్క్స్ ఎండీ దానకిషోర్ మాట్లాడుతూ... నగరంలో ప్రణాళికాబద్ధంగా వాటర్, సీవరేజీ పనులను చేస్తున్నామన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వాటర్‌వర్క్స్ ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో డీఎంసీ రమేష్, జీఎం హరిశంకర్, డీజీఎం వాహబ్, మేనేజర్లు రాజేందర్, శ్రీనివాస్, రమేష్, శ్రీనివాస్, కార్పొరేటర్లు వనం సంగీతయాదవ్, దేదీప్య, సి.ఎన్.రెడ్డి, రాజ్‌కుమార్ పటేల్, కాలనీ నేతలు మౌళి, సత్యనారాయణ, అప్పుఖాన్, డి.సంజీవ తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం పుణ్యకార్యం



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

వెంగళరావునగర్: సృష్టిలో అన్నదానం మహాపుణ్యకార్యమని, ప్రతి ఒక్కరూ తోటి వారికి ఏదోరకంగా సహాయ సహకారాలను అందించాలని మధురానగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్ సూచించారు. వెంగళరావునగర్ డివిజన్ రహమత్‌నగర్ చౌరస్తా వద్ద రహమత్‌నగర్ వర్తక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అమావాస్య అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విలువలు తరిగిపోతున్న ప్రస్తుత సమాజంలో పేదలకు అన్నదానం నిర్వహించడం సంతోషించదగ్గ విషయమని కమిటీని అభినందించారు. ప్రతి నెల అమావాస్య రోజున అన్నదానాన్ని చేసి పేదలకు ఒకపూట కడుపు నింపడం గొప్ప విషయమన్నారు. ఆర్థికంగా స్థిరపడిన వారంతా అన్నదానంతోపాటు విద్య, వైద్యం తదితర విషయాల్లోనూ నిరుపేదలకు సహాయ సహకారాలను అందించాలన్నారు. కార్యక్రమంలో వర్తక సంఘం నాయకులు తాడికొండ కృష్ణమూర్తిగుప్తా, ఎం.శ్యాంరావు ముదిరాజ్, జి.నటరాజ్ యాదవ్, బి.ఆంజనేయులు యాదవ్, మధురానగర్ ఎస్ఐలు యుగంధర్, నరేందర్ ఇతర సిబ్బంది, సంఘం నేతలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై ప్రచారం చేయాలి

- ఆ బాధ్యత ఉద్యోగులపై కూడా ఉంది
- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



జలమండలిలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్: గతంలో జలమండలి శాఖ అభివృద్ధి పనులు చేయాలంటే నిధుల లేమితో తీవ్ర ఇబ్బందులు ఉండేవని కానీ కేసీఆర్ సీఎం అయిన తర్వాత జీహెచ్ఎంసీతో పోటీ పడి మరీ జలమండలి అభివృద్ధి పనులు చేస్తుందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో మంచినీళ్ల పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ... క్షేత్ర స్థాయిలో ప్రజలకు జీహెచ్ఎంసీ సిబ్బందితో పాటు జలమండలి సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటారని ప్రభుత్వం చేపట్టే కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను ప్రజలకు చెప్పడంతో పాటు వాటిని ప్రచారం చేయాల్సిన బాధ్యత ప్రతి ఉద్యోగి, సిబ్బందిపై ఉందన్నారు. హైదరాబాద్ నగరానికి జలమండలి ప్రధాన కార్యాలయం ఖైరతాబాద్‌లో ఉండటంతో గతంలో ఎక్కడ నీటి సమస్య ఉన్నా కూడా ఈ కార్యాలయం కేంద్రం బిందువుగా ఉండి నీళ్ల బిందెలతో నిరసన తెలిపేవారని కానీ ప్రస్తుతం ఎక్కడ కూడా ఖాళీ నీళ్ల బిందెలు కనిపించడం లేదన్నారు. ఒక వైపు గోదావరి, మంజీర, కృష్ణా ఇలా ప్రతి నదీ హైదరాబాద్ వాసుల గొంతు తడుపుతుందని అన్నారు. తెలంగాణ ప్రధాన డిమాండ్లలో నీళ్ల సమస్య కూడా ఉండేదని ఆ విషయంలో సీఎం కేసీఆర్ విజయవంతంగా ముందుకు దూసుకుపోతున్నారని ఒక వైపు రైతులకు నిరంతరం నీళ్లు ఇవ్వడంతో పాటు ఊరూరా, ఇంటింటికి శుద్ధ మంచినీటి జలాలు అందిస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. నాగార్జున సాగర్ డెడ్ స్టోరేజికి చేరిన రెండు సంవత్సరాల వరకు కూడా నగరానికి నీటి ఎద్దడి లేకుండా సుంకిశాల వంటి భారీ ప్రాజెక్టులు రూపొందించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జలమండలి శాఖలో ఉత్తమ ఉద్యోగులు సిబ్బందిని ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జలమండలి ఎండీ దాన కిషోర్, ఈడీ సత్యనారాయణ, కార్పొరేటర్లు కవితారెడ్డి, సంగీతా యాదవ్, డీజీఎం శ్రీనివాస్, మేనేజర్లు రాంబాబు, శ్రీహరి, పవన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 36 లక్షలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎమ్మెల్యే కాలనీలో రమేష్ హెయిర్ కటింగ్ సెలూన్ చౌరస్తాలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు రూ. 36 లక్షలు మంజూరయ్యాయి. ప్లస్ ఆకారంలో ఉన్న ఈ రోడ్డులో తరచూ గుంతలు ఏర్పడుతూ స్థానికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చాలా మంది తమ ఇళ్లల్లో కార్లను కడుగుతున్నప్పుడు నీళ్లన్నీ రోడ్లపైకి వచ్చి బీటీ కొట్టుకుపోయి ఎన్నిమార్లు రోడ్డు వేసినా గుంతలమయంగా మారేది. ఇప్పుడు ఆ సమస్యకు సీసీ రోడ్డు ద్వారా చెక్ పెట్టనున్నారు. ఈ చౌరస్తాకు నాలుగు వైపులా సీసీ రోడ్డు వేయడం ద్వారా శాశ్వతంగా రోడ్డు నిలిచిపోయేలా జీహెచ్ఎంసీ సర్కిల్–18 ఇంజినీర్లు ప్రతిపాదనలు రూపొందించారు. ఇక్కడ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఎమ్మెల్యే కాలనీ, సయ్యద్‌నగర్, ఎన్బీటీనగర్, తదితర ప్రాంతాల ప్రజలకు మార్గం సుగమం అవుతుంది.

**రూ. 1.50 లక్షలతో మినీ హైమాస్ట్ లైట్...**
బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎమ్మెల్యే కాలనీలో మూడు చోట్ల మినీ హైమాస్ట్ లైట్లు రూ. 1.50 లక్షల వ్యయంతో నిర్మించనున్నారు. రమేష్ హెయిర్ కటింగ్ సెలూన్ చౌరస్తాతోపాటు డి.శ్రీనివాస్ ఇంటి చౌరస్తా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెనుకాల జీహెచ్ఎంసీ పార్కులో మూడు చోట్ల హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయనున్నారు.

### టీడీపీ నూతన కార్యవర్గాలు

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఆరు డివిజన్లకు తెలుగుదేశం పార్టీ నూతన కమిటీని ఏర్పాటు చేసేందుకు టీటీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఆదేశాల మేరకు కమిటీలు వేశామని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి శ్రీనివాస్‌నాయుడు వెల్లడించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో మూడు డివిజన్లకు కమిటీలు వేసినట్లు తెలిపారు. ఖైరతాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా జ్ఞానేశ్వర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా రవీందర్‌కుమార్, హిమాయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడిగా సి.హెచ్.ప్రదీప్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా రాపర్తి విజయ్, సోమాజిగూడ డివిజన్ అధ్యక్షుడిగా జి.శ్రీనివాస్ నాయి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్.రాజేష్, ప్రధాన కార్యదర్శిగా గడ్డి శ్రీనివాస్‌ను నియమించినట్లు ఆయన తెలిపారు. సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పి.సాయిబాబా సమక్షంలో నూతన కమిటీని ప్రకటించామన్నారు.

### గంజాయి విక్రేత అరెస్టు



నిందితుడు కూరపాటి శ్రీకాంత్

రహమత్‌నగర్(బోరబండ): గంజాయిని విక్రయిస్తున్న ఓ యువకుడిని బోరబండ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ రవికుమార్ సమాచారం మేరకు... హబీబ్‌ఫాతీమానగర్ బస్తీకి చెందిన కూరపాటి శ్రీకాంత్(24) కొంత కాలంగా గంజాయిని తీసుకొచ్చి పలు ప్రాంతాల్లో విక్రయిస్తుడు. ఈ సమాచారం మేరకు శనివారం అతడిని ఆదుపులోని తీసుకుని సోదా చేశారు. ఆ యువకుడి వద్ద కిలోన్నర గంజాయి, ఒక సెల్ ఫోన్ దొరికిందని ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. శ్రీకాంత్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

### ద్విచక్ర వాహనం చోరీ

వెంగళరావునగర్: ద్విచక్ర వాహనంపై ఆఫీసుకు వచ్చిన ఓ వ్యక్తి తిరిగి వెళ్లే సమయంలో తన వాహనం కనిపించకపోవడంతో మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలివీ... ఓల్డ్ బోయిన్‌పల్లి భవానీనగర్‌లో నివసించే పి.సుమన్ ప్రైవేటు ఉద్యోగి. ఇతను వెస్ట్ శ్రీనివాస్‌నగర్ కాలనీలోని ఓ ప్రైవేట్ సంస్థలో పని చేస్తుంటారు. ఈ క్రమంలో ఈ నెల 15వ తేదీ తన ద్విచక్ర వాహనం (టీఎస్ 03 ఈఈ 7337 )పై వెస్ట్ శ్రీనివాస్‌నగర్‌లోని కార్యాలయానికి వచ్చి సమీపంలోని అమరావతి టిఫిన్ సెంటర్ వద్ద బండిని నిలిపాడు. సాయంత్రం విధులు ముగించుకుని 5.30 గంటల సమయంలో బయటకు రాగా తన వాహనం కనిపించలేదు. చుట్టుపక్కల విచారించినా ఫలితం లేనందున మధురానగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బీసీలకు సాయాన్ని రూ. 10 లక్షలకు పెంచాలి



ఆందోళన చేస్తున్న రజక వృత్తిదారుల సంఘం నేతలు

వెంగళరావునగర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రూ. లక్ష ఆర్థిక సాయం బీసీ కులవృత్తిదారులను అవమానించడమేనని రజక వృత్తిదారుల సంఘం జూబ్లీహిల్స్ నాయకుడు ఆర్.అశోక్ అన్నారు. తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జూబ్లీహిల్స్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ... బీసీ కులవృత్తిదారులకు లక్ష రూపాయల ఆర్థిక సాయం చాలదని, తక్షణమే సాయాన్ని రూ. 10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ ఆర్థిక సాయం అర్హులైన ప్రతి బీసీ కుటుంబానికి అందేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. లక్ష రూపాయల ఆర్థిక సాయం ప్రకటించడం వల్ల గత కొన్ని రోజులుగా బీసీ కులవృత్తిదారులందరూ తమ పనులను మానుకుని మీ సేవ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. అయితే అక్కడ సర్వర్లు డౌన్‌గా ఉన్నాయని చెప్పడంతో బ్రోకర్లు బీసీల నుంచి అధిక డబ్బు గుంజుతూ ఆన్‌లైన్ చేస్తున్నారన్నారు. దరఖాస్తు గడువును ఈ నెల చివరి వరకు పొడిగించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టనున్నట్టు ఆయన హెచ్చరించారు. సంఘం నాయకులు మురళి, రవి, నాగరాజు, రాజశేఖర్, సంపత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ అభ్యున్నతి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం ఎర్రగడ్డలోని మెజెస్టిక్ గార్డెన్‌లో తెలంగాణా ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ ఫెడరేషన్ 10వ రాష్ట్ర స్థాయి వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రైవేట్ ఎలక్ట్రికల్స్ టెక్నీషియన్స్ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇలాంటి సభల ద్వారా మన హక్కులు, అవసరాలు, సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవచ్చని ఫెడరేషన్ అధ్యక్షుడు సామ కొండల్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో కేకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొత్త కృష్ణారెడ్డి, కనీస వేతనాల అమలు కమిటీ చైర్మన్ పి. నారాయణ, బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్, నవీన్, కార్పొరేటర్ సబియా గౌసుద్దీన్, లేబర్ ఆఫీసర్ ప్రమీల, విద్యుత్ అధికారి ఆంజనేయులు, ఫెడరేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, ట్రెజరర్ బాలస్వామి, హైదరాబాద్ అధ్యక్షుడు నరసింహారెడ్డి, విష్ణుచారి తదితరులు పాల్గొన్నారు.

### అర్హులకు ఇంటి పట్టాలివ్వాలని 22న ధర్నా



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

రహమత్‌నగర్: జీవో–58 కింద దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు అందజేయాలని డిమాండ్ చేస్తూ 22న ఖైరాతాబాద్ మండల కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని ప్రజా సంఘాల పోరాట వేదిక జూబ్లీహిల్స్ జోన్ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఎస్పీఆర్ హిల్స్ వినాయకనగర్ కమ్యూనిటీ హాల్ వద్ద ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు రాపర్తి అశోక్, స్వామి మాట్లాడుతూ... జీవో 58 ప్రకారం దరఖాస్తు చేసుకున్న అందరికీ పట్టాలు అందించి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. పట్టాలు అందించే వరకూ తమ పోరాటం ఆగదని ప్రకటించారు. నేతలు భాగ్యరాజ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### కేశవ్ మెమోరియల్‌లో ఘనంగా స్పోర్ట్స్-కల్చరల్ మీట్

హిమాయత్‌నగర్: కేశవ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కేశవ్ మెమోరియల్ మేనేజ్‌మెంట్ విభాగం ఆదివారం స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్ ఘనంగా నిర్వహించింది. ఇందులో 10 అనాథ ఆశ్రమాలకు చెందిన 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి హాజరయ్యారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.





పుస్తకాలను అందిస్తున్న విద్యావికాక్ సంస్థ ప్రతినిధులు

## విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

శ్రీనగర్‌కాలనీ: రాజీవ్‌నగర్‌కాలనీలో చదువుకుంటున్న వాచ్‌మెన్‌ల పిల్లలకు ఉచితంగా పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని విద్యావికాస్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాజీవ్‌నగర్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించి విద్యార్థులకు పుస్తకాలను అందించారు. పిల్లలకు ఉచితంగా ట్యూషన్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో డీటీ వెంకటేశ్వర్లు, విద్యావికాస్ సంస్థ అధ్యక్షులు కృష్ణశర్మ, కోశాధికారి మోహన్‌రావు, సంయుక్త కార్యదర్శి సత్యనారాయణ, విజయానంద్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తెస్తాం

అనిల్‌కుమార్‌యాదవ్

వెంగళరావునగర్: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తామని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ చేయి చేయి కలపాలని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. అనిల్‌కుమార్ డీసీసీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా ఆదివారం రాత్రి కాంగ్రెస్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకులు సిపిరి కిరణ్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ... గతంలో ఇక్కడ ఏం జరిగిందనేది అవసరం లేదని, ఇకపై ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ జెండా ఎత్తుకుని ముందుకు పోవాలని, ముఖ్యంగా యువత కాంగ్రెస్‌కు మరోసారి జీవం పోసి అధికారంలోకి తీసుకురావాలన్నారు. కాంగ్రెస్ వారిపై అక్రమ కేసులు బనాయిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనిల్ కుమార్ యాదవ్‌ను స్థానిక నేతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, సీనియర్ నాయకులు సత్యనారాయణ యాదవ్, అరవింద్ యాదవ్, మనోజ్ యాదవ్, ఎన్ఎస్‌యూఐ నగర ప్రధాన కార్యదర్శి కుందన్ యాదవ్, నిజాముద్దీన్, మోసిన్, దూడల రవిగౌడ్, కౌశిక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌యాదవ్

## ఇంకుడు గుంతలతో ఇంటికిందే జలసిరి



విశ్వేశ్వరయ్య భవన్‌లో ఇంకుడు గుంతను రీజనరేట్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దానం

వెంకటేశ్వరకాలనీ: వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పిలుపునిచ్చారు. ఆదివారం విశ్వేశ్వరయ్య భవన్‌లో ఆయన జలమండలి అధికారులతో కలిసి ఇంకుడు గుంతల రీజనరేట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వర్షం వచ్చిన ప్రతిసారి పెద్ద ఎత్తున వర్షం నీరు వృథాగా పోతున్నదని, ప్రతి నివాసి వారికి సమీపంలో ఇంకుడు గుంతలను తీసి వర్షం నీటిని ఒడిసి పట్టడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. తద్వారా ఎంతో మేలు జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. నూతనంగా ఇల్లు నిర్మించే అపార్ట్‌మెంట్లు, వ్యాపార సముదాయాల్లో కూడా ఇంకుడు గుంతలు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## బ్లాక్‌మెయిల్ చేస్తున్న నలుగురు విలేకరులపై కేసు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: నిర్మాణంలో ఉన్న భవనాల వద్దకు వెళ్లి యజమానులను బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్న నలుగురు విలేకరులపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాలివీ... శ్రీనగర్ కాలనీ ప్రధాన రహదారిలోని కమలాపురి కాలనీలో మనీష్ జైన్ అనే వ్యాపారి ప్లాట్ నెంబర్ 117లో ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఈ నెల 4వ తేదీన తాము విలేకరులమంటూ నలుగురు వ్యక్తులు అయనకు బెదిరింపు ఫోన్ కాల్స్ చేశారు. తాము లోకల్ మీడియా రిపోర్టర్లమని పేర్కొంటూ తీవ్రంగా వేధింపులకు గురి చేశారు. ఆకుల కిరణ్ గౌడ్, సోపాల శ్రీనివాస్, తడక విజయ్‌కుమార్, కుక్ల రవీందర్ తదితరులు రోజూ 20 నుంచి 30 సార్లు ఫోన్లు చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని వీరిపై బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న కేసులో చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను నిర్మిస్తున్న భవనంలోకి అక్రమంగా ప్రవేశిస్తూ తన ఇంటి ఫొటోలు తీస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని బిల్డింగ్ కూల్చివేయిస్తామని హెచ్చరిస్తున్నారని ఆరోపించారు. అయిదు సంవత్సరాల క్రితం కూడా ఈ నలుగురు విలేకరులు తమను డబ్బుల కోసం డిమాండ్ చేయడం జరిగిందని వీరి వేధింపులు భరించలేక ఆత్మహత్యాయత్నానికి కూడా పాల్పడ్డట్లు ఆరోపించారు. బిల్డింగ్ కూల్చివేయిస్తామని అప్పట్లోనే బెదిరించగా రూ. 12 లక్షలు ఇవ్వడం జరిగిందన్నారు. తాజాగా మళ్లీ తనను డబ్బుల కోసం బెదిరిస్తున్నాడని తనకు ఆత్మహత్య ఒక్కటే శరణ్యంగా మారిందని వీరి బారి నుంచి రక్షించాల్సిందిగా కోరారు. బంజారాహిల్స్ పోలీసులు కిరణ్‌గౌడ్, సోపాల శ్రీనివాస్, విజయ్‌కుమార్, కుక్ల రవీందర్‌లపై ఐపీసీ సెక్షన్ 447, 385, 386, 506 రెడ్‌విత్ 120(బి) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అమ్మ ఒడితో 100 శాతం సత్ఫలితాలు

## రాష్ట్రంలో వరుసగా నాలుగేళ్లుగా జీఈఆర్ పెరుగుదల

**ప్రాథమిక విద్యలో జాతీయ స్థాయిని మించి విద్యార్థుల చేరికలు**

**విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలే కారణం**

**టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిలైనా రెగ్యులర్‌గా చేరేందుకు అనుమతి**

**వారికి కూడా అమ్మ ఒడి, విద్యాకానుక, విద్యాదీవెన, వసతి దీవెన, గోరుముద్ద**

ప్రాథమిక విద్యలో జీఈఆర్ పెరుగుదల




సెకండరీ విద్యలో జీఈఆర్ పెరుగుదల




ఉన్నత విద్యలో జీఈఆర్ పెరుగుదల




**సాక్షి, అమరావతి:** విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న పథకాలతో ముఖ్యంగా జగనన్న అమ్మఒడి ద్వారా నూటికి నూరు శాతం సత్ఫలితాలు కనిపిస్తున్నాయి. అమ్మ ఒడి ద్వారా ప్రాథమిక విద్యలో జాతీయ స్థాయిని మించి చేరికలు నమోదైనట్లు వెల్లడైంది. గతేడాది ప్రాథమిక విద్యలో జాతీయ స్థాయిలో స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) 100.13 ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో 100.80కి చేరింది. అమ్మ ఒడి ద్వారా ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, సెకండరీ విద్యలో జీఈఆర్ పెరిగినట్లు ఇటీవల కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్‌రెడ్డి స్పష్టం చేశారు. మండల, జిల్లా స్థాయిల్లో నూరు శాతం జీఈఆర్ నమోదుకు కృషి చేయాలని సూచించారు.

రాష్ట్రంలో వరుసగా నాలుగేళ్లుగా ప్రాథమిక, సెకండరీ, ఉన్నత విద్యలో జీఈఆర్ పెరుగుతూ వస్తోంది. 2020 జనవరి 9వతేదీన జగనన్న అమ్మ ఒడి పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. అమ్మ ఒడి పథకం కింద ఇప్పటి వరకు 44,48,865 మంది తల్లుల ఖాతాల్లో రూ.19,674.34 కోట్లు జమ చేశారు. 2023–24కి సంబంధించి ఈ నెల 28న అమ్మ ఒడి నిధులను తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నారు.

- ప్రాథమిక విద్యలో 2018లో జాతీయ స్థాయిలో జీఈఆర్ 96.09 ఉండగా రాష్ట్రంలో 92.91 ఉంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత అమ్మ ఒడితో పాటు పలు పథకాలను అమలు చేయడంతో 2019–20 నుంచి వరుసగా ప్రాథమిక విద్యలో జీఈఆర్ పెరుగుతూ 2022–23 నాటికి జాతీయ స్థాయిని మించి 100.80కి చేరింది. సెకండరీ విద్యలో 2018–19లో జీఈఆర్ 79.69 ఉండగా 2022–23 నాటికి 89.63కి చేరింది. ఉన్నత విద్యలో రాష్ట్రంలో 2018–19లో జీఈఆర్ 46.88 ఉండగా 2022–23 నాటికి 69.87 శాతానికి జీఈఆర్ పెరగడానికి ప్రధాన కారణం జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన తదితరాలు కారణమని స్పష్టం అవుతోంది.
- టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు చదువు మానేస్తున్నారు. ఉన్నత విద్యలో జీఈఆర్‌ను మరింత పెంచడంపై దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం అలాంటి వారిని రెగ్యులర్ తరగతుల్లో అవే కోర్సుల్లో తిరిగి చేర్చుకునేందుకు అనుమతించింది. ఈమేరకు మిషన్, విజన్ పేరుతో ఈ ఏడాది ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను వలంటీర్ల ద్వారా అమలు చేస్తోంది. అంతేకాకుండా పదో తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిలై తిరిగి రెగ్యులర్ తరగతుల్లో చేరిన విద్యార్థులకు కూడా జగనన్న అమ్మ ఒడి, విద్యా కానుక, గోరుముద్ద, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను వర్తింప చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

# అదే డైలాగ్ వన్స్‌మోర్!

- ఎన్నికలప్పుడే ప్రాణహాని అంటున్న పవన్‌కల్యాణ్
- నన్ను చంపేస్తారేమో అంటూ సానుభూతి పొందే యత్నం
- గత అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది ముందు ఇవే మాటలు
- కాపుల ఓట్లు వైఎస్సార్‌సీపీకి పడకుండా చూసే వ్యూహం
- ఆ ఎన్నికల్లో ఏ మాత్రం పనిచేయని సానుభూతి డ్రామా
- అయినా మళ్లీ అవే మాటలతో తాజాగా బాబుకు లబ్ధి చేకూర్చే యత్నం
- పవన్ తీరుపై జన సైనికుల్లోనే ఆందోళన
- స్క్రిప్టు, మాటలు, చేతలకు పొంతన కుదరడం లేదని ఆవేదన

**సాక్షి, అమరావతి :** సరిగ్గా అసెంబ్లీ ఎన్నికలు జరిగే ఏడాది ముందు ప్రతిసారి సినీ నటుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ 'నాకు ప్రాణహాని ఉంది'అంటూ వ్యాఖ్యానించడం అలవాటుగా మారింది. తాజాగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జనసేన పార్టీ నాయకుల సమావేశంలోనూ అదే డైలాగ్ వల్లె వేశారు. 'నాకు ప్రాణహాని ఉంది. సుపారీ గ్యాంగులను ప్రత్యేకంగా దింపారనే సమాచారం ఉంది'అని ప్రకటించడం ద్వారా రాజకీయంగా లబ్ధి పొందాలన్న వ్యూహం దాగి ఉందని ఇట్టే తెలుస్తోంది. గత (2019) అసెంబ్లీ ఎన్నికలకు సరిగ్గా ఏడాది ముందు అచ్చం ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. 2018 జులై 7న విశాఖపట్నం జిల్లా పర్యటనలో 'నా కారు యాక్సిడెంట్ చేసి చంపేస్తామని, బాంబులు పెట్టి పేల్చేస్తామని బెదిరింపులకు దిగుతున్నారు'అంటూ వ్యాఖ్యానించారు. ఆ తర్వాత పలు చోట్ల ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ఇలానే మాట్లాడుతూ రాజకీయ ప్రచారం కొనసాగించారు.

**ఆ డైలాగ్ వర్కవుట్ కాకపోయినా...**

పవన్ కల్యాణ్ ఏం చేసినా... అది తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు రాజకీయ ప్రయోజనం చేకూర్చేందుకే అనే విషయం రాష్ట్రంలో జన సైనికులతో సహా అందరికీ తెలుసు. ప్రత్యేకించి ఒక సామాజికవర్గం నుంచి మరింత సానుభూతి పొందడం ద్వారా వీలైనంత మేర ఆ సామాజిక వర్గం ఓట్లను అధికార వైఎస్సార్‌సీపీకి దూరం చేయాలన్న ఎత్తుగడతోనే గతంతో వర్క్ అవుట్ కాని డైలాగ్‌ను పవన్ మళ్లీ వల్లె వేశారు. 2019 ఎన్నికల సమయంలో కాపు రిజర్వేషన్ల ఉద్యమకారుడు ముద్రగడ పద్మనాభం పట్ల అప్పటి చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై ఆ సామాజికవర్గం తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా ఉండింది. ఆ కారణంగా ఆ వర్గం ఓట్లన్నీ గంపగుత్తగా అప్పటి ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీకి పడకుండా ఉండేందుకు పవన్‌కల్యాణ్ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. 2014 ఎన్నికల ముందే జనసేన పార్టీని స్థాపించినప్పటికీ.. ఆ ఎన్నికల్లో ఒక్క సీటులో కూడా పోటీ చేయకుండా టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి కావడానికి పవన్ సహకరించిన విషయం బహిరంగ రహస్యం.

**తప్పులో కాలేయడమే!**

ఆ తర్వాత నాలుగేళ్లపాటు ప్రతి అంశంలో చంద్రబాబు ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు. తీరా ఎన్నికలకు ఏడాది ముందు.. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చడం ద్వారా చంద్రబాబుపై కోపంగా ఉన్న వారి ఓట్లు అప్పటి ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీకి పడకుండా చూసేందుకు విఫలయత్నం చేశారు. ఆ సమయంలో 'నాకు ప్రాణహాని ఉంది'అనే డైలాగ్ పుట్టుకొచ్చింది. 'టీడీపీ ప్రభుత్వ దోపిడీని బయట పెడుతున్నానని నా కారుకు యాక్సిడెంట్ చేసి చంపేస్తామని, బాంబులు పెట్టి పేల్చేస్తామని బెదిరింపులకు దిగుతున్నారు'అంటూ చిలక పలుకులు పలికారు. ఆ సానుభూతి డ్రామా ఆ ఎన్నికల్లో ఏ మాత్రం పనిచేయలేదు. అయినప్పటికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లక్ష్యంగా మళ్లీ అదే డైలాగ్‌ను వదలడం పట్ల జన సైనికులే పెదవి విరుస్తున్నారు. తమ అధినేత స్క్రిప్టు, మాటలు, చేతలకు ఏమాత్రం పొంతన కుదరడం లేదని వాపోతున్నారు. 'అయినా పవన్ కల్యాణ్‌కు ఏదైనా జరిగితే ఎవరికి ఉపయోగం? చంద్రబాబుకే కదా.. ఆ విషయాన్ని పదే పదే ఎల్లో మీడియాలో చూపించి లబ్ధి పొందడంలో చంద్రబాబును మించిన వారెవరూ ఉండరు కదా.. ఈ మాత్రం రాజకీయం అర్థం కాని వారెవరు? మా అధినేత మళ్లీ తప్పులో కాలేస్తున్నారు'అని జనసేన అభిమాని ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు.



# గెలుస్తాననే నమ్మకం నాకు లేదు

**నన్ను చంపేస్తామని బెదిరింపులు వస్తున్నాయి**

**నోటా ఓట్లు జనసేనకు వేయండి**

**కాకినాడ సభలో పవన్‌కల్యాణ్**

**సాక్షి ప్రతినిధి, కాకినాడ:** 'నేను గెలుస్తాననే నమ్మకం నాకు లేదు. కానీ, పోరాటం మాత్రం ఆపేది లేదు'.. అని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ అన్నారు. 'కీడెంచి మేలెంచాలనే ఈ విషయం మీకు చెబుతున్నాను. నన్ను చంపేస్తామని బెదిరింపులు వస్తున్నాయి. అయినా భయపడేదిలేదు. కులాన్ని చూడకండి. తెలంగాణ ప్రజల మాదిరిగా కులం కంటే నా ఆంధ్రా అనే భావన అందరిలోనూ రావాలి'.. అని ఆయనన్నారు. వారాహి యాత్రలో భాగంగా ఆదివారం రాత్రి జిల్లా కేంద్రమైన కాకినాడలోని సర్పవరం జంక్షన్‌లో జరిగిన బహిరంగ సభలో పవన్ మాట్లాడారు. 'మీరు అండగా నిలబడితే నేను, జనసేన ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్తాం. నాకు ఫలానా కులం ఎక్కువ, మరో కులం తక్కువ అనేది లేదు. అధికారం లేకున్నా 2008 నుంచి మీకోసం పోరాడుతూనే ఉన్నాను'.. అని చెప్పారు. రాజకీయం వేరు, సినిమాలు వేరని అన్నారు. సభలకు రావడం కాదు.. ఎన్నికల్లో ఓటేసి సత్తా చాటాలని, గత ఎన్నికల్లో పార్టీలపై కోపంతో నోటాకు వేసిన 3–4 శాతం ఓట్లను ఈసారి జనసేనకు వేయాలని పవన్ వేడుకున్నారు. మధ్యతరగతి మేధావులు మౌనంగా ఉండటమే ప్రశాంత ఆంధ్రప్రదేశ్ క్రిమినల్ అడ్డాగా మారడానికి కారణమని ఆయన ఆరోపించారు. అన్యాయం జరుగుతున్నప్పుడు యువత మేలుకోకపోతే అరాచకాలు పెరిగిపోతాయన్నారు.

**దళితులకు సీఎం అన్యాయం చేశారు**

దళిత యువతకు సంబంధించిన 18 పథకాలు రద్దు చేసిన ఈ ముఖ్యమంత్రిని ఏమనాలని పవన్ ప్రశ్నించారు. అంబేడ్కర్ విదేశీ విద్యను జగనన్న విదేశీ విద్యగా మార్చుకుని దళితులకు అన్యాయం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగున్నాయని డీజీపీ చెబుతున్న దానికి, వాస్తవ పరిస్థితికి అసలు పోలికేలేదన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని డీజీపీ చెబుతున్న తీరు సరికాదన్నారు. రాష్ట్రంలో క్రిమినల్ ఎంపైర్‌ను నేలమట్టం చేసి, సీఎంను రోడ్డు మీదకు తీసుకువస్తానన్నారు.

**నన్ను ఓడించడానికి రూ.200 కోట్లు ఖర్చు..**

ఇక భీమవరంలో ఉన్న ఓటింగ్ కంటే అధికంగా ఓటింగ్ జరిగిందని.. తనను ఓడించేందుకు రూ.200 కోట్లు ఖర్చుచేయాలనుకుంటున్నారని పవన్‌కల్యాణ్ చెప్పారు. రాష్ట్రంలో రోడ్ల దుస్థితిపై గతంలో జనసైనికులు ఫొటోలు తీసి దేశం దృష్టికి తీసుకువెళ్లినట్లుగానే హ్యాష్‌ట్యాగ్ ద్వారా ఇక్కడ జరుగుతున్న అవినీతి, దోపిడీపై ఫొటోలు తీసి కేంద్ర హోంశాఖ, రాష్ట్ర డీజీపీ, జనసేన కార్యాలయాలకు ట్యాగ్ చేయాలని పవన్ తన ప్రసంగంలో పిలుపునిచ్చారు.

# బాబు నుంచే పవన్‌కు ముప్పు!

- ఓ కన్నేసి ఉంచు తమ్ముడూ!
- ఏపీ డిప్యూటీ సీఎం సత్యనారాయణ

**తాడేపల్లిగూడెం అర్బన్:** జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తనకు ప్రాణహాని ఉందని ఎందుకన్నారో తెలియదుగానీ అయితే అది చంద్రబాబు నుంచే ఉందని గ్రహించాలని ఏపీ ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సూచించారు. 'తమ్ముడూ పవన్.. చంద్రబాబుపై ఓ కన్నేసి ఉంచు! ఆయన్ను ఓ కంట కనిపెడుతూ జాగ్రత్తగా ఉండాలి'అని హెచ్చరించారు. ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. టీడీపీ అధికారంలో ఉండగా పేదల నాయకుడు వంగవీటి మోహనరంగా హత్యకు పన్నాగం పన్నిన వారిలో చంద్రబాబు హస్తం ఉందని చెప్పారు. పవన్ కల్యాణ్‌కు ఏదైనా జరిగితే ఆ నెపాన్ని వైఎస్సార్‌సీపీ పైకి నెట్టి రాజకీయంగా లబ్ధి పొందేందుకు చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. పవన్ కల్యాణ్ పాలిచ్చే ఆవును వదిలేసి తన్నే దున్నపోతు లాంటి చంద్రబాబును విశ్వసిస్తున్నారని వ్యాఖ్యానించారు. పవన్ వెనుక తిరుగుతున్న వారంతా తమ పరిస్థితి కుక్కతోక పట్టుకొని గోదారి ఈదినట్లు అవుతుందని భయపడుతున్నట్లు చెప్పారు. స్థిరత్వం లేని మాటలతో ప్రజల్లో చులకన కావద్దని పవన్‌కు మంత్రి సత్యనారాయణ హితవు పలికారు. గతంలో తనకు ముఖ్యమంత్రి అయ్యే సీన్ లేదన్న పవన్ ఇప్పుడు అందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో పవన్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించగలరా? అని చంద్రబాబుకు సవాల్ విసిరారు.

**నగర వార్తలు**

## అంతర్జాతీయ సదస్సులో హెచ్‌సీయూ విద్యార్థి



**రాయదుర్గం:** అంతర్జాతీయ సదస్సులో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి పాల్గొన్నాడు. హెచ్‌సీయూలోని అప్లైడ్ లింగ్విస్టిక్స్ విభాగంలోని పరిశోధక విద్యార్థి వేణు రాధనోళ్ళ స్పెయిన్ దేశంలో 32వ యూరోపియన్ సిస్టమిక్ ఫంక్షనల్ లింగ్విస్టిక్స్ అనే అంశంపై జూన్15–17వ తేదీ వరకు జరిగిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్నాడు. విగో విశ్వవిద్యాలయంలోని ఎల్‌విటీసీ పరిశోధన బృందం నిర్వహించిన ఈ సదస్సులో ఆయన పాల్గొన్న ఆయన 'అప్లయింగ్ హాలిడేస్ సిస్టమిక్ ఫంక్షనల్ లింగ్విస్టిక్ టూ ది ట్రాన్స్‌లేషన్ ఆఫ్ వైకోమ్ ముహమ్మద్ బషీర్' అనే అంశంపై పత్ర సమర్పణ చేశారు.

## ముగిసిన ఐస్ క్రీం టేస్టింగ్ చాలెంజ్



బహుమతులను అందజేస్తున్న సోమా భరత్‌కుమార్, రాజగోపాల్ తదితరులు

**మాదాపూర్:** ది గ్రేట్ ఇండియన్ ఐస్‌క్రీం టేస్టింగ్ చాలెంజ్ అట్టహాసంగా ముగిసింది. మాదాపూర్‌లోని ఆదివారం మైదాన్ ఎక్స్‌పో సెంటర్‌లో నిర్వహించారు. కళ్లకు గంతలు కట్టుకుని వివిధ రకాల ఐస్‌క్రీం ఫ్లేవర్‌లను తిని వాటి పేర్లు చెప్పాలి. విజయ తెలంగాణ, హైబిజ్ టీవీ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో 1000 మందికి పైగా ఐస్‌క్రీం రుచులను ఆస్వాదించారు.

20కి పైగా ఐస్‌క్రీ స్టాల్స్, 20 ఫుడ్‌కోర్ట్స్ సందర్శకులకు అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయాడైరీ తెలంగాణ చైర్మన్ సోమా భరత్‌కుమార్, హైబిజ్‌టీవీ ఎండి రాజగోపాల్‌లు విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వివిధ ఐస్‌క్రీం కంపెనీల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# మంచుగడ్డపై మనోహర నృత్యం

**80 కిలోల మంచుగడ్డపై 8 నిమిషాలు నాట్యం చేసిన కళాకారిణి**



**నాంపల్లి:** ఎనభై కేజీల మంచుగడ్డపై అష్టలక్ష్మిని కీర్తిస్తూ ఎనిమిది శ్లోకాలతో, ఎనిమిది హారతులతో, ఎనిమిది ప్రాపర్టీలను వాడుతూ ఎనిమిది నిమిషాల పాటు కొంపల్లికి చెందిన నృత్యకారిణి బొమ్మకంటి సౌమ్య ప్రదర్శించిన శాస్త్రీయ కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. సౌమ్య ప్రదర్శించిన నృత్యాన్ని మెచ్చుకుని వరల్డ్ రికార్డు సంస్థలు ఎనిమిది ప్రపంచ రికార్డులను ప్రకటించాయి. ఆదివారం రాత్రి పబ్లిక్‌గార్డెన్స్‌లోని నందమూరి తారక రామారావు కళా మందిరంలో స్పందన నృత్యకేళి, స్పందన చారిటబుల్ ట్రస్ట్ సంస్థల సంయుక్త నిర్వహణలో ఈ నృత్య ప్రదర్శన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి సతీసమేతంగా హాజరయ్యారు. భారత్ వరల్డ్ రికార్డ్స్ అధ్యక్షులు లయన్ కె.వి. రమణారావు ఈ నృత్యానికి 8 ప్రపంచ రికార్డుల్లో నమోదైనట్లుగా ధృవీకరించిన పత్రాలను అందజేశారు. నాట్య గురువు డాక్టర్ నామని రవికుమార్, ప్రపంచ రికార్డుల సమన్వయకర్తలు, శారద సంజు, వాల్మీకి, కుద్రదీపికల సమక్షంలో ఎనిమిది ప్రపంచ రికార్డుల నమోదు ధృవపత్రాలను అందజేసి సత్కరించారు.

# విద్యారంగ సమస్యలపై ఐక్యపోరాటాలు




సమావేశంలో ప్రసంగిస్తున్న ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి

**సాక్షి,సిటీబ్యూరో :** విద్యారంగ సమస్యలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కోశాధికారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం దోమలగూడలోని సంఘం కార్యాలయంలో జరిగిన హైదరాబాద్ జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ప్రసంగించారు. విద్యారంగం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బదిలీలు పదోన్నతులు చేపట్టడం లేదని, పాఠశాలల్లో ఉన్న ఖాళీ పోస్టులు భర్తీ చేయడం లేదని, మూడు డీఏలుడి ఏ లు ప్రకటించాల్సి ఉన్న ఆలస్యం చేస్తోందన్నారు. ఐక్య పోరాటాలతోనే పెండింగ్ సమస్యల పరిష్కారమన్నారు. రాష్ట్ర అకడమిక్ కమిటీ కన్వీనర్ శారద మాట్లాడుతూ మహిళా ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు రాజారావు అధ్యక్షత జరిగినసమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్ గత మూడు నెలలుగా జరిగిన కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టగా వివిధ మండలాల నుంచి హాజరైన కార్యకర్తలు నివేదికపై చర్చించి ఆమోదించారు. అనంతరం ఎఫ్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కన్వీనర్‌గా వినయ్ కుమార్, ఎయిడెడ్ పాఠశాలల కన్వీనర్ గా నరసింహారెడ్డి, కో కన్వీనర్లుగా రేణు,భాష నియమితులయ్యారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి సింహాచలం, జిల్లా కార్యదర్శులు విద్య, విశాలి, ఉదయ్ కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజులు చెల్లించాలి

**బీసీ విద్యార్థి సంఘం సత్యాగ్రహ దీక్షలో ఎంపీ ఆర్.కృష్ణయ్య**

**ముషీరాబాద్:** రాష్ట్రంలో ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ, డిగ్రీ, ఇంటర్ తదితర కాలేజీ కోర్సులు చదివే బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజులు స్కీమ్‌ను ఈ విద్యా సంవత్సరం పునరుద్ధరించాలని, లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో తెలంగాణ ప్రభుత్వాన్ని గద్దె దించేంత వరకు విద్యార్థులతో పోరాటం చేస్తామని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థుల సత్యాగ్రహ దీక్ష జరిగింది.ఈ దీక్షకు ముఖ్య అతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ పూర్తి ఫీజుల చెల్లింపు స్కీమ్‌ను ప్రభుత్వం రద్దు చేయడం వల్ల బీసీలు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని వాపోయారు. ధనిక రాష్ట్రంలో విద్యార్థుల పూర్తి ఫీజులు చెల్లించక పోవడం వెనుక బీసీలను విద్యకు దూరం చేయాలనే కుట్ర దాగి ఉందని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజుల బకాయి 5 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్పొరేట్ కాలేజీలను నిషేధించాలని, ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలేజీ హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని, బీసీ కాలేజీ హాస్టల్స్‌కు సొంత భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య.

## పీఆర్సీ కమిటీని నియమించాలి

**సాక్షి, సిటీబ్యూరో:** పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు నూకలపాటి రమణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రాష్ట్ర శాఖ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. టీచర్ల పెండింగ్ బిల్లుల చెల్లింపుపై నిర్లక్ష్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత రెండవ పీఆర్‌సీ వచ్చేనెలతో పూర్తి కావస్తుందని, వెంటనే పీఆర్సీ కమిటీని 20 శాతం ఐఆర్‌తో నియమించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయల ప్రమోషన్లకు బదిలీల అంశాలను త్వరగా పరిష్కరించి ప్రమోషన్లు బదిలీలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వడ్డేమాన్ బాల పీర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడి గంగరాజు పాల్గొన్నారు.

# అణగారిన ప్రజల పక్షాన నిలిచిన కుసుమ ధర్మన్న



కార్యక్రమంలోపాల్గొన్న ఇనాక్, రాధ కుసుమ

**చిక్కడపల్లి:** వివక్ష, దురాచారాలకు వ్యతిరేకంగా సాహిత్యం, కార్యాచరణతో ఉద్యమించిన కుసుమ ధర్మన్నను దళిత పదానికి పరిమితం చేయవద్దని శ్రీ వేంకరటేశ్వర యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో ఆదివారం కుసుమ ధర్మన్న కళాపీఠం ఆవిర్భావ సభ, కవిసమ్మేళనం జరిగింది. ఇనాక్ కళాపీఠం ప్రారంభించి మాట్లాడుతూ సమాజంలో సమాన హక్కుల కోసం కార్యకర్తగా, సాహితీవేత్తగా అణగారిన ప్రజల పక్షాన నిలిచిన ధర్మన్న తొలుత గాంధీజీని అనుసరించినా తదుపరి కాలంలో అసమ్మతి తెలిపారన్నారు. బలహీనవర్గాల కోసమే జయభేరి పత్రికను నడిపిన ధర్మన్న దళిత హరిజన పదాలకు వ్యతిరేకి అని అది హిందూ సరైన పదమని ప్రచారం చేశారన్నారు. స్వమతంలోనే ఉండి వివక్షతకు వ్యతిరేకంగా పోరాటం చేస్తానని నైజాం నవాబుకు ధర్మన్న తెలిపారన్నారు. నారాయణ స్వామి అధ్యక్షత వహించిన సభలో సంస్థ స్థాపకులు డాక్టర్.రాధ కుసుమ సంస్థ లక్ష్యాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ రచయితలు నాళేశ్వరం శంకరం, సరోజినిదేవి, అంజనికుమారి, బడేసాబ్, రామకృష్ణ, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న హజ్ యాత్ర

**నగరం నుంచి బయలుదేరిన 5 వేల మంది యాత్రికులు**



**సాక్షి, సిటీబ్యూరో:** ఈ ఏడాది హజ్ యాత్ర కొనసాగుతోంది. ఇప్పటి వరకు 35 విమానాల్లో దాదాపు 5 వేల మంది సౌదీ అరేబియాలోని జిద్దా నగరానికి చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. ఆదివారం సాయంత్రం రెండు విమానాల్లో దాదాపు 300 మంది వెళ్లినట్లు రాష్ట్ర హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి బి.షఫీవుల్లా చెప్పారు. రెండు విమానాల ప్రయాణికుల బస్సులను రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ మసీవుల్లా జెండా ఊపి వీడ్కోలు పలికారు. కాగా ఇప్పటికే సౌదీ అరేబియాలోని మక్కా నగరానికి చేరుకున్న యాత్రికులు అక్కడ వసతులు, సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు కుటుంబ సభ్యులు 'సాక్షి'కి తెలిపారు. అదేవిధంగా యాత్రికులతో సేవకులుగా వెళ్లిన ప్రభుత్వ ఉద్యోగులు పత్తా లేకుండా పోయారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర, కేంద్ర హజ్ కమిటీ సమన్వయం లోపం కారణంగా మక్కాలోని విదేశీ వ్యవహారాల అధికారులకు యాత్రికుల సమాచారం సకాలంలో చేరవేయకపోవడంతోనే యాత్రికులకు సౌకర్యాలు లేకుండా పోయాయని పలువురు చెబుతున్నారు. యాత్రకు సంబంధించిన ఖర్చులు మాత్రం కేంద్ర హజ్ కమిటీ రూ.లక్షల్లో వసూలు చేసింది..కానీ సౌకర్యాలు, ఏర్పాట్లు చేయడంలో విఫలమైందని యాత్రికులు ఆరోపిస్తున్నారు.

## క్లుప్తంగా...

### ఢిల్లీలో నేటి నుంచి లాల్ దర్వాజా బోనాలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశరాజధానిలోని తెలంగాణ భవన్ సింహవాహిని శ్రీ మహంకాళి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లాల్ దర్వాజా బోనాలు నిర్వహించనున్నట్లు చైర్మన్ సి.రాజేందర్ యాదవ్ తెలిపారు. సోమ, మంగళ, బుధవారాల్లో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో తెలంగాణ సంస్కృతి చాటిచెప్పేలా బోనాలు నిర్వహించనున్నట్లు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 19న ఫొటో ప్రదర్శన, 20న ఇండియా గేట్ వద్ద ఘటస్థాపన, 21న బంగారు బోనం, పట్టు వస్త్రాల సమర్పణతో పాటు బుధవారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.

### పదేళ్లకు చేరుకున్న హరిత ప్రగతి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తొలినాళ్లలో కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన అత్యంత ప్రాధాన్యతా పథకాల్లో 'తెలంగాణకు హరితహారం' ఒకటి. భావి తరాలకు స్వచ్ఛమైన గాలిని, నివాస యోగ్యమైన ప్రకృతి పరిసరాలను అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. 2015 నుంచి ఇప్పటివరకు 273.33 కోట్ల మొక్కలు నాటింది. రాష్ట్రవ్యాప్తంగా 1,00,691 కి.మీ. మేర రహదారి వనాలు ఏర్పాటు చేసింది. ఈ పథకానికి ఏకంగా రూ. 10,822 కోట్లు ఖర్చు చేసింది.

**తొమ్మిదేళ్లలో అడవుల పునరుద్ధరణ...**

గత తొమ్మిదేళ్లలో సుమారు 13.44 లక్షల ఎకరాల్లో అడవుల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యల ఫలితంగా 53.84 కోట్ల మేర మొక్కలు పెరిగాయి. అడవుల్లో కార్చిచ్చుల నివారణకు 21,452 కి.మీ. మేర ఫైర్‌లైన్లు ఏర్పాటు పూర్తయింది. నేల, తేమ పరిరక్షణకు అడవుల్లో పెద్ద ఎత్తున చెక్ డ్యాములు, ఇంకుడు చెరువులు/కుంటల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. నగరాలకు సమీపంలో 75,740 ఎకరాల్లో 109 అర్బన్ ఫారెస్ట్ పార్కులను అభివృద్ధి చేసింది. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం హరితహారం వల్ల గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గత పదేళ్లలో గ్రీన్ కవర్ 147 శాతం పెరిగింది. అలాగే హెచ్‌ఎండీఏ పరిధిలో ప్రభుత్వం సుమారు 12 కోట్ల మొక్కలు నాటింది.

### ఎన్ఐఏ అదుపులో మాజీ మహిళా మావోయిస్ట్!

గుంటూరు రూరల్: నేషనల్ ఇన్వెస్టిగేషన్ అథారిటీ (ఎన్ఐఏ) అధికారులు ఆదివారం గుంటూరు మండలం వెంగళాయపాలెంలో ఓ మహిళను అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఆంధ్రజ్యోతి దిన పత్రికలో సబ్ఎడిటర్‌గా పనిచేసే జ్యోతి అనే మహిళ వెంగళాయపాలెంలో సుమారు ఐదేళ్లుగా ఓ ఇంటిని అద్దెకు తీసుకుని తల్లితో పాటు నివాసం ఉంటోంది. ఆమె ఇంటికి వారం రోజులుగా ఒక మహిళ వచ్చి వారితోపాటు ఉంటోంది. ఆమె జ్యోతికి స్నేహితురాలని, ఆమె పేరు బల్లల పద్మ అని తెలిసింది. కాగా, ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా సుమారు 20 మంది పోలీసులు, మహిళా పోలీసులు జ్యోతి ఇంటికి వచ్చి.. ఇంట్లో ఉన్న పద్మను పోలీస్ జీప్‌లో ఎక్కించుకుని విజయవాడ వైపు వెళ్లారు. ఆ సమయంలో జ్యోతి ఇంట్లో లేదని సమాచారం. సాయంత్రం జ్యోతి ఇంటికి వచ్చాక స్థానికులు ఈ విషయం ఆమెకు తెలిపారు. పద్మ మాజీ మావోయిస్ట్ అని జ్యోతి స్థానికులకు తెలిపినట్టు సమాచారం. దీంతో వెంగళాయపాలెం ఉలిక్కిపడింది. పద్మ గతంలో జైలులో ఉండి అన్ని కేసులు కొట్టివేసిన తరువాత డిగ్రీ పూర్తి చేసిందని సమాచారం. అనంతరం లా చదివిందని, ఇప్పుడు న్యాయశాస్త్రంలో పీజీ చేస్తోందని పౌర హక్కుల సంఘం కార్యదర్శి చిలకా చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. సమాచారం లేకుండా పద్మను అదుపులోకి తీసుకోవటం ఏమిటని, అనుమానం ఉంటే విచారించి ఆమెను వెంటనే విడుదల చేయాలని కోరారు.

## నేటి భవితలో..

- పదితోనే..ఇంటిగ్రేటెడ్ బీటెక్: పదోతరగతి తర్వాత అత్యున్నత ప్రమాణాలతో కూడిన ఉన్నత విద్యకు మార్గం.. రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్‌జీయూకేటీ). పల్లె ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థులు సైతం నాణ్యమైన చదువులు చదవాలనే సమున్నత ఆశయంతో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత వై.ఎస్.రాజశేఖరరెడ్డి 2008లో ఈ ట్రిపుల్‌ఐటీలకు అంకురార్పణ చేశారు. అలా ప్రారంభమైన ఈ విద్యాసంస్థలు.. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలోని బాసర, ఆంధ్రప్రదేశ్‌లోని ఆర్కే వ్యాలీ, నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలుల్లోని క్యాంపస్‌ల్లో వేల మంది విద్యార్థులకు సాంకేతిక విద్యను అందిస్తున్నాయి. రెండు రాష్ట్రాల్లోనూ 2023–24 విద్యాసంవత్సరానికి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. ఆయా క్యాంపస్‌ల్లో సీట్లు, దరఖాస్తుకు అర్హతలు, ప్రవేశ ప్రక్రియ, విద్యావిధానం వివరాలు...
- గ్రూప్స్ ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్: సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడేలా.. అంతర్జాతీయం, జాతీయం, రాష్ట్రీయం, వార్తల్లో వ్యక్తులు, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, అవార్డులు, నివేదికలు, క్రీడలు తదితర ముఖ్యాంశాలతో వీక్లీ కరెంట్ అఫైర్స్ రౌండప్..
- విద్య, ఉద్యోగ సమాచారం

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి



రైతులు మార్కెట్ యార్డుకు పంటను తీసుకెళ్తే.. అక్కడి వ్యాపారులు, నిపుణులు ఆ పంటను పరిశీలించి, వాసన చూసి, తేమ ఎంత ఉంటుందో అంచనా వేసి ధర కడతారు. అలా కాకుండా కృత్రిమ మేధ (ఏఐ)తో పనిచేసే యంత్రాలే.. కాస్త శాంపిల్ చూసి పంట నాణ్యత, తేమశాతం కచ్చితంగా చెప్పేస్తే రైతులకు ఎంతో ఊరట. పని త్వరగా పూర్తవుతుంది, మోసాలకు తావుండదు. వ్యాపారులు కొర్రీపెట్టి ధర తగ్గించేసే అవకాశం ఉండదు. ప్రపంచ ఆర్థిక సంస్థ (డబ్ల్యూఈఎఫ్), ఏజీనెక్స్ట్ స్టార్టప్ సంస్థల సహకారంతో ఇలా ఏఐతో పనిచేసే మెషీన్లతో మిర్చి పంట విక్రయాలు కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని 'ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ అగ్రికల్చర్ ఇన్నోవేషన్ (ఏఐ4ఏఐ)'కార్యక్రమంలో భాగంగా.. 'సాగు-బాగు'పేరిట ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాల్లో చేపట్టిన ఈ పైలట్ ప్రాజెక్టు విజయవంతమైంది. దీనితో మొత్తం ఖమ్మం జిల్లాతోపాటు మహబూబాబాద్, వరంగల్ జిల్లాలకు విస్తరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. - ఖమ్మం వ్యవసాయం



ప్రత్యేక యంత్రాల్లో మిర్చి నాణ్యతను పరీక్షిస్తున్న సిబ్బంది

# మిర్చి ఘాటు.. ఏఐ చెబుతుంది!

**పొలం వద్దే కేవలం 25 నిమిషాల్లోనే తేమ, రసాయనాల శాతం నిర్ధారణ**

**కాయ పొడవు, నాణ్యతనూ తేల్చే కృత్రిమ మేధ**

**గ్రామాల్లో, పొలాల వద్దే మిర్చి కొనుగోళ్లు.. మంచి ధర**

**ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాల్లో 'సాగు-బాగు' ప్రయోగం సక్సెస్**

**మొత్తం ఖమ్మంతోపాటు మహబూబాబాద్, వరంగల్ జిల్లాలకు విస్తరించేందుకు కసరత్తు**



మిర్చి నాణ్యతను పరీక్షిస్తున్న సిబ్బంది

### మూడు యంత్రాలతో.. మూడు ప్రమాణాల గుర్తింపు

మిర్చి పంట నాణ్యతను తేల్చేందుకు ఏఐ ఆధారిత 'విజియో బాక్స్, 7స్పెక్ఎక్స్ ప్రో, 7స్పెక్ఎక్స్ కనెక్ట్'గా పిలిచే మూడు యంత్రాలను వినియోగిస్తున్నారు. దీనిలో విజియో బాక్స్‌లో మిర్చిని పెడితే.. అది కాయ పరిమాణం, రంగు, మచ్చలు ఇతర అంశాలను పరిశీలించి నాణ్యతను నిర్ధారిస్తుంది.

- 100 గ్రాముల మిర్చిని పరిశీలించి నాణ్యత, రసాయనాల శాతం, తేమశాతాన్ని పరిశీలించడం కేవలం 20–25 నిమిషాల్లో పూర్తవుతుంది. అదే ప్రస్తుత సాధారణ పద్ధతిలో ఒక రోజు వరకు పడుతుంది.
- ఏఐ పరికరాల్లో పరిశీలన పూర్తయిన వెంటనే.. మిర్చికి ఏ, బీ, సీ, డీ అంటూ గ్రేడింగ్ ఇస్తుంది. ఈ వివరాలతో ఆటోమేటిగ్గా రైతుల ఫోన్ నంబర్లకు సంబంధిత ఎస్సెమ్మెస్ కూడా వస్తుంది.
- నిపుణులు, రైతుల సహకారంతో మిర్చికి సంబంధించిన వేలాది ఫొటోలను అప్‌లోడ్ చేసి ఏఐ ప్రోగ్రామ్‌ను రూపొందించామని.. దీనితో మంచి నిపుణులతో పోల్చితే 98శాతం కచ్చితత్వంతో ఏఐ యంత్రాలు పనిచేస్తున్నాయని ఏజీ నెక్స్ట్ స్టార్టప్ సంస్థ ప్రతినిధులు చెప్తున్నారు.

### పొలాల వద్దే మిర్చి కొనుగోళ్లు కూడా..

రాష్ట్ర ప్రభుత్వం 'సాగు- బాగు'కార్యక్రమాన్ని మిర్చి సాగు మొదలు పంట అమ్మకం వరకు తగిన సాయం అందేలా రూపొందించింది. ఈ పైలట్ ప్రాజెక్టు కోసం.. ఎగుమతులకు పేరున్న 'తేజ'రకం మిర్చిని సాగుచేసే ఖమ్మం జిల్లా కూసుమంచి వ్యవసాయ డివిజన్‌లోని ఏడు వేల మంది రైతులను ఎంపిక చేశారు. వారికి కొత్త విధానంపై అవగాహన కల్పించేందుకు 25 మంది సీఆర్పీలను నియమించారు. రైతుల భూముల్లో భూసార పరీక్షలు నిర్వహించి.. ఎరువులు, పురుగు మందుల వాడకం తదితర అంశాలపై తగిన సూచనలు అందించారు. రైతులు మిర్చి పంటను పొలాల వద్దే విక్రయించుకునేలా మార్కెటింగ్ సౌకర్యం కల్పించారు. ఇందుకోసం రైతువేదికల్లో పంట నాణ్యత పరిశీలన కోసం ఏఐ మెషీన్లను ఏర్పాటు చేశారు. గత ఏడాది ప్రాజెక్టు అమలు చేసిన మూడు మండలాల్లో 150 టన్నుల మిర్చిని విక్రయించగా.. క్వింటాల్‌కు రూ.19,500 నుంచి రూ.22వేల వరకు ధర దక్కడం గమనార్హం.

### పొలం వద్దే పంట విక్రయించా..



మిర్చి తోటలోనే పంటను విక్రయించా. సాగు–బాగు ప్రాజెక్టు ప్రయోజనకరంగా ఉంది. నేరుగా శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు ఇచ్చారు. పంట నాణ్యతను రైతువేదిక వద్దే పరీక్షించి, తోటలోనే విక్రయించాను. మార్కెట్‌లో కంటే మెరుగ్గా క్వింటాల్‌కు రూ.22 వేల ధర లభించింది. కమీషన్, రవాణా చార్జీలు కూడా మిగిలాయి. వెంటనే సొమ్ము చెల్లించారు.

– వి.రమేశ్, లింగారం తండా, కూసుమంచి మండలం

# ఆ దేవుళ్లు చేసిన పాపమేంటి?

**753 ఆలయాలను విస్మరించిన దేవాదాయశాఖ**

- స్వయంగా సీఎం ప్రకటనకు భిన్నంగా ఆ శాఖ తీరు
- కొత్తగా 2,796 దేవాలయాలకు ధూపదీప నైవేద్య పథకాన్ని విస్తరిస్తామంటూ ఇటీవల కేసీఆర్ ప్రకటన
- కేవలం 2,043 దేవాలయాలకే వర్తింపు జేస్తూ ఉత్తర్వు జారీ

సాక్షి, హైదరాబాద్: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదు.. ఇప్పుడు దీన్ని "సీఎం వరమిచ్చినా దేవాదాయశాఖ కరుణించడం లేదు"అని మార్చి చదువుకోవాలి. ధూపదీప నైవేద్యాలకు స్వయంగా సీఎం ముందుకొచ్చినా.. దేవాదాయ శాఖే దాన్ని అడ్డుకుంది.

గోపన్‌పల్లిలో నిర్మించిన బ్రాహ్మణ సదనాన్ని ప్రారంభించిన రోజు ముఖ్యమంత్రి తన ప్రసంగంలో ధూపదీప నైవేద్య పథకాన్ని ప్రస్తావించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆ పథకం కింద అందిస్తున్న భృతిని రూ.6 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతున్నట్టు ప్రకటించిన సమయంలో కొత్తగా మరో 2,796 దేవాలయాలకు కూడా దీన్ని వర్తింపజేయనున్నట్టు వెల్లడించారు. అప్పటికే ఆ జాబితా దేవాదాయ శాఖ పరిశీలనలో ఉన్నందున, ఆ జాబితాలోని దేవాలయాలకు ఈ పథకాన్ని వర్తింపజేయనున్నట్టు సీఎం తేల్చి చెప్పారు. కానీ, శనివారం విడుదలైన ఉత్తర్వుల్లో ఆ సంఖ్యను దేవాదాయశాఖ 2,043గానే చూపింది. నిధుల సాకుతో మిగతా గుడులను అందులో నుంచి తప్పించింది. ఫలితంగా, ఆయా దేవాలయాల్లో దేవరులతోపాటు, ఆ ఆలయాలనే నమ్ముకుని ఉన్న అర్చకులు ఇప్పుడు ఆగమాగమయ్యే గందరగోళ పరిస్థితి నెలకొంది.

**ఒకే జాబితా.. ఎలా తొలగిస్తారు..?**

రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం 3,645 దేవాలయాలకు ధూపదీప నైవేద్య పథకం కింద ప్రతినెలా రూ.6 వేలు చొప్పున ప్రభుత్వం విడుదల చేస్తోంది. వీటిల్లో రూ.2 వేలను దేవుడికి ధూపదీప నైవేద్యానికయ్యే వ్యయానికి వాడుతుండగా, మిగతా మొత్తాన్ని ఆ ఆలయ పూజారి కుటుంబం గడవటానికి భృతిగా వినియోగిస్తున్నారు. ఆదాయం లేక ఆలనాపాలనా లేని మరిన్ని దేవాలయాలను కూడా దీని పరిధిలోకి తేవాలన్న ఉద్దేశంతో దేవాదాయ శాఖ గత ఏడాది చివరలో ఓ జాబితాను సిద్ధం చేసింది. ప్రతి జిల్లా అదనపు కలెక్టర్, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, ముగ్గురు అర్చకులు.. వెరసి ఐదుగురు సభ్యుల కమిటీ అర్చకుల అర్హతల ఆధారంగా ఎంపికలు జరిపింది. అలా 2,796 మంది పూజారుల జాబితాను సిద్ధం చేసుకుని ప్రభుత్వ పరిశీలనకు పంపింది. ఆ జాబితా ఆధారంగానే ముఖ్యమంత్రి కూడా ప్రకటన చేశారు.



**మిగిలిన 753 దేవాలయాల పరిస్థితేంటి?**

కొంతకాలంగా ధూపదీప నైవేద్య పథకానికి ఆర్థిక శాఖ నిధులు సరిగా ఇవ్వటం లేదు. మూడు నెలల మొత్తం బకాయిగా పేరుకుపోయి ఉంది. గతేడాది చివరలో కూడా నాలుగు నెలల బకాయిలు పేరుకుపోయాయి. దీంతో ఈ జాబితాను తగ్గించాలని భావించిన అధికారులు, సీఎం ప్రకటనకు భిన్నంగా కేవలం 2,043 దేవాలయాలకే పథకాన్ని వర్తింపు చేస్తున్నట్టు శనివారం ఉత్తర్వు జారీ చేశారు. దీంతో ఆ జాబితాలో 753 దేవాలయాలు మిగిలిపోయాయి. ఒకేసారి రూపొందిన మొత్తం జాబితాను ఒకే చేయాల్సిందిపోయి, సింహభాగం దేవాలయాలను ఎంపిక చేసి కొన్నింటిని వదిలేయటం ఇప్పుడు గందరగోళంగా మారింది. ప్రభుత్వం నుంచి భృతి రాదని తేలితే వారు ఆ ఆలయాల్లో అర్చకులు కొనసాగే పరిస్థితి అంతగా ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అప్పుడు ఆలయంలో ధూపదీప నైవేద్యాలు ఆగిపోయే పరిస్థితి వస్తుంది.

# 3 జిల్లాలు = 30 జిల్లాలు!

మొదటి పేజీ తరువాయి

పరిసర ప్రాంతాల్లోనే కేంద్రీకృతమైందని.. జిల్లాల మధ్య సమతుల్యత లోపించినట్టుగా ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. జిల్లాల మధ్య అసమతుల్యతను తొలగించేందుకు అమలు చేయాల్సిన విధానాలు, ప్రణాళికల రూపకల్పనలో జీడీడీపీని పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేస్తున్నారు. జీడీడీపీకి సంబంధించి.. భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ అర్బన్, మహబూబ్‌నగర్ జిల్లాలు వరుసగా 34.2%, 24.9%. 24.9% వృద్ధి రేటును సాధించి టాప్‌లో నిలిచాయి. రాష్ట్రంలోని 32 జిల్లాలు వృద్ధిరేటులో పురోగమించగా.. ఒక జిల్లా మాత్రం వృద్ధి రేటులో తిరోగమనంలో ఉన్నట్టు నివేదిక వెల్లడించింది.

**తలసరి ఆదాయంలో రంగారెడ్డి టాప్**

రంగారెడ్డి జిల్లా రూ.7,58,102 తలసరి ఆదాయంతో 2021–22లో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచింది. దేశ సగటు తలసరి ఆదాయంతో పోల్చితే ఇది 5.1 రెట్లు అధికం. హైదరాబాద్ జిల్లా రూ. 4,02,941తో, సంగారెడ్డి జిల్లా రూ. 3,01,870తో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. వికారాబాద్ జిల్లా రూ.1,54,509 తలసరి ఆదాయంతో అట్టడుగున నిలిచింది. పట్టణీకరణ జరిగిన జిల్లాలతో పోల్చితే..గ్రామీణ జిల్లాలు తలసరి ఆదాయంలో వెనుకబడి ఉన్నట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇక తలసరి ఆదాయంలో 32 జిల్లాలు రెండంకెల వృద్ధి రేటు నమోదు చేస్తున్నట్టు నివేదికలో తెలిపింది.

**రాష్ట్రంలో ఎక్కువ జీడీడీపీ ఉన్న జిల్లాలివీ.. (రూ.కోట్లలో)**

| జిల్లా | జీడీడీపీ |
|---|---|
| రంగారెడ్డి | 2,26,957 |
| హైదరాబాద్ | 1,86,225 |
| మేడ్చల్ మల్కాజ్‌గిరి | 73,132 |
| సంగారెడ్డి | 55,513 |
| నల్లగొండ | 46,158 |
| ఖమ్మం | 36,777 |
| నిజామాబాద్ | 32,478 |
| భద్రాద్రి కొత్తగూడెం | 29,928 |
| సూర్యాపేట | 26,195 |
| సిద్దిపేట | 25,998 |
| మహబూబ్‌నగర్ | 25,975 |

**అత్యల్ప జీడీడీపీ ఉన్న జిల్లాలివీ.. (రూ.కోట్లలో)**

| జిల్లా | జీడీడీపీ |
|---|---|
| ములుగు | 6,240 |
| ఆసిఫాబాద్ | 9,599 |
| నారాయణపేట | 10,848 |
| రాజన్న సిరిసిల్ల | 11,022 |
| జనగామ | 11,667 |
| వనపర్తి | 11,833 |
| జోగులాంబ గద్వాల | 11,922 |
| భూపాలపల్లి | 11,942 |
| నిర్మల్ | 14,759 |
| ఆదిలాబాద్ | 14,903 |
| మహబూబాబాద్ | 16,280 |

**అత్యల్ప తలసరి ఆదాయమున్న జిల్లాలివీ.. (రూ.లలో)**

| జిల్లా | తలసరి ఆదాయం | జిల్లా | తలసరి ఆదాయం |
|---|---|---|---|
| వికారాబాద్ | 1,54,509 | జోగులాంబ గద్వాల | 1,67,207 |
| వరంగల్ అర్బన్ | 1,56,086 | రాజన్నసిరిసిల్ల | 1,68,302 |
| ఆసిఫాబాద్ | 1,57,258 | కామారెడ్డి | 1,73,313 |
| జగిత్యాల | 1,61,064 | నిజామాబాద్ | 1,75,361 |
| నారాయణపేట | 1,65,384 | వనపర్తి | 1,75,445 |
| | | నిర్మల్ | 1,77,158 |

# సర్కార్ బడిలో కార్పొరేట్ సౌకర్యాలు

**భవనాన్ని రేపు ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్**



ఆధునిక హంగులతో ప్రారంభానికి సిద్ధంగా పాఠశాల

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఆకట్టుకునే గ్రీనరీ ఒకవైపు.. పిల్లలు ఆడుకునే ఆటవస్తువులు మరోవైపు. అధునాతన డైనింగ్‌హాల్.. అద్భుతమైన భవంతులు. ఇదంతా ఏదో కార్పొరేట్ స్కూల్ అనుకుంటే పొరబాటు పడ్డట్టే. రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ఇటీవల నిర్మించిన పాఠశాల సమీకృత భవనం. నిజాం కాలంలో నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరడంతో రూ.8.50 కోట్లతో 'మన ఊరు–మన బడి'లో భాగంగా అత్యాధునిక సౌకర్యాలతో పాఠశాల సమీకృత భవనాన్ని నిర్మించారు. ఈ భవన సముదాయాలను మంత్రి కేటీఆర్, రాష్ట్ర విద్యాశాఖమంత్రి సబితా రెడ్డి ఈనెల 20న ప్రారంభించనున్నారు. 50 కంప్యూటర్లతో డిజిటల్ ల్యాబ్, ఆధునిక సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, ఆధునిక డైనింగ్ హాల్, విద్యార్థులకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు నీటిశుద్ధి కేంద్రం, మోడరన్ టాయిలెట్స్, పిల్లలు ఆడుకునేందుకు రకరకాల ఆట వస్తువులు వంటి అనేక సౌకర్యాలు కల్పించారు.

# నేటి హరితోత్సవానికి సీఎం కేసీఆర్

- తుమ్మలూరు అర్బన్‌పార్క్‌లో మొక్కలు నాటనున్న సీఎం
- నేడు రాష్ట్రవ్యాప్తంగా హరితహారం ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించే హరితోత్సవం కార్యక్రమంలో సీఎం కేసీఆర్ పాల్గొంటారని అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వెల్లడించారు. అలాగే, సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా హరితహారం కార్యక్రమం ప్రారంభం కానుందని చెప్పారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా తుమ్మలూరు అర్బన్ ఫారెస్ట్ పార్కులో సీఎం మొక్కలు నాటుతారని తెలిపారు. సీఎం కేసీఆర్ మానస పుత్రిక హరితహారం కార్యక్రమం ప్రజల భాగస్వామ్యంతో మంచి ఫలితాలు ఇస్తోందని ఇంద్రకరణ్ రెడ్డి చెప్పారు. ఇదే స్ఫూర్తితో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే హరితోత్సవం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో పెద్దఎత్తున మొక్కలను నాటాలని సూచించారు. అదే విధంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పచ్చదనం పెరగడానికి చేసిన కృషి, వాటి ఫలితాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించే కార్యక్రమంలో అడవుల పరిరక్షణకు విశేష కృషి చేసిన అటవీ అధికారులు, సిబ్బందిని సన్మానించి, అవార్డులు అందజేస్తామని వెల్లడించారు.

**ఈసారి 19.29 కోట్ల మొక్కలు లక్ష్యం**

ఈసారి 9వ విడత హరితహారం కింద 19.29 కోట్ల మొక్కలు నాటాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు. అన్ని సాగునీటి ప్రాజెక్టుల స్థలాలు, కాలువల వెంట పచ్చదనం పెంచాలని నిర్ణయించారు. 2015–16లో 'తెలంగాణకు హరితహారం' ప్రారంభించి ప్రభుత్వ, ప్రజల భాగస్వామ్యంతో మొత్తం 230 కోట్ల మొక్కలు నాటాలనేది లక్ష్యం. గడిచిన తొమ్మిదేళ్లలో రికార్డ్ స్థాయిలో 273 కోట్ల మొక్కలు నాటారు.

# కొన్ని కేటగిరీలకు ఉమ్మడి పరీక్షలు

- గురుకుల కొలువుల భర్తీకి టీఆర్ఈఐఆర్బీ కొత్త విధానం
- పీజీటీ, జేఎల్, డీఎల్ పోస్టులకు పేపర్–1 ఉమ్మడిగానే..
- ఆగస్టు 1వ తేదీ నుంచి 22 వరకు నిర్వహణ



సాక్షి, హైదరాబాద్: గురుకుల ఉద్యోగాల భర్తీకి నిర్వహించే అర్హత పరీక్షలకు తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్బీ) వ్యూహాత్మక కార్యాచరణ చేపట్టింది. పరీక్షలను సులభతరంగా నిర్వహించే క్రమంలో అభ్యర్థులకు వెసులుబాటు కల్పించింది. ఆగస్టు 1 నుంచి 22వ వరకు పరీక్షలు నిర్వహించనుంది. పరీక్షల వారీగా తేదీలను ఖరారు చేస్తూ రూపొందించిన వ్యూహాత్మక టైమ్‌టేబుల్‌ను టీఆర్ఈఐఆర్బీ వెబ్‌సైట్‌లో ఉంచింది. విద్యార్హతలు సమానమైన కేటగిరీ కొలువులకు పరీక్షలను ఉమ్మడిగా నిర్వహిస్తోంది. తద్వారా అభ్యర్థులు ఒక పేపర్‌లో అర్హత సాధిస్తే సంబంధిత పోస్టులకు అర్హత సాధించినట్లే.

**పేపర్ వన్, టూల్లోనే ఉమ్మడిగా..**

టీఆర్ఈఐఆర్బీ రూపొందించిన పరీక్షల షెడ్యూల్ కాస్త ఒత్తిడి కలిగించే విధంగా కనిపిస్తున్నప్పటికీ ఉమ్మడి పరీక్షలతో అభ్యర్థులకు భారీ ఊరట లభించనుంది. సులభతర పరీక్షా విధానం ఉండటంతో రోజుకు మూడు సెషన్లలో పరీక్షలు నిర్వహించేలా టైమ్‌టేబుల్ ఉందని అధికారులు చెబుతున్నారు. మొదటి సెషన్ కింద ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2.30 గంటల వరకు, మూడో సెషన్ సాయంత్రం 4.30 గంటల నుంచి 6.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పలు పోస్టులకు పేపర్–1, పేపర్–2లను ఉమ్మడిగా నిర్వహిస్తోంది. పీజీ అర్హతతో ఉన్న పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ), జూనియర్ లెక్చరర్ (జేఎల్), డిగ్రీ లెక్చరర్ (డీఎల్) కేటగిరీ కొలువులకు పేపర్–1 పరీక్షను ఉమ్మడిగా నిర్వహిస్తున్నారు. అంటే ఒక అభ్యర్థి ఈ మూడు పరీక్షలకు దరఖాస్తు చేసి.. కేవలం ఒకసారి పేపర్–1 పరీక్ష రాసి అర్హత సాధిస్తే మూడింటికీ పేపర్–1లో అర్హత సాధించినట్టేనన్నమాట. పీజీటీ, జేఎల్ కొలువుల పేపర్–2 పరీక్షలను కూడా ఉమ్మడిగా నిర్వహిస్తున్నారు. ఈ రెండు కేటగిరీలకు సంబంధించిన పెడగాగి (విద్యాబోధన శాస్త్రం) ఒకే రకంగా ఉండటంతో ఈ రెండు కేటగిరీలకు ఉమ్మడి పరీక్ష నిర్వహిస్తున్నట్లు అధికారులు వివరిస్తున్నారు. ఇక పేపర్–3 పరీక్షలను వేర్వేరుగా నిర్వహిస్తున్నట్లు గురుకుల బోర్డు స్పష్టత ఇచ్చింది. పరీక్ష తేదీలు ఎక్కడా క్లాష్ కాకుండా పక్కా షెడ్యూల్ తయారు చేసినట్లు వివరించారు. పరీక్షలన్నీ సీబీటీ (కంప్యూటర్ బేస్డ్) పద్ధతిలో నిర్వహించడం ద్వారా ఫలితాలను కేవలం నెలరోజుల్లో విడుదల చేసేలా కార్యాచరణ సిద్ధం చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

# మల్కపేట రెండో పంపు వెట్‌రన్ సక్సెస్

- కాళేశ్వరం 9వ ప్యాకేజీ తొలి దశ పూర్తి
- పనులు పర్యవేక్షించిన ఈఎన్సీ వెంకటేశ్వర్లు
- ఇంజనీర్లను అభినందించిన మంత్రి కేటీఆర్



మల్కపేట రిజర్వాయర్‌లోకి చేరుతున్న గోదావరి జలాలను పరిశీలిస్తున్న ఇంజనీర్లు

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్ రెండో పంపు వెట్‌రన్ విజయవంతమైంది. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ప్రక్రియ పూర్తి చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు 9వ ప్యాకేజీలో భాగంగా సిరిసిల్ల శివారులోని మధ్యమానేరు (శ్రీరాజరాజేశ్వర) జలాశయం బ్యాక్‌వాటర్‌ను సొరంగం ద్వారా 12.03 కిలోమీటర్ల దూరంలోని మల్కపేటకు మళ్లించారు. మల్కపేట వద్ద రూ.504 కోట్లతో మూడు టీఎంసీల నిల్వ సామర్థ్యం గల రిజర్వాయర్‌ను నిర్మించారు. ఈ రిజర్వాయర్‌లోకి 30 మెగావాట్ల పంపుతో సర్జిపూల్ నుంచి గోదావరి జలాలను ఎత్తిపోశారు. మే 23న మొదటి పంపు వెట్‌రన్ నిర్వహించారు. తాజాగా రెండో పంపు వెట్‌రన్‌ను శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12.40 గంటలకు ప్రారంభించి 1.40 గంటల వరకు కొనసాగించారు. ట్రయల్‌రన్ విజయవంతమైనట్లు ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు ప్రకటించారు. రెండో పంపు ట్రయల్‌రన్ విజయవంతం కావడంతో మంత్రి కె.తారక రామారావు ఇంజనీర్లను అభినందించారు. దీంతో కాళేశ్వరం 9 ప్యాకేజీ తొలి దశ పూర్తయిందని అధికారులు తెలిపారు. సిరిసిల్ల మధ్యమానేరు జలాశయం నీరు 12 కిలోమీటర్లు సొరంగం ద్వారా ప్రయాణించి ధర్మారం వద్ద నిర్మించిన సర్జిపూల్‌కు చేరాయి. ఆ నీటిని రెండో పంపు ద్వారా మల్కపేట రిజర్వాయర్‌లోకి ఎత్తిపోశారు. రాష్ట్ర ఎత్తిపోతల పథకాల సలహాదారు పెంటారెడ్డి, ట్రాన్స్‌కో డైరెక్టర్ సూర్యప్రకాశ్, 9వ ప్యాకేజీ ఎస్ఈ సుధాకర్‌రెడ్డి, ఈఈ జి.శ్రీనివాస్‌రెడ్డి, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు, ఇంజనీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు**

మల్కపేట రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలను ఎత్తిపోసే కాళేశ్వరం 9వ ప్యాకేజీలో రెండు పంపుల వెట్‌రన్ విజయవంతం కావడంతో ఈ పంపులను సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరో 15 –20 రోజుల్లో కేసీఆర్ చేతుల మీదుగా 9వ ప్యాకేజీని ప్రారంభిస్తామని మంత్రి కేటీఆర్ ఇటీవల ఎల్లారెడ్డిపేటలో ప్రకటించారు. దీంతో మధ్యమానేరు నుంచి ఏడాదిలో 120 రోజులపాటు 11.635 టీఎంసీల నీటిని రెండు మోటార్లతో ఎత్తిపోసి మల్కపేట రిజర్వాయర్‌ను నింపి.. అక్కడి నుంచి గంభీరావుపేట మండలం సింగసముద్రం మీదుగా బట్టల చెరువు, నర్మాల ఎగువమానేరు జలాశయానికి గోదావరి జలాలను చేర్చనున్నారు. ఈ క్రమంలో మధ్యలో ఉండే వివిధ గ్రామాల్లోని చెరువులు, కుంటలను నింపుతారు. ఈ పథకం కింద సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో 96,150 ఎకరాలకు సాగునీరు అందనుంది. వానాకాలంలో 12వేల ఎకరాలకు మల్కపేట రిజర్వాయర్ ద్వారా సాగునీరు అందించాలని భావిస్తున్నారు. 9 డిస్ట్రిబ్యూటరీల ద్వారా పొలాలకు సాగునీరు అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

## క్లుప్తంగా...

### క్రూరమైన 'ఉపా' రద్దుకు కేంద్రంపై ఒత్తిడి

**సీఎం కేసీఆర్‌కు ప్రొఫెసర్ హరగోపాల్ సూచన**



**పాలమూరు:** ప్రజల హక్కులను హరించేలా ఉన్న క్రూరమైన ఉపా చట్టాన్ని రద్దు చేసేలా కేంద్ర ప్రభుత్వంపై సీఎం కేసీఆర్ ఒత్తిడి తేవాలని ప్రొఫెసర్ హరగోపాల్ సూచించారు. మహబూబ్‌నగర్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఉపా చట్టాన్ని రద్దు చేస్తామని ఆయా రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొనాలని డిమాండ్ చేశారు. ఉపా చట్టానికి ప్రజాస్వామ్యంలో చోటులేదని వ్యాఖ్యానించారు. అక్రమంగా నమోదు చేసిన ఉపా కేసును తనతో సహా మరో ఆరుగురిపై మాత్రమే రద్దు చేసిందని, మిగిలిన వారిపై కేసు అలాగే ఉందన్నారు. వారు ఎలాంటి దేశ ద్రోహానికి పాల్పడిన వారు కాదని, అంతా అమాయకులని చెప్పారు. ప్రజాస్వామ్యవాదులు, అన్ని రాజకీయ పార్టీలు ఉపా చట్టాన్ని ఎత్తివేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ చట్టాన్ని తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమని అప్పట్లో ఎవరినైనా ఏ కారణం లేకుండా అరెస్టు చేసి మూడు నెలల పాటు ఎలాంటి విచారణ లేకుండా జైలులో నిర్బంధించవచ్చని, బీజేపీ ప్రభుత్వం దానిని ఆరు నెలలకు పెంచిందని హరగోపాల్ వివరించారు. ఎక్కడైనా ఒక వ్యక్తి మీద నేరం రుజువు చేయాలంటే పోలీసులు తగిన సాక్ష్యాలు కోర్టులో ప్రవేశపెట్టి శిక్షపడేలా చేయాల్సి ఉంటుందన్నారు. ఉపా చట్టంలో నేరం మోపబడిన వ్యక్తి తాను నేరం చేయలేదని రుజువు చేసుకోవాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

### పేదలపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

- ఇంటిస్థలం కోసం పోరాడుతున్న పేదలను జైలుకు పంపడం దారుణం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



**సాక్షి, హైదరాబాద్:** హయత్‌నగర్ మండలం సాయిబ్‌నగర్‌లో ప్రభుత్వ భూమిలో ఇంటిస్థలం కోసం పోరాడుతున్న పేదలపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీఛార్జి చేసి..అర్ధరాత్రి జైలుకు పంపడాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. వారందరినీ వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు వేల ఎకరాల ప్రభుత్వ భూములు రియల్ వ్యాపారుల ఆక్రమణకు గురవుతుంటే..60 గజాల ఇంటిస్థలం కోసం పోరాడుతున్న పేదలపై అధికారులు, పోలీసులు దౌర్జన్యం చేయడం అత్యంత దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేదలకు స్థలం కేటాయించి, గృహ నిర్మాణం కోసం రూ.3 లక్షలు ఇవ్వాలన్నారు. లేకపోతే..తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుదని హెచ్చరించారు. భూపోరాటంలో పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, దళితులు, మహిళలపై దాడి చేసిన సీఐని సస్పెండ్ చేసి..ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

### రెండోసారి బీఎల్ఎఫ్ చైర్మన్‌గా నల్ల సూర్యప్రకాశ్

- కన్వీనర్లుగా దండి వెంకట్, వనం సుధాకర్, కె.పర్వతాలు
- బహుజన తెలంగాణ కోసం ఉద్యమించాలి: మద్దికాల అశోక్ ఓంకార్

**సాక్షి, హైదరాబాద్:** బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) తెలంగాణ కమిటీ చైర్మన్‌గా నల్ల సూర్య ప్రకాశ్ తిరిగి ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని ఓంకార్ భవన్‌లో ఆదివారం బీఎల్ఎఫ్ రాష్ట్ర వర్క్ షాప్‌లో 35 మందితో రాష్ట్ర కమిటీ ఎన్నిక జరిగింది. కన్వీనర్లుగా దండి వెంకట్, వనం సుధాకర్, కె.పర్వతాలు ఎన్నికయ్యారు. అలాగే రాష్ట్ర కమిటీ సభ్యులుగా వల్లపు ఉపేందర్ రెడ్డి, ఎస్.సిద్దిరాములు, గాజుల శ్రీనివాస్, కుంభం సుకన్య, సబ్బని లత, ధనలక్ష్మి, వస్కుల మట్టయ్య, వి.తుకారం నాయక్, పి.భూమయ్య తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎంసీపీఐ(యు) అఖిల భారత ప్రధాన కార్యదర్శి మద్దికాల అశోక్ ఓంకార్ మాట్లాడుతూ...తెలంగాణలో రాజకీయ ప్రత్యామ్నాయం బహుజనులదేనన్నారు. తెలంగాణ సమాజంలో 93% ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రకుల పేదలతో కూడిన బహుజన తెలంగాణ కోసం ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.

## పవర్‌లోకి వస్తామని కాంగ్రెస్ పగటి కలలు

▶ మొదటి పేజీ తరువాయి

నేతలు జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇప్పటికే చెప్పారని గుర్తుచేశారు. గుంట నక్కలే గుంపులుగా వస్తాయని, బీజేపీ సింగిల్‌గానే పోటీ చేస్తుందని బండి స్పష్టం చేశారు. బీజేపీ మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బద్దిపల్లిలో ఆదివారం టిఫిన్ బైటక్‌లో బండి సంజయ్ పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ :రాష్ట్ర అభివృద్ధిపై సీఎం కేసీఆర్ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహిళా దుస్తులపై రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ స్పందించిన తీరు అవమానకరమన్నారు.

# 'అన్న'లకు అనారోగ్యం!



ఉద్యమం కోసం అడవుల బాట పట్టిన 'అన్న'లకు అనారోగ్యం తీవ్రంగా బాధిస్తోంది. దశాబ్దాలుగా అడవుల్లో ఎన్నో విపత్కర పరిస్థితులు లెక్క చేయక గడిపిన ఎందరో నాయకులు ఇప్పుడు అనేక జబ్బులతో ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తోంది. ఓవైపు మారిన వాతావరణ పరిస్థితులు, మరోవైపు అడవుల్లో సరైన వైద్య సాయం అందక, కొన్నిసార్లు మందులకు తీవ్ర కొరతతో కొట్టుమిట్టాడుతున్నట్టు సమాచారం. వైద్యం కోసం అడవులు వదిలితే ఎక్కడ పోలీస్ బలగాలకు చిక్కుతామన్న భయంతో తప్పని పరిస్థితుల్లో అడవుల్లోనే ఉండి చివరకు ప్రాణాలు కోల్పోతున్నారు. కరోనా సమయంలో ఎలాగోలా బతికి బయటపడినా.. పోస్ట్ కోవిడ్ సమస్యలు ఇప్పుడు వారిని మరింత కుంగదీస్తున్నట్టు తెలుస్తోంది.

**దీర్ఘకాలిక రుగ్మతలతో బాధపడుతున్న సీనియర్ మావోయిస్టులు**

**అడవుల్లో వైద్యం అందక.. బయటికి రాలేక అవస్థలు**

**తీవ్ర అనారోగ్యంతో 30 మంది వరకు నాయకులు?**

### అగ్రనేత ఆర్కే అనారోగ్యంతోనే..

అనారోగ్య కారణాలతోనే మావోయిస్టు అగ్రనాయకులైన ఆర్కే, హరిభూషణ్‌లు సైతం మృతిచెందారు. అలాగే ఇటీవలే మావోయిస్టు పొలిట్ బ్యూరో సభ్యుడు, సెంట్రల్ కమిటీ సభ్యుడు కటకం సుదర్శన్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఇదే తరహాలో మావోయిస్టు కేంద్ర కమిటీతోపాటు తెలంగాణ రాష్ట్ర కమిటీకి చెందిన వారిలోనూ దాదాపు 30కి పైగా మావోయిస్టు కీలక నేతలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని గతంలో అరెస్టయిన మావోయిస్టు నేతలు చెబుతున్నారు.

మావోయిస్టు ఉద్యమం పేరు చెబితే వెంటనే గుర్తుకు వచ్చే పేర్లలో ఒకటైన ముప్పాల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి ఆరోగ్యం ప్రస్తుతం ఆందోళనకరంగా ఉన్నట్టు తెలుస్తోంది. మావోయిస్టు మాజీ జనరల్ సెక్రెటరీ, ప్రస్తుతం సెంట్రల్ కమిటీ సభ్యుడిగా అత్యంత కీలక నేతగా ఉన్న గణపతి వయస్సు 73కు చేరింది. బీపీ, షుగర్, మోకాళ్ల నొప్పులు, అల్జీమర్స్‌తో బాధపడుతున్న గణపతి ప్రస్తుతానికి మంచానికే పరిమితమైనట్టు విశ్వసనీయ సమాచారం. సెంట్రల్ కమిటీలో కీలక సభ్యుడు అయిన గాజర్ల రవి సైతం కీళ్ల నొప్పులు, కిడ్నీ సంబంధ జబ్బులతో బాధపడుతున్నట్టు తెలిసింది. సెంట్రల్ కమిటీలోని రామచంద్రారెడ్డి, మొడెం బాలకృష్ణ, పోతుల కల్పన, దండాకరణ్యం స్పెషల్ జోన్ కమిటీలోని నూనె నర్సింహారెడ్డి అలియాస్ జంపన్న వెన్ను నొప్పితో , తెలంగాణ డివిజనల్ కమిటీ సభ్యుడు అప్పాసి నారాయణ అలియాస్ రమేశ్ అధిక రక్తపోటు, గుండె జబ్బుతో బాధపడుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇతర కీలక నాయకులు సైతం చాలా మంది షుగర్ , బీపీ, కీళ్ల నొప్పులు ఇతర సమస్యలతో సతమతవుతున్నట్టు తెలుస్తోంది.

**మంచానికే పరిమితమైన గణపతి?**

**స్థానికుల నుంచి సహకారం తగ్గుతోందా?**

మరోవైపు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో గతంలో మాదిరిగా స్థానికుల నుంచి మద్దతు తగ్గుతోందనీ, అందుకే సకాలంలో మందుల రవాణా, ఇతర సహాయ సహకారాల్లో జాప్యమవుతోందన్న చర్చ నడుస్తోంది. అయితే వైద్య కోసం వచ్చే మావోయిస్టులకు మందులు, వైద్య చికిత్స అందకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ఫాసిస్టు దాడి ఫలితంగానే మావోయిస్టుల మరణాలు జరుగుతున్నాయని మావోయిస్టు పార్టీ ఆరోపిస్తోంది. కటకం సుదర్శన్ మృతిపై ప్రకటన జారీ సందర్భంగా మావోయిస్టు కేంద్ర కమిటీ మీడియా ప్రతినిధి అభయ్ ఇవే ఆరోపణలు చేశారు.

**జనజీవన స్రవంతిలోకి వస్తే మేం చూసుకుంటామంటున్న ఖాకీలు**

పోలీసు అధికారుల వాదన మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది..అనారోగ్యంపాలైన మావోయిస్టుల జనజీవన స్రవంతిలోకి వస్తే మెరుగైన వైద్య సేవలందిస్తామని తాము బహిరంగంగా, మీడియా ద్వారా విజ్ఞప్తి చేస్తున్నామని పేర్కొంటున్నారు. మావోయిస్టు నాయకులు, కేడర్ లొంగిపోతున్న సందర్భాల్లో, అరెస్టుల సందర్భంగా నిర్వహించే పత్రికా సమావేశాల్లోనూ లొంగిపోతే సరైన వైద్యం అందిస్తామని పోలీస్ ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## 'భగీరథ'పై చెడు ప్రచారం మానుకోవాలి



ఆదివారం రవీంద్ర భారతిలో 'మంచినీళ్ల పండుగ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు వేముల, మహమూద్ అలీ, ఎర్రబెల్లి, తలసాని, మల్లారెడ్డి. చిత్రంలో స్మితా సబర్వాల్ తదితరులు

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఈ పథకం వల్లే బీఆర్ఎస్‌లో చేరా
- రాష్ట్రంలో తాగునీటి కొరత లేదు
- ఘనంగా మంచినీళ్ల పండుగ
- మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, తలసాని, మహమూద్ అలీ, మల్లారెడ్డి హాజరు

**గన్‌ఫౌండ్రీ, సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో వేగంగా అభివృద్ధి చెందుతోందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ప్రభుత్వం ప్రతి ఇంటికి మంచి నీరును అందించాలనే లక్ష్యంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం విజయవంతమైందని తెలిపారు. కేంద్రం సైతం ఈ పథకాన్ని కాపీ కొట్టిందని పేర్కొన్నారు. కానీ కొంతమంది రాజకీయ నాయకులు తమ స్వలాభం కోసం మిషన్ భగీథపై చెడు ప్రచారం చేస్తున్నారని, ఆ ప్రచారాన్ని మానుకోవాలని సూచించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రవీంద్రభారతిలో మిషన్ భగీరథ, మున్సిపల్ శాఖ, హైదరాబాద్ మెట్రో వాటర్‌వర్క్స్ ఆధ్వర్యంలో మంచినీళ్ల పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. మిషన్ భగీరథ ద్వారా అన్ని ప్రాంతాలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామని, తెలంగాణ ఫ్లోరైడ్ రహిత రాష్ట్రంగా నిలిచిందని పార్లమెంట్‌లో కేంద్రం ప్రకటించిందని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టి కలిగిన నాయకుడని, ఆయన విజన్‌తోనే ఇది సాధ్యమైందని చెప్పారు. తెలంగాణ ఏర్పడక ముందు తాగునీటి కోసం ఖాళీ బిందెలతో అసెంబ్లీ ముందు ధర్నాలు జరిగేవని గుర్తు చేశారు. అయితే రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎటువంటి నీటి కొరతా లేదన్నారు. మిషన్ భగీరథ విఫలమైందని మాట్లాడే నాయకులకు ఖాళీ బిందెలతో నిరసన తెలిపే దమ్ముందా అని ప్రశ్నించారు. తాను టీడీపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరడానికి ప్రధాన కారణం మిషన్ భగీరథ పథకమేనన్నారు. ఈ పథకానికి కేంద్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తప్పుడు లెక్కలతో మాట్లాడడం బాధాకరమన్నారు.

**నిండు వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్యలేదు..**

మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డిలు మాట్లాడుతూ.. మిషన్ భగీరథ పథకం దేశంలోని అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. నిండు వేసవిలో సైతం ఎక్కడా తాగునీటి సమస్య లేదన్నారు. సుంకిశాలతో హైదరాబాద్‌కు, మిషన్ భగీరథతో రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలకు తాగునీటికి ఢోకా లేదని తెలిపారు. అనంతరం జలమండలి అధికారులు, ఇంజనీర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దగుట్టపై హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్

- ఇంధనం అయిపోవడంతో యాదాద్రిలో అరగంటపాటు నిలిపివేత
- హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న మంత్రి ఎర్రబెల్లి, ఎంపీ కవిత

**యాదగిరిగుట్ట:** పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత ప్రయాణిస్తున్న హెలికాప్టర్ అత్యవసరంగా యాదాద్రి జిల్లా యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని టెంపుల్ సిటీ (పెద్దగుట్ట)పై ఉన్న హెలిప్యాడ్ వద్ద ల్యాండ్ అయింది. హెలికాప్టర్‌లో ఇంధనం అయిపోవడంతో హెలికాప్టర్‌ను పైలెట్ పెద్దగుట్టపై నిలిపాడు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్‌లో ఓ కార్యక్రమాన్ని ముగించుకొని మంత్రి ఎర్రబెల్లి, ఎంపీ మాలోతు కవిత హైదరాబాద్‌కు ప్రత్యేక హెలికాప్టర్‌లో బయల్దేరారు. హెలికాప్టర్‌లో ఇంధనం అయిపోతున్న విషయాన్ని ముందే గమనించిన పైలెట్ విషయాన్ని మంత్రికి వివరించాడు. దీంతో యాదగిరిగుట్ట పెద్దగుట్టపైకి ఇంధన వాహనాన్ని తీసుకురావాలని ఆయన అధికారులకు సూచించారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక వాహనం ఇంధనంతో మధ్యాహ్నం 3.30గంటల సమయంలో పెద్దగుట్టకు చేరుకుంది. మంత్రి ఎర్రబెల్లి, ఎంపీ కవిత ఉన్న హెలికాప్టర్ సాయంత్రం 5.30గంటలకు పెద్దగుట్ట మీద ల్యాండ్ అయ్యింది. వారు హెలికాప్టర్ దిగి చెట్ల కింద కూర్చోగా.. అధికారులు ఇంధనాన్ని హెలికాప్టర్‌లో నింపారు. తిరిగి 6గంటలకు హెలికాప్టర్‌లో వారు వెళ్లిపోయారు. హెలికాప్టర్ రావడంతో అందులో ఎవరొచ్చారోనని ఆసక్తితో స్థానిక ప్రజలు పెద్దగుట్ట దగ్గరకు వచ్చి చూశారు.



హెలికాప్టర్‌లో ఇంధనం నింపుతున్న దృశ్యం

## ఎన్నికల ప్రచారానికి అందరిలాగే డీకే వస్తారు

**రాష్ట్ర ఇన్‌చార్జిగా వస్తారనేది అవాస్తవం: మాణిక్‌రావు ఠాక్రే**

- బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రహస్య స్నేహం ఉందని ఆరోపణ



మీడియాతో మాట్లాడుతున్న మాణిక్‌రావు ఠాక్రే చిత్రంలో భట్టి, ఇతర నేతలు

**నల్లగొండ రూరల్:** కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలంగాణకు ఎన్నికల ఇన్‌చార్జిగా వస్తారనే ప్రచారం అవాస్తవమని తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో తెలంగాణలో పార్టీ తరఫున ప్రచారానికి ఇతర రాష్ట్రాల కాంగ్రెస్ ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు వచ్చినట్లుగానే కర్ణాటక సీఎం, డిప్యూటీ సీఎం వస్తారని చెప్పారు. ప్రచారం గురించి కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ నిర్ణయిస్తారని తెలిపారు. ఆదివారం సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో పాల్గొన్న ఆయన ఆదివారం నల్లగొండ మండలంలోని చందనపల్లిలో విలేకరులతో మాట్లాడారు.

**ఇక్కడ లూటీ చేసి అక్కడ వినియోగిస్తున్నారు..**

తెలంగాణ ప్రజల సంపదను సీఎం కేసీఆర్ లూటీ చేసి ఇతర రాష్ట్రాల్లో బీఆర్ఎస్ కార్యాలయాలు, ప్రచారం కోసం వినియోగిస్తున్నారని ఠాక్రే ఆరోపించారు. ప్రచార ఆర్భాటానికి, మీడియాలో ప్రకటనల కోసం వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. ఆదాయ పన్ను శాఖతో పాటు కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ.. బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ అక్రమాలపై ఎందుకు విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. 10 సంవత్సరాల కేసీఆర్ పాలనలో అనేక అక్రమాలు, అవినీతి జరిగిందని మాట్లాడిన ప్రధాని మోదీ, అమిత్‌షాలు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడానికి.. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల రహస్య స్నేహమే కారణమని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి మంచి పట్టు ఉందని, బలమైన నాయకత్వం ఉందని ఠాక్రే పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు చాలామంది నేతలు తమతో టచ్‌లో ఉన్నట్లు తెలిపారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావుల చేరిక విషయమై ప్రశ్నించగా పైవిధంగా స్పందించారు. భట్టి చేపట్టిన పాదయాత్ర కాంగ్రెస్ బలోపేతానికి దోహదపడుతుందని, వచ్చే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకొస్తామని అన్నారు.

**బీఆర్ఎస్ గమ్యాన్ని ప్రజలు నిర్ణయిస్తారు: భట్టి**

బీఆర్ఎస్ పార్టీ గమ్యాన్ని వచ్చే ఎన్నికల్లో ప్రజలు నిర్ణయిస్తారని భట్టి వ్యాఖ్యానించారు. గమ్యం, గమనం లేని భట్టి యాత్ర అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. తనకు గమ్యం, గమనం తెలుసని అన్నారు. గుత్తా పొద్దు తిరుగుడు పువ్వు లాంటి వ్యక్తని, ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి పోతారని విమర్శించారు.

## ఆ డబ్బులు కిషన్‌రెడ్డి అయ్యసొత్తు కాదు

- దేశ ప్రజలు పన్నులుగా చెల్లించిన డబ్బులే మీరిచ్చేది
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్



**సాక్షి, మహబూబాబాద్:** 'కేంద్రం పేదలకు పంపిణీ చేస్తున్న డబ్బులు.. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించినవే, ఆ డబ్బులు కిషన్‌రెడ్డి అయ్యసొత్తు కాదు'అని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్ అన్నారు. సీపీఎం ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన బస్సుయాత్ర ఆదివారం మహబూబాబాద్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఉంటే రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని ప్రధాని మోదీ చెబుతున్నారని, కానీ వాళ్లది బుల్డోజర్ల సర్కార్ అని ధ్వజమెత్తారు. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లలో అదే జరుగుతోందని అన్నారు. 70 ఏళ్ల స్వాతంత్య్ర భారతంలో పేద ప్రజల కనీస అవసరాలు తీర్చలేని దుస్థితి నెలకొందని, దళితులు, గిరిజనులు, మైనార్టీలు, వెనుకబడిన తరగతులే పేదరికంతో కొట్టుమిట్టాడుతున్నాయని అన్నారు. అయితే కేరళలో ఆ పరిస్థితి లేదని, ప్రజల అభిమతం మేరకే పాలన జరుగుతుందని చెప్పారు. ఇల్లు లేని పేదలకు రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షలు వరకు వెచ్చించి ఇళ్లు కట్టిస్తున్నారని, ఎందుకంటే అక్కడ పేదలు ఇష్టపడి తెచ్చుకున్న కమ్యూనిస్టు పార్టీ అధికారంలో ఉందని వివరించారు. మతతత్వ బీజేపీ, నరేంద్ర మోదీ పాలనకు వ్యతిరేకంగా కేసీఆర్ చేస్తున్న పోరాటానికి మద్దతిస్తామన్నారు. అయితే పేదల ఇళ్లను కూల్చివేస్తే సహించబోమని స్పష్టం చేశారు. నిలువనీడ కోసం నిరు పేదలు వేసుకున్న గుడిసెలను కూల్చివేయడం అమానవీయమని అన్నారు. అధికారుల వేధింపులు, పోలీసుల కేసులకు బెదిరేది లేదని, పేదలకు ఇళ్ల పట్టాలు వచ్చే వరకు ఉద్యమం ఆగదని చెప్పారు.

## గమ్యం లేని నాయకుడు భట్టి

**శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**మిర్యాలగూడ:** భట్టి విక్రమార్క... గమనం, గమ్యం లేని నాయకుడని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుతో కలిసి ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భట్టి విక్రమార్క పాదయాత్రకు ప్రజల నుంచి స్పందన లేదని, నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్‌లో జరిగిన సభలో 150 మంది మాత్రమే పాల్గొన్నారని తెలిపారు. పబ్లిసిటీ కోసం తనపైన, మంత్రి జగదీష్‌రెడ్డిపైన ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఫ్లోరైడ్ ప్రాంతాలకు నీటిని అందించేందుకు డిండి ప్రాజెక్టును పూర్తి చేశామని, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు 9కి.మీ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని చెప్పారు. 'పాలమూరు- రంగారెడ్డి'పూర్తికాకుండా గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు వేసి స్టేలు తీసుకొచ్చిన దుర్మార్గులు కాంగ్రెస్ నేతలని గుత్తా ఆరోపించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్కలు ఏ ఒక్కరోజూ తెలంగాణ కోసం పోరాటం చేయలేదని గుర్తుచేశారు. తాను రాష్ట్ర సాధన కోసం కొట్లాడానని, ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధికి కృషి చేశానని చెప్పారు. కాలువలు తవ్వి కోట్లాది రూపాయలను దుర్వినియోగం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని విమర్శించారు. సమావేశంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ నుంచే కేసీఆర్ పతనం: జానారెడ్డి



బట్టువెంకన్నబావి తండాలో మాట్లాడుతున్న జానారెడ్డి

**తిరుమలగిరి(నాగార్జునసాగర్):** గిరిజనులకు మాయమాటలు చెప్పి మోసం చేసిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు రోజులు దగ్గర పడ్డాయని ఆయన పతనం నాగార్జునసాగర్ నుంచే ప్రారంభం కానుందని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి పేర్కొన్నారు. తన తనయుడు కుందూరు జైవీర్‌రెడ్డి చేపట్టిన 'గిరిజన చైతన్య యాత్ర'ఆదివారం నల్లగొండ జిల్లా తిరుమలగిరి మండలంలోని జాల్ తండా నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా బట్టువెంకన్నబావి తండాలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ మాయ మాటలకు లొంగకుండా ఆయన గడీలను బద్దలు కొట్టేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. శ్రీశైలం ఎడమకాలువ టన్నెల్ మొత్తం 51 కిలోమీటర్లు కాగా కాంగ్రెస్ హయాంలోనే 30 కిలోమీటర్ల పని పూర్తయిందని, పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం పది కిలోమీటర్లు మాత్రమే పూర్తి చేసిందని మిగతా 11 కిలోమీటర్లు తవ్వితే కానీ నీళ్లు రావని చెప్పారు. రైతుబంధు పేరుతో ప్రభుత్వం మోసం చేస్తోందని ఒక్క ఎకరం ఉన్న రైతులు రాష్ట్రంలో 20లక్షలు మాత్రమే ఉన్నారని, రెండు ఎకరాల లోపు ఉన్న రైతులు 18 లక్షల మంది మాత్రమేనని మిగతా వారంతా వందల ఎకరాలు ఉన్న భూస్వాములేనని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లలోనే రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, మహిళలకు పది లక్షల వరకు వడ్డీలేని రుణాలు అందిస్తామన్నారు.

## నల్లగొండలో అవమానించారు

- ఎంపీ కోమటిరెడ్డిపై చర్యలు తీసుకోకపోవడం పార్టీకి నష్టం
- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఠాక్రేకు చెరుకు సుధాకర్ లేఖ



**సాక్షి, హైదరాబాద్:** పార్టీలో జరుగుతున్న అవమానాలు తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నాయని టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్ర సందర్భంగా నల్లగొండలో జరిగిన అవమానం బహుజన వర్గాలకు చెందిన తెలంగాణ ఉద్యమ నాయకుడిగా తనకు మాత్రమే కాదని అన్నారు. ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీలో సోషల్ ఇంజనీరింగ్ తెలంగాణలో, ముఖ్యంగా నల్లగొండలో అమలవుతుందా లేదా అనే అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేకు ఆదివారం ఆయన లేఖ రాశారు. నల్లగొండలో భట్టి పాదయాత్ర సందర్భంగా నిర్వహించిన కార్నర్‌మీటింగ్ వేదికపై కేవలం నల్లగొండ నియోజకవర్గ నేతలే ఉండాలని, ఇతరులు దిగిపోవాలని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అనుచరులు హెచ్చరించడం, ఈ విషయంలో పార్టీ నేతలందరూ మౌనం వహించడం కాంగ్రెస్‌కు రావాల్సిన మైలేజీని దెబ్బతీసిందని ఆ లేఖలో పేర్కొన్నారు. తనను చంపుతానని తన కుమారుడికి ఫోన్ చేసి ఎంపీ కోమటిరెడ్డి బెదిరించడం, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఇతర పీసీసీ సభ్యులతో కలసి తాను ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, కనీసం దానిపై చర్చ జరపకపోవడం పార్టీ ప్రతిష్ఠకు నష్టం కలిగిస్తుందని అన్నారు. గతంలో కూడా ఇదే తరహా అవమానాలు జరిగాయని, టీపీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు తనను చైర్మన్‌గా నియమించాలని పార్టీ నిర్ణయించినా అడ్డుకున్నారని తెలిపారు. ఇలాంటి చర్యలు పార్టీకి నష్టమని, రాష్ట్ర ఇన్‌చార్జిగా ఈ అంశాలపై స్పందించాలని ఆ లేఖలో చెరుకు సుధాకర్ కోరారు.

## కొత్త కార్యదర్శులకు బాధ్యతలు

**జిల్లాల వారీగా అప్పగించిన కాంగ్రెస్ ● త్వరలో పర్యటనలు ప్రారంభం**

**సాక్షి, హైదరాబాద్:** ఏఐసీసీ నుంచి కొత్తగా తెలంగాణ కాంగ్రెస్‌కు వచ్చిన ఇద్దరు కార్యదర్శులకు పని విభజన జరిగింది. ఈ ఇద్దరితో పాటు ఇప్పటికే ఉన్న మరో కార్యదర్శికి ఉమ్మడి జిల్లాల వారీగా పార్టీ పర్యవేక్షణ (ఇన్‌చార్జి) బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే నిర్ణయం తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ముందు నుంచీ ఇన్‌చార్జి కార్యదర్శిగా ఉన్న రోహిత్‌చౌదరికి ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, కరీంనగర్ (సిరిసిల్ల అసెంబ్లీ మినహా) జిల్లాల బాధ్యతలు అప్పగించారు. కొత్తగా వచ్చిన కేరళకు చెందిన విష్ణునాథ్‌కు ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ జిల్లాలతో పాటు సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గ బాధ్యతలు ఇచ్చినట్టు సమాచారం. మరో కార్యదర్శి మన్సూర్ అలీఖాన్ (కర్ణాటక)కు ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ఆయా జిల్లాల్లోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ కార్యకలాపాలు, నేతల మధ్య సమన్వయం, ఏఐసీసీకి నివేదికలు లాంటి బాధ్యతలు వారు నిర్వర్తిస్తారని గాంధీభవన్ వర్గాలంటున్నాయి. పార్టీకి అనుబంధంగా ఉండే సంఘాల బాధ్యతలను కూడా ఈ ముగ్గురు కార్యదర్శులకు అప్పగించినప్పటికీ, ఎవరికి ఏ అనుబంధ సంఘం బాధ్యతలు ఇచ్చారన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

**పార్టీ గెలుపు కోసం కార్యాచరణ దిశగా..**

కొత్తగా నియమితులైన ఏఐసీసీ కార్యదర్శుల జిల్లాల పర్యటనలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. రోహిత్ చౌదరికి ఇప్పటికే రాష్ట్ర పార్టీపై కొంత అవగాహన ఉండడంతో ఆయన తన పనిని కొనసాగిస్తారని, కొత్తవారు మాత్రం ఈ నెలలోనే పర్యటనలు ప్రారంభించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వారికి కేటాయించిన జిల్లాలపై పూర్తిస్థాయిలో అవగాహన తెచ్చుకోవడంతో పాటు ఆయా జిల్లాల్లో పార్టీ గెలుపునకు అవసరమైన కార్యాచరణ రూపొందించే దిశలో వారు ముందుకెళ్లనున్నారు.

మంచి మాట



# సాధించాల్సిన లక్షణం ఐకమత్యం

ఐకమత్యంతో ఉండడం, మానవులు కలిసికట్టుగా కార్యోన్ముఖులు అవడం, మనుషుల్లో సమానత్వం అనేవి ప్రస్తుత పరిస్థితిలో మన సంఘానికి, దేశానికి, ప్రపంచానికి ఎంతో అవసరం. నిజానికి ఇవి ప్రస్తుతానికి మాత్రమే కాదు, ఎప్పటికీ తప్పకుండా అవసరం అయినవే. వర్తమానంలోలాగానే గతంలోనూ ఇవి నిజాయితీగానూ, నిజంగానూ మనలో చోటుచేసుకోలేదు. అందుకే మన వర్తమానం ఉండాల్సినంత ఫలవంతంగానూ, విజయవంతంగానూ లేదు. ఈ క్షేత్రవాస్తవాన్ని తెలుసుకుని మనం వీటిని ఆవాహన చేసుకోవాలి.

వేద వాఙ్మయంలోని సూక్తాల్లో సంవనన సూక్తం ఒకటి. ఇది ఋగ్వేదానికి చెందినదిగా చెప్పబడింది. కలిసికట్టుగా ఉండడం, కార్యోన్ముఖత్వం, సమానత్వం వీటిని ఉద్దేశిస్తూ, ఉవాచిస్తూ, ఉద్బోధిస్తూ సనాతన సాహిత్యం ఈ సంవనన సూక్తం ద్వారా విశ్వమానవాళికి యుక్తమైన చింతనను అందజేస్తోంది. ఇకనైనా మనం ముందుకు వచ్చి దాన్ని అనుసరించాల్సి ఉంది.

'సంసమిద్యువసే వృషన్నగ్నే విశ్వాన్యర్య ఆ' అంటూ మంచిని కురిపించే దైవమైన అగ్నీ! విశ్వమంతా ఇక ఐకమత్యంతో ఉండేట్టు చెయ్యి అని ఐకమత్యం ఆవశ్యకతను గుర్తెరిగి సంవనన సూక్తం ప్రార్థన చేసింది. ఈ విశ్వంలోని మానవులకు లుప్తం కాకుండా కావాల్సింది ఏమిటి? అది ఐకమత్యం కాకపోతే ఇంకేమిటి?? మనం ఆ ఐకమత్యాన్ని ఆకాంక్షించి సాధించాలి.

ఐకమత్యం తరువాత విశ్వమానవుల్ని కలిసికట్టుగా కార్యోన్ముఖులు అవండి, కలిసికట్టుగా మాట్లాడండి, మీ మనసుల్లో కలిసిపోయిన ఒకే అవగాహన నెలకొనాలి; మొదట్లో దేవతోపాసనలో ఏవిధంగా భాగమయ్యారో అలా కలిసికట్టుగా ఉండండి అని సూచిస్తూ 'సంగచ్ఛధ్వం సం వదధ్వం సం వో మానాంసి జానతామ్ దేవా భాగం యథా పూర్వే సంజానానా ఉపాసతే' అని తెలియజెప్పింది సంవనన సూక్తం.

> ఆలోచనలు ఒకటైతే బలం అన్న సార్వజనీనమైన, సార్వకాలికమైన, సకల శ్రేయస్కరమైన చింతనను మనం మస్తిష్కాల్లో సమ్మిళితం చేసుకోవాలి; మన అస్తిత్వానికి ప్రశాంతతను సమకూర్చుకుని సుఖంగానూ, సంతోషంగానూ జీవించాలి.

ఐకమత్యం, కలిసికట్టుగా పనిచెయ్యడం తరువాత మానవుల్లో ఉండాల్సింది సమానత్వం. అందుకే

'సమానో మన్త్రః సమితిః సమానీ సమానం మనః సహ చిత్తమేషామ్ సమానం మన్త్రమభి మన్త్రయే వః సమానేన వో హవిషా జుహోమి' అంటూ

మంత్రం అందరికీ సమానం, సభలు సమానత్వంతో ఉండాలి. మీ ఆలోచనలూ, చిత్తమూ సమానంగా ఉండాలి, మీ కోసం సమానంగా మంత్రాన్ని అభిమంత్రిస్తాం, మీ కోసం సమానంగా ఆహుతుల్తో ఆరాధిస్తాం అని సంవనన సూక్తం ద్రష్టలు గట్టిగా చాటారు.

అంటరానితనమో, భేద చింతనో వేదంలోనూ, సనాతన సాహిత్యంలోనూ లేదు అన్న సత్యాన్ని ఈ మాటల ద్వారా సరిగ్గా అర్థం చేసుకున్నాక, చక్కగా ఆకళింపు చేసుకున్నాక 'సమానీ వ ఆకూతిః సమానా హృదయాని వః సమానమస్తు వో మనో యథా వః సుసహాసతి' అంటూ మీ తలపులు లేదా సంకల్పాలు ఒకటే అయి ఉండాలి, మీ హృదయాల భావాలు ఒకటే అయి ఉండాలి, మీ ఆలోచనలు ఒక్కటై ఉండనీ. ఇలా మీలో మంచితనం బలం నెలకొనాలి అని సంవనన సూక్తం చేసిన దిశానిర్దేశాన్ని మనం అవగతం చేసుకోవాలి; అటుపై ఆచరణలోకి ఆహ్వానించి దాన్ని అమలులో నిలపాలి.

ఒక కుటుంబంలోని, ఒక సమాజంలోని, ఒక దేశంలోని, ఒక ప్రపంచంలోని మనుషుల్లో ఐకమత్యం, కలిసికట్టుతనం, సమానత్వం ఈ మూడూ లేకపోవడంవల్ల జరుగుతున్న హానికి ప్రతి మనిషీ గురి అవుతున్నాడు; కలుగుతున్న నష్టానికి ప్రతి మనిషీ బలి అవుతున్నాడు. ఎప్పుడో కాదు ఇప్పటికి ఇప్పుడు ముమ్మాటికి ఆ మూడిటిని మనకు మనం అన్వయించుకోవాలి; ఉన్న, రానున్న ముప్పుల్ని లేకుండా చేసుకోవాలి. మునుపటి ప్రమాదాలకు ముగింపు పలికి ఐకమత్యం, కలిసికట్టుతనం, సమానత్వం వీటితో ప్రమోదంగా మనం మునుముందుకు సాగుతూ ఉండాలి.

– రోచిష్మాన్

సన్నిధి

గురువాణి

# నీ ఆకలి, నీ నిద్ర నీదే కదా... మరి..!!!



నీవు ఎదగలేకుండా పోవడానికి కారణం ఎవరు ? నీకు సలహాలిచ్చేవారికోసం, నీకు సహాయపడేవారి కోసం చూస్తున్నావా? నీకు బంధువులు లేరా? వాళ్ళు నిన్ను పట్టించుకోవడంలేదా? నీకు స్నేహితులు, శ్రేయోభిలాషులెవరూ లేరా? వారు నీకు మార్గదర్శనం చేయడం లేదా? లేక... నీకు శత్రువులు ఎక్కువగా ఉన్నారా? వాళ్లు నిన్ను ముందుకు పోనీయడం లేదా? అంటే ఎవరో రావాలనీ, వాళ్ళు నిన్ను జాగ్రత్తగా నడిపించాలనీ, నీ ప్రతి కష్టంలో వారు నీకు తోడుగా నిలబడి దిశానిర్దేశం చేయాలని నీవు కోరుకుంటున్నావని అర్థం... దీనికి జగద్గురువయిన కృష్ణ పరమాత్మ ఏమంటున్నాడో చూడండి...

"ఉద్ధరేద్ ఆత్మనాత్మానమ్ నాత్మానమ్ అవసాదయేత్, ఆత్మైవ హై ఆత్మనో బంధుర్ ఆత్మైవ రిపుర్ ఆత్మనః"

– అంటే నీకు నీవే బంధువువు, నీకు నీవే స్నేహితుడివి, నీకు నీవే శత్రువివి. నీకు ఆకలివేస్తే నీవే తినాలి, నీకు నిద్రవస్తే నీవే నిద్ర పోవాలి, నీకు దాహం వేస్తే నీవే నీళ్లు తాగాలి...అలాగే నీకు కష్టం వచ్చినప్పుడు, నీకు సమస్యలు ఎదురయినప్పుడు ఎవరో వస్తారని, నిన్ను కటాక్షిస్తారని, నిన్ను ఉద్ధరిస్తారని ఎదురు చూస్తూ కూచోవద్దు. బంధువులు, స్నేహితులు, శత్రువులు బయట లేరు... నీలోనే ఉన్నారు. నీవు వారిని గుర్తిస్తే... నీకు ఇక ఏ చింతా ఉండదు. నీ నిద్ర నీవు పోయినట్లుగానే, నీ ఆకలి నీవు తీర్చుకున్నట్లుగానే... నీ కష్టాన్ని కూడా నీవే తీర్చుకుంటావు.

భగవంతుడు మనకు కొన్ని అద్భుతమయినవి ఇచ్చాడు. భువనం.. ఈ ప్రపంచాన్ని ఇచ్చాడు. నీ జీవితం వర్ధిల్లడానికి ప్రకృతిని ఇచ్చాడు. నీకు ఆహ్లాదమయినవి చూసి సంతోషించడానికి కళ్ళు ఇచ్చాడు.. నీకు ఇష్టమయినవి వినడానికి చెవులిచ్చాడు. తాకి అనుభూతి చెందడానికి చర్మానికి స్పర్శనిచ్చాడు. వాసనలు చూడడానికి ముక్కు ఇచ్చాడు... ఇలా చాలా ఇచ్చాడు... ఇవన్నీ నీకోసం, నీవు అనుభవించడానికే ఇచ్చాడు... అయితే ఇవన్నీ ధర్మచట్రంలో ఇమిడేటట్టు చూసుకోమన్నాడు... అంతే.. అదే చేసెయ్... ఇవన్నీ వదిలేసి మనసు పక్క చూపులు చూస్తున్నదనీ, ఎటో లాగుతున్నదనీ విచ్చలవిడిగా పోతే ... నీలో ఉన్న శత్రువును... నీవే ఉత్సాహపరిస్తే... నీ పతనానికి నీవే దారి ఏర్పాటు చేసుకుంటున్నట్లు అవుతుంది.

పిల్లలను కూర్చోబెట్టుకుని వారికి మంచీ చెడూ ఎలా చెబుతుంటావో... నీ మనసుకు కూడా ప్రతిరోజూ, ప్రతి క్షణం అలా చెబుతూ ఉండు... అప్పుడది నీకు ఆత్మబంధువుగా మారుతుంది. నీ శ్రేయస్సు కోరే నీ స్నేహితుడిగా, నీ శ్రేయోభిలాషిగా నీకు మార్గదర్శనం చేస్తుంది. నీ కంటికి కనురెప్ప ఉంది. అది నీ కంటిని ఎలా కాపాడుతుంటుందో నీ మనసును అనుక్షణం నీవు అలా కాపాడుతుండాలి. అదే నిన్ను నీవు ఉద్ధరించుకోవడం– అని పరమాత్మ గీతాబోధ చేసాడు. ఇంత కన్నా చెప్పడానికి ఎవరికయినా ఏముంటుంది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

తాత్త్వికథ

# భాషా మాధుర్యం



ఆయన ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు. ఢిల్లీలో స్థిరపడాల్సి వచ్చింది. ఖాళీగా ఉండటం దేనికని ఇంటి గేటుకు 'తెలుగు నేర్పించబడును' అని బోర్డు పెట్టించాడు.

'ఇక్కడెవరు తెలుగు నేర్చుకుంటారు? మీకు పిచ్చి కాకపోతేను...' అని కుటుంబ సభ్యులు ఆట పట్టించినా పట్టించుకోలేదు. ఆరు నెలలు గడిచినా ఎవ్వరూ రాలేదు. అయినా ఆయన నిరాశ చెందలేదు. ఎప్పుడో ఒక రోజు ఎవరో ఒకరు వస్తారని, తెలుగు నేర్చుకుంటారని ఆశగా ఉండేవాడు.

ఆయన అనుకున్నట్టుగానే ఒక రోజు సాయంత్రం పడవలాంటి కారు ఇంటి ముందర వచ్చి నిలుచుంది. అందులో నుంచి, మంచి పేరున్న ఓ వృద్ధ హిందీ రచయిత దిగాడు. తెలుగు నేర్పమని కోరాడు.

అందుకు సంతోషంగా సమ్మతిస్తూ ఎప్పుడెప్పుడు రావాలో, ఏయే పుస్తకాలు తెచ్చుకోవాలో...' లాంటివి చెప్పాడు తెలుగు పండితుడు.

అలాగేనని చెప్పి బయలు దేరుతున్న రచయితతో "ఈ వయసులో మీకు తెలుగు నేర్చుకోవాలని ఎందుకు అనిపించింది?" అని అడిగాడు.

"నేను ఈ మధ్యనే దక్షిణాది తీర్థయాత్రకు వెళ్ళాను. యాత్రలో భాగంగా తిరుమలకొండ కూడా వెళ్ళాను. అక్కడ వెంకటేశ్వర స్వామిని కీర్తిస్తూ రాసిన తాళ్ళపాక అన్నమయ్య సంకీర్తనలు విన్నాను. గుండె లోలోతు పొరల్ని తాకాయి ఆ కీర్తనలు. తెలుగు భాష నేర్చుకుంటే అన్నమయ్య రచనల్ని మరింత లోతుగా పరిశీలించవచ్చని భావించాను. అందుకే మీ దగ్గర తెలుగు నేర్చుకోవాలనుకున్నాను" అని బదులిచ్చాడు.

రచయిత మాటలు విన్న విశ్రాంత ఉపాధ్యాయుడి కళ్ళు తడి అయ్యాయి.

'అయ్యో... తెలుగువాడినై ఉండి నేను ఇప్పటివరకు అన్నమాచార్య కీర్తనలను ఆస్వాదించలేకపోయానే...' అని బాధ పడ్డాడు.

ఒకపక్క ఆ రచయితకు తెలుగు పాఠాలు చెబుతూనే అన్నమయ్య గ్రంథాలను చదవడం, వినడం ప్రారంభించాడు. అన్నమయ్య కీర్తనల్లోని మాధుర్యాన్ని ఆస్వాదించసాగాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

## సినిమా

# గ్రీన్‌సిగ్నల్ ఇస్తారా?



రవితేజ

రవితేజ యమా స్పీడ్‌గా సినిమాలు చేస్తున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రాలు 'టైగర్ నాగేశ్వరరావు' అక్టోబరు 20న, 'ఈగిల్' జనవరిలో రిలీజ్ కానున్నాయి. అయితే ఈ చిత్రాల తర్వాత రవితేజ ఏ దర్శకుడితో సినిమా చేస్తారు? అనే చర్చ కొంతకాలంగా ఇండస్ట్రీలో వినిపిస్తోంది. గోపీచంద్ మలినేని, అనుదీప్ వంటి దర్శకుల పేర్లు తెర్పైకి వచ్చాయి. అయితే తాజాగా జీవీఆర్ వాసు చెప్పిన ఓ స్టోరీ లైన్‌కు రవితేజ ఇంప్రెస్ అయ్యారని, పూర్తి కథ విన్న తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై తుది నిర్ణయం తీసుకుంటారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మించనుందనే ప్రచారం కూడా జరుగుతోంది. మరి.. జీవీఆర్ వాసు కథకి రవితేజ ఫైనల్ గ్రీన్ సిగ్నల్ ఇస్తారా? లేదా? వేచి చూడాలి.

# వారికి కాజల్ ఓ ఉదాహరణ


– దర్శకుడు శేఖర్ కమ్ముల

"మగధీర' సినిమాలో మిత్రవిందగా కాజల్ ఎలా ఉన్నారో ఇప్పుడూ అలానే ఉన్నారు. పెళ్లి చేసుకున్న తర్వాత కూడా హీరోయిన్స్ వారి కెరీర్‌ను కొనసాగించవచ్చనడానికి కాజల్ ఓ ఉదాహరణగా నిలుస్తున్నారు. 'సత్యభామ' సినిమా గ్లింప్స్ బాగుంది.. టీమ్‌కు ఆల్ ది బెస్ట్" అని దర్శకుడు శేఖర్ కమ్ముల అన్నారు. కాజల్ అగర్వాల్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'సత్యభామ'. అఖిల్ డేగల దర్శకత్వంలో అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాస రావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. నేడు (సోమవారం, జూన్ 19) కాజల్ బర్త్ డే. ఈ సందర్భంగా ఆదివారం 'సత్యభామ' సినిమా గ్లింప్స్‌ని శేఖర్ కమ్ముల విడుదల చేశారు. కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ– "తెలుగుచిత్ర పరిశ్రమ నాకు ఇల్లు లాంటింది. తెలుగు ఆడియన్స్ బెస్ట్. వారి ప్రేమ, ప్రోత్సాహం వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నా" అన్నారు. "నా తొలి సినిమాకు హీరోగా నిలిచిన కాజల్‌గారికి ధన్యవాదాలు" అన్నారు అఖిల్ డేగల. "మంచి చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తాం" అన్నారు శ్రీనివాస్, బాబీ. ఈ కార్యక్రమంలో స్క్రీన్‌ప్లే, చిత్ర సమర్పకుడు శశికిరణ్ తిక్క, కథారచయితలు రమేష్, ప్రశాంత్, కెమెరామేన్ మోహిత్ కృష్ణ, క్రియేటివ్ ప్రొడ్యూసర్ రాజీవ్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.



శశికిరణ్, అఖిల్, శేఖర్ కమ్ముల, కాజల్, శ్రీనివాస రావు, బాబీ

# నాన్‌స్టాప్‌గా నలభై రోజులు!



మహేశ్‌బాబు

'గుంటూరు కారం' సెట్స్‌లోకి మహేశ్‌బాబు మరోసారి అడుగుపెట్టడానికి ఇంకాస్త సమయం పట్టేలా ఉంది. మహేశ్ బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం'. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో పూజా హెగ్డే, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్నారు. కాగా ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ ఈ నెల రెండో వారంలో ప్రారంభం కావాల్సి ఉంది. కానీ జూలై మొదటి వారంలో ప్రారంభించాలని యూనిట్ భావిస్తోందని ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అలాగే జూలైలో ప్రారంభమయ్యే కొత్త షెడ్యూల్ చిత్రీకరణ నాన్‌స్టాప్‌గా దాదాపు 40రోజులకుపైగా జరుగుతుందనే టాక్ కూడా వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల చేయనున్నట్లు గతంలో మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

# హారర్ సినిమాలు చేయకూడదనుకున్నా

– నందితా శ్వేత



అనూప్, నందితా శ్వేత, శంకర్, శంకర్ మార్తాండ్

"హారర్ చిత్రాల్లో నటించకూడదనుకున్నాను. కానీ 'ఓ మంచి ఘోస్ట్' సినిమా కథ నచ్చడంతో చేశాను. ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది" అని హీరోయిన్ నందితా శ్వేత అన్నారు. శంకర్ మార్తాండ్ దర్శకత్వంలో నందితా శ్వేత, 'వెన్నెల' కిశోర్, 'షకలక' శంకర్, నవమి గాయక్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. అభినిక ఐనాభాతుని నిర్మించారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'పాప నువ్వు తోపు..' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. సింహాచలం లిరిక్స్ అందించిన ఈ పాటను బాలసూరన్న పాడారు. ఈ పాట విడుదల వేడుకలో శంకర్ మార్తాండ్ మాట్లాడుతూ–"హారర్ అండ్ కామెడీ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. హారర్ కథలకు మ్యూజిక్ చాలా ముఖ్యం.. అనూప్‌గారు ప్రాణం పెట్టి ఈ సినిమాకు సంగీతం అందించారు" అన్నారు. "'ఓ పాప నువ్వు తోపు..' పాట ఆకట్టుకుంటుంది" అన్నారు అనూప్ రూబెన్స్.

# మా నాన్న సూపర్ హీరో!



సుధీర్‌బాబు

'మా నాన్న సూపర్ హీరో' అంటున్నారు సుధీర్ బాబు. 'లూజర్' వెబ్‌సిరీస్ ఫేమ్ అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో సుధీర్‌బాబు హీరోగా రూపొందుతున్న చిత్రానికి 'మా నాన్న సూపర్ హీరో' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ మూవీలో ఆర్నా హీరోయిన్. సీఏఎం ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి వి సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సునీల్ బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆదివారం (జూన్ 18) ఫాదర్స్ డే సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు మేకర్స్. "తండ్రీకొడుకుల ప్రేమ, అనుబంధాలకు నిజమైన అర్థాన్ని తెలియజేసేలా 'మా నాన్న సూపర్ హీరో' ఉంటుంది. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేస్తాం" అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రంలో రాజు సుందరం ఓ కీలక పాత్రలో నటిస్తూనే, కొరియోగ్రాఫర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సాయిచంద్, సాయాజీ షిండే, శశాంక్, ఆమని, హర్షిత్ రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: జై క్రిష్, కెమెరా: సమీర్ కల్యాణి.


# ఇదేం జీవితం?



రామకృష్ణ గౌడ్, సాయిప్రసన్న, శ్రీకాంత్

శ్రీకాంత్ గుర్రం, సాయిప్రసన్న జంటగా ఎస్ఎస్ శాన్నీ దర్శకత్వంలో 'ఇది ఏం జీవితం రా అయ్యా' సినిమా ప్రారంభమైంది. బొక్కిసం భూలక్ష్మి నిర్మిస్తున్నారు. హీరో హీరోయిన్లపై చిత్రీకరించిన తొలి సన్నివేశానికి నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ క్లాప్ ఇచ్చారు. "మిడిల్ క్లాస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. రాజమండ్రి సమీపంలో షూటింగ్ జరుగుతుంది" అన్నారు ఎస్ఎస్ శాన్నీ.

# రాకేష్ మాస్టర్ ఇకలేరు



తెలుగు చలన చిత్రపరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ నృత్య దర్శకుడు ఎస్.రామారావు అలియాస్ రాకేష్ మాస్టర్(53) ఆదివారం మృతిచెందారు. వారం క్రితం ఓ సినిమా షూటింగ్ కోసం విశాఖపట్నం, భీమవరం వెళ్లి వచ్చిన ఆయన అప్పటినుంచి అనారోగ్యం పాలయ్యారు. ఆదివారం రక్త విరోచనాలు కావడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి ప్రాంతంలో రాకేష్ మాస్టర్ జన్మించారు. ఆయన అసలు పేరు ఎస్.రామారావు. 10 ఏళ్ల వయస్సులో డిస్కో డాన్స్ చూసి డ్యాన్సర్‌గా మారాలనుకున్నారు. కానీ, ఎక్కడ నేర్చుకోవాలి? ఎవరు నేర్పుతారు? అని తెలియక టీవీలో వచ్చే పాటలను చూసి డ్యాన్స్ నేర్చుకున్నారు. ఆ తర్వాత తిరుపతి టౌన్‌కి వెళ్లి ఓ డ్యాన్స్ స్కూల్ ప్రారంభించారు. తొలిరోజుల్లో కేవలం రూ.5 ఫీజుతో డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చేవారు. కొన్ని రోజుల తర్వాత సినిమా అవకాశాల కోసం చెన్నై వెళ్లారు. చాన్స్‌లు రాకపోవడంతో మళ్లీ తిరుపతికి వచ్చి డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్‌ను నడిపారు. ఆ తర్వాత ముక్కు రాజు మాస్టర్ దగ్గర కొంతకాలం పనిచేశారు రాకేష్ మాస్టర్. 'ఆట', 'ఢీ' లాంటి డ్యాన్స్ రియాలిటీ షోల ద్వారా డ్యాన్స్ మాస్టర్‌గా కెరీర్‌ను మొదలు పెట్టారాయన. 'ఢీ' షోలో బషీర్ అనే కుర్రాడికి మాస్టర్‌గా వ్యవహరిస్తున్న సమయంలో ఆ షోకి ఓ జడ్జిగా వ్యవహరించిన ప్రముఖ డ్యాన్స్ మాస్టర్, నటుడు ప్రభుదేవాతో 'తెలుగు తెలిసిన వాళ్లే జడ్జిలుగా ఉండాలి' అంటూ కామెంట్స్ చేసి, వార్తల్లో నిలిచారు రాకేష్ మాస్టర్. వేణు తొట్టెంపూడి హీరోగా నటించిన 'చిరునవ్వుతో' లో 'నిన్నలా మొన్నలా లేదురా..' పాటతో సినిమాల్లో కొరియోగ్రాఫర్‌గా తొలి అవకాశం అందుకున్నారాయన. ఆ తర్వాత 'లాహిరి లాహిరి లాహిరిలో, దేవదాసు, సీతారామరాజు, యువరాజు, గర్ల్ ఫ్రెండ్, బడ్జెట్ పద్మనాభం, మనసిచ్చాను, సీతయ్య, అమ్మో పోలీసోళ్లు' వంటి దాదాపు 1500 చిత్రాలకుపైగా కొరియోగ్రఫీ చేశారు రాకేష్ మాస్టర్. 'గ్లోబల్ పీస్ యూనివర్సిటీ' నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారాయన. ప్రభాస్ వంటి పలువురు హీరోలకు డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చారు. టాలీవుడ్‌లోని పలువురు స్టార్ హీరోలందరికీ కొరియోగ్రఫీ చేసిన ఘనత ఆయన సొంతం. ప్రస్తుతం తెలుగులో అగ్ర కొరియోగ్రాఫర్లుగా ఉన్న శేఖర్ మాస్టర్, జానీ మాస్టర్ రాకేష్ మాస్టర్ శిష్యులే కావడం విశేషం. ఓ టీవీ చానల్‌లో ప్రసారం అవుతున్న షోలో పలు స్కిట్లు చేసి, బుల్లితెర ప్రేక్షకుల్ని తనదైన శైలిలో నవ్వించారు రాకేష్ మాస్టర్. కొంతకాలంగా ఆయన సినిమాలకు దూరంగా ఉన్నారు. అయితే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండేవారు. యూట్యూబ్ చానల్స్ వేదికగా పలువురు సెలబ్రిటీలపై వివాదాస్పద ఇంటర్వ్యూలు ఇచ్చి ఇటీవల మళ్లీ ట్రెండ్ అయ్యారాయన. వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో వారి అభిమానుల నుంచి రాకేష్ మాస్టర్‌కి, ఆయన కుటుంబానికి బెదిరింపులు వచ్చేవి. ఈ కారణంగా ఆయన కుటుంబానికి దూరంగా అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఓ అనాథ ఆశ్రమంలో ఉంటూ వచ్చారు. ఆయనకు భార్య లక్ష్మి, కుమారుడు చరణ్‌తేజ్, కుమార్తె శ్రీజ ఉన్నారు. రాకేష్ మాస్టర్ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు తమ సంతాపం తెలిపారు. కాగా హైదరాబాద్‌లోని బోరబండలో నేడు రాకేష్ మాస్టర్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

**మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తోనే..**

"ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు రాకేష్ మాస్టర్‌ని గాంధీ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. డయాబెటిక్ పేషెంట్ కావడం, సివియర్ మెటబాలిక్ ఎసిడోసిస్ కావడంతో మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ అయి సాయంత్రం 5గంటలకు మృతి చెందారు" అని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు మీడియాకు తెలిపారు.

# సంక్రాంతికి జాతర



ప్రజ్వల్

కన్నడ నటుడు దేవరాజ్ పెద్ద కుమారుడు ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా నటించనున్న చిత్రం 'జాతర'. ఉదయ్ నందనవనమ్ దర్శకత్వంలో వర్ధమాన్, లోటస్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై గోవర్ధన్ రెడ్డి నిర్మించనున్న ఈ సినిమా షూటింగ్ ఆగస్టులో ప్రారంభంకానుంది. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ–"'జాతర'కి మంచి కథ కుదిరింది. ప్రజ్వల్‌కి స్క్రిప్ట్ నచ్చడంతో వెంటనే ఓకే చెప్పేశారు. బి. వాసుదేవ్ రెడ్డి కథకు ఉదయ్ నందనవనమ్ ఇచ్చిన ట్రీట్మెంట్, స్క్రీన్ ప్లే 'జాతర' స్క్రిప్ట్‌ను మరింత కొత్తగా మార్చాయి. హైదరాబాద్, బళ్లారి లొకేషన్స్‌లో చిత్రీకరణ జరుపుతాం" అన్నారు. "ఈ సినిమాలో ప్రేమ కథ ఎంత అందంగా ఉంటుందో, నేపథ్యం కూడా అంతే కొత్తగా ఉంటుంది. ప్రస్తుతం నటీనటుల ఎంపిక జరుగుతోంది. వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమా విడుదల చేస్తాం" అన్నారు ఉదయ్ నందనవనమ్. పాన్ ఇండియా చిత్రంగా రూపొందనున్న ఈ మూవీకి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

**సాత్విక్-చిరాగ్ నెగ్గిన టైటిల్స్**

| ఏడాది | టోర్నీ | టోర్నీ స్థాయి |
|---|---|---|
| 2018 | హైదరాబాద్ ఓపెన్ | సూపర్-100 |
| 2019 | థాయ్‌లాండ్ ఓపెన్ | సూపర్-500 |
| 2022 | ఇండియా ఓపెన్ | సూపర్-500 |
| 2022 | ఫ్రెంచ్ ఓపెన్ | సూపర్-750 |
| 2023 | స్విస్ ఓపెన్ | సూపర్-300 |
| 2023 | ఇండోనేసియా ఓపెన్ | సూపర్-1000 |

**ఇతర ఫలితాలు**

| | | |
|---|---|---|
| 2018 | కామన్వెల్త్ గేమ్స్ | రజతం |
| 2022 | కామన్వెల్త్ గేమ్స్ | స్వర్ణం |
| 2022 | ప్రపంచ చాంపియన్‌షిప్ | కాంస్యం |
| 2023 | ఆసియా చాంపియన్‌షిప్ | స్వర్ణం |
| 2022 | థామస్ కప్ | టీమ్ స్వర్ణం |

**3** ఇండోనేసియా ఓపెన్ టైటిల్ భారత ప్లేయర్లకు దక్కడం ఇది మూడోసారి. మహిళల సింగిల్స్‌లో సైనా (2009, 2010, 2012), పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్ (2017) టైటిల్స్ గెలిచారు.

“ టోర్నీ విజయంకంటే ఆరోన్-యిక్‌లను ఓడించడమే గొప్పగా అనిపిస్తోంది. గతంలో గెలుపునకు చేరువగా వచ్చి కూడా ఓడిపోయాం. ఈసారి పక్కా ప్రణాళికతో వచ్చి ఫలితం సాధించాం. ఇలాంటి విజయాలకు ఇది ఆరంభం మాత్రమే. ఇకపై మరిన్ని పెద్ద టోర్నీల్లో గెలవాలి. గత రెండు టోర్నీల్లో వైఫల్యాల తర్వాత ఆత్మవిమర్శ చేసుకున్నాం. ఈసారి బాగా ఆడకపోతే తొలి రౌండ్‌లోనే ఓడిపోవచ్చు, అందుకే కోచ్‌లు, ఫిజియో, ట్రైనర్ల సహకారంతో చాలా కష్టపడ్డాం. గోపీ సర్ చాలా రోజుల తర్వాత మా మ్యాచ్‌కు వచ్చారు. ఆయన అక్కడ ఉండటం మా ఉత్సాహాన్ని పెంచింది. ఇండోనేసియాలో గెలుపు అంత సులువు కాదు. దిగ్గజాలంతా బరిలోకి దిగుతారు. ఒకప్పుడు ఈ టోర్నీలో ఆడితే చాలనుకునే రోజునుంచి చాంపియన్‌గా నిలవడం వరకు ఇదో సుదీర్ఘ ప్రయాణం.

–సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి

# అపూర్వ జోడీ... అద్భుత విజయం



**ఇండోనేసియా ఓపెన్ డబుల్స్ విజేతగా సాత్విక్-చిరాగ్ ద్వయం**

**ఈ ఘనత సాధించిన తొలి భారతీయ జోడీగా గుర్తింపు**

**ఫైనల్లో ప్రపంచ చాంపియన్ జంటపై విజయం**

**కెరీర్‌లో తొలిసారి సూపర్-1000 టైటిల్ కైవసం**

**రూ. 75 లక్షల 77 వేల ప్రైజ్‌మనీ సొంతం**

**జకార్తా వేదికగా ఆదివారం అద్భుతం చోటు చేసుకుంది. గతంలో ఏ భారతీయ బ్యాడ్మింటన్ జోడీకి సాధ్యంకాని ఘనతను సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం సుసాధ్యం చేసి చూపించింది. ప్రతిష్టాత్మక ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీలో ఈ భారత జంట తొలిసారి విజేతగా అవతరించింది. తద్వారా డబుల్స్ విభాగంలో ఈ ఘనత సాధించిన మొదటి జోడీగా కొత్త చరిత్ర సృష్టించింది. గత ఐదేళ్లుగా అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో తమ విజయాలతో భారత డబుల్స్ విభాగానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన సాత్విక్-చిరాగ్ జోడీ తాజా గెలుపుతో తమ స్థాయిని మరింత ఎత్తుకు పెంచుకుంది. క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ జంటను ఓడించి సంచలనం సృష్టించిన సాత్విక్-చిరాగ్... ఫైనల్లో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ జోడీని కూడా బోల్తా కొట్టించి ఔరా అనిపించింది.**

**జకార్తా:** నిరీక్షణ ముగిసింది. డబుల్స్ విభాగంలో భారత బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఖాతాలో తొలిసారి వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీ టైటిల్ చేరింది. ప్రతిష్టాత్మక ఇండోనేసియా ఓపెన్ మరోసారి భారత్‌కు కలిసొచ్చింది. గతంలో సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్ సింగిల్స్ విభాగాల్లో విజేతగా నిలువగా... పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం మొదటిసారి చాంపియన్‌గా అవతరించింది. తమ కెరీర్‌లో ఫైనల్ చేరుకున్న తొలి సూపర్-1000 టోర్నీలోనే సాత్విక్-చిరాగ్ ద్వయం టైటిల్ సాధించడం విశేషం. ఆదివారం జరిగిన ఫైనల్లో ప్రపంచ ఆరో ర్యాంక్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి 21-17, 21-18తో ప్రపంచ మూడో ర్యాంక్ జంట, ప్రస్తుత ప్రపంచ చాంపియన్స్‌గా ఉన్న ఆరోన్ చియా-సో వుయ్ యిక్ (మలేసియా)పై గెలుపొందింది. ఈ మ్యాచ్‌కు ముందు 2017 నుంచి ఇప్పటి వరకు ఆరోన్ చియా-సో వుయ్ యిక్‌లతో ఎనిమిదిసార్లు తలపడిన సాత్విక్-చిరాగ్‌లకు ఎనిమిదిసార్లూ ఓటమి ఎదురుకాగా... తొమ్మిదో ప్రయత్నంలో తొలిసారి ఈ మలేసియా టాప్ జోడీపై గెలిచారు.

విజేతగా నిలిచిన సాత్విక్-చిరాగ్ జోడీకి 92,500 డాలర్ల (రూ. 75 లక్షల 77 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 12,000 ర్యాంకింగ్ పాయింట్లు... రన్నరప్ ఆరోన్ చియా-సో వుయ్ యిక్ జంటకు 43,750 డాలర్ల (రూ. 35 లక్షల 84 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 10,200 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

**పక్కా వ్యూహంతో...**

గతంలో మలేసియా జోడీ చేతిలో ఎదురైన ఎనిమిది పరాజయాలను విశ్లేషించి ఈసారి ఎలాగైనా నెగ్గాలనే పట్టుదలతో భారత జోడీ బరిలోకి దిగింది. ఎలా ఆడితే తమ ప్రత్యర్థి జంట ఆట కట్టించే అవకాశముందో అదే రకంగా సాత్విక్-చిరాగ్ ద్వయం ఆడింది. సుదీర్ఘ ర్యాలీలను ఆడుతూనూ పదునైన స్మాష్ షాట్‌లతో వాటికి ఫినిషింగ్ టచ్ ఇచ్చి సాత్విక్-చిరాగ్ సత్తా చాటుకున్నారు. తొలి గేమ్ ఆరంభంలో ఒకదశలో 3-7తో వెనుకబడిన సాత్విక్-చిరాగ్ నెమ్మదిగా తేరుకున్నారు. వరుసగా ఆరు పాయింట్లు గెలిచి 9-7తో ఆధిక్యంలోకి వచ్చారు. అనంతరం మలేసియా జోడీ స్కోరును 9-9 వద్ద సమం చేసినా... సాత్విక్-చిరాగ్ తమ వ్యూహాలకు మరింత పదును పెట్టి ప్రత్యర్థి జంటపై ఒత్తిడి పెంచి వరుసగా మూడు పాయింట్లతో 12-9తో మళ్లీ ఆధిక్యంలోకి వచ్చారు ఆ తర్వాత భారత జోడీ ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని తొలి గేమ్‌ను దక్కించుకుంది. రెండో గేమ్‌లో స్కోరు 8-7 వద్ద సాత్విక్-చిరాగ్ వరుసగా మూడు పాయింట్లు గెలిచి 11-7తో... ఆ తర్వాత స్కోరు 14-11 వద్ద ఈసారి వరుసగా నాలుగు పాయింట్లు నెగ్గి 18-11తో ఆధిక్యాన్ని పెంచుకున్నారు. చివర్లో 20-14 వద్ద వరుసగా సాత్విక్-చిరాగ్ వరుసగా నాలుగు పాయింట్లు కోల్పోయి ఆధిక్యం 20-18కి తగ్గడంతో ఒత్తిడికి లోనయ్యారు. అయితే మలేసియా జోడీ అనవసర తప్పిదంతో భారత జోడీకి ఒక పాయింట్ రావడంతో విజయం ఖాయమైంది.

**వరల్డ్ టూర్ టోర్నీలు అంటే...**

HSBC BWF World Tour

ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) వరల్డ్ టూర్‌ను ఆరు స్థాయిలుగా విభజించారు. ఏడాదిలో నాలుగు సూపర్-1000 టోర్నీలు (ఒక్కో టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ: 12 లక్షల 50వేల డాలర్లు), ఆరు సూపర్-750 టోర్నీలు (ఒక్కో టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ: 8 లక్షల 50 వేల డాలర్లు), ఏడు సూపర్-500 టోర్నీలు (ఒక్కో టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ: 4 లక్షల 20 వేల డాలర్లు)...11 సూపర్-300 టోర్నీలు (ఒక్కో టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ: 2 లక్షల 10 వేల డాలర్లు) ఉంటాయి. వీటితోపాటు సీజన్ ముగింపు టోర్నీ వరల్డ్ టూర్ ఫైనల్స్ (మొత్తం ప్రైజ్‌మనీ: 20 లక్షల డాలర్లు) కూడా జరుగుతుంది. దాంతోపాటు సూపర్-100 టోర్నీలు (ఒక్కో టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ: 1 లక్ష డాలర్లు) కూడా నిర్వహిస్తారు. టోర్నీ స్థాయిని బట్టి ర్యాంకింగ్ పాయింట్లలో, ప్రైజ్‌మనీలో తేడా ఉంటుంది. సూపర్-1000 టోర్నీలలో అత్యధిక పాయింట్లు, అత్యధిక ప్రైజ్‌మనీ లభిస్తుంది.

# మరింత ఎత్తుకు...

- మేటి జోడీగా ఎదిగిన సాత్విక్-చిరాగ్
- అంతర్జాతీయ టోర్నీల్లో మంచి ఫలితాలు
- ఒలింపిక్స్ పతకమే లక్ష్యంగా ముందుకు




ఫిజియో కిరణ్, చీఫ్ కోచ్ గోపీచంద్, ఫిట్‌నెస్ ట్రైనర్ గణేశ్, డబుల్స్ కోచ్ మథియాస్ బోలతో సాత్విక్-చిరాగ్

అంతా బాగుంది కానీ ఆరోన్ చియా-సో వుయ్ యిక్ జోడీపై ఎప్పుడు గెలుస్తారు?... గత నెలలో ఆసియా చాంపియన్‌షిప్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ విజేతగా నిలిచిన తర్వాత భారత డబుల్స్ కోచ్ మథియాస్ బోను అడిగిన ప్రశ్న ఇది! 'త్వరలోనే' అంటూ చిరునవ్వుతో బో దీనికి సమాధానమిచ్చాడు. ఆ సమయంలో అతనిలో ఆత్మవిశ్వాసం చూస్తే ఫలితం రాబట్టగలడనిపించింది. నిజంగానే నెల రోజులకే అతను ఆశించిన విజయం దక్కింది. వారిద్దరి ఆట గత కొంత కాలంగా ఎంత మెరుగైందో తెలిసిన కోచ్‌గా, వారిపై ఉన్న నమ్మకంతో మథియాస్ ఈ వ్యాఖ్యలు చేశాడు. ఇప్పటికే ఎనిమిదిసార్లు ఓడిన ప్రత్యర్థిపై సాత్విక్-చిరాగ్ మరో ప్రయత్నంలోనైనా గెలవగలరా అనిపించిన పరిస్థితి అది. కానీ భారత ద్వయం అద్భుత ఆటతో తమ కోచ్ కోరికను నెరవేర్చారు. గత ఐదేళ్లుగా అంతర్జాతీయ సర్క్యూట్‌లో నిలకడగా రాణిస్తూ వరుస విజయాలు సాధిస్తూ వచ్చిన ఈ జోడీ ఇప్పుడు మరో ప్రతిష్టాత్మక టోర్నీలో సత్తా చాటింది. కొన్నాళ్ల క్రితమే కెరీర్‌లో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమంగా నాలుగో స్థానానికి చేరిన భారత జంట స్థాయికి తగ్గ ప్రదర్శనతో చెలరేగుతోంది.

- 2019లో థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్-500 టోర్నీ గెలవడంతో సాత్విక్-చిరాగ్ బీడబ్ల్యూఎఫ్ వేదికపై ప్రధాన ఆకర్షణగా మారారు. అయితే కోవిడ్, తదనంతర పరిణామాల్లో చాలా మంది లాగే వీరిద్దరి ఆట కూడా లయ తప్పింది. దాంతో చెప్పుకోదగ్గ విజయాలు దక్కలేదు. ముఖ్యంగా 2021లో ఎన్నో అంచనాలు పెట్టుకున్న టోక్యో ఒలింపిక్స్‌లో వీరు నిరాశపర్చారు. కనీసం క్వార్టర్ ఫైనల్‌కు కూడా చేరలేకపోయారు. అయితే ఆ తర్వాత ఈ భారత జోడీ తీవ్రంగా శ్రమించింది. ముఖ్యంగా ఎండ్‌గేమ్‌లో తమకు ఇబ్బందిగా మారిన ఆటను మెరుగుపర్చుకోవడంతో పాటు మానసికంగా కూడా దృఢంగా మారింది. ఒకప్పుడు ఒత్తిడిలో ఒక పాయింట్ కోల్పోతే ఆ తర్వాత వరుసగా 2-3 పాయింట్లు చేజార్చుకునేవారు. అలాంటి స్థితిని వీరు అధిగమించారు. దాంతో 2022లో విజయాలు నడిచొచ్చాయి. సూపర్-500, సూపర్-750 టోర్నీల్లో టైటిల్స్ సాధించిన ఈ జోడీ కామన్వెల్త్ గేమ్స్, థామస్ కప్‌లాంటి ఈవెంట్లలో కూడా స్వర్ణాలతో మెరిసింది. అన్నింటికి మించి ఏడాది క్రితం ఎక్కడ ఒలింపిక్స్ ఓడారో అదే టోక్యో వేదికపై వరల్డ్ చాంపియన్‌షిప్ సాధించిన పతకం వీరిద్దరి స్థాయిని మరింత పెంచింది.
- భారత బ్యాడ్మింటన్ చరిత్రలో డబుల్స్ విభాగంలో గొప్ప ఘనతలు చాలా తక్కువగా నమోదయ్యాయి. గుత్తా జ్వాల-అశ్విని పొన్నప్ప వరల్డ్ చాంపియన్‌షిప్‌లో సాధించిన కాంస్యమే అన్నింటికంటే మెరుగైన ప్రదర్శన. పురుషుల డబుల్స్‌లోనైతే అదీ లేదు. కానీ సాత్విక్-చిరాగ్ జత కట్టిన తర్వాత టోర్నీ ఏదైనా ఈ ఈవెంట్‌లో కచ్చితంగా పతకం మన ఖాతాలో చేరుతుందనే భరోసా పెరిగింది. ముఖ్యంగా డబుల్స్‌కు కూడా ప్రత్యేక కోచ్‌ను నియమించాలనే భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) నిర్ణయం వీరిద్దరికి ఎంతో మేలు చేసింది. సాత్విక్-చిరాగ్ విజయాల్లో కోచ్ మథియాస్ బో పాత్ర కూడా ఎంతో ఉంది. డెన్మార్క్‌కు చెందిన మాజీ ఆటగాడు ఒకప్పుడు డబుల్స్‌లో వరల్డ్ నంబర్‌వన్‌గా నిలిచాడు. టోక్యో ఒలింపిక్స్‌కు ముందు తాత్కాలికంగా మథియాస్ జట్టుకు కోచ్‌గా ఉన్నాడు కానీ ఆటగాళ్ల గురించి తెలుసుకునేందుకు కూడా అది సరిపోలేదు. ఒలింపిక్స్ తర్వాత సుమారు ఆరు నెలల పాటు మన జట్టుకు కోచ్ లేడు. అయితే చివరకు 'బాయ్' మళ్లీ మథియాస్‌నే సరైన వ్యక్తిగా భావించి 2022 ఏప్రిల్‌లో తీసుకు రాగా... ఆ తర్వాత భారత ద్వయం ఆట దూసుకుపోయింది.
- ఈ ఏడాది ఆరంభంలో గాయం కారణంగా సాత్విక్ రెండు నెలల పాటు ఆటకు దూరమయ్యాడు. ఆ సమయంలో ధ్రువ్ కపిలతో చిరాగ్ జత కట్టగా, సరైన ఫలితాలు రాలేదు. దీనిని బట్టి ఈ ద్వయం మధ్య 'బాండింగ్' ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. కోలుకున్న తర్వాత సాత్విక్-చిరాగ్ స్విస్ ఓపెన్ విజయంతో మళ్లీ దారిలోకి వచ్చారు. ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణంతో ఆ జోరు కొనసాగగా... ఇప్పుడు సూపర్-1000లాంటి పెద్ద ఈవెంట్‌లో సాధించిన టైటిల్ వారి స్థాయిని మరింత పెంచింది. ఈ ఏడాది ఆసియా క్రీడలు ఉన్నాయి. సహజంగానే చైనా, మలేసియా, ఇండోనేసియా లాంటి పటిష్ట జట్ల నుంచి పోటీ ఎదురయ్యే అవకాశం ఉన్నా... తాజా ఫామ్‌ను బట్టి చూస్తే మరో పతకం ఖాయం. అయితే 'టోక్యో' గాయాలు మాన్పేందుకు 'పారిస్' పిలుస్తోంది. ఇదే దూకుడు, ఇదే తరహా ఆటను కొనసాగిస్తే 2024 పారిస్ ఒలింపిక్స్‌లో పతకం సాధించాలనే స్వప్నం సాకారం అయ్యేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయి. ఇకపై సాత్విక్-చిరాగ్ ఏకైక లక్ష్యం కూడా అదే అనడంలో సందేహం లేదు.

–సాక్షి క్రీడా విభాగం

## సీఎం వైఎస్ జగన్ అభినందన

**సాక్షి, అమరావతి:** ప్రతిష్టాత్మక ఇండోనేషియా ఓపెన్ పురుషుల డబుల్స్ టైటిల్‌ను సాధించిన ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్‌ను ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అభినందించారు. భవిష్యత్తులో జరిగే టోర్నీల్లో సాత్విక్-చిరాగ్ జంట మరిన్ని విజయాలు సాధించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## ప్రపంచ చాంపియన్‌షిప్‌కు మురళీ శ్రీశంకర్ అర్హత



**భువనేశ్వర్:** భారత స్టార్ లాంగ్‌జంపర్ మురళీ శ్రీశంకర్ ఆగస్టులో హంగేరిలో జరిగే ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించాడు. ఇక్కడ జరుగుతున్న జాతీయ సీనియర్ అంతర్ రాష్ట్ర అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో కేరళకు చెందిన శ్రీశంకర్ క్వాలిఫయింగ్ రౌండ్‌లో అర్హత ప్రమాణాన్ని (8.25 మీటర్లు) అధిగమించాడు. 24 ఏళ్ల శ్రీశంకర్ తొలి ప్రయత్నంలోనే 8.41 మీటర్ల దూరం దూకి తన అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శన నమోదు చేయడంతోపాటు ఫైనల్‌కు చేరాడు. ఈ ప్రదర్శనతో శ్రీశంకర్ సెప్టెంబర్-అక్టోబర్‌లలో చైనాలో జరిగే ఆసియా క్రీడలకు కూడా అర్హత పొందాడు. మహిళల లాంగ్‌జంప్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భగవతి భవాని యాదవ్, కార్తీక, కుసుమ ఫైనల్‌కు అర్హత సాధించారు.

## సాయి కార్తీక్‌కు డబుల్స్ టైటిల్



**సాక్షి, హైదరాబాద్:** అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) ఫ్యూచర్స్ టోర్నీలో హైదరాబాద్‌కు చెందిన గంటా సాయి కార్తీక్ రెడ్డి పురుషుల డబుల్స్ టైటిల్‌ను సాధించాడు. ఇండోనేసియా రాజధాని జకార్తాలో ఆదివారం జరిగిన డబుల్స్ ఫైనల్లో సాయి కార్తీక్ రెడ్డి-సిద్ధాంత్ భాటియా (భారత్) ద్వయం 6-7 (3/7), 7-5, 10-5తో 'సూపర్ టైబ్రేక్'లో సోరా ఫకుడా-తొమోహిర్ మసాబాయాషి (జపాన్) జోడీని ఓడించింది.

# చాంపియన్ భారత్

**ఇంటర్ కాంటినెంటల్ కప్ ఫుట్‌బాల్ టోర్నీ**




**భువనేశ్వర్:** సొంతగడ్డపై మరోసారి సత్తా చాటుకున్న భారత ఫుట్‌బాల్ జట్టు నాలుగు దేశాల ఇంటర్ కాంటినెంటల్ కప్ టోర్నమెంట్‌లో చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం కళింగ స్టేడియంలో జరిగిన ఫైనల్లో సునీల్ ఛెత్రి నాయకత్వంలోని భారత జట్టు 2-0 గోల్స్ తేడాతో లెబనాన్ జట్టుపై గెలిచింది. 2018లోనూ భారత జట్టు ఈ టైటిల్‌ను సాధించింది. లెబనాన్‌తో జరిగిన ఫైనల్లో భారత్ తరపున కెప్టెన్ సునీల్ ఛెత్రి (46వ ని.లో), లాలియన్‌జులా చాంగ్తె (65వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. లెబనాన్ జట్టుపై 46 ఏళ్ల తర్వాత భారత జట్టు గెలుపొందడం విశేషం. చివరిసారి భారత్ 1977లో ప్రెసిడెంట్స్ కప్ టోర్నీలో లెబనాన్‌పై 4-2 గోల్స్ తేడాతో నెగ్గింది. ఆ తర్వాత లెబనాన్‌తో భారత్ మరో ఆరు మ్యాచ్‌లు ఆడగా... మూడింటిలో ఓడి, మూడింటిని 'డ్రా' చేసుకుంది.

# 'యాషెస్' టెస్టుకు వర్షం దెబ్బ

**ఆస్ట్రేలియా 386 ఆలౌట్**



**బర్మింగ్‌హామ్:** ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య తొలి 'యాషెస్' టెస్టు మ్యాచ్ వర్షం బారిన పడింది. వాన కారణంగా మూడో రోజు కేవలం 32.4 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. ఆదివారం మ్యాచ్ నిలిచిపోయే సమయానికి ఇంగ్లండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 28 పరుగులు చేసింది. డకెట్ (19), క్రాలీ (7) ఒకే స్కోరు వద్ద పెవిలియన్ చేరగా...ప్రస్తుతం పోప్ (0), రూట్ (0) క్రీజ్‌లో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 311/5తో ఆట కొనసాగించిన ఆస్ట్రేలియా తమ తొలి ఇన్నింగ్స్‌లో 386 పరుగులకు ఆలౌటైంది. దాంతో ఇంగ్లండ్‌కు 7 పరుగుల అతి స్వల్ప ఆధిక్యం లభించింది. ఉస్మాన్ ఖ్వాజా (321 బంతుల్లో 141; 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) తన స్కోరుకు మరో 15 పరుగులు జోడించగా, కెప్టెన్ ప్యాట్ కమిన్స్ (38; 3 సిక్స్‌లు) రాణించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో స్టువర్ట్ బ్రాడ్, రాబిన్సన్ మూడు వికెట్ల చొప్పున తీశారు.

# జింబాబ్వే, వెస్టిండీస్ శుభారంభం







**హరారే:** వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో జింబాబ్వే, వెస్టిండీస్ జట్లు శుభారంభం చేశాయి. ఆదివారం మొదలైన ఈ టోర్నీలో... గ్రూప్ 'ఎ' తొలి లీగ్ మ్యాచ్‌ల్లో జింబాబ్వే ఎనిమిది వికెట్ల తేడాతో నేపాల్ జట్టును ఓడించగా... వెస్టిండీస్ 39 పరుగుల తేడాతో అమెరికా జట్టుపై గెలిచింది. నేపాల్ నిర్దేశించిన 291 పరుగుల లక్ష్యాన్ని జింబాబ్వే 44.1 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' క్రెయిగ్ ఇర్విన్ (128 బంతుల్లో 121 నాటౌట్; 15 ఫోర్లు, 1 సిక్స్), సీన్ విలియమ్స్ (70 బంతుల్లో 102 నాటౌట్; 13 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీలతో జింబాబ్వే విజయంలో కీలక పాత్ర పోషించారు. ఇర్విన్, సీన్ విలియమ్స్ మూడో వికెట్‌కు అజేయంగా 164 పరుగులు జత చేశారు. అంతకుముందు నేపాల్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 290 పరుగులు చేసింది. ఓపెనర్ కుశాల్ భుర్తెల్ (95 బంతుల్లో 99; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఒక్క పరుగు తేడాతో సెంచరీని చేజార్చుకోగా... ఆసిఫ్ షేక్ (100 బంతుల్లో 66; 7 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. జింబాబ్వే బౌలర్ రిచర్డ్ ఎన్‌గరవా నాలుగు వికెట్లు తీశాడు.

**రాణించిన జాన్సన్**

వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో 298 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన అమెరికా 50 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 258 పరుగులు చేసి ఓడిపోయింది. గజానంద్ సింగ్ (109 బంతుల్లో 101 నాటౌట్; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ సెంచరీ చేసినా ఫలితం లేకపోయింది. అంతకుముందు వెస్టిండీస్ 49.3 ఓవర్లలో 297 పరుగులకు ఆలౌటైంది. జాన్సన్ చార్లెస్ (66; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), షై హోప్ (54; 6 ఫోర్లు, 1 సిక్స్), రోస్టన్ ఛేజ్ (55; 4 ఫోర్లు, 1 సిక్స్), జేసన్ హోల్డర్ (40 బంతుల్లో 56; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించారు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో యూఏఈతో శ్రీలంక; ఒమన్‌తో ఐర్లాండ్ తలపడతాయి.

# సెమీస్‌లో తెలుగు టాలన్స్



**జైపూర్:** ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్ (పీహెచ్‌ఎల్)లో హైదరాబాద్‌కు చెందిన తెలుగు టాలన్స్ జట్టు తమ విజయపరంపర కొనసాగిస్తోంది. సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టాలన్స్ జట్టు 26-25తో ఒక్క పాయింట్ తేడాతో గోల్డెన్ ఈగల్స్ ఉత్తరప్రదేశ్ జట్టుపై గెలిచింది. కంకణాల అభిషేక్ రెడ్డి యజమానిగా ఉన్న తెలుగు టాలన్స్ జట్టు ఈ విజయంతో పీహెచ్‌ఎల్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. గోల్డెన్ ఈగల్స్‌తో మ్యాచ్‌లో తెలుగు టాలన్స్ గోల్‌కీపర్ రాహుల్ విశేషంగా రాణించాడు. అతను ఏకంగా 24 సార్లు ప్రత్యర్థి ఆటగాళ్లగోల్‌పోస్ట్‌పై కొట్టిన షాట్‌లను నిలువరించాడు. కై లాష్ పటేల్ ఐదు గోల్స్ సాధించడంతోపాటు 'మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్' అవార్డు గెల్చుకున్నాడు. ఎనిమిది మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న తెలుగు టాలన్స్ 12 పాయింట్లతో మహారాష్ట్ర ఐరన్‌మెన్ జట్టుతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉంది.

# అభిషేక్ 'పసిడి' గురి



**మెడెలిన్ (కొలంబియా):** తొలి రెండు ప్రపంచకప్ టోర్నీలకు భారత జట్టులోకి ఎంపిక కాలేకపోయిన భారత స్టార్ ఆర్చర్ అభిషేక్ వర్మ పసిడి పతకంతో పునరాగమనం చేశాడు. ఆర్చరీ సీజన్‌లోని మూడో ప్రపంచకప్‌లో అభిషేక్ వర్మ పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో చాంపియన్‌గా నిలిచాడు. ఫైనల్లో అభిషేక్ వర్మ 148-146తో జేమ్స్ లుట్జ్ (అమెరికా)పై నెగ్గాడు. సెమీఫైనల్లో 148-143తో లుకాస్ అబ్రెయు (బ్రెజిల్)పై నెగ్గిన అభిషేక్... క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ మైక్ ష్కాలెసర్ (నెదర్లాండ్స్)పై సంచలన విజయం సాధించాడు. ప్రపంచకప్ టోర్నీలలో అభిషేక్‌కిది మూడో వ్యక్తిగత స్వర్ణ పతకం. 2015, 2021లలో జరిగిన ప్రపంచకప్ టోర్నీల్లోనూ విజేతగా నిలిచాడు.

# వాణిజ్య ప్రాపర్టీకి యజమాని అవుతారా..!



- రూ.300తోనూ పెట్టుబడికి అవకాశం
- అందుబాటులో నాలుగు రీట్‌లు
- దీర్ఘకాలంలో వీటిలో మెరుగైన రాబడులు
- వీటితో రిస్క్‌లూ ఉన్నాయ్
- ప్రాపర్టీల ధరలు పడిపోవచ్చు
- ఆర్థిక సంక్షోభాల ప్రభావమూ ఉంటుంది
- అన్నీ తెలుసుకున్నాకే ముందుకు వెళ్లాలి

ప్రాపర్టీపై పెట్టుబడి పెట్టాలనే ఆసక్తి చాలా మందిలో ఉంటుంది. నివాసం కోసం కొనుగోలు చేసే ఇల్లు ఎప్పటికీ పెట్టుబడి కాబోదు. రాబడులు అందించేదే పెట్టుబడి అవుతుంది. ఆ విధంగా చూస్తే వాణిజ్య రియల్ ఎస్టేట్ పెట్టుబడి కిందకే వస్తుంది. మరి వాణిజ్య ప్రాపర్టీ కొనుగోలు చేయాలంటే రూ.కోట్ల పెట్టుబడి కావాలి. అంత పెట్టుబడి అందరికీ సాధ్యపడదు. రూ.కోట్లతో పని లేకుండా, వెయ్యి రూపాయలు ఉన్నా.. వాణిజ్య ప్రాపర్టీకి యజమానులను చేసేవే రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్/ఆర్ఈఐటీ)లు. ప్రతీ ఇన్వెస్టర్‌కు ఇవి అనుకూలమని చెప్పడానికి కుదరదు. కొందరికే అనుకూలం. రీట్‌లో పెట్టుబడితో ప్రయోజనం ఏ మేరకు? ఎవరికి అనువైనవో తెలియజేసే కథనం ఇది...

రియల్ ఎస్టేట్ అనేది భారతీయులకు ఎంతో ఇష్టమైన ప్రాధాన్య పెట్టుబడుల్లో ఒకటిగా ఉంటుంది. ఇల్లు లేదా ఫ్లాట్‌పైనే ఎక్కువ మంది ఇన్వెస్ట్ చేస్తుంటారు. ఎందుకంటే తమ బడ్జెట్ ధరలో ఇవి అందుబాటులో ఉంటాయి కనుక. అదే ఓ కమర్షియల్ షాప్ లేదా బిల్డింగ్ కొనుగోలు చేయాలంటే కొంచెం అధిక మొత్తం కావాల్సి వస్తుంది. వ్యక్తులు వాణిజ్య ప్రాపర్టీలపై తక్కువగా పెట్టుబడులు పెట్టడం వెనుక ఉన్న ప్రధాన కారణం ఇదే. అయినా కానీ, తమ శక్తికొద్దీ, తమ బడ్జెట్ పరిధిలోనే వాణిజ్య రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టుకోవాలని అనుకునే వారికోసం ఉద్దేశించినవి రీట్‌లు. ఇన్వెస్టర్లకు మరిన్ని సాధనాలను అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో సెబీ వీటికి అనుమతించింది. భారత స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ అయిన తొలి రీట్ 'ఎంబసీ ఆఫీస్ పార్క్స్'. రూ.4,750 కోట్లను సమీకరించి 2019 ఏప్రిల్‌లో ఇది లిస్ట్ అయింది.

## సానుకూలతలు..

అధిక రాబడులు ఇచ్చే వాణిజ్య రియల్టీలో స్వల్ప మొత్తం పెట్టుబడికి రీట్ వీలు కల్పిస్తుంది. కావాలంటే ఒక్క యూనిట్ కూడా కొనుగోలు చేసుకోవచ్చు. లిస్ట్ అయిన అన్ని రీట్‌లలో ఎంబసీ ఆఫీస్ పార్క్స్ రీట్ యూనిట్ ధర రూ.303గా ఉంది. అంటే రూ.303తో ఇందులో పెట్టుబడికి అవకాశం ఉంటుంది. రిటైల్ మాల్స్‌తో కూడిన నెక్సస్ సెలక్ట్ ట్రస్ట్ రీట్‌లో అయితే రూ.107తో ఒక యూనిట్ కొనుగోలు చేసుకోవచ్చు. అద్దె ఆదాయం రూపంలో రీట్‌లకు స్థిరంగా ఆదాయం వస్తుంటుంది. పన్నులు పోను 90 శాతం లాభాన్ని వాటాదారులకు పంపిణీ చేయాలనేది నిబంధన. కనుక ప్రతీ మూడు నెలలకు రీట్ యూనిట్ వాటాదారులకు ఆదాయం వస్తుంటుంది. కచ్చితంగా, నూటికి నూరు శాతం డివిడెండ్ వస్తుందన్న గ్యారంటీ ఉండదు. ఆర్థిక సంక్షోభ సమయాల్లో, ఇతర క్లిష్ట పరిస్థితుల్లో రాకపోవచ్చు. లేదా డివిడెండ్ ఆదాయం పంపిణీని తగ్గించొచ్చు. కానీ అవి తాత్కాలిక పరిణామాలే. రీట్‌లో ఇన్వెస్ట్ చేయడం వల్ల పెట్టుబడుల్లో వైవిధ్యం ఏర్పడుతుంది. ఇతర సాధనాలతో పాటు వీటికి కొంత కేటాయింపులు చేసుకోవడం ద్వారా వైవిధ్యం చేసుకోవచ్చు.

## ప్రతికూలతలు

స్టాక్ ఎక్స్ఛేంజీలలో ట్రేడ్ అవుతుంటాయి కనుక రీట్‌లలో ముందుగా మార్కెట్ రిస్క్ ఉంటుందని గుర్తుంచుకోవాలి. అంతర్జాతీయ, జాతీయ పరిణామాల ప్రభావం ఈక్విటీ మార్కెట్లపై ఉన్నట్టే.. వీటి ధరల్లోనూ అస్థిరతలు ఉంటాయి. ఇతర షేర్ల మాదిరే డిమాండ్ సరఫరా వీటి యూనిట్ ధరలను నిర్ణయిస్తుంది. క్లియర్ టైటిల్ కాకపోతే రీట్‌లు న్యాయపరమైన వివాదాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. రీట్‌లలో ఉన్న ఒక పెద్ద ప్రతికూలత ఏమిటంటే, అవి కలిగి ఉన్న రియల్ ఎస్టేట్ ఆస్తుల విలువపైనే యూనిట్ నికర విలువ (ఎన్ఏవీ) ఆధారపడి ఉంటుంది. రియల్ ఎస్టేట్ ధరలు పడిపోతే, అది యూనిట్ ధరపైనా ప్రతిఫలిస్తుంది. దాంతో నష్టాలు ఎదుర్కోవాల్సి రావచ్చు. రియల్ ఎస్టేట్ ధరలు పడిపోతున్నాయని తెలిస్తే, వెంటనే పెట్టుబడులు వెనక్కి తీసుకోవాలి. పెట్టుబడి శ్రేణి ఆఫీస్ స్థలాలు డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోతే, స్వల్ప కాలం నుంచి మధ్య కాలానికి వాటి ఆస్తుల ధరల పెరుగుదలకు దారితీస్తుందని, ఇది కూడా ఒక రిస్కేనని అగర్వాల్ తెలిపారు. ఆఫీసు స్థలాలను లీజుకు ఇవ్వడం ద్వారా వచ్చే ఆదాయాన్నే రీట్‌లు వాటాదారులకు పంపిణీ చేస్తాయి. మరి రీట్‌ల నిర్వహణలోని ఆస్తుల్లో ఆక్యుపెన్సీ (భర్తీ) ఇక్కడ కీలకం అవుతుంది. కొంత స్థలం ఖాళీగా మిగిలిపోతే ఆ మేరకు ఆదాయం తగ్గిపోతుంది. అది డివిడెండ్ పంపిణీని ప్రభావితం చేస్తుంది. ప్రతికూల ఆర్థిక పరిస్థితులు, మార్కెట్ క్షీణత సందర్భాల్లో కార్యాలయ స్థలాలకు ఖాళీ ఏర్పడవచ్చు. చివరిగా రీట్‌లలో పెట్టుబడులకు తప్పనిసరిగా బ్రోకర్ వద్ద ట్రేడింగ్, డీమ్యాట్ ఖాతా కలిగి ఉండాల్సిందే.

## రాబడులు ఎలా..?

రీట్‌లో పెట్టుబడులపై రెండు రకాలుగా రాబడి ప్రయోజనానికి అవకాశం ఉంటుంది. స్టాక్ ఎక్స్ఛేంజీలో యూనిట్ ధర వృద్ధి చెందడం ద్వారా పెట్టుబడి విలువ పెరుగుతుంది. యూనిట్ ధర పెరగడానికి రెండు అంశాలు దోహదం చేస్తాయి. ఆ రీట్ నిర్వహణలోని ఆస్తుల విలువ పెరగడం, ఆయా ఆస్తులపై అద్దె రాబడి పెరగడం యూనిట్ విలువను పెంచుతుంది. మరో రూపంలో ఇవి డివిడెండ్ చెల్లిస్తుంటాయి. కాకపోతే స్టాక్స్‌తో పోలిస్తే వీటిల్లో డివిడెండ్ పంపిణీ ఎక్కువగా ఉంటుంది. సెబీ నిబంధనల ప్రకారం రీట్‌లు తమ పోర్ట్‌ఫోలియోలో 80 శాతం ఆదాయాన్నిచ్చే ఆస్తులు కలిగి ఉండాలి. అంటే నిర్మాణం పూర్తయి క్రమం తప్పకుండా అద్దె ఆదాయం వచ్చేవి. మిగిలినవి నిర్మాణంలో ఉన్నవి కావొచ్చు. దీంతో 80 శాతం ఆస్తుల నుంచి వచ్చే ఆదాయాన్ని వాటాదారులకు పంపిణీ చేయడానికి వీలుంటుంది. రెంట్, లీజు ఆదాయానికి తోడు, రియల్ ఎస్టేట్ విలువ పెరగడం రూపంలోనూ యూనిట్‌దారులకు ఆదాయం వస్తుందని అనరాక్ క్యాపిటల్ సీఈవో, ఎండీ శోభిత్ అగర్వాల్ తెలిపారు.






## రీట్ అంటే..?

మ్యూచువల్ ఫండ్ మాదిరే రీట్ కూడా. ఒక ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ పథకం ఎన్నో స్టాక్స్‌లో పెట్టుబడులు పెడుతుంటుంది. కానీ, ఇన్వెస్టర్లకు షేర్లకు బదులు యూనిట్లను కేటాయిస్తుంటుంది. రీట్ కూడా వాణిజ్య రియల్ ఎస్టేట్ ప్రాపర్టీలపై పెట్టుబడులు పెడుతుంది. ఆయా ప్రాపర్టీలకు సంబంధించి యూనిట్లను కేటాయిస్తుంది. ఫండ్స్ నిర్వహణలో షేర్లు, ఈటీఎఫ్‌లు, బాండ్లు, సెక్యూరిటీలు ఉన్నట్టే, రీట్‌ల నిర్వహణలో రియల్ ఎస్టేట్ ఆస్తులు ఉంటాయి.

ప్రస్తుతం మూడు రీట్‌లు అందుబాటులో ఉన్నాయి. ఎంబసీ ఆఫీస్ పార్క్స్, మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్, బ్రూక్‌ఫీల్డ్ రియల్ ఎస్టేట్ ట్రస్ట్ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ అయి ఉన్నాయి. ఇవన్నీ వాణిజ్య ప్రాపర్టీల్లోనే ఇన్వెస్ట్ చేస్తాయి. ఈ మూడింటి నిర్వహణలో దేశవ్యాప్తంగా వివిధ పట్టణాల్లో 93 మిలియన్ చదరపు అడుగుల వాణిజ్య ఆఫీసు స్థలాలు ఉన్నాయి. "ఈ మూడు రీట్‌లు లిస్టింగ్ ధరతో పోలిస్తే ప్రీమియంలో ట్రేడ్ అవుతున్నాయి. వీటిల్లో రాబడులు, నగదు, డివిడెండ్ ఈల్డ్, క్యాపిటల్ వృద్ధి కలిపి వార్షికంగా 13–15 శాతం మధ్య ఉన్నాయి''అని కొలియర్స్ ఇండియా ఎండీ పీయూష్ గుప్తా తెలిపారు. ఇవి వార్షికంగా 5–6 శాతం మధ్య రాబడిని త్రైమాసికం వారీగా యూనిట్‌దారులకు చెలిస్తున్నాయి. ఇవి కాకుండా రిటైల్ షాపులతో కూడిన మాల్స్‌ను నిర్వహించే నెక్సస్ సెలక్ట్ ట్రస్ట్ పేరుతో మరో రీట్ కూడా ఉంది.

## ఇన్వెస్టర్ల ముందున్న మార్గం?

రీట్‌లకు మంచి భవిష్యత్తు ఉంటుందని రియల్ ఎస్టేట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు ప్రాపర్టీ మార్కెట్లలో గ్రేడ్ ఏ ఆఫీసు స్థలాలపై పెట్టుబడులు పెట్టేందుకు పోటీ పడుతున్నట్టు శోభిత్ అగర్వాల్ తెలిపారు. అలాగే, భవిష్యత్తులో మెరుగైన డివిడెండ్ ఆదాయానికి అవకాశం ఉంటుంది. రీట్‌ను వైవిధ్యానికి ఉపకరణంగా భావించి, తన మొత్తం పెట్టుబడుల్లో కొంత మేరకు వీటికి కేటాయించుకోవడాన్ని పరిశీలించొచ్చు. "మీ ఆర్థిక పరిస్థితులు అనుమతిస్తే మొత్తం పెట్టుబడిలో కొంత మొత్తాన్ని రీట్‌కు కేటాయించుకోవచ్చు. కానీ, ఒకరి మొత్తం పెట్టుబడుల్లో రియల్ ఎస్టేట్ లేదా రీట్ మాదిరి రియల్ ఎస్టేట్ సాధనాల్లో 10–30 శాతం మించి ఉంచకూడదు''అని సెబీ రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ సంజీవ్ గోవిల సూచించారు. రీట్‌లు మన దేశంలో కొత్త తరహా పెట్టుబడి సాధనాలు. కనుక వీటి రాబడులను స్టాక్ మార్కెట్ రాబడులతో పోల్చుకోకూడదు.

## రీట్ మ్యూచువల్ ఫండ్స్

రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌ల్లో వేటిని ఎంపిక చేసుకోవాలి, ఎప్పుడు వాటి నుంచి బయటపడాలి, తిరిగి ఎప్పుడు వాటిల్లో పెట్టుబడులు పెట్టాలనే విషయంలో రిటైల్ ఇన్వెస్టర్లకు అంతగా అవగాహన ఉండదు. అటువంటప్పుడు వీటిల్లో ఇన్వెస్ట్ చేసే ఫండ్స్ పథకాలను ఎంపిక చేసుకోవచ్చు. ప్రస్తుతం మూడు రకాల రీట్ మ్యూచువల్ ఫండ్స్ మన మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. ఇవన్నీ కూడా రీట్ యూనిట్లలో పెట్టుబడులు పెడుతుంటాయి. కాకపోతే ఇవి మన మార్కెట్ ఒక్కటే అని కాకుండా ఇతర దేశాల మార్కెట్లలోని రీట్‌లలోనూ ఇన్వెస్ట్ చేయడాన్ని గమనించొచ్చు. అంటే వివిధ దేశాల రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు వర్గీకరించినట్టుగా అర్థం చేసుకోవాలి. కోటక్ ఇంటర్నేషనల్ రీట్ ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్‌వోఎఫ్) ఇందులో ఒకటి. దేశంలో రీట్ ఆధారిత తొలి మ్యూచువల్ ఫండ్ పథకం ఇది. 2020 డిసెంబర్‌లో మొదలైంది. రూ.100 కోట్లను సమీకరించింది. ఈ పథకం భారత్‌తో పాటు సింగపూర్, ఆస్ట్రేలియా, హాంగ్‌కాంగ్‌లోనూ ఇన్వెస్ట్ చేస్తుంది. గడిచిన ఏడాది కాలంలో 7 శాతం నష్టాలను ఇచ్చింది. పీజీఐఎం ఇండియా గ్లోబల్ సెలక్ట్ రియల్ ఎస్టేట్ సెక్యూరిటీస్ ఎఫ్‌వోఎఫ్ మరొక పథకం. ఈ పథకం తన పెట్టుబడులు తీసుకెళ్లి పీజీఐఎం గ్లోబల్ సెలక్ట్ రియల్ ఎస్టేట్ సెక్యూరిటీస్‌లో ఇన్వెస్ట్ చేస్తుంది. 12 దేశాల్లోని రీట్‌లలో ఈ పేరెంట్ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుంది. ఈ పథకం గత ఆరు నెలల్లో 2 శాతం రాబడులు ఇస్తే, ఏడాది కాలంలో రాబడి సున్నాగా ఉంది. మహీంద్రా మనులైఫ్ ఆసియా పసిఫిక్ రీట్ ఎఫ్‌వోఎఫ్ పథకం 2021 సెప్టెంబర్‌లో మొదలైంది. ఈ పథకం తన పెట్టుబడులు తీసుకెళ్లి మనులైఫ్ గ్లోబల్ ఫండ్ ఆసియా పసిఫిక్ రీట్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేస్తుంది. ఈ పథకం గత ఏడాది కాలంలో 5 శాతం నష్టాలను ఇచ్చింది. ఈ మూడు ఫండ్ రీట్‌లలో ఏడాది కాలంలో ఎలాంటి రాబడులు లేవు. కనుక వీటిల్లో పెట్టుబడులు పెట్టే ముందు ఇన్వెస్టర్లు మరికొంత కాలం పాట వేచి చూడడమే సరైనది అవుతుంది. వీటికి బదులు లిస్టెడ్ రీట్‌లు కాస్త మెరుగ్గా కనిపిస్తున్నాయి.

## పన్ను వసూళ్లు 11% అప్

### ఏప్రిల్–జూన్‌లో రూ. 3.80 లక్షల కోట్లు




**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ 17 నాటికి నికరంగా ప్రత్యక్ష పన్నుల వసూళ్లు 11.18 శాతం పెరిగి రూ. 3.80 లక్షల కోట్లకు చేరాయి. అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లు పెరగడం ఇందుకు దోహదపడినట్లు ఆర్థిక శాఖ తెలిపింది. జూన్ 17 నాటికి ఏప్రిల్–జూన్ త్రైమాసికానికి సంబంధించి అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లు గతేడాది ఇదే వ్యవధితో పోలిస్తే 13.70%పెరిగి రూ. 1,16,776 కోట్లకు చేరాయి. నికరంగా వసూలైన రూ. 3,79,760 కోట్ల ప్రత్యక్ష పన్నుల్లో కార్పొరేషన్ పన్నులు రూ. 1,56,949 కోట్లు, వ్యక్తిగత ఆదాయ పన్నులు రూ. 2,22,196 కోట్లు ఉన్నాయి. జూన్ 17 నాటికి రీఫండ్‌లు 30% పెరిగి రూ. 39,578 కోట్లుగా నమోదయ్యాయి.

**జీఎస్‌టీ రిటర్నులకు అదనపు ధ్రువీకరణలు!**

కాగా పన్ను ఎగవేతలు, నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) క్లెయిమ్‌లకు అడ్డుకట్ట వేసేలా జీఎస్‌టీ రిటర్నుల ఫైలింగ్ విధానంలో మరిన్ని ధ్రువీకరణలను అమలు చేయాలన్న సీబీఐసీ ప్రతిపాదనను జూలై 11న జరిగే సమావేశంలో జీఎస్‌టీ కౌన్సిల్ పరిశీలించే అవకాశాలు ఉన్నాయి. సీనియర్ ప్రభుత్వాధికారి ఒకరు ఈ విషయం తెలిపారు. రిజిస్ట్రేషన్ సమయంలోనూ అలాగే రిటర్ను దాఖలు చేసేటప్పుడు కూడా అదనంగా ధ్రువీకరణ నిబంధనలను ప్రవేశపెట్టాలని కేంద్రీయ పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు నిర్ణయించినట్లు వివరించారు.

| కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో) | |
|---|---|
| 19-6-2023 | |
| విశాఖ | 550–00 |
| చిత్తూరు | 593–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 515–00 |
| విజయవాడ | 515–00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| 18-6-2023 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 525–00 |
| వరంగల్ | 527–00 |
| రిటైల్ ధర | 5.85 |

## డీసీబీ బ్యాంక్ | ఐడీబీఐ క్యాపిటల్ | కొనొచ్చు

స్టాక్స్ వ్యూ

**ప్రస్తుత ధర: రూ. 118**

**టార్గెట్: రూ. 150**

**ఎందుకంటే:** ప్రయివేట్ రంగ సంస్థ డీసీబీ బ్యాంక్ ఆస్తుల(రుణాలు) నాణ్యత త్రైమాసికవారీగా మెరుగుపడుతూ వస్తోంది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.6 శాతం నుంచి 3.2 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు సైతం 1.4 శాతం నుంచి 1 శాతానికి దిగివచ్చాయి. త్రైమాసిక ప్రాతిపదికన పునర్వ్యవస్థీకరించిన నికర స్టాండర్డ్ బుక్ రూ. 1,630 కోట్ల నుంచి వెనకడుగు వేసి రూ. 1,550 కోట్లకు పరిమితమైంది. అయితే బ్యాంకింగ్ పరిశ్రమలో ఇది అధికమే అయినప్పటికీ డిపాజిట్లు వార్షిక ప్రాతిపదికన 19 శాతం వృద్ధిని అందుకున్నాయి. క్రెడిట్(రుణ) వృద్ధి సైతం పటిష్టస్థాయిలో 18 శాతంగా నమోదైంది. ఇక నికర వడ్డీ ఆదాయం(ఎన్ఐఐ) 28 శాతం జంప్ చేసింది. ఇందుకు మార్జిన్లు 0.25 శాతంమేర బలపడటం సహకరించింది.




ఈ బాటలో నికర లాభం 25 శాతం ఎగసింది. మొండి రుణాలకు కేటాయింపులు(ప్రొవిజన్లు) 22 శాతం తగ్గడం ఇందుకు దోహదపడింది. ఆదాయ వ్యయ(సీ/ఐ) నిష్పత్తి వార్షిక పద్ధతిలో 60 శాతం, త్రైమాసికంగా 64 శాతానికి చేరింది. ఇందుకు వడ్డీయేతర ఆదాయం పుంజుకోవడం తోడ్పాటునిచ్చింది. బ్యాంక్ యాజమాన్యం సమీప భవిష్యత్‌లో సీ/ఐను 55 శాతం లేదా అంతకంటే దిగువకు చేర్చాలని భావిస్తోంది. సగటు ఆస్తుల వ్యయ నిష్పత్తిని 2.4 శాతానికి చేర్చే లక్ష్యంతో ఉంది. బ్రాంచీల విస్తరణ మందగించనున్న అంచనాల నేపథ్యంలో సమీప కాలానికి 25–30 బ్రాంచీలను జత కలుపుకునే వీలుంది. వచ్చే ఏడాది ఏప్రిల్‌కల్లా ప్రస్తుత ఎండీ పదవీ కాలం ముగియనుంది. అయితే బోర్డు స్థాయిలో అంతర్గత చర్చల ద్వారా అధికారుల ఎంపికలో విజయవంత విధానాలను అవలంబిస్తోంది.

## కర్ణాటక బ్యాంక్ | ఆనంద్ రాఠీ రీసెర్చ్ | కొనొచ్చు

**ప్రస్తుత ధర: రూ. 155**

**టార్గెట్: రూ. 192**

**ఎందుకంటే:** ప్రయివేట్ రంగ సంస్థ కర్ణాటక బ్యాంక్ మార్జిన్లు మెరుగుపడటంతోపాటు.. పుంజుకున్న ఫీజు ఆదాయం పటిష్ట నిర్వహణా పనితీరుకు దారిచూపాయి. మార్చితో ముగిసిన గతేడాది చివరి త్రైమాసికం(జనవరి–మార్చి)లో ఆదాయ వ్యయ(సీ/ఐ) నిష్పత్తి దాదాపు 45 శాతానికి దిగివచ్చింది. నికర వడ్డీ మార్జిన్లు(ఎన్ఐఎం) 0.62 శాతం బలపడి 3.81 శాతాన్ని తాకాయి. ఇందుకు రుణ వడ్డీ రేట్ల పెంపు సవరణలతో మెరుగుపడిన ఈల్డ్స్‌తోపాటు.. సానుకూలంగా మారిన డిపాజిట్ వ్యయ(సీడీ) నిష్పత్తి తోడ్పాటును అందించింది. నిలకడైన బ్యాంకింగ్ ప్రాతిపదికన నికర వడ్డీ మార్జిన్లు 3.5 శాతం స్థాయిలో నిలవగలవని అంచనా. అయితే ఆస్తుల(రుణాలు) నాణ్యత స్వల్పంగా నీరసించడంతో స్లిప్పేజీలు రూ. 590 కోట్లకు చేరాయి. ఇది రుణాలలో 3.9 శాతంకాగా.. అంచనాలను మించాయి.





ప్రధానంగా పునర్వ్యవస్థీకరించిన రుణాల(లోన్ బుక్) నుంచి అధిక స్లిప్పేజీలు నమోదుకావడం ప్రభావం చూపింది. అయితే పటిష్టస్థాయిలో రికవరీలు, అప్‌గ్రేడ్స్ వసూళ్లు పుంజుకునేందుకు మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నాయి. వార్షికంగా పునర్వ్యవస్థీకరించిన స్టాండర్డ్ బుక్ 22.2 శాతం క్షీణించి రూ. 3,200 కోట్లకు పరిమితమైంది. ప్రత్యేక నమోదు ఖాతాలు(ఎస్ఎంఏ) 2.5 శాతం దిగువకు చేరాయి. చాలావరకూ మొండి రుణాల పునర్వ్యవస్థీకరణ జరగడంతో ఇకపై స్లిప్పేజీలు తగ్గే అవకాశముంది. రెండేళ్ల(2024, 2025)లో స్థూల మొండిబకాయిలు(జీఎన్‌పీఏలు) 3 శాతం దిగువకు చేరవచ్చని అంచనా. రుణ వృద్ధి ఊపందుకోవడం, వీటి వ్యయాలు తగ్గడం వంటి సానుకూలతల కారణంగా ఆర్‌వోఏ 1 శాతానికి ఎగువన నిలిచే వీలుంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

## ఎన్‌పీఎస్ నుంచి నెలవారీ ఆదాయం

- సిస్టమ్యాటిక్ విత్ డ్రాయల్ ఆప్షన్
- సెప్టెంబర్ నాటికి తీసుకొస్తాం
- పీఎఫ్ఆర్‌డీఏ చైర్మన్ మహంతి

**న్యూఢిల్లీ:** నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) కింద క్రమం తప్పకుండా ఉపసంహరణ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ)ను ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి తీసుకురానున్నట్టు పింఛను నిధి నియంత్రణ, అభివృద్ధి సంస్థ చైర్మన్ దీపక్ మహంతి తెలిపారు. దీంతో 60 ఏళ్లు నిండిన తర్వాత పెన్షన్ ఖాతాదారులు అప్పటి వరకు సమకూరిన నిధి నుంచి కావాల్సినంతే ఉపసంహరించుకోవచ్చని పేర్కొన్నారు. "ఈ ప్రతిపాదన పురోగతి దశలో ఉంది. దాదాపు వచ్చే త్రైమాసికం చివరి నాటికి ఈ పథకంతో ముందుకు వస్తాం''అని మహంతి చెప్పారు. ప్రస్తుతం ఎన్‌పీఎస్ పథకంలో 60 ఏళ్లు నిండిన వారు అప్పటి వరకు సమకూరిన మొత్తం నుంచి 60 శాతాన్ని ఉపసంహరించుకుని, మిగిలిన 40 శాతంతో యాన్యుటీ ప్లాన్ తీసుకోవాలనే నిబంధన అమల్లో ఉంది. అంతేకానీ, నెలవారీ ఇంత చొప్పున తీసుకునే అవకాశం లేదు.




సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ ను అమల్లోకి తీసుకొస్తే అప్పుడు పింఛనుదారులు నెలవారీ లేదా మూడు నెలలు, ఆరు నెలలు, ఏడాదికొకసారి.. వీటిల్లో తమకు అనువైన ఆప్షన్ ఎంపిక చేసుకుని, క్రమం తప్పకుండా ఆదాయం పొందొచ్చు. ఇలా 75 ఏళ్లు వచ్చే వరకు తీసుకోవడానికి పీఎఫ్ఆర్‌డీఏ అవకాశం కల్పించనుంది. "నా నిధిపై మంచి రాబడులు వస్తున్నప్పుడు ఆ మొత్తాన్ని ఎందుకు కొనసాగించకూడదు. ఎందుకు యాన్యుటీ తీసుకోవాలనే అభ్యర్థనలు వస్తున్నాయి''అని మహంతి తెలిపారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలిస్తే, యాన్యుటీని వాయిదా వేసుకోవచ్చని, దీనివల్ల తర్వాత అధిక మొత్తంలో పింఛను వస్తుందని చెప్పారు. తాము తీసుకురాబోయే మార్పుతో, చందాదారులు 40 శాతం నిధితో డిఫర్డ్ యాన్యుటీని ఎంపిక చేసుకుని, మిగిలిన 60 శాతం ఫండ్‌ను క్రమం తప్పకుండా వెనక్కి తీసుకోవడానికి అవకాశం లభిస్తుందన్నారు.

# ఏ వయసుకు సొంతిల్లు సమకూర్చుకోవాలి..?

**మా చిన్నారిని ఉన్నత విద్య కోసం విదేశాలకు పంపిద్దామన్నది నా భవిష్యత్తు ఆలోచన. రూపాయి మారకం విలువను హెడ్జ్ చేసుకునేందుకు ఇప్పటి నుంచే అంతర్జాతీయ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చా? పెట్టుబడుల కాలవ్యవధి 21 ఏళ్లు.**

**– ప్రవీణ్ షా**

ఐదు, పదేళ్ల క్రితం డాలర్‌తో రూపాయి మారకం విలువ నుంచి చూస్తే ఇప్పటికి చాలా వరకు క్షీణించినట్టు గుర్తించొచ్చు. కానీ, ఆర్థిక వ్యవస్థ పరంగా పెద్దగా మారిందేమీ లేదు. వడ్డీ రేట్ల పరంగా అంతరం ఉంటున్నందున రూపాయి విలువ క్షీణత కొనసాగుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని మీ చిన్నారి విదేశీ విద్య కోసం పొదుపు చేద్దామనుకుంటే అందుకు అంతర్జాతీయ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవడం సరైనది. సామర్థ్యం, దీర్ఘకాలంలో మెరుగైన రాబడులను ఇచ్చే పథకంలోనే ఇన్వెస్ట్ చేసుకోవాలి. మరింత మెరుగైన రాబడులను ఇచ్చే దేశీ మ్యూచువల్ ఫండ్ పథకంలో ఇన్వెస్ట్ చేసుకుంటే మరింత మొత్తం సమకూరొచ్చు. కనుక మెరుగైన రాబడులను ఇవ్వలేని విదేశీ పథకాన్ని ఎంపిక చేసుకుంటే అనుకున్న లక్ష్యం నెరవేరకపోవచ్చు. కనుక అంతర్జాతీయ ఫండ్ ఎంపిక కీలకమని తెలుసుకోవాలి.

**నా వయసు 22 సంవత్సరాలు. అద్దె ఇంట్లో ఉంటున్నాను. ఏ వయసుకు సొంతిల్లు సమకూర్చుకోవాలి?**

**– రషీద్**

సొంతిల్లు విషయంలో అందరికీ సరిపోయే ఏకైక ప్రామాణిక పరిష్కారం ఉందని అనుకోవడం లేదు. కాకపోతే ఇంటి కొనుగోలు నిర్ణయాన్ని తీసుకునే ముందు పరిగణనలోకి తీసుకోవాల్సిన కొన్ని అంశాలున్నాయి. ఇవి సరైన నిర్ణయం తీసుకునేందుకు సాయపడతాయి. చాలా మందికి సొంతిల్లు ఆర్థికంగా అతిపెద్ద ఖర్చుతో కూడుకున్నది అవుతుంది. ఇంటి రుణం పేరుతో అతిపెద్ద ఆర్థిక బాధ్యత వచ్చి పడుతుంది. ప్రతీ నెలా నిర్ణీత మొత్తం చొప్పున (ఈఎంఐ) చాలా ఏళ్లపాటు చెల్లించాల్సి వస్తుంది. అందుకే ఈ నిర్ణయానికి వచ్చే ముందు ఆర్థికంగా ఏ మేరకు స్థిరపడ్డామన్నది ప్రతీ ఒక్కరూ ఆలోచించుకోవాలి. తమ ఉద్యోగం లేదా వృత్తి జీవితంలో స్థిరత్వం గురించి స్పష్టతకు రావాలి. అప్పుడే తన ఆదాయంపై అంచనాకు రావచ్చు. వృత్తిపరంగా స్థిరత్వాన్ని సాధించారా? లేదంటే వచ్చే రెండు మూడేళ్లలో ఆ స్థాయికి చేరుకుంటామని భావిస్తున్నారా? ఈ విషయంలో స్పష్టత అవసరం. రెండో అంశం.. ఈఎంఐ కట్టాలన్న లక్ష్యంతో వ్యయాలను పూర్తిస్థాయిలో తగ్గించుకునే పరిస్థితి తెచ్చుకోవద్దు. మీ ఆదాయంలో ఈఎంఐ మూడింట ఒక వంతును మించకపోవడం సహేతుకమైనది. అప్పుడే ఇతర వ్యయాలను ఎదుర్కోవడానికి మీకు వెసులుబాటు ఉంటుంది. అంతేకాదు, ఇతర జీవిత లక్ష్యాలకూ కొంత ఆదా చేసుకోగలరు. నెలవారీ వేతనంలో ఈఎంఐ పరిమాణం ఎంతన్నది ముఖ్యమైనది. మీకున్న రుణ పరపతి ఏ మేరకు, బ్యాంక్ బ్యాలన్స్ ఏ మేరకు? అన్న అంశాలను రుణమిచ్చే సంస్థలు చూస్తాయి. వీటి ఆధారంగా రుణ రేటును నిర్ణయిస్తాయి. రుణ పరపతి మెరుగ్గా ఉంటే, ఆకర్షణీయమైన రేటుకే గృహ రుణం అందుకోవచ్చు. ఇక ఇంటిని కొనుగోలు చేయడం అన్నది ఒక్క ఆర్థికపరమైన నిర్ణయమే కాదు. ఇందులో జీవిత భాగస్వామి ప్రాధాన్యాన్ని చాలా మంది పరిగణనలోకి తీసుకుంటారు. కనుక దంపతులు ఇద్దరూ కలసి తమ జీవిత లక్ష్యాలు, ఎక్కడ స్థిరపడాలి, ఎటువంటి ఇల్లు కొనుగోలు చేయాలన్న అంశాలను నిర్ణయించుకోవాలి.




ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. 


SETTING A NEW
STANDARD OF EXCELLENCE
in JEE Advanced 2023
50 YEARS OF BRILLIANCE
ALL INDIA RANK 10
G.SAATVIK
R. 236195100 (R)
ALL INDIA RANK 26
J.SHASHIVARDHAN
R. 236193237 (R)
ALL INDIA RANK 42
P.SREEKARI
R. 236193002 (R)
ALL INDIA RANK 42
B.SAMEETH
R. 236193170 (R)
ALL INDIA RANK 87
B.SONU SREE
R. 236193170 (R)
ALL INDIA RANK 114
L.VISHAL
R. 236194087 (R)
ALL INDIA RANK 135
B.NITHISH
R. 236193050 (R)
ALL INDIA RANK 164
C.SONIKA
R. 236199145 (R)
ALL INDIA RANK 168
B.ABHIRAM NAIK
R. 236198118 (R)
ALL INDIA RANK 253
A.MANIDEEP REDDY
R. 236193370
ALL INDIA RANK 264
SHAIK ABDUL SAMEER
R. 236023004 (R)
ALL INDIA RANK 266
K.SHREE VARSHITH
R. 236195240 (R)
ALL INDIA RANK 272
S.DATTU
R. 236159390 (R)
ALL INDIA RANK 303
J.SANJAY
R. 236133638 (R)
ALL INDIA RANK 369
K.NITHIN NAIK
R. 236163134 (R)
ALL INDIA RANK 392
V.DEEKSHITH REDDY
R. 236195063
ALL INDIA RANK 396
G.PRAVEEN
R. 236199053 (R)
ALL INDIA RANK 430
PRUTHVIRAJ TEJAVATH
R. 236176046 (R)
ALL INDIA RANK 445
B.SAHARSH
R. 236202093 (R)
ALL INDIA RANK 604
J.CHANDRA SHEKAR
R. 236128283 (R)
ALL INDIA RANK 631
B.NITHIN
R. 236134779 (R)
ALL INDIA RANK 732
J.SHAVAN KUMAR
R. 236159169 (R)
ALL INDIA RANK 780
A.AJAY
R. 236134271 (R)
ALL INDIA RANK 880
B.THARUN
R. 236193217 (R)
ALL INDIA RANK 951
SHAIK KODURU ASIF
R. 236023016 (R)
ALL INDIA RANK 973
K.BHAVESH CHANDRA
R. 236201058 (R)
LONG TERM JEE (ADVANCED) ADMISSIONS ARE IN PROGRESS 2023-24
HYDERABAD: 8886322296, 9121307474, 9290684090, 9154174318 | WARANGAL: 9642117378 | VIJAYAWADA: 8142111302 | VIZAG: 9052222274, 9154854707 | GUNTUR: 9154854694 | TIRUPATI: 9154854699 | NELLORE: 9154854696 | ANANTHAPURM: 9154854691 | KURNOOL: 9154854695 | NIZAMABAD: 9642117110 | SRIKAKULAM: 9154854697 | BHIMAVARAM: 9642223762, 7331122579 | RAJAHMUNDRY: 9154854693 | KARIMNAGAR: 9642117367 | NALGONDA: 9573927070 | ONGOLE: 8712609156 | KHAMMAM: 9121155002 | ADILABAD: 9154854690 | KOTHAGUDEM: 9154854692 | NIRMAL: 9642117835 | HOSAPETE: 9154854713.
SR Educational Academy
TELANGANA • ANDHRA PRADESH • KARNATAKA